
ఆగస్టు 1989

వెల: 7 రూ.

స్వాతి



అశేష పాఠకుల విశేష తెలుగు మాసపత్రిక

అగస్టు నెల
'జ్యోతి' అనుబంధం
వర్తమానకవుల కవితా సంపుటి

ఇంటింటి మాసపత్రిక
సంపుటి 27 సంచిక 8
ఆగస్టు 1989



ఎడిటర్:
దాట్ల నారాయణ మూర్తి రాజు

వ్యవస్థాపకులు:
వి.వి. రాఘవయ్య
1971-1989
జనవరి వరకూ

సంపాదకులు:
లీలావతీ రాఘవయ్య

చీఫ్ ఎడ్వయిజర్:
మోహన్

TYPF SETTING: BLUECHIP COMMUNICATIONS. COVER PRINTING & PROCESSED BY INTERNATIONAL PRINTERS. HYDERABAD.

గెస్ట్ ఎడిటోరియల్

తెలుగు కథ

తెలుగు కథా సాహిత్యంలో మొదటి అడుగు జాడ గురజాడది. (1910) సాంప్రదాయిక కథా కథనం నుంచి వైదొలగి, ఆధునిక కథా కథనాన్ని ఒక ఉద్యమ స్థాయిలో నడిపిస్తూ చింతా దీక్షితులు, శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి, మల్లాది రామకృష్ణ శాస్త్రి, రావికొండల వేంకటరావు, చేకుమళ్ల రామేశ్వర రావు, వేలూరి శివరామశాస్త్రి, విశ్వనాథ సత్యనారాయణ, ముని మాణిక్యం నరసింహారావు, అడివి బాపిరాజు, రా.స.ఆంజనేయ శాస్త్రి, బుర్రా వేంకట సుబ్రహ్మణ్యం, ఇల్లిందల సరస్వతీ దేవి ప్రభృతులు తెలుగు కథకు వాసివన్నెలు సంతరించారు. తెలుగులో కథానికకు ఆది నుంచీ ఆలంబనంగా వుంటూ వచ్చిన పత్రికల సంఖ్య ఈ శతాబ్ది పూర్వార్థంలో బాగా పెరుగుతూ వచ్చింది. ఆంధ్ర సచిత్ర వార పత్రిక, ఆంధ్ర పత్రిక సంవత్సరాది సంచిక, భారతి, ప్రతిభ, ఉదయిని, ఆనందవాణి, ఢంకా, కథాంజలి, చిత్రగుప్త మొదలైన పత్రికలు విరివిగా కథలు ప్రచురించాయి. బాల్య వివాహాల వల్ల ఏర్పడే అనర్థాలను వివరిస్తూ, కన్యాశుల్కాలను ఖండిస్తూ, వర విక్రయాలను దుయ్యబడుతూ, వేశ్యా లంపటత్వాన్ని నిరసిస్తూ, కులాల నడుమ మతాల నడుమ నెలకొన్న విద్వేషాలను ఈసడిస్తూ, అస్పృశ్యతా జాడ్యాన్ని అమానుషమని నిరూపిస్తూ అసంఖ్యాకంగా కథలు వెలువడ్డాయి.

గుడిపాటి వెంకటచలం, రొడవటి గంటి కుటుంబరావు, గోపీచంద్, చాసో లాంటి వీనుమిగిలిన కథకులు అనమార్గాలను ఎత్తి చూపుతూ, మంచి ధోరణులకు స్వాగతమిస్తూ పెరశి సమాజాభ్యున్నతికి కథానికను ఒక బలమైన సాధనంగా వినియోగించుకున్నారు.

1950 ప్రాంతాలలో అడుగు పెట్టేటప్పటికి తెలుగు కథ ప్రపంచ కథానికల పోటీలో బహుమతికి పాత్రమై (గాలివాన-పాలగుమ్మి పద్మరాజు) తెలుగు సాహిత్యానికి అంతర్జాతీయ విఖ్యాతిని సముపార్జించి పెట్టగలిగింది. అయితే ఇది యాదృచ్ఛికంగా జరిగిన సంఘటన గాదు. ఆపాటికి వస్తు పరంగాను, శిల్పపరంగాను తెలుగు కథ అందుకోవలసిన ఎత్తులు అందుకోగలిగిందన్న మాట. పలాయితుడు, అశక్త-అవిద్య (కాశీపట్నం రామారావు) పువ్వులు, వర్షం (రావిశాస్త్రి) బిళ్లల మొలతాడు, కయ్యి-కాలువ, పశువుల కొట్టాం (కరుణ కుమార) అరణ్యంలో మానవ యంత్రం, బిచ్చగాళ్ల జండా (మునిపల్లె రాజు) మంచి ముత్యం, వరద వెల్లువ (బలివాడ కాంతారావు) అరకులోయలో మాలిన శిఖరం, అడవి కాచిన వెల్లువ, కాలచక్రం నిలిచింది (బుచ్చిబాబు) చివరి పుటలు (అంగర వేంకట కృష్ణారావు) ఎత్తువల్లాలు (హితశ్రీ) నీలి, ఒంటరి బంగళా (పురాణం సుబ్రహ్మణ్య శర్మ) నిద్రాశువు, చరణదాసులు (పురాణం సూర్య ప్రకాశరావు) సర్కస్ డేరా, నోరులేని జీవుడు, కూనలమ్మ కోన (మధురాంతకం రాజారాం) అజ్ఞానం-విజ్ఞానం, క్షమించేను (కొమ్మూరి వేణుగోపాల రావు) అపరాజిత, సృష్టిలో తీయనిది (వాదాటి పాండురంగారావు) అతడు ఇక రాడు, సాంప్రదాయం (కొనకళ్ల వేంకటరత్నం) అలకాన పుట్టిళ్లు, మాడంత మబ్బు (కళ్యాణ సుందర్ జగన్నాథ్) పరిస్థితుల వారసులు (రావూరి భరద్వాజ) మొదలైనవి కథను అభిమానించే తెలుగు పాఠకుల్ని కలకాలం అలరిస్తాయి. ఈ కథకుల్లో యిప్పటికింకా రచనా వ్యాసంగం కొనసాగిస్తున్న వారున్నారు. వీరి రచనలతో బాటు పెద్దిభోట్ల సుబ్బరామయ్య పంచభూతాల కథలు, కలువరొలను సదానంద నవ్వే కళ్ల వెనుక ఏడ్పే పెదవుల కథలు, కొలకలూరి ఇనాక్ ఊరబావి కథలు, ఆర్.యస్.సుదర్శనం మధుర మీనాక్షి కథలు, వసుంధరా దేవి గాలి రథం కథలు, సత్యం శంకరమంచి అమరావతి కథలు, నవీన్ యువతరం గురించి రాసిన కథలు, యస్.యస్.ప్రకాశరావు వేదర్ టైగర్ కథలు, భూషణం కొండగాలి కథలు, పువ్వుల నరసింహం తిరగబడ్డ భూమి కథలు, అల్లం శేషగిరిరావు వేట కథలు మొదలైనవి ఈ జాబితాకు మరింత పరిపుష్టిని చేకూరుస్తాయి. ఇటీవల విశాఖ

చిత్తూరు, అనంతపురం, తెలంగాణా ప్రాంతాల నుంచీ రాస్తున్న యువ రచయితలు ఈ కథల ఒలింపిరి రాను రాను క్రిందటి తరం రచయితల నుంచీ అందిపుచ్చుకుని ముందుకు మున్ముందుకు తీసుకెళ్ళగలవని ఆశించవచ్చు.

ఒక సాహిత్య ప్రక్రియ యొక్క సార్థకత అది సమకాలీన సమాజ జీవనాన్ని ఎంత వరకు ప్రతిఫలించిందన్న విషయం పైన ఆధారపడి వుంటుంది. ఈ దృక్పథంలో నుంచి చూచినప్పుడు తెలుగు కథ అనంతమైన వస్తు వైవిధ్యంతో పాఠకులకెంతో చేరువగా వెళ్లి అంతగాను వాళ్ల అభిమానానికి పాత్రమైందని చెప్పవచ్చు. ఇతిహాసపు చీకటిలోనూ అట్టడుగున పడి కన్పించని నిస్సహాయుల, దుఃఖ భోగాల దీన గాథలు, తెలుగు సీమ పల్లె పట్టులలోని పాటవ జన జీవితాలు, సమస్త శృంఖలాలు విడగొట్టుకుని స్త్రీ అన్ని రంగాలలోను పురుషునికి సమ వుజ్జీగా పెరిగిన పరిణామంలోని వివిధ దశలు, క్లిష్టతకు వైచిత్రిక క్షణక్షణ పరిణామ శీలతకు రంగస్థలమైన మానవ మనస్తత్వం, దోపిడీని దౌష్ట్యాన్ని ఎదిరించి సమ సమాజ నిర్మాణానికి దారి తీయవలసిన ఆవశ్యకత మొదలైన అంశాలనన్నింటినీ తెలుగు కథానిక సాహిత్య నిబద్ధం చేస్తూ వచ్చింది.

1910 నుండి ఈనాటి వరకు పరివ్యాప్తమైన తెలుగు కథా సాహిత్యంలో నుంచీ ఏరి కోరి వంద కథల్ని ఎన్నిక చేసి ఒక సంపుటంగా ప్రచురిస్తే, అది ఈ శతాబ్ది తెలుగు వాళ్ల సాంఘిక చరిత్రకొక ప్రత్యామ్నాయంగా వుంటుంది. ఒక సాహిత్య ప్రక్రియ నుంచీ ఇంతకు మించి ఆశించదగిన సామాజిక ప్రయోజనం ఏముంటుంది?

-మధురాంతకం రాజారాం

ఒకసారి వీరిలా 'అన్నారు:

ఆత్మ సుఖమ్ము కోసమయి! అన్యుల గొంతులు కోసి తెచ్చు పుణ్యాత్ముడు! నీకు మోక్షమెటులబ్బును! నెత్తురు చేతి పూజ విశ్వాత్ముడు స్వీకరించునె? చరాచర వర్తి ప్రభుండు మా పవిత్రాత్మల నందుకోడె: నడుమంత్రపు నీ తగులాట మేటికిన్.

-'ఉదయశ్రీ' లోంచి 'కరుణశ్రీ'


రచయిత్రుల కథల దీపావళి ప్రత్యేక సంచిక

...ర్ నెల ...తి మాస ... 'రచ ...' ...తెలి ... ఆనంది ... అవకాశాన్ని ... విని యోగిం ... కోరు

...త్రులు తమ కథలను, సెప్టెంబరు 15వ తేదీలోగా మాకందేటట్లు పంపాలి. కథలు అయిదు, ఆరతావు పేజీలకు మించకుండా ఉండాలి. పాస్‌పోర్టు సైజు ఫోటో జతపరచాలి. ప్రచురణకు అంగీకరించని కథలను తిప్పి పంపడానికి వీలుగా స్వంత చిరునామా కలిగిన కవర్లను జతపరచవలెను.



మా చిరునామా:
ఎడిటర్
జ్యోతి (దీపావళి ప్రత్యేక సంచికకు)
చిక్కడపల్లి,
హైదరాబాద్
500 020



ఎర్ర బుష్కోటు

శ్రీ శ్రీరంగం నారాయణబాబు కథ

పాతికేళ్ళ క్రితం కథ

గరివిడి మాంగనీసు గనుల్లో మా బావమరది మేనేజరు పని చేస్తున్నాడు. సాధారణంగా బంధువుల ఇళ్ళకంటూ వెళ్ళను, నేను ఎప్పుడూ. కాని, మా చెల్లెలంటే నాకు మమకారం ఎక్కువ. అది పుట్టాక మా అమ్మ జబ్బు మనిషైపోయింది. నా చేతులతో నేను పెంచాను. అందుకే మా చెల్లెలంటేనాకు వల్లమాలిన అభిమానం.

వేసవి కాలంలో మా ఊళ్ళో ఎండలు దారుణంగా వుంటవి. మా వూరికి అప్పటికింకా ఎలక్ట్రిసిటీ రాలేదు. పంకాలు గాని, దీపాలుగాని, సౌకర్యం కొంచెం కూడా లేదు. వేసవికి రమ్మనమని మా బావమరిది ఉత్తరం రాశాడు. కాస్త ఎత్తయిన జాగా-కొండ మీదవడం చేత, అక్కడ ఎలక్ట్రిసిటీ ఉండడం నుంచీ, మా బావమరిది పెద్ద ఉద్యోగస్థుల్లో లెక్క వస్తాడు కాబట్టి, చిన్న బంగళాలో వుంటున్నాడు. అక్కడ హాయిగా వుంటుందనీ, అంతేకాకుండా గనుల కన్నిటికీ యజమాని-డైరెక్టర్ సింగ్- ఇంగ్లండు వెళ్లి వచ్చినవాడనీ, ఆయన దగ్గర ఎన్నో మంచి పుస్తకాలూ చక్కని లైబ్రరీ వుంది, చదువుకోవచ్చును. రమ్మనమనీ రాశాడు. బ్రతుకు జీవుడా అని పాము కాటులాంటి వేసవి కాలాన్ని తప్పించుకుందుకు గాను, మనకు నల్లమందులాంటి మంచి పుస్తకాలు కూడా అక్కడ లభ్యమవుతాయని, మూటా ముళ్లే కట్టుకుని, బస్సుమీద గరివిడి చేరుకున్నాను.

ఆ రోజు సాయంకాలమే మా బావమరిది సింగ్ దగ్గరకు తీసుకెళ్లాను రమ్మనమన్నాడు.

సింగ్ పంజాబీ, మనిషి అజానుబాహు. మంచి వర్చస్సు వున్నవాడు. ఇంగ్లండు వెళ్ళివచ్చాడు. ఆ రోజుల్లో ఇంగ్లండు వెళ్ళడమంటే కాశీ వెళ్ళడం కంటే గొప్ప మాట. సింగ్ ఇంగ్లండ్ వెళ్ళినా, ఏ పరీక్షలూ పాస్ అవలేదు. ఇంగ్లండ్ వెళ్ళినందుకు ఆయనకు అలవాటైనవి రెండు గుణాలు. తాగి తందనాలాడడం-అవకాశం వస్తే వ్యభిచరించడం. ఈ రెండు గుణాలూ ఇంగ్లండులో సంపాదించాడు కాబట్టి, ఎంతటి గొప్ప ఉద్యోగానికైనా అర్హుడు. అంచేత ఆ మాంగనీస్ కంపెనీకి డైరక్టరుగా వెయ్యి రూపాయిల జీతం, కారూ, బంగళా అన్నీ సమకూరినై.

సింగ్ ఎప్పుడూ ఆఫీసుకు వెళ్లడు. ఇంట్లోనే కూర్చుంటాడు తాగుతూ, సంతకాలు పెట్టవలసిన కాగితాలన్నీ, సాయంత్రం ఐదు గంటలకి మా బావమరిది తీసుకెళ్ళి సంతకాలు పెట్టించాలి. ఐదు మొదలు కొని ఆరు వరకే ఈ లోకానికి చెందిన వ్యవహారాలూ, ఈ లోకంలో వుండడం. మళ్ళా ఆరు గంటలు కొట్టారంటే, పీర్యా పీర్యా పునఃపీర్యా అని ఎన్ని గాజు బుడ్లు గొంతులోకి దిగుతాయో చెప్పడం కష్టసాధ్యం.

సింగ్‌కు ఒక భార్యా, ఇద్దరు పిల్లలూ వున్నారు. భార్య ముఖం చూస్తే పూర్వోత్తరపు మనిషి, సాధ్వి అనిపించింది. ఒక కొడుకూ, కూతురూ ఆయనకి. కొడుక్కి నాలుగేళ్ళూ, కూతురికి ఐదేళ్లు. ఇద్దరు పిల్లలూ అందంగా, దొరల పిల్లల్లా వుంటారు.

సాయంత్రం మా బావమరిది ఆఫీసు కాగితాలతో పాటు నన్ను కూడా తీసుకెళ్లి సింగ్‌కు గొప్పగా పరిచయం చేశాడు-కవినీ, విద్వాంసుణ్ణనీ, సింగ్ కూర్చున్న హాలులో అనేక పులి చర్మాలూ, తుపాకీలూ అవీ వున్నాయి. సింగ్ ఒకప్పుడు గొప్ప వేటగాడట. ఇప్పటికి కూడా పట్నం నుంచి విదేశీ సారా రావడం ఆలస్యమైతే-లేదా.

సార్లు గ్రహణం పట్టిన రోజుల్లో, వేటకని వెళ్ళినప్పుడు కారు వేసుకొని. సార్, బుద్ధి వచ్చినప్పుడు తెలిస్తేనే సందెవేళకో, అపరాత్రికో ఇల్లు చేరుకుంటాడు.

సింగ్ నాతో ముక్తసరిగా రెండు మాటలాడి ఇక్కడకు అన్ని పుస్తకాలూ తేలేదు. కొన్ని పుస్తకాలే తెచ్చానని, ఆ వున్న పుస్తకాలు కావలిస్తే చూడొచ్చని, చూపించమని భార్యకు ఆదేశించాడు. ఆవిడ సవినయంగా నమస్కరించి, పక్క గదిలోకి తీసుకెళ్ళింది. ఒకటి రెండు పెద్ద వరుస బీరువాల్లో నాకు కావలసిన పుస్తకాలన్నీ ఉన్నాయి. కొన్ని ఎన్నుకుని, అవి చదివి ఇచ్చేశాక కొత్తవి పట్టుకెళ్ళొచ్చని అని సింగ్ కు ధన్యవాదాలర్పించి, ఇంటి ముఖం పట్టేసరికి, సింగ్ పిలిచి 'నాతో మీకిక పని లేదు. మీకు కావలసినప్పుడు వచ్చి, నా భార్యనడిగి పుస్తకాలు పట్టుకెళుతుండండని నాతో గౌరవంగా చెప్పాడు. నేను బ్రతుకు జీవుడా అనుకున్నాను. ఆయన తాగుడికి ఆటంకం రాకుండా వుండేందుకు అనుకుంటాను అలా అన్నాడు.

తాగినవాడితో ఎలా మాటాడతమో, ఎంత తెలివైనవాడైనా తాగనివాడైతే తెలియదు. వెర్రివాణ్ణి వెర్రివాడే తెలుసుకున్నట్టుగా తాగేవాడే అర్థం చేసుకోగలడు.

మా బావమరిది ఆఫీసు పక్క, నేను ఇంటి పక్కా తిరిగి నడుస్తున్నాము. సింగ్ బంగళాకు ఎదురుగుండా చింత చెట్టు కింద చిన్న పూరి గుడిసె ముందు, యౌవనం సడలి, ప్రౌఢత్వం పరిఢవిల్లే ఒక అందాలు చిందే ఆడ మనిషి మాసిన చీరతో ఒక నాలుగేళ్ళ కుర్రాణ్ణి దగ్గర పెట్టుకొని కూర్చుంది. ఆవిడ ముఖం చూస్తే నాకెందుకో ఆవిడ పెద్దింటికి చెందింది, కర్మవశాత్తూ, కాల వైపరీత్యం నుంచి, కడగళ్ళకు పాలై, ఈ దీనావస్థలో వుంది-ఒక ఉపశమించే మాటంటే ఆవిడకు ఊరట చేకూరుతుందేమో అనిపించింది.

దగ్గరవున్న కుర్రవాడు నాలుగేళ్ళవాడు. ఆ కుర్రవాడికి మానవత్వం పోలికలు లేవు. మృగంలా వున్నాడు. కాస్త చిన్న పిల్లలు చూస్తే దడుచుకుంటారు. ఆవిడ కొడుకు అవుతాడా? ఎంత మాత్రం కాదు. భర్త ఒకవేళ ఎంత అందవిహీనుడైనా ఆవిడ వర్చస్వి కాబట్టి, కొంతైనా వీడికి రాకుండా వుంటుందా! ఏమో, ఏమని చెబుతాం. భార్యాభర్తలు అందంగా వుండొచ్చు-పిల్లలు వికృతంగా వుండొచ్చు! దంపతులు ఏమీ అందమైన వాళ్ళు కాకపోవచ్చును-పిల్లలు అందమైనవారు అవవచ్చును. చీకటిలోంచి కాంతి పుట్టలేదా, కాంతిని చీకటి కబళించలేదా-అంతే!

కారు క్లీనర్ మహమూద్!

హాస్య రస ప్రధాన భూమికలను నిర్వహిస్తూ జాతీయ స్థాయిలోనే అగ్రశ్రేణి హాస్యనటుడుగా పేరు తెచ్చుకున్న మహమూద్.

అప్పట్లో పేరుగాంచిన గీత రచయిత నరత్ వ్యాస్ యింట్లో మహమూద్‌కు ప్రతి రోజూ ఆయన కారు కడిగి శుభ్రం చేసి తుడిచే పని దొరికింది. కారును కడిగే పనిని కూడా ఆయన ఎంతో సంతోషంగా స్వీకరించాడు. ఎందుకంటే ఈయన కుటుంబ సమేతంగా బొంబాయి చేరుకున్నాడు.

రోజుకు దొరికే రెండు రూపాయలతో తన కుటుంబంలోని అయిదుగురు సభ్యులను పోషించేవాడు మహమూద్ మొదట్లో-

- ఉ.పి.

పలకరిస్తే ఏమనుకుంటుందో-చెడ్డవాణ్ణి అనుకుంటుందేమో! అనుకుంటూ నాలుగడుగులు వెళ్ళి మనసు వెనక్కి లాగితే ఆ పూరి గుడిసె దగ్గరకే వెళ్ళా. ఆమె భయంగా లేచి ఆ గుడిసెలోకి వెళ్ళింది. పైకి ముఖాన్ని పెట్టి "ఎవరు బాబూ, మీకు ఏం కావాలి?" అంది. నే పేరిమిటన్నా, ఆవిడ పేరు చెప్పేందుకు జంకింది. నేను నా మనస్సులో అనుకున్నది చెప్పా.

"నా పేరు రంగమ్మ. మీరు అనుకున్నదానిలో యధార్థం వుందండి. మీరు గొప్ప ఇంటివారు కాబట్టి పోల్చగలిగారు. మరోవుడు నా బ్రతుకు మీకు మనవి చేసుకుంటాను. చీకటి పడుతున్నాది. ఎవరయినా చూస్తే ఏమైనా అనుకుంటారు. ఇంటికి వెళ్ళండి" అన్నది.

సింగ్ బంగళా, కనులకు విందుగొలిపే అందాల సోఫానన్నటే ఆకర్షించలేకపోయింది. పూరి గుడిసెలో వున్న రంగమ్మ ఎవరై వుంటుందీ. దగ్గరగా వున్న కుర్రవాడు ఏమవుతాడూ, అవే సంగతులు పదేపదే నా హృదయంలో పరిణతిని పొందాయి.

రాత్రి భోజనం చేయడం, నా పుస్తకాల చదువు గోడవలో-సద్యోఫలితమైన విద్యుద్దీపం-పక్షి రెక్కల్లా చల్లని గాలి ఉయ్యాలలూపే ఎలక్ట్రిక్ పంకా, సౌఖ్యాన్ని చేకూర్చాయి. చదువుకంటే నిదురకే శరీరం, మనస్సు కూడా దోహదం చేశాయి.

ఉదయం నేను లేచే సరికి చాలా ఆలస్యమైంది. నేను సాధారణంగా చీకటి వుండగానే లేస్తాను. ఆ రోజు మాత్రం ఆలస్యమైంది. లేచిన వెంటనే కాఫీ లేకపోతే దుర్దినంగా తోస్తుంది కాబట్టి వంట ఇంట్లోకి వెళ్ళే సరికి మా చెల్లెలు ఆప్యాయంగా ఫలహారం, కాఫీ అందించింది. ఫలహారం చేస్తూ వుంటే-

"ఏమిరా, నిన్న సాయంత్రం సింగ ఇంటి నుంచి వస్తూ రంగమ్మను పలకరించావుగా. అది నాతో వచ్చి చెప్పుకుంది. దాని గాథ విచిత్రమైంది- నాకు తెలుసు. అప్పుడప్పుడు మన ఇంట్లోకి వచ్చి పని సహాయం చేస్తూ వుంటుంది" అని అంటూ-

"పెద్ద యింటికి చెందిందే పాపం-దాని ఖర్మం ఇలా కాలి అగచాట్లు పడుతున్నది. మన ఊరికి దగ్గరగావున్న గుంకలాం కరణం కూతురు. తండ్రికి వల్లమాలిన ఆస్తి, పలుకుబడి-అన్నిటినీ విసర్జించి, వారింటికి చెందిన ఒక పాలికాపును ప్రేమించి తండ్రి దండిస్తే, అతనితో లేచిపోయి నెల్లిమర్ల మిల్లులో ఇద్దరూ పని చేసుకుంటూ, తెచ్చుకున్నది తక్కువే ఐనా, సుఖంగా కాలక్షేపం చేసి, సౌఖ్యంగా జీవితాన్ని గడుపుతూ వుండే రోజుల్లో రంగమ్మకు ఒక కుర్రవాడు పుట్టాడు. వాడే ఆ రంగమ్మ దగ్గర కూర్చున్నవాడు."

"వాడు వన్యమృగంకంటె అధ్వాన్నం. పశుబలుడు. వాడికి వినిపించదు. మాటలు రావు. వాడు పుట్టిన రెండేళ్ళకి నెల్లిమర్లలో కలరా రావడం, ఎవరికోసమైతే తాను త్యాగాన్ని చేసి జీవితం స్వర్గంగా చేసుకుందో, వాణ్ణే తన చేతులతో పిడికెడు బుగ్గి చేసి, నడి సముద్రంలో నావలా పిల్లాణ్ణి పెంచలేక, కూలి చేయలేక-సొంతవూరు చేరుకొని, అపరాధం మన్నించమని తండ్రి కాళ్ళు పట్టుకుంది. కొడుకును వదిలేసి తాను వచ్చి ఇంట్లో వుండొచ్చు అన్నాడు. తనకు మనస్కరించలేదు.

"అనాకారులైనా, కురూపులైనా బిడ్డలను వల్లమాలిన మమకారంతో సాకుతుంది.


అందుకే స్త్రీ, పురుషుడి కంటే ఎప్పుడూ గొప్పదే."

"ఊళ్లు తిరిగి, ఈ గరివిడి చేరకుని, గనిలో పని చేస్తే, రకరకాల మనుషులు వుండడమే కాకుండా, పిల్లాణ్ణి ఒంటరిగా వదలవలసి వస్తుంది కాబట్టి, సింగ్ ఇంటి దగ్గర అంట్లు తోముతుంది. ఒక పూట భోజనం, నెలకు మూడు రూపాయిలు ఇస్తారు. మానవతి, ఉత్తమ గుణాలు కలిగింది. ఐతేనేం? దరిద్రం వున్నప్పుడు జీవితం రేణికి రాదు."

అని మా చెల్లెలు నాతో చెప్పేసరికల్లా నా మనస్సు వికలమైంది. రంగమ్మ మీద ఒక విధమైన గౌరవం, రంగమ్మ కొడుకు మీద జాలీ కలిగాయి.

నేను పుస్తకాల కోసం అప్పుడప్పుడూ సింగ్ ఇంటికి వెళ్తున్నప్పుడు, రంగమ్మని పలకరించడం, కాస్త ఏదైనా చిల్లర డబ్బులు ఇవ్వడానికి ప్రయత్నిస్తే ఆమె ఎంతమాత్రం వద్దని, వారించి పుచ్చుకునేది కాదు. ఎప్పుడూ రోదిస్తూ వుండేటువంటి ఆ కొడుకు చేతుల్లో కాస్త చిల్లర డబ్బులు పెట్టి ఇల్లు చేరుకునే వాణ్ణి.

ఒకనాడు ఉదయాన్నే ఏదో వ్యాసం రాస్తూ కొన్ని పుస్తకాలు అవసరం వచ్చి సింగ్ ఇంటికి హుటాహుటి బయలుదేరి వెళ్తున్నాను. తోవలో రంగమ్మను పలకరించిపోదామని చింత చెట్టు దగ్గరికి చేరుకునేసరికి, ఆ చింత చెట్టుకు వేసి రంగమ్మ కొడుకుని ఒక తాడుతో కట్టబడిన దృశ్యం కనిపించింది. విపరీతంగా ఏడుస్తున్నాడు రంగమ్మ కొడుకు. రంగమ్మని పిలిచి-



"ప్రకృతి వాడికి చేయవలసినంత అన్యాయం చేసింది. ఇంకా ఈ తాడుతో కూడా ఎందుకు బంధిస్తావు వాణ్ణి? నీవు అన్నది వాడికి వినిపించదు. మాట్లాడేందుకు ఉపయుక్తం కాని నోరు ఏడుపుకే పనికొస్తుంది. వాడి భాషంతా ఏడుపే-వదిలి పెట్టు" అన్నాను.

రంగమ్మ గుడిసెలో నుంచి పైకి వచ్చి, కంటనీరు పెట్టుకుంటూ "ఏం చేయమన్నారు బాబు-వాడి బాధ పడలేకుండా ఉన్నాను. ఈ మధ్య ఒకరోజు సింగు కొడుకు పుట్టినదినం వచ్చింది-ఆ సింగు కొడుక్కి మంచి ముఖమల్ ఎర్ర బుష్ కోటు తొడిగారు. అది వీని కంట బడింది. అప్పట్నుంచీ అలాంటి కోటు కావాలని ప్రతి నిత్యం ఏడుస్తూ పొద్దున్న తెల్లవారే ముందు, సాయంత్రం సంధ్యలోనూ, ఆకాశం పక్క చూపిస్తూ, అరుస్తూ ఏడుస్తాడు. నాకా శక్తి ఎక్కడ ఉంది కొనేందుకు అలాంటి కోటు! నెలకు ఇచ్చే మూడు రూపాయిల జీతంలో ఒక రూపాయి మిగిల్చి, రెండు రూపాయలు ఖర్చు చేసుకుంటున్నాను. నాకెంత అభి

మానం ఉంటే మాత్రం ఏం సాగుతుంది? జీతంలోది కష్టపడి మిగుల్చుకున్న మూడు రూపాయలతోటి ఒక ఎర్రకోటు తెచ్చా, కాని-అది అక్కర్లేదంటాడు.

"ఆ సింగు కొడుకు వేసుకున్న లాంటి కోటే ఇమ్మంటాడు. అలాంటిది ఇరవై రూపాయలకు తక్కువకివ్వనన్నారు. మా బ్రతుకేమిటి, నేనేమిటి? వాతం చేస్తుందా? కొనగలగితే మాత్రం లోకం సహిస్తుందా? చిన్న పిల్లాడు వాడికి ఇవన్నీ ఏం తెలుస్తవి బాబూ?

"ఇవాళ సింగ్ కొడుకు పుట్టిన దినం. నా చేతుల్తో నేనే ఆ కోటు సింగ్ కొడుక్కి తొడిగాను. మా బాబుగాడు చూసి, సింగ్ కొడుకు మీదకెళ్ళి జులూం చేస్తే, సింగ్ కోపానికి హద్దులు లేవు. మా బాబుకి ప్రమాదమైనా రావచ్చు. నాకున్న ఈ నౌకరీ ఐనా పోవచ్చు. ఇప్పుడు మళ్ళా పనిలోకి సింగ్ ఇంటికి వెళ్ళాలి. అంచాత తాడేసి కట్టేస్తే మంచిది కదా అని కట్టేశాను. అందుకలా మారాం చేస్తున్నాడు" అని చెప్పింది.

సింగ్ బంగళా గేటుకేసి ప్రవేశించేసరికల్లా సింగ్ భార్య చడీ చప్పుడూ లేకుండా నావైపు కొచ్చి సద్దు చేయడకుండా, తనతో రమ్మనమంది. నేను విస్మయం చెందాను. ఆవిడ చెప్పినట్టుగానే ఆవిడవెంట, బంగళా వెనుక భాగానికి వెళ్లాను. ఆవిడ మెల్లగా, రహస్యం చెప్పినట్టుగా నాతో ఈ విధంగా చెప్పింది. ఈ పొద్దున వేళ పది దాటేలోపున వాళ్ళ బంగళాకు ఎప్పుడూ రావద్దు. వస్తే ప్రమాదం వుందని అంది. అంటే నాకు అర్థమవక-

"ఏమిటా ప్రమాదం?" అని అడిగాను.

"రాత్రల్లా తాగడంలో గడిపిన సింగ్ తెల్లవారు జామున కుర్చీలోనే కొంతసేపు నిద్రించి, ఎనిమిది గంటలన్నరయ్యేసరికల్లా, పడక గదిలో నుంచి పైకి వచ్చి హాలులో కూర్చుంటాడు. అప్పుడు అతని కంట ఎవరూ పడకూడదు. అతనికంట ఎవరైనా పడ్డా, ఏదైనా దారుణమైన శబ్దం ఆయన చెవినపడ్డా, సహించలేక కోపం వస్తే ఎంత పనైనా చేస్తాడు."

ఒకమాటు ఆయనకు కావలసిన ఫలహారాలన్నీ ఆవిడ అమర్చి, అతని కంట బడకుండా ఆవిడ వంటింట్లోకి చేరుకుందట. ఎందుకో ఆవిడకి సింగ్ పిలిచినట్టుగా తోస్తే హాలులోకి వెళ్ళబోయిందట. ఆవిణ్ణి చూసి సింగ్ తుపాకీ తీశాడట. ఆవిడ జడిసి పారిపోయిందట. అందుచేత "పుస్తకాలు కావలిస్తే సాయంత్రం రావచ్చును. ఇప్పటికి సద్దు చేయకుండా పెరటితోవంటే ఇంటికిపొండి" అంది. నేను బ్రతుకు జీవుడా అనుకుని, బయటపడి నిషాకు జీవితం అమ్ముకున్న మనుష్యుల్లో రాక్షసత్వానికి చెందిన ఎంత గుణాలేవో బ్రహ్మజెముళ్లా పెరిగి, సన్నిహితులైన వాళ్ళని హింసించడం లోకంలో మనకు తరచూ ద్యోతకమవుతుంటుంది. దీనికి హృదయతత్త్వశాస్త్రం కూడా సరియైన జవాబు చెప్పలేదేమో!

నేను ఇల్లు చేరుకుని వ్యాసం రాసుకుంటున్నాను. కొంతసేపయాక, తుపాకీ పేలిన శబ్దం వినిపించింది. గుండె గతుక్కుమంది. నాకు కరచరణాలాడ లేదు. వెళ్ళి చూదామా అనుకున్నాను. వెళ్ళడం వల్ల ఏం చిక్కులు వస్తాయో, నాకు కాకపోయినా, నా బావమరిదికి-అని భయం వేసింది. వ్యాసం రాయలేక ఆలోచిస్తూ కూర్చున్నాను. పన్నెండు గంటలయింది. భోజనానికి లేద్దామనుకున్నాను.

జ్యోతి వీక్లీ సర్వేలో పాల్గొన్న

పాఠకుల లిస్టు......

లోపలి పేజీల్లో

రంగమ్మ కొడుకుని సింగ్ తుపాకీతో కాల్చి చంపేశాడని, గనిలోకెళ్లే కూలీలను కుంటున్నారు. నేను వుండలేకపోయాను. ఏ ఆపద సంభవించినా, సంసిద్ధతతో రంగమ్మ వూరి గుడిసె దగ్గరకు తొందరగా వెళ్ళాను.


రంగమ్మ గుడిసె ముందు కొద్దిమంది మనుష్యులు మూగి వున్నారు. ఆ మనుష్యలను తోసుకుని లోపలికి వెళ్ళాను. రక్తపు మడుగులో మృతించిన రంగమ్మ కొడుకున్నాడు. గుండు గుండెల్లోంచి దూసుకుపోయింది. రంగమ్మ ఇంట్లో లేదు. నేనాశ్చర్యపడ్డాను. అక్కడ వున్న కూలీని "ఏం జరిగింది?" అని అడిగాను.

రంగమ్మ కొడుకు సింగ్ ఇంట్లో, పెరట్లో ఆడుకుంటున్న కొడుకు మీదికి గెంతుకుంటూ వెళ్ళి ఆ కుర్రవాణ్ణి గోళ్ళతో రక్కి, పళ్ళతో కోటు చీల్చి పారేశాడట. సింగ్ కొడుకు పెద్దగా ఏడ్చాడట. సింగ్ కిటికీలోనుంచి చూసి, తుపాకీ తెచ్చి రంగమ్మ కొడుకుని కాల్చేశాడట. ఇంట్లో పని చేస్తున్న రంగమ్మను పిలిచి, ఇరవై రూపాయలు ఇచ్చాట్ట. ఈ విషయం ఎవరితోనైనా అంటే రంగమ్మని కాల్చి చంపుతానన్నాట్ట.

ఇంతలో రంగమ్మ ఏడుస్తూ వచ్చింది. రంగమ్మ చేతుల్లో ముఖమల్ బుష్‌కోటు వుంది. కొడుక్కి ముఖమల్ బుష్‌కోటు తొడిగింది. కన్నీళ్ళలో మిలమిల కూడా ఏదో కొంత కనిపించింది. కొడుకునెత్తుకుని ఊరి బయట స్మశానం పక్క నడిచిపోయింది. తరువాత మరి రంగమ్మ ఏమైందో, ఎవరికీ కనిపించలేదు.

కొంతమంది కొడుక్కోసం చనిపోయిందన్నారు. మరి కొంతమంది పుట్టింటికి వెళ్ళి శుభ్రంగా వుందన్నారు. ఈ రెండింట్లో ఏదైన అవడానికి అవకాశం కద్దు.

●




ఈ సీరియల్‌ను
సమర్పిస్తున్నవారు
DIGJAM
Sannidhi

గత సంచిక తరువాయి

హైమ జీవం లేని కళ్ళు శూన్యంలోకి చూస్తున్నాయి.
మొహం మీద వెచ్చటి స్పర్శ.
పెదాలు చిన్నగా విచ్చుకున్నాయి.
ఎవరో గాఢంగా చుంబిస్తున్నట్టు కింది పెదవి చిత్రంగా కదిలింది.
చెక్కిళ్ళ మీద నొక్కులు పడుతున్నాయి.
పైట నెమ్మదిగా ప్రక్కకి జరిగింది.

గుండ్రని భుజాల మీదుగా నిలువెల్లా కదులుతున్న స్పర్శ హఠాత్తుగా ఆగిపోయింది.

హైమ కుడి చేతి నరంలోకి రక్తాన్ని ప్రవేశపెడుతున్న సూది బయటకు వచ్చి గాల్లో నిలబడింది. దాని రంధ్రంలో నుండి రాలుతున్న రక్తం చుక్కలు నేల మీద పడకుండానే గాల్లో అదృశ్యమైపోతున్నాయి. సీసాలోని రక్తమంతా ఎవరో పీల్చేస్తున్నట్టు ధారలా గాల్లోకి ఎగజిమ్మబడింది. అదృశ్యమయిపోయింది. సీసా ఖాళీ అయ్యాక సూది విసురగా నేల మీద బడింది.

"హే... య్... మ్... మా!!!!!!! ను... వ్... వ్యు... నా... మ... ని... ష్... షి...వీ...

సరిగ్గా ఆ నిమిషంలో నర్సు గదిలోకి వచ్చింది.

హైమను చూసి నిశ్చేష్టురాలయింది.

భయంకరంగా తెరుచుకున్న కళ్ళు. చెదిరిన పయిట.

గబ గబ వెళ్లి చీర సర్దింది.

హైమను లేపే ప్రయత్నం చేసింది. ఆమె పలుకలేదు. కళ్ళు అర చేత్తో మూసేస్తూ బొమ్మకేసి చూసింది బొమ్మ గాఢ నిద్రలో ఉంది.

ఆమెను 'లేపాలా వద్దా' అన్న ఆలోచనలో ఉన్న నర్సు స్టాండుకి వేలాడుతున్న ఖాళీ రక్తం సీసాను చూసి ఆశ్చర్యపోయింది. అంత త్వరగా ఓ సీసా రక్తం పేషంటు వంట్లోకి వెళ్ళటం. ఇంపాసిబుల్! సీసాను తీసేస్తూ అప్పుడు చూసింది.. నేల మీద పడున్న సూదిని. సూదిలో నుండి జారిన పెద్ద రక్తం చుక్క ఒకటి నేల మీద ఎర్రగా మెరుస్తోంది.

వెళ్ళే ముందు చక్కగా అమర్చి వెళ్ళింది. సూది పేషంటు నరంలో నుండి ఎలా జారి కింద పడుతుంది?..... ఒకవేళ పడ్డా రక్తమంతా కిందకెలా ప్రవహిస్తుంది?... అలా జరిగినా... ఆ రక్తమంతా ఏమయినట్టు?! తను సరిగ్గానే చూస్తోంది?...

శశిధర్ మందులు తీసుకుని వచ్చాడు.

ఇంజక్షనిచ్చి వెళ్ళి నేల మీద రక్తం తుడవటానికని 'కాటన్' తీసుకు



వచ్చింది. కాని... నేల మీద ఇందాక కనిపించిన రక్తం కాదు కదా, చిన్న మరక కూడా లేదు. నేల 'క్లీన్'గా వుంది.

ఒకసారి తల విదిలించుకుంది. తనకేమవుతోంది? ఎవరికయినా చెప్తే నవ్వేస్తారేమో!...

శశిధర్ హైమ ప్రక్కనే కూర్చున్నాడు.

బయట చిన్నగా వర్షం కురుస్తోంది.

ఉండుండి భీకరంగా ఉరుముతోంది ఆకాశం.

వాతావరణం అతని మనసులాగే అల్లకల్లోలంగా ఉంది. అతని మస్తిష్కం నిండా ఏవేవో ఆలోచనలు. అన్నిటికీ ఒక్కటే!... 'హైమనెలా దక్కించుకోవాలి?'

"హైమా!" గొంతు గద్గదమవుతుంటే అనునయంగా పిలుస్తూ ముంగురులు సర్దబోయాడు.

భళ్ళున పెద్ద శబ్ధమయింది.

ఉలిక్కిపడి అటువైపు చూశాడు.

నిలువెత్తు కిటికీ అద్దం బ్రద్దలయింది. కొంచెం దూరంలో ఉన్న అశోకవృక్షం ఎవరో పెకిలిస్తున్నట్టు విపరీతంగా ఊగుతోంది.

నర్సు వచ్చి గాజు పెంకుల్ని ఓ ప్రక్కకి తప్పించే ప్రయత్నం చేస్తూ అంది "ఎక్కడో మళ్లీ 'సైక్లోన్' వచ్చినట్టుంది". అన్ని గాజు పెంకుల్ని తీయటం కష్టమనుకుందేమో! "నేను వెళ్ళి 'స్వీపర్'ని తీసుకు వస్తాను" అని వెళ్ళిపోయింది.

తన చూపులని మళ్ళీ హైమ వైపు తిప్పుకున్నాడు శశిధర్.

అలిసిపోయిన లేత వదనం. అమాయకంగా మూసుకున్న నల్లని కను రెప్పలు. వన్నె తగ్గిన కెంపు కాంతుల చెక్కిళ్ళు. మౌన ముద్రలో లేత గులాబీ అధరాలు.

శాంతినెరుగని అతని హృదయం గాలి వానతో కలిసి రోదిస్తోంది "హైమా! ఒక్కసారి కళ్ళు తెరవ్వూ! నీకేం భయం లేదు. నేనున్నాను. నిన్ను దక్కించుకుంటాను. ఎక్కడో పుట్టి ఎక్కడికో ప్రయాణం చేస్తున్న మనం ఒక మలుపులో ప్రశాంతంగా కలుసుకున్నాం. జీవితాలని ఒకటి చేసుకున్నాం. భవిష్యత్తు గురించి కలలు గన్నాం. నువ్వు... నువ్వు పలక్కపోయినా సరే, నీ మౌనాన్ని నా హృదయంలో నింపుకుని తృప్తి పడతాను. కాని... నన్ను విడిచిపోకు నేస్తం.

లాలనగా ముంగురులు సవరిస్తూ నుదుట ముద్దు పెట్టుకున్నాడు.

అశోక వృక్షం థధృతంగా ఊగిపోయింది.

ఆకాశంలో విద్యుల్లతలు అల్లబిల్లిగా కదిలి మాయమయ్యాయి.

విద్యుత్ స్పర్శతో తల్లడిల్లిపోతున్న 'పిచ్చి పేషంట్లలా' మేఘాలు అరుస్తున్నాయి... ఆక్రోషిస్తున్నాయి.

అశనిపాతపు తొలి స్పర్శ తాకునట్టు అశోక వృక్షం నేల కూలుతూ నిప్పంటుకుంది.

గాలి వాన సైతం ఆ మంటలనార్పలేక పోయింది.

నిమిషాల్లో నింగికెగిసే మంటల్లో మాడిపోతున్న కొమ్మల, రెమ్మల చిటపటలు...

"హై... య్... మ్... మా... నా... దీ..."

ఉదయం పదకొండు గంటలు.

'కేతా నర్సింగ్ హోమ్' కాన్ఫరేన్స్ హాలులో 'రౌండ్ టేబుల్' అందంగా అలంకరించబడి ఉంది. దాని చుట్టూ దాదాపు పదిహేను మంది డాక్టర్లు కూర్చుని ఉన్నారు. వాళ్ళంతా వైద్య రంగంలోని వివిధ శాఖల్లో నిష్ణాతులు. ఒక్కొక్కరి ముందూ ఒక్కో 'ప్యాడ్' ఉంది. 'ప్యాడ్స్' మీద 'ఫిక్స్' చేసిన పేపర్లలో హైమ భౌతిక పరిస్థితికి సంబంధించిన వివరాలు క్లుప్తంగా టైప్ చేయబడి ఉన్నాయి. వాటిని ఓసారి చదివిన డాక్టర్లు ఒకరి మొహాలొకరు చూసుకున్నారు అయోమయంగా.

"ఇటీజ్ అన్ బిలీవబుల్" అన్నాడో డాక్టరు.

"ఓ బ్రతికున్న మనిషికి సంబంధించిన వివరాలేనా ఇవి?"

"సెన్స్‌లెస్ రిపోర్ట్స్..."

"డాక్టర్ మిస్ కేతా!" ఓ డాక్టరు లేచి నిలబడ్డాడు. అతని పెదాలు వెటకారంగా వంకర తిరిగాయి "ఈ ప్యాడ్ మీద రాసిన వివరాలు..." అంటూ ప్యాడ్‌ని ఆమె వైపు, అందరి వైపూ ఓసారి చూపెట్టి నిర్లక్ష్యంగా టేబులు పైన వదిలేశాడు "మమ్మల్ని నమ్మమంటున్నారు... అవునా?" ఆ డాక్టరుకి కూడా ఆ ప్రాంతంలోనే 'ఓ నర్సింగ్ హోం' ఉంది.

"అఫ్‌కోర్స్"...

ఆమెను పూర్తిగా మాట్లాడనీయకుండా అన్నాడు.

"బట్... ఇలాంటివి మేమెలా నమ్ముతామనుకున్నారు?"

అతని నర్సింగ్ హోమ్‌కి, కేతా నర్సింగ్ హోమ్‌కీ మధ్య వ్యాపారంలో గట్టి పోటీ ఉంది.

"ఓసారి పేషంటుని మీరంతా పరీక్షించాలనే ఇలా 'కాన్ఫరెన్స్' ఏర్పాటు చేశాను..."

"అవసరం లేదు. మీ 'స్టాఫ్'కి మంచి ట్రయినింగ్ ఇప్పించండి. అది చాలు..." అతడు వెళ్లిపోవటానికి అటు తిరిగాడు.

"దే ఆర్ వెల్ ట్రయిన్డ్" అంది సాలోచనగా. ఆమెకర్థమయిపోయింది. ఆ డాక్టరు ఈ అవకాశాన్ని బిజినెస్ కోసం వాడుకుంటున్నాడు. కేతా నర్సింగ్ హోమ్‌ని కించపరిచే విధంగా మాట్లాడి, అది పేపర్లో వచ్చేట్టు 'మేనేజ్' చేస్తాడు. తర్వాత విషయాలు ఎవరూ పట్టించుకోరు గాని, 'నెగెటివ్ టాక్' మాత్రం ప్రజల్లో వస్తుంది. అదీ అతనికి కావల్సింది.

"అలా అయితే మీ 'ఆధునిక పరికరాలని' ఓసారి 'చెక్' చేయించండి." నిర్లక్ష్యంగా అన్నాడు.

"వాటిల్లో దోషం లేదు." ఆమెలో ఉక్రోషం పెరిగిపోతోంది. 'రిసెర్చ్ స్కాలర్స్'కి ఎంతో ఉపకరించే ఓ మంచి పని చేయబోతోంది తను. తన ప్రయత్నం మాటిలా ఉన్నా వ్యాపారం వృద్ధి చేసుకునేందుకు ఇలాంటి సమావేశాలని కూడా ఉపయోగించుకోవటం ఆమె ఊహించని విషయం-

"దెన్... ఒక్కటే మిగిలిపోయింది."

"ఏమిటి?"

"ఓ మానసిక వైద్యుణ్ణి సంప్రదించండి... మీ కోసం..."

క్షణం పాటు ఆమె స్తంభించిపోయింది.

ఆ క్షణం కోసమే ఎదురు చూస్తున్నట్టు అన్నాడు.

"కేవలం ఇలాంటి 'మీటింగులు' పెట్టి 'ప్రెస్సు'ను పిలిపించి అర్థం లేని 'స్టేట్ మెంట్స్' ఇచ్చి వాటి మూలంగా బిజినెస్ పెంచుకోవటం మీలాంటి మంచి డాక్టర్లు చేయాల్సిన పని కాదు. మీ స్వార్థం కోసం మా సమయాన్ని వృథా చేస్తున్నారు. సెలవ్....."

అతని వెనుకే ఒక్కొక్కరూ లేచి నిలబడ్డారు.

"ప్లీజ్ వెయిట్! దయచేసి కూర్చోండి. మీ సమయం వృథా చేయటం నా ఉద్దేశ్యం కాదు. జస్ట్... రెండు నిమిషాలు కూర్చోండి చాల..."

అందరూ నిరాసక్తంగా కూర్చున్నారు.

"మీరలా అనటంలో ఆశ్చర్యం లేదు. మీ స్థానంలో ఉంటే నేనూ అలాగే అనేదాన్నేమో?" ఆగి ఓ క్షణం అందరి వంకా చూసింది. "హైమని నిన్న ఉదయం ఇక్కడ చేర్పినప్పుడు ఆమె పల్స్ రీడింగ్ అవీ ఎంతో హెచ్చు స్థాయిలో అసాధారణంగా ఉన్నాయి. ఈ రోజు ఉదయం అంతే తక్కువ స్థాయిలో అసాధారణంగా ఉన్నాయి. ఈ పేషంటు మొదటి నుండీ మమ్మల్ని అయోమయంలో పడేసిన మాట వాస్తవం. 'కోమా'లో ఉంది. ఆమె భౌతిక పరిస్థితి, సగటు మనిషి భౌతిక పరిస్థితికి భిన్నంగా ఉంది. అంతే తప్ప ఆమెలో మరే అనారోగ్యం కనిపించటం లేదు... ఒక్క..." పెదవి దాకా వచ్చిన "మాన భంగం" అన్న మాటని చప్పున నొక్కి పెట్టింది. "వెల్... ఈ కేసుని 'ఇంటర్‌నేషనల్ రాయల్ మెడికల్ సొసైటీ'కి రెఫర్ చేశాను. పేషంటుని పరీక్షించటానికి వాళ్ళ బృందం త్వరలో రావచ్చు."

రచయిత చిరునామా
దంతూరి పండరీనాథ్,
9-2-619, సేంట్‌ఫ్రాన్సిస్ స్ట్రీట్,
సికింద్రాబాద్ - 500 003

"ఇంటర్నేషనల్ రాయల్ మెడికల్ సొసైటీ" పేరు వినగానే డాక్టర్లంతా 'ఎలర్ట్' అయ్యారు. ఆ సొసైటీ 'ఇంగ్లాండ్'లో ఉంది. అందులో "మెంబర్ షిప్" దొరకటం అదృష్టంగా భావిస్తారు డాక్టర్లు. అంతర్జాతీయంగా దానికత్యంత గౌరవనీయమయిన రెప్యుటేషనుంది. ఈ కేసుని ఆ సొసైటీకి రెఫర్ చేస్తే, పేషంటు పరిస్థితిని 'ఫాలో' అయ్యే డాక్టర్ల పేరు కూడా 'రెఫర్' చేయబడతాయి. నిజంగా కేసు అసాధారమయిందయితే 'రాయల్ మెడికల్ సొసైటీ' దాన్ని ప్రపంచ వ్యాప్తంగా విశదీకరిస్తుంది. అలాగే దానికి సంబంధించిన డాక్టర్లకి కూడా ప్రపంచ వ్యాప్తంగా పేరు (పబ్లిసిటీ) వినిపించుకునే అవకాశం కలుగుతుంది. అందులో సందేహం లేదు. డాక్టర్ కేతా చేస్తున్న ఆర్భాటమంతా బాగానే ఉంది కాని... 'ఈ కేసు నిజంగా అంత అసాధారణమయిందేనా?" అన్నదే ప్రశ్న.

మళ్ళీ డాక్టర్ల మధ్య చిన్న కలకలం. (ఇంకావుంది)

పర్సనల్ ఎఫైర్స్

ఎడిటర్‌గారికి! నమస్కారం.

నా పేరు అ .... నా వయసు ముప్పై ఎనిమిదేళ్లు. మంచి కుటుంబం లోంచి వచ్చాను. మా తండ్రిగారు తాశిల్దారుగా రిటైరయ్యారు. మేం ముగ్గురం అక్కచెల్లెళ్లం. నేనే పెద్ద దాన్ని. దేనికీ కొరత లేకుండా పెరిగాం. నాకు పెళ్లయి పదిహేనేళ్లయింది. ఇద్దరు పిల్లలు. మా శ్రీవారు నన్ను అమితమైన ప్రేమతో చూసుకుంటారు. సెక్సువల్‌గా కూడా మా ఇద్దర మధ్యా ఏ మొహమాటాలూ లేవు. కానీ ఇటీవల కాలంలో నా ఆలోచనల్లో ఏదో మార్పు వచ్చింది. దానిక్కారణం రెండు నెలల క్రితం జరిగిన ఓ సంఘటన. ఆ రోజు ఓ మధ్యాహ్నం..... ఊసుపోక మా పక్కింటికెళ్లాను. నేనెన్నడూ ఊహించని సంఘటన. నేను పిన్నిగారూ, పిన్నిగారూ అని పిలిచే పక్కింటావిడ, వాళ్లింట్లో అద్దెకుండే ఓ కుర్రాడితో ..... ఏకాంతంగా ..... ఉంది ..... ఆ దృశ్యం చూసిన దగ్గర్నించి నా మనసు నా మనసులో ఉండడంలేదు. అప్పటివరకు, మగవాళ్లని, మా ఇంటికొచ్చే అతిథులైన మగవాళ్లనిగాని మామూలుగా చూసే నేను ప్రస్తుతం అలా చూడలేకపోతున్నాను. రాత్రివేళ నిద్రపోతున్న సమయంలో పరాయి పురుషులతో ఉంటున్నట్టు ... వాళ్లకోసం ..... ఎదురుచూస్తున్నట్టు ... చాలా ... చాలా ... ఎన్నో చెప్పలేని కలలు....

ఇప్పటి వరకూ నా భర్త నాతో వారానికి రెండు సార్లు పడుకుంటాడు. కానీ ఆ దృశ్యం చూసిన దగ్గర్నించి ప్రతిరోజా ..... ఆయన నా దగ్గరుండాలని అన్పిస్తోంది.... లేకపోతే చెడు ఆలోచనలొస్తున్నాయి. ఈ వయసులో పిల్లల తల్లిగా ఈ ఆలోచన లేమిటని ..... అనుకుంటున్నా ..... నన్ను నేను అదుపులో పెట్టుకోలేక పోతున్నాను. ఈ సమస్యను ఎవరితో చెప్పుకోను .... మా ఆయన్తో చెప్పుకున్నా ... ఏమని చెప్పను ..... నాకు కాస్త మనశ్శాంతిని ఇవ్వమని కోరుతూ-


భవదీయురాలు.

.....అ .... విజయవాడ.

అమ్మా!

మీరు రాసిన సుదీర్ఘమైన ఉత్తరం చూశాం. అందులో సాధ్యమైనంత తగ్గించి మీ కోరిక మేరకే ప్రచురిస్తున్నాం. మేం ఒక డాక్టర్ని ప్రత్యేకంగా సంప్రదించి, మీరిచ్చిన అడ్రసుకి విపులంగా ఒక ఉత్తరం రాస్తున్నాం. డాక్టరు చెప్పిన ప్రకారం మీరు ఆచరణలో పెడితే మీకు మానసిక వత్తిడులు కానీ, వేరే ఆలోచనలు కానీ లేకుండా ఉంటాయనుకుంటున్నాం. దేనికైనా సంశమయం ముఖ్యం. ఆ విషయం మీకు తెలుసుకదా!

పల్లకీలో శవం



పురాణం శ్రీనివాసశాస్త్రి

కథ

ఊరంతా పండుగ చేస్తూ ఇంటింటి దగ్గరా ఆగుతూ మేళతాళాల పట్టుబట్టల పన్నీటి గంభాల పిల్లల కేరింతల పల్లకీ ఒక సరదాలా సాగుతోంది!

ఆ పల్లకీలో ఓ శవం...

చాకలి సుబ్బడి పల్లకీ చాలా రోజుల తరవాత ముస్తాబు చేసుకొంది.

సుబ్బడు పల్లకీని నమ్ముకోటం మానేసి కులవృత్తి చేసుకు బతుకుతున్నట్టు-కాదు కాదు-చాకలి బట్టల కుల వృత్తిలో పల్లకీ తరుగయిపోయింది.

చుట్టుపక్కల నాలుగైదు ఊళ్లకి సుబ్బడి పల్లకీయే పెళ్ళిళ్ళు చేసేది.

"మనుసులు పల్లకీని . ఒదిలేసారు. పల్లకీ ఎక్కాలనే పిల్ల మనసు ఈ రోజుల్లో పెళ్లి కొడుకులకి లేదు. పెళ్లి కొడుకులు కాబోయే అలి సించి డబ్బులు దండుకోడం మరిగాక సిన్న సిన్న సరదాలు, సిట్టి సిట్టి తగవులూ పోయి పెళ్లిళ్లు నీతి తప్పాక ఈ రోజుల్లో నా పల్లకీలో ఊరేగేదెవళ్లు!" అని బాధ పడేవాడు! ఇప్పుడలా బాధ పడడం మానేసాడు. ఓ గాడిదను సంపాదించాడు. పల్లకీకి మేలు రకం భర్తీ దొరికింది.

పల్లెటూళ్లల్లో కూడా కొత్త జంటలు పల్లకీల్లో ఊరేగక పోతే సుబ్బడికొచ్చిన నష్టం లేదు. కానీ పల్లకీ ఎక్కాలనుందని సర్దా పడే పెళ్లి కొడుకెవరైనా ఉంటే తన పల్లకీ మళ్లీ ముస్తాబవదా అని ఓ సరదా సుబ్బడి గుండెల్లో రహస్యంగా ఒక కోరికగా పేనరుకుంది.

వాడి గాడిద గడ్డి తింటూ చాకి రేవు దగ్గర వాడికి సాయపడుతోంది.

వాడి పల్లకీ వాడి గుడిసె వెనకాల ఓ పందిరి కింద ఎండకి ఎండకుండా వానకి తడవకుండా దేని కోసమో తపస్సు చేస్తున్నట్టు ఉండిపోయింది.

పల్లకీలో శవం మౌనంగా రోదిస్తోంది.

తండ్రి కోసం తాను చేసుకొన్న "అనుకోని ఆత్మహత్య" గుర్తుకు తెచ్చుకుంటోంది శవం.

తండ్రి

పేరు సూర్యారావు!

అతనికి ఒకే ఒక్క కూతురు. ఇద్దరు భార్యలు!!

రెండు పెళ్ళిళ్లు చేసుకున్నాడు-కట్నం కోసం. కూతురి పేరు సుభద్ర. కూతురుని కన్నందుకు పెద్ద భార్యని బాలింతగా ఉన్నప్పుడు కొట్టిన పశువు.

పల్లకీలో శవం ఊహ చేసుకుంటోంది. తండ్రి దెబ్బలికి తల్లడిల్లిన తల్లి బాలింత రోదనని. అప్పుడు అమ్మ పక్కలో తొమ్మిది రోజుల తను కళ్లు విప్పని తను ఉలిక్కి పడి ఏడ్చిందిట. ఇప్పటికీ చెబుతుంది అమ్మ.

కూతుర్ని కన్నందుకు అమ్మని వదిలేసిన నాన్న ఇంకో పిన్నిని తెచ్చుకున్నాడు. ఈ విషయం కూడా అమ్మ చెబుతుంది-నవ్వుతూ. అమ్మ నాన్నని క్షమించదు. కాని క్షమించకపోవడం మినహా ఇంకేమీ చెయ్యలేదు. అందుకే నవ్వుతుంది. వెక్కిరింత లేని కోపపు నవ్వు నవ్వుతుంది.

అమ్మ తనకి లాగూ, చొక్కా తొడిగేది. క్రాఫింగ్ చేసేది. బొట్టూ కాటుకా పెట్టేది కాదు. మగ పిల్లాడిలా పెంచింది. సుభద్ర అని పిలిచేది కాదు తనని. భద్రీ, భద్రిగా, భద్రరావ్ అని పిలిచేది. స్కూల్లో తోటి ఆడపిల్లలు తనను వింతగా చూసేవారు. వాళ్లు తన మగ వేషానికి అలవాటు పడిపోయారు. అలవాటు కానిది తనకే. అమ్మని ఓ రోజు అడిగేస్తే అమ్మ మళ్లీ

నవ్వుతూ చెప్పింది "నిన్ను కొడుకుగా కన నందుకు మీ నాన్నకి నా మీద ఏవగింపు. నిన్ను కూతురిలా కాకుండా కొడుకులా పెంచుకుంటున్నా-మీ నాన్న సంతోషిస్తా రేమో అని"

ఈ మాట చెప్పగా మా నాన్న సూర్యా రావు మీద తనకి కోపం పెరిగి పోయింది. సూర్యారావంటే అసహ్యం..చిరాకు..ఎప్పుడూ పిన్ని దగ్గర ఉండేవాడు. బిజినెస్ చేసే పొద్దు. అప్పుడప్పుడు అమ్మ దగ్గరకి వచ్చే వాడు.

అమ్మకెపుడూ మూడే చీరలుండేవి. అందులో ఒకటి మంచిది. నాన్న వచ్చినప్పుడల్లా అమ్మ అదే మడిచి. చీర కట్టుకునేది.

నాన్న సూర్యారావు ఎప్పుడూ తనని దగ్గరకి తీసుకునే వాడు కాదు. అమ్మతో ఎప్పుడూ డబ్బు లెక్కలు మాట్లాడేవాడు. ఒక్క రోజే ఉంటే అమ్మతో గొడవ పడి వెళ్ళిపోయేవాడు. రెండు రోజులుంటే రెండో రోజు అమ్మని కొట్టేవాడు. కొన్ని రూపాయలు జేబు లోంచి తీసి విసిరి అస హ్యంగా ఊగుతూ వెళ్ళిపో యేవాడు.

నాన్న సూర్యారావు మనిషిలా కాకుండా రూపాయ నోట్లతో చేసిన గేదె బొమ్మలా కనిపించేవాడు తనకి.

నాన్న రెండ్రోజులు కాకుండా-ఒక్క రోజే ఉంటే బాగుణ్ణు అని దేముడికి తాను మొక్కు కోడం అమ్మకి తెలుసు.

నాన్న అంటే

అమ్మని కొట్టే, నన్ను తిట్టే, నాన్న అంటే-జమగాడు.

మగ బట్టల్లో ఉన్న తనకి 'మగ' అనే ఆలోచనే ఒక భయం.

ఓసారి మగ బట్టల్లో ఉన్న తనని నాన్న ఒళ్ళో కూర్చోబెట్టుకున్నాడు.

"ఒసే ఈ కోతికి పెళ్ళలాగే చెయ్యడం. ఒంటి రంగు నలుపు-అంటే పది వేలు. శరీరం లావు-వేసుకో ఇంకో 20 వేలు. చూడబోతే అరడుగులు ఎదిగేట్టుంది. ప్లటా ఇంకో 30 వేలు. ఈ ముండకి పెళ్ళి కొడు కుని తేవాలంటే కనా కష్టంగా ముష్టి వెధవ కిచ్చినా 70 వేలు కట్నం లేనిదే కుదర్దు" అన్నాడు.

"కట్నం పోతురా జులకిచ్చి చెయ్యను నా కన్న తల్లిని" అంది ఆ మాటకి సమాధానంగా నాన్న సూర్యారావుతో అమ్మ.

నాన్న సూర్యారావుని చంపేయాలని మొదటిసారి అనుకుంది తను.

సుబ్బడి పల్లకీకి కబురొచ్చింది.

అప్పుడు వాడు చాకి రేవు దగ్గరున్నాడు. వాడి గాడిద గడ్డి మేస్తోంది. చాకిరేవు బాన వాడి గుడ్డల మోతకి లయ వేస్తోంది. ఉతికి వేసిన

నిమ్మీ అదృష్టం

బొంబాయి సెంట్రల్ స్టేషన్‌కు దగ్గర్లోనే ఒక చిన్న గేరేజ్ వుంది. చిత్రసీమలో తన ప్రత్యేక ఇమేజ్‌ను స్థాపించుకున్న నిమ్మీ బొంబాయిలో మొదట్లో ఆ గేరేజి లోనే కాలం గడిపింది.

మురికికూపం లాంటి ఆ ప్రదేశంలోని గేరేజిలో వుంటూ ఆకలికి తట్టుకుంటూనే అక్కడి దుర్వాసనను పీల్చుకోడానికి అల వాటు పడిపోయింది. ఈ మురికి కూపంలోనే తనకో ఆశా కిరణం కనిపించిందని చెప్తుంది నిమ్మీ. ఆ ఆశాకిరణమే తనను జీవితంలో నిలదొక్కుకునేలా చేసింది. తర్వాత, తన అదృష్ట రేఖ మారి పోయింది.

- ఎ.పి.

బట్టలు దండేలకి ఎగురుతున్నాయి. అప్పుడు పెళ్ళివాడు అక్కడికి వగరుస్తూ వచ్చి సుబ్బడికి కబురు చెప్పాడు.

"మునసబు గారి అల్లుడు గారు మాయాబజారు సినిమాకెళ్తాడంట. బేగ రమ్మన్నడు నిన్ను." అంటూ.

విషయం ఏమిటంటే-

మాయా బజారు సినిమా మళ్ళీ ఆడు తోంది మార్కెట్లో. మునసబు గారి కొత్త ల్లుడు గారు ఊళ్ళోకి దిగారు నిన్ననే. పట్నం మడిసికి పొద్దు గడవక కొత్త పెళ్ళాంతో మార్కెట్టు సినిమాకి బయల్దేరారు. బస్సు దొరికింది కాదు. ఊళ్ళో ఉన్న ఒక్క ఒంటెద్దు బండికి కబురంపితే పురుగు మందు కలిపిన కసువు మేసి ఎద్దు కాళ్ళు బారజాపుకుని పడి ఉంది. ఇప్పుడు అర్జెం టుగా సుబ్బడు పల్లకి బైటికి తియ్యాల. లేకపోతే మునసబు గారికి అల్లుడి ముందు అగుమానం.

మునసబు అల్లుడిగారి 'మాయా బజారు' ముచ్చట తీర్చాడు సుబ్బడు. ఐదు రూపాయలు సంపాదించ పెట్టింది పదిహే నేళ్ళ తరవాత పల్లకి. తానుషీ సారా కొట్టులో తిరింది కాని-

పెళ్ళి కొడుకుని, పెళ్ళి కూతుర్ని దివి టీలతో మేళతాళాలతో ఊరేగించాలన్న కోరిక మాత్రం సుబ్బడికే మిగిలిపోయింది.

పల్లకీలో శవం ఉలిక్కి పడింది పెళ్ళి కూతురి పలకరింపుతో, ఎవరింటి దగ్గరో ఆగింది పల్లకి. ఓ బామ్మగారు పెళ్ళి కొడు కుని మొహం మీద మొహం పెట్టి పరీక్షగా చూస్తోంది. "బామ్మగారు చూస్తారు తలకా యెత్తరేం?" అంది పెళ్ళి కూతురు. శవం ఉలిక్కి పడి తలెత్తింది. బామ్మగారు బుగ్గలు తడిమి "చందమామే దొరికిందే నీకు పిల్లా" అంది పెళ్ళి కూతురుతో. పెళ్ళి కూతురు అత్యవసరంగా సిగ్గు పడింది బామ్మగారు కోప్పడుతుందేమోనని.

పల్లకీలో శవం కోరినాబంది నరదాల పరదాల మాటున నిప్పు లాంటి నిజం తలచుకొని.

ఓసారి

అంటే రెండేళ్ళ క్రితం

భాద్రీ, భాద్రిగా, భద్రరావూ అని అమ్మ పిలిచే తనకి, ముష్టివాడికిచ్చి చెయ్యాలన్నా 70 వేలు పొయ్యాలని కూతురి ముఖంలో ఖర్చు పద్దులు చూసి నాన్న సూర్యారావు నిట్టూర్చిన తనకి పెళ్ళీడు వచ్చిందన్నాడు.

"పండిన మొగలి పొత్తు వంటి పరి మళం గల ప్రారంభ యౌవనము నిండిన ఆరోగ్యపు నా కళ్ళ ముందు విరిసిన నంది వర్ధనం పువ్వుల మధ్య"... ముఖం మీద లక్ష రూపాయల ఖర్చుతో తను నాన్న సూర్యారావుకి ఎలా కనిపించిందో తెలి యదు.

"ఒసే! ఈ ముండని ఎలాగూ మగ వెధవలాగా పెంచావు. అదేదో ఆపరేషనొ చ్చిందట. మగవాడిలాగా మార్చ పారే స్తాను. డాక్టర్ బిల్లు ఎంతవుతుందీ-మహా అయితే పది వేలు. మార్కెట్లో నిలబె ట్టామంటే కట్నం ఒడుక్కోవచ్చు" నాన్న సూర్యారావు అమ్మతో జోగేసాడు.

అంతే-

ఎప్పుడో చిన్నప్పుడు తల్లి బాలింత పక్కలో కెవ్వుమన్న పసి గుడ్డు అయిపో యింది తను.

ఆత్మహత్య చేసుకోవాలనిపించింది నాన్న సూర్యారావు మాటకి. తన చదువు ఆ ఆలోచనకి అడ్డొచ్చింది.

సుబ్బడి పల్లకీ ముస్తాబవుతోంది. ముఖమల్ జలతారు, పూసలు, చమ్కీ,

రంగుల గాజు ముక్కల గోటు, కుచ్చుల తో రెండు రోజులు అలంకరించాడు సుబ్బడు.

సరిగ్గా అంతకంతా కళ నాయుడు గారమ్మాయి ముఖంలో కనిపిస్తోంది. పేరు రమణి.

"రమణకి సంబంధం కుదిరిందట"

"పెళ్లి కొడుకు పెద్ద చదువులు చదివాట్ట... హైదరాబాద్ సంబంధమట. ఒకడే కొడుకట..."

"కట్నం ఎంతిస్తున్నారో"

"ముప్పై వేలని అంటున్నారు. కట్నానిదేముందమ్మా... నాయుడిగారికేం లోటు.... పసుపు కుంకుమా కింద ఐదెకరాలు రమణికి ఇస్తున్నాట్ట...."

"రమణికి పెళ్లంటే ఈ జిల్లా మొత్తానికి గవర్నమెంటు వారు సెలవు ప్రకటించెయ్యాల్సిందే... ముచ్చటైన పిల్ల కాదుటండీ"

ఊరంతా సంబరపడింది.

ఒక ఆడపిల్లకి పెళ్లవుతుంటే అంతా సంతోషించే పాత కాలపు ఊరది.

నాయుడుగారు ఈ పెళ్లికి భూమ్యాకాశాలు ఏకం చెయ్యడానికి నిశ్చయించారని కార్చిచ్చులా వార్త వ్యాపించింది. ఇక ఊళ్లో చ్చి. ఆ ఊరు మీద పడడం తరువాయి. ఈ పెళ్లికి పల్లకీ ఉండాల్సిందే అని నాయుడుగారు కాబోయే వియ్యంకుణ్ణి కట్టడి చేసారు.

"పెళ్లి కొడుకుని అడగాలండీ... ఈ విమానాల రోజుల్లో పల్లకీ ఎక్కాలంటే వాడేమంటాడో".

"విమానాలదేముంది. స్పుత్నిక్‌లు కూడా ఉన్నాయి. కానీ అవి పెళ్లి ఊరేగింపుకి బాగుంటాయంటారా?" నాయుడు గారు, చిన్న కుండ బద్దలు కొట్టారని వియ్యంకుడు అర్థం చేసుకున్నాడు. 30 వేలు కట్నం ఐదెకరాల పసుపు కుంకుమా 20 తులాల బంగారం ఇస్తానంటే పల్లకీ దగ్గర పేచీ కూడదని లెక్కకట్టి లాభం ఆలోచించి 'నా పేరు సూర్యారావు' అని మీసం మెలేసాడు ఆయన.

సుబ్బడికదేమీ తెలియదు.

లోకంలో తన పల్లకీ కోసం ముచ్చటపడే పెళ్లి కొడుకులున్నారని సంతోషపడ్డాడు. వాడి పల్లకీకి చాన్నాళ్లకి మళ్లా పెళ్లి కళ వచ్చింది.

పల్లకీ సాగుతోంది.

ఊరంతా పండగ చేస్తూ ఇంటింటి దగ్గరా ఆగుతూ మేళతాళాల పట్టుబట్టల పన్నీరు గంధాల పిల్లల కేరింతల పల్లకీ ఒక పరదాలా సాగుతోంది.

ఆ పల్లకీలో ఓ శవం... పేరు సుభద్ర.... ఇప్పుడు భద్రి, భద్రిగాడు, భద్రరావు...

"అకలుషితపు యౌవనోల్బణంతో కళ్లల్లో ఆకాశాల ఆశల మేరు చందనీయ

ఒకసారి వీరిలా అన్నారు

వ్రాసేటప్పుడు నా హృదయంలో గొప్ప ఉత్సాహం, ఉద్రేకం మండుతూ ఉంటుంది.

-చెలం

ఒకసారి వీరిలా అన్నారు

మనం రాసిన దానికి సర్వాధికారి పాఠకుడే. మనం ఏదో రాసినా పాఠకుడి కోసమే! 'పాఠకుడికీ జై' అనుకుని మనం రాయడం మొదలు పెడితే పాఠకుడు కూడా కొన్ని రోజులు పోయాక 'రచయితకీ జై' అనొచ్చు అంతే.

-తంబు

కట్టుకున్నా" పెళ్లి కూతుర్ని ఆర్తిగా ఆలింగనం చేసుకోవాలనుకుంది.

మనిద్దరినీ శవంలాంటి ఒక వ్యవస్థని పల్లకీలో కూర్చోబెట్టి ఊరేగిస్తున్నారని చెప్పాలనుకుంది.

పల్లకీ సాగుతోంది శవ యాత్రలా!

('పల్లకీలో శవం' పేరు సూచించి దానికి తగ్గ కథ రాయమని అడిగిన మిత్రుడు కథల మూర్తి రాజు దాటికి కరచాలనంతో-రచయిత)

సాహిత్య వార్త

● జూలై 2న హైదరాబాద్‌లో కొంత మంది మేధావులు, రచయితలు కలిసి 'తెలుగు హితవరులు' అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించారు. ఈ సంస్థ తొలి సమావేశం రవీంద్ర భారతిలో జస్టిస్ ఆవుల సాంబశివరావు అధ్యక్షతన జరిగింది. శ్రీయుతులు వావిలాల గోపాలకృష్ణయ్య, డాక్టర్ నండూరి రామ కృష్ణమాచార్య, మహీధర రామమోహన రావు, మధురాంతకం రాజారాం, ఆర్.ఎస్.సుదర్శనం, పురాణం సుబ్రహ్మణ్య శర్మ, రాంభట్ల కృష్ణమూర్తి జి.కృష్ణ, డాక్టర్ బి.రామరాజు, డాక్టర్ చేకూరి తెలుగు అకాడమీ డైరెక్టర్ వి.కొండల రావు, సి.ధర్మారావు, కోడూరి కాశీ, ముక్తవి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సంస్థ తెలుగు జాతి శ్రేయస్సుకు తద్వారా భారత శ్రేయస్సుకు కృషి చేస్తోందని, సాహిత్య అభిరుచులను సంస్కరిస్తుందని నిర్వాహకులు తెలియజేశారు.

● *జూన్ 28 నుంచి జూలై 8 వరకు హైద్రాబాద్‌లోని మాక్స్ ముల్లర్ భవన్‌లో ప్రఖ్యాత చిత్ర కళాకారుడు టి.వైకుంఠం, పెయింటింగ్స్, డ్రాయింగ్స్ ప్రదర్శన జరిగింది. తనదైన విశిష్టమైన జానపద శైలిలో కృషి చేస్తున్న వైకుంఠం చిత్ర ప్రదర్శనను నగరంలో ప్రముఖులు, మేధావులు రచయితలు తిలకించారు.

● *అమలాపురం 'ఎక్స్‌రే' సాహిత్య మాస పత్రిక వారు ఉత్తమ కవితకు '1969 ఎక్స్‌రే అవార్డు' ఇవ్వడానికి నిర్ణయించారు. ఈ కవిత కింద 300 రూపాయల నగదు, 200 రూ. విలువైన శాశ్వత షీల్డు ఇస్తారు. మిగతా వివరాలకు 'ఎక్స్‌రే కొట్లూరి హౌస్, అమలాపురం.' వారిని సంప్రదించాలి.

వీక్లీ సర్వే ....

రీడర్స్ లిస్ట్ ......

అతి త్వరలో రానున్న 'జ్యోతి' వీక్లీకి సంబంధించి జూన్ నెలలో ఇచ్చిన 'సర్వే'కు అశేషంగా మా పాఠకులు స్పందించారు. ఈ 'సర్వే'లో పాల్గొన్న వేలాది పాఠక మిత్రులు ఒక నవతరం వారపత్రిక ఎలా ఉండాలో, ఏ పరిధిలో ఉండాలో, ఏఏ సాహిత్య విలువలుండాలో కోరుకుంటూ తమ అమూల్యమైన సలహాలను అందించారు. ఉత్సాహంగా ఈ సర్వేలో పాల్గొని మంచి సూచనలందజేసిన వారి జాబితా ఈనెల ఇస్తున్నాం.

కాగా వచ్చే సంచికలో మా యువతరం పాఠకుల కోసం ఒక వెరైటీ 'సర్వే' ఇస్తున్నాం. దీనిలో కూడా మా పాఠకులు ఉత్సాహంగా పాల్గొంటారని ఆశిస్తున్నాం. మొదటి, రెండవ సర్వేలలోంచి ఉత్తమ సూచనలందజేసిన పాఠకులు 50 మందికి జూన్ సంచికలో మేం హామీ ఇచ్చినట్టుగా బహుమతులివ్వడం జరుగుతుంది. కాగా ఈ నెల ప్రచురించిన మా 'పాఠకులకు' ఈ నెల జ్యోతిని కానుకగా పంపిస్తున్నాం.

\- ఎడిటర్

1. సి.ఇఫ్తెకర్ అహ్మద్, అనంతపూర్.
2. శాకా శ్రీనివాసరావు, ద్రాక్షారామ
3. డాక్టర్ జి.వి.పసలపూడి, విశాఖపట్నం.
4. ఉడాలి రాజేంద్రప్రసాద్, బెంగుళూరు.
5. పాలా విజయభాస్కరరెడ్డి, కలువాయి.
6. కె.వి.భాస్కర్, నంద్యాల్.
7. కోకా శాయి, కాకినాడ.
8. డి.వి.ప్రకాశరావు, పిఠాపురం
9. ఐ.చంద్రయ్య, సిద్దిపేట.
10. బి.శ్రీనివాసు, బెంగుళూరు.
11. విశ్వనాథ్ పమ్మి, పెంటపాడు.
12. కె.వి.సాయిరామారెడ్డి, పిట్టలవేమవరం.
13. ఎన్.నరసింహమూర్తి, టి.బి.డామ్.
14. కె.ఎన్నార్.నమ్మి, పెనుగొండ.
15. వి.రాజశేఖర్, తెనాలి.
16. హరికృష్ణ చిట్టిపోతు, గుంటూరు.
17. గుడిమెట్ల వెంకటేశ్వరరావు, హుకుంపేట.
18. ఎన్.భానుకృష్ణ, హైదరాబాద్.

19. ఎమ్.వెంకటేశ్వరరావు, తోగపల్లి.
20. పి.విమలా వర్ధిని, ఏలూరు.
21. ఎస్.వనిత, హైదరాబాదు.
22. జి.రమణమ్మ, విశాఖపట్నం.
23. తుమ్మల కుమారి, వేమూరు.
24. జగదీష్, విజయనగరం.
25. టి.ఇందిర, బెంగుళూరు.
26. శిఖారోజ్ మేరీ, కూచినపూడి.
27. ఎ.రవీంద్రకుమార్, విశాఖపట్నం.
28. జె.వెంకటరమణ, విజయవాడ.
29. ఇ.సంగప్ప, కూడేరు.
30. ఎస్సెస్వీ సౌజన్య, పందలపాక.
31. ఎ.రామారావు, విశాఖపట్నం.
32. జ్యోతి స్వరూప్, మద్రాసు.
33. ఆర్.ఎస్.హైమవతి, మద్రాసు.
34. కొండపనేని శంకరరావు, హైదరాబాదు.
35. కె.సూర్యనారాయణ, సికింద్రాబాదు.
36. కె.సంజీవరాయుడు, నిడిగల్లు.
37. కె.ఆదినారాయణరావు, విజయవాడ.
38. ఎ.వెంకటేశ్వరరావు, విజయవాడ.
39. వి.శివరామకృష్ణ, భీమవరం.
40. బి.పూర్ణ చంద్రరావు, హైదరాబాద్.
41. వై.భాస్కరరావు, హైదరాబాద్.
42. జి.సుబ్రహ్మణ్యం, దుర్గ్.
43. పి.సూర్యనారాయణ్, మెహరాలీ.
44. వేదుల కామేశ్వరశర్మ, విశాఖపట్నం.
45. జుజ్జూరు లక్ష్మీసత్యప్రసాదు, నరసరావుపేట.
46. ఎం.టి.యతిరాజ్, బెంగుళూరు.
47. వి.ఫణిశేఖర్, హైదరాబాద్.
48. టి.ఎన్.కృష్ణమోహన్, అనకాపల్లి.
49. పోడూరి లక్ష్మి, కొవ్వూరు.
50. వేదుల నరసింహం, హైదరాబాద్.
51. నల్లబాటి రాఘవేంద్రరావు, మచిలీపట్నం.
52. ఐ.కె.ఈశ్వరరావు, మచిలీపట్నం.
53. చోడవరపు నాగేశ్వరరావు, సికింద్రాబాదు.
54. మేడిచర్ల సూర్యప్రకాశరావు, సికింద్రాబాదు.
55. పి.రామానుజాచారి, హనుమకొండ.
56. బి.వై.రత్నం, మద్రాసు.
57. ఎమ్.నిరంజనరావు, ఏలూరు.
58. ఎమ్.సుగుణరావు, నాగ్‌పూర్.
59. రామరాజు లక్ష్మీనారాయణ, గుంటూరు.
60. వి.వి.సుబ్బరాజు, కోలంక.
61. జె.జి.పి.బాంధవి, విశాఖపట్నం.
62. సిహెచ్.కృష్ణ కొవ్వూరు.
63. ఇ.రత్నాకర్, హైదరాబాద్.
64. చలపాక ప్రసాద్, విజయవాడ.
65. వై.వి.ఎస్.హరికృష్ణ, గుడివాడ.
66. జె.రామారావు, బరంపురం.
67. పిల్లలమర్రి జగన్నాథకృష్ణ హైదరాబాద్.
68. కొత్త శివరామకృష్ణప్రసాద్, ఏలూరు.
69. తురగా శితారామయ్య, రాజమండ్రి.
70. జి.రంగయ్య, గుత్తి.
71. ఎ.వి.హర్షవర్ధన్, జి.రాయగఢ్.
72. జి.ప్రభాకరరావు,
73. జి.వి.కె.సత్యసాయి, అమలాపురం.
74. కాకూరి అప్పారావు, చిట్టివలస.
75. రాయపల్లి బాలాజీరావు, వీరవాసరం.
76. కె.సత్యనారాయణ, కొవ్వూరు.
77. పి.సాయినాథ్, వరంగల్.
78. ఎస్.ఎర్రస్వామి, అనంతపురం.
79. శ్రీమతి వసంతా పట్టాభి, జహీరాబాద్.
80. కె.నగేష్, ఏలూరు.
81. ఎమ్.లక్ష్మీపతి, హుబ్లి.
82. కె.వేణుగోపాల్, దొంబిలి 521 201.

83. బి.హెచ్.వెంకటేశ్వరరావు,
రాజమండ్రి.
84. ఎస్.శరీఫ్, మేడ్చల్లి.
85. ఎ.భవానీశర్మ, సికింద్రాబాదు.
86. మడగల ప్రసాదరావు,
విజయనగరం.
87. ఉప్పలపాటి శ్రీనివాసవర్మ,
చిట్టివలస.
88. కె.దేవేందర్, హైదరాబాద్.
89. శాంతకుమారి, విశాఖపట్నం.
90. కె.చినబాబు, నెల్లూరు.
91. జి.జె.బనియన్, హైదరాబాద్.
92. కె.రవిబాబు, నగరం.
93. మానేపల్లి సత్యనారాయణ,
నర్సిపట్నం.
94. ఎ.కామాక్షిదేవి, రాజమండ్రి.
95. రత్నామహీధర్, హైదరాబాద్.
96. చెరుకూరి లక్ష్మీనరసింహబోస్,
హైదరాబాద్
97. కోనూరి పరమేశ్వర ప్రసాద్,
సికింద్రాబాద్.
98. డి.వెంకట సుందర రాజా, కాకినాడ.
99. వాలి హిరణ్మయిదేవి, హైదరాబాద్.
100. ఎమ్.శ్రీనివాస్, ప్రక్కిలంక.
101. కె.రామారావు, హైదరాబాద్.
102. పోలజు వెంకటాచారి,
హైదరాబాద్.
103. కె.నిర్మలా భగవాన్, హైదరాబాద్.
104. కె.జగన్మోహన్‌రావు,
విశాఖపట్నం.
105. జి.ప్రభాకరరావు, హన్మకొండ.
106. కె.ఎన్.బి.సురేంద్రనాథ్,
అమలాపురం.
107. బి.అరుణకుమారి, పలాస.
108. సిహెచ్.పద్మప్రియ, విశాఖపట్నం.
109. వై.రాజేష్, విశాఖపట్నం.
110. పి.అరుణ ఆదిత్యసుందర్,
కలకత్తా.
111. చాగంటి భాను, రామచంద్రాపురం.
112. కె.ఎన్.వాసు, జంగారెడ్డిగూడెం.
113. ఎమ్.రజనీ శకుంతల,
సికింద్రాబాద్.
114. ఎన్.కె.మోహన్‌రావు, కాకినాడ.
115. ఎల్.రామారావు, పత్తార్‌డియా.
116. గిరిజా నారాయణ్,
117. పి.నాగేశ్వరరావు, అనకాపల్లి.
118. ఆర్.శ్రీధర్, గుడివాడ.
119. డి.వసంత, హైదరాబాద్.
120. కె.సాయికుమార్, విశాఖ.
121. పి.ఖాజాహుస్సేన్, ఆదోని.
122. జె.విద్యాసాగర్, హైదరాబాద్.
123. విరేక (టి.యస్వీ.పిళ్లై).
సికింద్రాబాద్.
124. ఎమ్.నాగేశ్వరరావు, విజయవాడ.
125. గ్రంధే జగన్మోహన్, ధర్మవరం.
126. జి.ప్రవీణ్ కుమార్, మాధవరం.
127. కె.జె.వాసు, జంగారెడ్డిగూడెం.
128. బి.వి.పసలపూడి, విశాఖ.
129. శాకా శ్రీనివాసరావు, ద్రాక్షారామ.
130. ఎన్.భానుక్రిష్ణ, హైదరాబాద్.
131. జి.వెంకటేశ్వరరావు, హుకుంపేట.
132. కె.వి.సాయిరామారెడ్డి,
పిట్టలవేమవరం.
133. కె.శంకరరావు, హైదరాబాద్.
134. ద్వివేదుల కామేశ్వరమ్మ,
విశాఖపట్నం.
135. మంజులవాణి, లావణ్య, సుధారాణి, కె.వి.వాసంతి, పి.లక్ష్మి, సిహెచ్.మధురాణి, కె.రమణబాబు, టి.లలిత, గౌతమి, టి.రమాదేవి, మల్లిక, హేమలత చౌదరి, సౌజన్య, వి.కనకమహాలక్ష్మి, ఎస్.అరుణ,
గుంటూరు.

మాతా - విమాతా



హిందీమూలం : భీష్మసహానీ
అనువాదం : ఉమాదేవి.

అర్ధరాత్రి పదకొండు గంటల సమయాన రాంచంద్రంకు కడుపు నొప్పి లేచింది. విపరీతంగా కడుపు నొప్పి లేచింది. ఇంటి నుండి బయట పడి రిక్షా ఎక్కి ప్రభుత్వ ఆసుపత్రి చేరాడు. అది జిల్లా కేంద్రమైన పట్టణం కనుక ఆసుపత్రిలో డాక్టర్ వున్నారు. డాక్టర్ తొందరగా దొరకటం ఆయన అదృష్టమే.

డాక్టర్ పరీక్షించి చాలా జాగ్రత్తగా చూచి అన్ని విధాల పరీక్షించి అర్జంటుగా ఆపరేషన్ చేయాలన్నారు. కడుపు పేగుకు చిన్న పుండు పుంటపచ్చు. అన్నాడు.

"చేయండి సార్ ఈ నొప్పి భరించలేను"

పరీక్షగా చూచాడు డాక్టర్.

ఆపరేషన్ చేయండి సార్! ఈ నొప్పి బాధపడలేను"

"డబ్బులు తెచ్చావా ?"

"ఇది ప్రభుత్వ ఆసుపత్రి అని డబ్బులు తేలేదు."

"ప్రభుత్వ ఆసుపత్రి అయితే డబ్బు లేకుండా ఆపరేషన్ చేయాలా ?"

"నేను బీదవాన్ని సార్!"

"అయితే ఎవరేమి చేస్తారు. ప్రభుత్వం ఏమి చేస్తుంది? కడుపునొప్పి ఎందుకు లేచింది. కల్తీ ఆహారంతో, కల్తీ నీళ్ల తో, కల్తీ నూనెతో, సరిగా తినకపోతే కష్టం ఎక్కువయితే ఇదంతా నా తప్పా? కడుపు నొప్పి ఎందుకు లేచింది? కల్తీ వస్తువులు అమ్మేవాన్ని ఏమైనా అనగలవా? అనలేవు. కల్తీ స సష్టమి చేసే ప్రభుత్వాన్ని అనగలవా? బొక్కలో తోస్తారు. డబ్బు దగ్గర చట్టం, ధర్మం, రూల్స్, హ హక్కులు అంతా వట్టిదే డబ్బు డబ్బే. డాక్టర్ కోర్సు చదవటానికి లక్ష ఇచ్చాను. తెలుసా ?"

రామచంద్రంకు కోపమొచ్చింది.

"మీ నాన్న సొమ్ము సార్!"

"ఆయన ఎలా సంపాదించాడో తెలుసా ? చెమట వంచి"

"కాదు మీరంటున్నారే కల్తీ కల్తీ వ్యాపారంతో"

"అరేయ్ నీవు ఎక్కువ మాట్లాడుతున్నావు నాకు కోపం రానీయకు."

రామచంద్రం నిశ్శబ్దంగా వూరుకొన్నాడు.

"డబ్బు దగ్గర స్నేహితం బంధుత్వం పనికిరాదురా నాకు లేచింది కడుపునొప్పి వెయ్యిరూపాయలిచ్చాను. సీనియర్‌కు నీవు వట్టి చేతులతో వచ్చావేమిటి? అయినా ఏదో బీదవాళ్లని చేస్తాం. ఆపరేషన్ అయిన తర్వాత ఇస్తారో ఇవ్వరో తప్పించుకపోతారు బేరం చేస్తారు."

"నాకు తెలియక అడుగుతున్నాను సార్ మేము తప్పించుక పోవటం బేరమాడటం తప్పా? మీరు సర్కారు అయివుండి లంచం అడగటం తప్పా? వాడికి డాక్టర్ ఉపన్యాసంతో కడుపునొప్పి ఎప్పుడో పోయింది.

"అరేయ్ నీవు ఎక్కువ మాట్లాడుతున్నావు.కోపగించాడు డాక్టర్."

"ఏం చేస్తారు సార్ బొక్కలో తోస్తారు అంతేగా. కడుపునొప్పితో వస్తే జైలుకు పంపిస్తారు. రిపోర్టులనే క్రిందా మీద చేసే డాక్టర్లు ఏమైనా చేయగలరు!.

ఫిఫ్టీన్ డౌన్ ఎక్స్‌ప్రెస్ బయల్దేరడానికింక రెండు నిమిషాలుందంతే. పచ్చలైటు వెలిగింది. సిగ్నల్ కూడా ఇచ్చారు. ప్రయాణీకులంతా తమతమ బోగీల్లోకి ఎక్కారు. ఉన్నట్టుండి ఇద్దరు ఆడవాళ్ళ మధ్య తగువు ప్రారంభమయింది. ఒకామె ఇంకొకామె చేతిలో ఉన్న బిడ్డని లాక్కొనే ప్రయత్నం చేస్తోంది. బిడ్డ నెత్తుకొని వున్నామె బిడ్డని గట్టిగా గుండెలకి అదుముకుని రైలెక్కే ప్రయత్నం చేస్తోంది.

"వదలవే నన్ను. రైలు కదుల్తోంది. నువ్వింక ఎక్కడైనా నాశనమైపో."

"వదల్ను చచ్చినా వదల్ను" అంటూ ఇంకొకామె బిడ్డకోసం వెంపర్లాడుతోంది.

అంతకు కొద్ది సేపటి ముందు ఇద్దరూ బాగానే మాట్లాడు కొన్నారు. ఇప్పుడిలా, చూసే వాళ్ళలో కొందరికీ గోల విసుగ్గా వుంది. మరి కొందరికి వినోదంగా వుంది. నీళ్ళకోసం అటు కుళాయి దాకా వచ్చిన పోలీసాయన లాఠీని వెనక్కీ ముందుకీ ఊపుతూ అక్కడికి వచ్చాడు.

"ఏమిటి సంగతి? ఎందుకే అరుచుకుంటున్నారు?" అని అందులో ఒకావిడని ప్రశ్నించాడు.

అతన్ని చూడగానే ఇద్దరూ నిశ్శబ్దంగా అయిపోయారు. రొప్పుకుంటూ ఒకరివంక ఒకరు క్రూర మృగాల్లా చూసుకోసాగారు.

ఒకరిద్దరు ప్రయాణీకులు రైలెక్కుతుంటే చూసి తనూ ఎక్కబోయింది బిడ్డనెత్తుకున్నామె. అంతే, ఆమెని వెనక్కి లాగుతూ ప్లాట్‌ఫాం మధ్యకీడ్చుకు పోయింది ఆ మరొక స్త్రీ. ఆ శిశువు మాత్రం అమాయకంగా కాళ్ళు, చేతులు వేళ్ళాడేసుకుని ఆ స్త్రీ భుజం మీద నిద్రపోతోంది. ఈ కుమ్ములాటలో ఆ బిడ్డ తల అటూ ఇటూ వూగుతోంది కానీ నిద్రకి మాత్రం భంగం కాలేదు.

"ఏయ్, ఏంటీ గోల? అసలు సంగతేంటి" అంటూ లాఠీ కర్ర కొసతో, ఆ ఇద్దరాడవాళ్ళని వేరు చేస్తూ అడిగాడు పోలీసాయన.

పిల్లాడిని లాక్కోబోతున్న స్త్రీ కంగారుగా అతనికేసి చూసింది.

"నా పిల్లాడ్నెత్తుకు పోతోంది. నా పిల్లాడ్ని నేనియ్యను" అంటూ మళ్ళీ ముందుకొచ్చింది.

"బండి కదుల్తోంది వదలవే రాక్షసి" అంటూ మరొకామె మళ్ళీ రైలువేపు పరిగెట్టింది. కానీ పోలీసు ఆమెని అటకాయించి,

"దాని పిల్లాడిని నువ్వెందుకెత్తు కెళ్తున్నావ్?" అంటూ కరుకుగా ప్రశ్నించాడు.

"దానిదా? ఏం కాదు, ఇది నా బిడ్డ" అందామె.

"అది మరి దాన్నేనంటోంది?

"అయ్యో, ఇది నా బిడ్డే" అని ఆ మరొకామె. వయసులో చిన్నది.... ఏడ్చుకుంటూ ముందుకొచ్చింది. రేగిన జుట్టు, ఎర్రబడ్డ ముఖం, కళ్ళల్లో భయం....

పోలీసాయన ఈ తగువేదో త్వరగా తీర్చేయాలనుకున్నాడు.

"ముందా బిడ్డనీమెకప్పచెప్పు." అన్నాడు అజ్ఞాపిస్తూ.

"నేనెందుకివ్వాలి, అది నా బిడ్డ." అంది బిడ్డని ఎత్తుకున్నామె.

"నువ్వు కన్నావా?"

బిడ్డ నెత్తుకున్నామె మాట్లాడ లేదు. ఇంకొకామెని చురచుర చూసింది.

"చెప్పు, నీ కడుపునే పుట్టిందా?" పోలీసు కోపంగా అడిగాడు.

"నా కడుపున పుట్టక పోతేనేం? ఏడునెల్ల నుంచీ నేనే పాలిచ్చి పెంచుతున్నాను."

"పాలిస్తే బిడ్డ నీదై పోతుందా? బిడ్డని బలవంతగా లాక్కుపోతావా?"

"బలవంతంగా నేనెందుకు లాక్కెళతాను? ఆ మాయలాడిని అడగండి. అదే నా కప్పగించింది. నా బిడ్డ ఎక్కడ బతికున్నా చాలు నాకు" అంటూ ఆమె మరొకామె వైపు తిరిగి "చెప్పవే నోటి తీటదానా! నేను పిల్లాడిని బలవంతంగా

లాక్కెడుతున్నానా? ఇదిగో పోలీసాయన, ఇదే స్వయంగా పిల్లాడిని నా వళ్ళో పెట్టింది. బిడ్డని కని పెంటకుప్ప మీద పారెయ్యబోతుంటే నేనే అడిగాను. నాకియ్యి నేను పెంచుకుంటానని అదే చేతులారా నా చేతుల్లో పెట్టింది. ఆ రోజు నుంచీ నేనే పెంచుకుంటున్నాను. ఇది నన్ను పంపించడానికొచ్చి ఇప్పుడు తగువులాడుతోంది."

"నువ్వీబిడ్డనామె కిచ్చావా?" పోలీసు ప్రశ్నించాడు.

ఆ స్త్రీ భయం నిండిన కళ్ళతో ఓ క్షణం బిడ్డనెత్తుకున్న స్త్రీకేసి చూసి, మళ్ళీ కళ్ళు నేలకి వాల్చింది.

"అవును ఇచ్చాను. కానీ అది నా బిడ్డ.

"నే నొదల్లేను. ఆ స్త్రీ నిస్సహాయంగా చూస్తూ నుంచుంది. భయంతో ఆమె కళ్ళల్లో నీళ్ళొండిపోయాయి."

"నువ్వే స్వయంగా ఇస్తే మళ్ళీ వెనక్కి ఎందుకిమ్మంటున్నావు?" అనడిగాడు పోలీసు.

బిడ్డనెత్తుకున్నామె ఆతృతగా చూస్తోంది. ఆమె దేహమంతా కంపిస్తోంది.

"ఇప్పుడిది నా బిడ్డనింకో వూరు తీసుకు పోతోంది." అని చెప్పగానే దుఃఖం కట్టలు తెంచుకొంది.

"ఐతే, ఎప్పుడూ నీ దగ్గరే పడుండాలంటావా?" అని చుట్టుపక్కల వాళ్ళందరికీ వినిపించేలా గట్టిగా అరవసాగింది ఆ స్త్రీ. "నాతోబాటు డేరా వేసుకున్న వాళ్ళంతా వెళ్ళిపోయారు. ఇది నన్నొదలకుండా చంపుకు తింటోంది. ఇంకొక వారం ముందు, పది రోజులు ఆగు అంటూ నెలల తరబడి జరుపుకొస్తోంది. ఇవాళిలాగో అలా పోదామంటే మళ్ళీ వచ్చింది. మాడు మొహంది."

"ఇది నీకు చుట్టమా?" అడిగాడు పోలీసు.

"నాకెక్కడి చుట్టం అయ్యా, ఇది కథియవాడ్ మనిషి. మేం బంజారీలం."

"నువ్వు రైల్లో ఎక్కడికెల్తావ్."

"ఫిరోజ్ పూర్‌కి."

"అక్కడేముంది?"

"మేం బంజారీలం. రెడేళ్ళ నుంచీ ఇక్కడున్నాం. పొలం పన్లూ అవీ చేసుకుంటూ బతికాం. ఇప్పుడు ఫిరోజ్ పూర్‌లో సాగు చేయడానికి భూమి దొరికింది. మా వాళ్ళంతా అక్కడికెళ్ళిపోయారు."

పోలీసాయన ఇరుకున పడ్డాడు. ఒకామె కని పారేసింది. మరొకామె పాలు పోసి పెంచింది. బిడ్డ ఇప్పుడెవరిది?

"నీకు ఇల్లు, వాకిలి లేదా? ఎక్కడుంటున్నావ్?" కన్నావిడని

"ఇక్కడ ఉండడానికేముంది? వంతెన దగ్గర గుడిసెలో మేమిద్దరం ఉండేవోళ్ళం. ఇదీ కూలి చేసేది. ఇది కన్నప్పుడు నేనే బొడ్డు కోసింది." బిడ్డనెత్తుకున్నామె అంది.

కన్న మనిషి మతి లేనట్టు బిడ్డనే చూస్తోంది. ఎవరి మాటలూ ఆమె చెవిన పడటంలేదు.

"దీని మొగుడెక్కడ?"

"ఎవడూ లేడు. ఇది మగాళ్ళ వెంటబడి పోతోంటుంది. ఎవరూ దాన్ని ఉంచుకోరు. నీడనివ్వరు. ఇల్లూ వాకిలి ఉంటే బిడ్డని కని పారేద్దామని ఎందుకనుకుంటుంది?"

గార్డు ఈల ఊదాడు. జనమంతా హడావుడిగా పైకెక్కారు. బంజారీ స్త్రీ కూడా అటు తిరిగింది. కన్నామె ఆ రెండవ స్త్రీ కాళ్ళని గట్టిగా పట్టేసుకుంది."

"నా బిడ్డని తీసుకుపోకు..."

కొందరికి చాలా కోపం వచ్చింది.

"బిడ్డని వెనక్కిచ్చెయ్. ఆవిడీయక పోతే నువ్వు తీసికెళ్ళటానికి వీల్లేదు." పోలీసుధృడంగా అన్నాడు. బంజారీ స్త్రీ ఇలాంటి తీర్పు వస్తుందని అనుకోలేదు. ఆమె తటపటాయించింది.

"నేనెందుకియ్యాలి? నేనియ్యను. ఈ బిడ్డ నాది. దానికి కొంపా – గోడూ లేదు. ఎక్కడుంచుకొంటుంది?"

"బండి కదుల్తోంది. తొందరగా ఇయ్యి. లేకపోతే కోర్టుకి లాక్కెళతాను." అన్నాడు పోలీసు గడుసుగా, బంజారీ స్త్రీ కంగారుపడింది. దారితోచక అటూ ఇటూ చూసింది. ఆ మరో ఆమెని నోటికొచ్చినట్లు తిట్టసాగింది.

"హరామ్ జాది, కుక్క ఇక్కడికీ వచ్చి ప్రాణం తీస్తున్నావు, పట్టు. తీసుకో. మళ్ళీ పాలిమ్మని అడిగావో చూస్కో విషమిస్తాను. నీకూ ఇస్తానే విషం! ఏడు నెలల్నుంచీ పాలిచ్చానే నేను....."

కన్న స్త్రీ బిడ్డని గుండెల కదుముకుంది. బిడ్డ చేతికి రాగానే ఆమె మమకారం పెల్లుబికి ఏడవసాగింది.

అంతా మంచి తమాషాలా జరుగుతోంది. ఇద్దరూ ఏడుస్తున్నారు. ఇద్దరూ బద్ధ శత్రువులు. కానీ ఒకే బిడ్డకి తల్లులు. అటూ ఇటూ తిరిగే జనానికి మంచి కాలక్షేపం దొరికింది. ఈ తగువంతటికీ మూలం ఆ అర్భకపు బిడ్డ. ఇంకా పిడికిళ్ళు బిగించి నిద్రపోతూనే ఉన్నాడు. బంజారీ స్త్రీ ఆ మరొకామెని దుమ్మెత్తి పోస్తూ బండెక్కింది.

"పిల్లాడు దక్కాడుగా, తొందరగా అవతలికి పో" అంటూ నిద్ర పోతున్న ఆ పిల్లాడి వీపు మీద తన లాఠీ కొసని ఆనించి మొరటుగా అన్నాడు పోలీసు. బిడ్డని గుండెలకి హత్తుకుంటూ వెనక్కి జరిగిందా స్త్రీ. గుంపు చెదిరింది, బండి మెల్లగా కదిలింది. బోగీ గుమ్మంలో నుంచున్న ఆ బంజారీ స్త్రీ తిట్లకి లంకించుకుంది.

"మాయలాడి! పుట్టగానే పిల్లాడిని చంపెయ్యక పోయావా? నువ్వాడదానివేనా? ఇప్పుడైనా చంపెయ్. నా కడుపు చల్లబడుతుంది."

పోలీసు కర్ర తగలగానే పిల్లాడికి మెలుకువ వచ్చేసింది. బుల్లి బుల్లి పిడికిళ్ళతో కళ్ళూ, మొహం రుద్దుకున్నాడు. వేళ్ళని నోట్లో పెట్టుకొని చీకడం మొదలుపెట్టాడు.

జరిగిన దానికి దిగ్భ్రాంతు రాలై బిడ్డని కన్న తల్లి ఫ్లాట్ ఫారం గోడకానుకుని చూస్తోంది. వేళ్ళల్లోంచి పాలు రాకపోవడంతో పిల్లాడు ఏడవటం మొదలెట్టాడు. కాళ్ళూ చేతులూ కొట్టుకుంటూ రభస చెయ్యసాగాడు. కన్నతల్లి పిల్లాడిని ఆ భుజంమీంచి ఈ భుజం మీదికి మార్చుకుంది. అయినా బిడ్డ ఏడుపు మానలేదు సరికదా మరింత పెంచేసింది. తల్లి నిస్సహాయురాలు. బిడ్డని మళ్ళీ అటునుంచి ఇటు మార్చుకుంది.

బంజారి స్త్రీ మళ్ళీ అరుపులు మొదలెట్టింది.

"చంపెయ్ పాపిష్టిదానా. చంపెయ్యవే పిల్లాడికింత విషమిచ్చెయ్. మధ్యాహ్నం నుంచీ ఒక్క చుక్క పాలయినా ఇవ్వలేదు ఏడవకేం చేస్తాడు?"

పోలీసాయన కర్ర ఊపుకుంటూ అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు. ఒకరిద్దరు కూలీలు తప్ప ఆ భోగీ దగ్గర ఇంకెవరూ లేరు. దూరంగా వెనకాలెక్కడో నీలం యూనీఫాం వేసుకొని పచ్చ జెండా ఊపుతున్నాడు. గార్డు బండి కూతవేసుకుంటూ వేగాన్నందుకుంది.

బిడ్డ ఏడుస్తూనే ఉన్నాడు. తల్లి తన చిరుగుల బట్టలోంచీ శనగ్గిజాకటి తొక్క వలిచి పిల్లాడి నోట్లో పెట్టింది.

"ఖూనీ చేసేస్తోంది బాబోయ్.... నోట్లో ఏం పెట్టేస్తున్నావే పిల్లాడికి? నా పిల్లాడిని చంపేస్తోంది నాయనోయ్! కసాయి ముండ!" అంటూ భోగీ తలుపుకి ఆనుకున్న ఆమె బట్టల మూటని ఫ్లాట్‌ఫాం మీదికి విసిరేసింది. నానా తిట్లూ తిడుతూ తనూ దూకేసింది.

"హరామ్ జాదీ నన్నూ వెళ్ళ నియ్యాదు. ఇది చావనన్నా చావకూడదా!"

రైలు వెళ్ళిపోయింది. కూలీలంతా బయటికి వెళ్ళిపోయారు. ఫ్లాట్‌ఫాం నిశ్శబ్దమై-పోయింది. పోలీసు గస్తీ తిరుగుతూ ఫ్లాట్‌ఫాం చివరికి వెళ్ళినవాడు వెనక్కి తిరిగి వస్తూ చూసిన దృశ్యం – ఈ స్త్రీలిద్దరూ గోడకానుక్కూచున్నారు. బంజారీ స్త్రీ పిల్లాడికి రొమ్మునందించి పాలు తాగిస్తోంది. కన్నతల్లి పిల్లాడి తల నిమురుతోంది!

వీరభద్రరావు



సీరియల్



దయానందకి రాత్రికి, పగటికి తేడా తెలియడం లేదు. కరుణ అతన్ని నవ్విస్తోంది. అతన్ని కవ్విస్తోంది.

దాంపత్యంలో ఉండే హాయి అంతా అతను పొందుతున్నాడు. తన జీవితంలో కరుణ తప్ప వేరే మనుషులెవరూ లేరవే ధోరణికి వచ్చాడు.

చల్లని సాయంత్రాలు, వెన్నెల రాత్రిళ్ళు ఆమె చెయ్యి పట్టుకుని షికార్లు చేస్తుంటే స్వర్గపు చివరి అంచున నిలబడ్డ ఆనందం కలుగుతుంది.

ఇక ఇదే జీవితం అనుకున్నాడు.

అలా రెండేళ్ళు గడిచాయి.

కరుణ గర్భవతి అయింది. అతని ఆనందానికి హద్దు లేదు. అతని మిడిసిపాటుకి అంతులేదు.

కరుణంత అందంగా ఉండే బిడ్డ కలగాలని ఆశపడ్డాడు. ఆమెను నేల మీద నడిపించకుండా అరచేతుల్లో నడిపించాడు.

తీరా లేబర్ రూంలోంచి డాక్టర్ వచ్చి "సారీ దయానంద. హెమరేజ్ వచ్చింది. తల్లిని, బిడ్డని ఇద్దర్నీ రక్షించలేకపోయాం." అంటే అతనికి పిచ్చెక్కినంత పనైంది.

అతను కుప్పలా కూలిపోయాడు.

ఆ క్షణంలో-ఆ భయంకర క్షణంలో అతనికి భార్గవి జ్ఞాపకం వచ్చింది. అమాయకత్వం. అలౌకికం నిండిన మొహంతో భార్గవి అతని కళ్ళ ముందు కదిలింది.

"భార్గవీ! నన్ను శపించావు కదూ!" అనుకున్నాడు మనసులో. తర్వాతర్వాత పశ్చాత్తాపంలో అతను కుళ్ళిపోయాడు.

ఏ పాపమూ ఎరుగని ఓ అమాయకురాల్ని క్రూరంగా అతి క్రూరంగా తను వంచించాడు. దానికి సమాధానంగా విధి తన అందమైన కలలాంటి జీవితంలోంచి కరుణని తీసికెళ్ళిపోయి తనని వంచించింది.

అతనికి తల్లి జ్ఞాపకం వచ్చింది.

తల్లి మరణం జ్ఞాపకం వచ్చింది.

చేసిన తప్పు సరిదిద్దుకోవాలని అతను చాలా తాపత్రయపడ్డాడు.

ఎలాగైనా భార్గవిని కల్సుకుని ఆమెను ఒప్పించి-ఆమెకే కష్టమూ కలక్కుండా, జీవితాంతం ఆమెను దేవతలా చూసుకోవాలనుకున్నాడు. ధైర్యం కూడదీసుకుని కొన్ని నెలలు పోయాక ఆమె ఊరు వెళ్ళాడు.

"ఇంకా ఎక్కడి భార్గవి? అది ఆత్మహత్య చేసుకుని చాలా కాలమైంది." అన్న మాటలు విని అతను హతాశుడయ్యాడు.

అంతే!

అతనికి జీవితం మీద విరక్తి కలిగింది.

తనవల్ల భార్గవి చనిపోయింది. తనవల్ల తల్లి చనిపోయింది. ఏ శిక్షా పడని రెండు హత్యలు....../

ఏ శిక్షా పడలేదా?

అతను దేశమంతా తిరగడం మొదలెట్టాడు. కాశీ వెళ్ళాడు. గయ వెళ్ళాడు. హిమాలయాలకి వెళ్ళాడు. ఎక్కడికి వెళ్ళినా అతనికి మనశ్శాంతి దొరకలేదు. దేశద్రిమ్మరిలా తిరుగుతూనే ఉన్నాడు.

చివరికి ఆ అడవి ప్రాంతం అతనికి

నచ్చింది. జీవితంలో సూర్యోదయమంత అందాన్ని, హాయిని, బండ కొండలంత క్రూరత్వాన్ని చూసిన అతను ఆ ప్రాంతంలో ఉండి పోవడానికి నిశ్చయించుకున్నాడు. ఉన్న కొద్దిపాటి ఆస్తి అమ్మేసి బ్యాంకులో వేసుకుని-దాని మీద వచ్చే వడ్డీతో కాలక్షేపం చేస్తున్నాడు.



అతని అవసరాలు చాలా తక్కువ. కొన్నాళ్ళు సోమయ్య, తర్వాత ఝాన్సీ అతని అవసరాలు చూస్తుంటారు.

జీవితం అతనికి వేదాంతం నేర్పింది. జీవితానికి మించిన గురువు వేరే ఎవరూ లేదన్నది అతని అభిప్రాయం.

కథంతా విన్న రాజేష్ నిట్టూర్చాడు. 'ధీర గంభీరంగా కనిపించే ఈ మనిషి వెనకాల ఇంత కథ ఉందా!' అనుకున్నాడు.

అంత క్రితం అతని మనసులో ఉన్న ఆలోచన మళ్ళీ ఒక్కసారి తల ఎత్తింది.

తన తల్లి ఘోరమైన ఒంటరితనంతో బాధ పడుతుందని, దానివల్లే ఆమె కటువుగా ప్రవర్తిస్తోందని అతని ఆలోచన. దయానందని "పోనీ మీకు అభ్యంతరం లేకపోతే మా అమ్మను పెళ్ళి చేసుకోకూడదూ- ఆవిడకి ఒంటరితనం తప్పుతుంది కదా" అని అడుగుదామనుకున్నాడు. తన తల్లి పెళ్ళి విషయం తను మాట్లాడ్డం సబబుగా ఉండదనిపించింది.

అందులోను దయానందతో అంతకు పూర్వం పెద్దగా చనువు లేదు.

గౌరి విషయంలో తల్లితో ఘర్షణ పడ్డాక ఆ విషయం దయానంద తనతో మాట్లాడ్డం వల్ల హఠాత్తుగా అతనితో తనకి చనువు ఏర్పడినట్టుగా అతను ఫీలయ్యాడు.

ఇంతలో దయానంద తన కథంతా చెప్పడం జరిగింది.

జీవితంలో అంత ఘోరంగా ఓడిపోయిన మనిషి మళ్ళీ పెళ్ళికి ఒప్పుకుంటాడా అన్న సందేహం కలిగింది. అంతే కాకుండా-

దయానంద కథంతా విన్నాక రాజేష్‌కి దయానంద ఓ పెద్ద శిఖరంలా కనిపిస్తున్నాడు. మనిషి పశ్చాత్తాపం వల్ల ఎంత గొప్పవాడౌతాడో అతనికి తెలిసి వచ్చింది.

"ఎవరెస్టు శిఖరం లాంటి మనిషిని పిపీలికం లాంటి తను అలాంటి ప్రశ్న అడగడం?

రాజేష్ ఆ విషయం ప్రస్తావించకుండా ఊరుకున్నాడు. మరో రెండు రోజులుండి కాలేజీకని రాజేష్ రాజమండ్రి ప్రయాణమయ్యాడు.

అతను బైల్దేరుతుంటే తల్లి మొహంలో ఎప్పుడూ లేని వింత ఆందోళన కనిపించింది. "నువ్వు-ఆందోళనపడకు. నీకు చెడ్డ పేరు తెచ్చే పనులేవీ నేను చెయ్యను." అన్నాడు. ఆమె మొహం అంతలోనే విప్పారింది.

ఝాన్సీ కోరిక మీద దయానంద కూడా రాజేష్‌తో రాజమండ్రి వెళ్ళాడు. రెండు రోజుల పాటు రాజేష్‌తో కల్సి ఉండి -అతని చదువు పరిస్థితి చూసి రమ్మని ఆమె కోరింది.

దయానంద ఈ మధ్య కాలంలో పట్నానికి వెళ్ళలేదు. రెండు రోజులు కాలక్షేపం చెయ్యవచ్చని, ఏవైనా మంచి పుస్తకాలు కొని తెచ్చుకోవచ్చని అతను ప్రయాణమయ్యాడు.

దయానంద బైల్దేరుతుంటే ఝాన్సీ అతన్ని లోపలికి పిల్చి వెయ్యి రూపాయిలు చేతిలో పెట్టింది.

"ఏం కావాలి?" అనడిగాడతను.

"మీకేం కావాలో అవి కొనుక్కోండి." అంది.

"నా దగ్గర డబ్బు ఉంది. నాక్కావల్సినవల్లా పుస్తకాలు. నాకు వేరే దేని మీద ఆశ లేదు. ఆపేక్ష లేదు." అన్నాడు దయానంద.

"దయుంచి నా మాట కాదనకండి. మీకేం కావాలన్నా కొనుక్కోండి." అంది.

అతను మరేమీ మాట్లాడకుండా వింతగా నవ్వాడు.

ఆమె తృప్తిగా అతని కళ్ళల్లోకి చూసింది. దయానంద, రాజేష్ బండి ఎక్కేరు. గుర్రం ముందుకి కదిలింది. రాజమండ్రిలో దయానందకి బాగా కాలక్షేపం అయింది. తనకి కావల్సిన వేదాంత పుస్తకాలు కొనుకున్నాడు.

రాజేష్ ఉండే గది, అతనితో తిరిగే స్నేహితులు, చదువు పరిస్థితి అన్నీ గమనించాడు.

ఆ రోజు దయానంద ఇంటికి ప్రయాణమౌతుంటే "ఈ ఒక్కరోజు ఉండి రేపు పొద్దునే వెళ్ళిపోండి." అని బతిమాలాడు రాజేష్.

దయానంద సరేనన్నాడు.

ఆ రోజు ఇద్దరూ కల్సి సినిమాకి వెళ్ళారు. సినిమా పూర్తయాక హోటల్‌కి వెళ్ళారు.

ఇద్దరికీ భోజనం తెమ్మని చెప్పాడు రాజేష్.

"నాకు ఎక్కువ ఆకలిగా లేదు. నేను కొద్దిగా టిఫిన్ తింటాను." అన్నాడు దయానంద.

"ఫరవాలేదు. భోజనం చెయ్యండి." రాజేష్ అడిగాడు.

"ఒద్దులే-ఓ ప్లేటు ఇడ్లీ తింటాను."

"ఈడెవడో పెద్ద సాములారిలా ఉన్నాడురా-రాత్రిళ్ళు భోజనం సెయ్యడంట. గాలి బోంచేత్తాడనుకుంటా."

రాజేష్, దయానంద ఇద్దరూ వెనక్కి తిరిగి చూశారు. వెనక వైపు కూర్చున్న ఇద్దరిలో ఒకడు అన్న మాటలివి. ఇద్దరూ బాగా తాగి ఉన్నారు.

రాజేష్ చటుక్కున లేవబోయాడు. దయానంద వారించాడు.

హోటల్ యజమాని వచ్చి వాళ్ళిద్దర్నీ వెళ్ళిపొమ్మని చెప్పాడు. వాళ్ళు యజమానితో పోట్లాటకి దిగారు. "మెడ పట్టుకుని బైటికి గెంటెయ్యండి. తాగుబోతు వెధవలు." అన్నాడు రాజేష్.

"గెంటేసే మొనగాడివి రారా దమ్ముంటే." అని ఓ తాగుబోతు లేచి ఇవతలికి వచ్చాడు.

రాజేష్ కూడా లేచి వాడికి ఎదురుగా నిలబడి "బైటికి రారా-నీ సంగతి తేలుస్తాను." అన్నాడు.

"దమ్ముంటే ఇక్కడ దెబ్బలాడరా?" అని తాగుబోతు రాజేష్‌తో, కలియబడ్డాడు.

హోటల్ యజమాని రాజేష్‌ని ఇవతలికి లాగుతున్నాడు.

అంతే!

వంటశాలలోంచి ఇద్దరు హేమాహేమీల్లాంటి మనుషులు పెద్ద గరిటెలు చేత్తో పుచ్చుకుని బైటికి వచ్చి తాగుబోతుల ఎదురుగా నిలబడ్డారు.

తాగుబోతులిద్దరూ కంగారు పడ్డారు. జంకి ఏదో సణుక్కుంటూ వెళ్ళిపోయారు.

మర్నాడు పొద్దున్నే బైల్దేరి దయానంద తన ఊరు వెళ్ళిపోయాడు.

రాజేష్ చదువు. అతను తిరిగే వాతావరణం అతని స్నేహితులు-వీటి గురించి వివరాలన్నీ దయానంద వివరంగా ఝాన్సీకి చెప్పాడు.

ఆమె చాలా తృప్తి పడింది.

"కేశవరావు పొలం అమ్మేసాడు" ఝాన్సీ చెప్పింది.

"ఎవరికి?" దయానంద అడిగాడు.

"ఎవరో పోతరాజుట-కొత్తగా ఈ ప్రాంతానికి వచ్చాడు."

"అయితే మన సరిహద్దులో కొత్త స్నేహితుడన్న మాట."

"ఏమో ఎలాంటివాడో చూడాలి. పొరుగు పొలంలోకి కొత్తగా ఎవరో వచ్చారంటే-నాకు దడగా ఉంటుంది."

"ఎందుకు?"

"ఏమో ఎలాంటివాడో ఏవిటో?"

"మనం భయపడటం అనవసరం. పొరుగున ఎవరో ఒకరు ఎప్పుడూ ఉంటారు కదా!"

(మిగతా వచ్చే సంచికలో)


పాఠకులకో గమనిక:

ఈ సంచికతో ప్రత్యేకంగా 'కవుల కవితల సంపుటిని' ప్రచురిస్తున్న కారణంగా సీరియల్స్‌ని తక్కువ పేజీల్లో ఇస్తున్నామని తెలియజేస్తున్నాం. అలాగే ఇదే కారణంవల్ల కొంచెం 'పెద్ద కథ' అయిన దాట్ల నారాయణమూర్తి రాజు కథను కూడా ఈ సంచికలో ప్రచురించలేక పోతున్నామని తెలియజేస్తున్నాం.

స్థలాభావం వల్ల ఈనెల 'చిత్రలహరి' ప్రచురించలేకపోతున్నాం. వచ్చేనెల యథావిధిగా ప్రచురిస్తామని మా పాఠకులకు తెలియజేస్తున్నాం.

- ఎడిటర్.

వ్యథ



తాడిమళ్ళ రామకృష్ణ

దుర్గ:

ఆ రోజు వాతావరణానికి ముసురు పట్టింది.

టైము ఆరవుతోంది.

కాన్సరు ఆస్పత్రి గేటు ముందు అసహనంగా నిల్చుంది దుర్గ.

నలిగిన చీర-

అలసిపోయిన కళ్ళు-

వెలుగులేని మొహం-

నీరసం నిండిన దేహం-

తన్ని రోజూ వాడిగ్గా తీసికెళ్లే రిక్షా ఇంకా రాలేదు. ఆమెలో కంగారు ఎక్కువైంది. పిల్లల్ని చూడాలన్న గుబులు మొదలయింది.

మరో రిక్షా బేరం ఆడింది.

రిక్షా ఎక్కే ముందు ఆమె కళ్ళలో నీళ్ళు సుళ్ళు తిరిగాయ్! హాస్పిటల్‌లో బెడ్ మీద నిస్సత్తువగా పడున్న ప్రకాశం ఆలోచనలు ఆమెని ముసిరాయ్! ఆయనకు నయమవుతుందా?

ఆమె మనసు బాధగా మూల్గింది!

రిక్షా ముందుకు సాగింది. ఆమె భర్త ఆలోచనల నుంచి దూరంగా కదిలింది.

లక్డీకాపూల్ దాటి రవీంద్రభారతి వైపు తిరిగింది రిక్షా. దుర్గ మనసులో పిల్లలు మెదిలారు.

"అమ్మా! నాన్న ఎప్పుడొస్తాడే!"

తను రిక్షా దిగకుండానే పిల్లలడిగే మొదటి ప్రశ్న అది.

'వస్తారమ్మా! జ్వరం ' తగ్గగానే వచ్చేస్తారు'

తనది 'టేపు' చేసిన జవాబు.

మభ్యపెట్టే మాత్ర.

అంతకన్నా తను చేయగలిగింది మాత్రం ఏముందిగనుక? కనిపించని దేముణ్ని మొక్కటం తప్ప కనిపించే దేముడి కోసం.

వెంకట్రామయ్య:

గేటు ముందు ఆగిన రిక్షాలోంచి దిగిన కోడల్ని చూశారు వెంకట్రామయ్య గారు.

'ఎంత చిక్కిపోయింది?'

ఆయన మనసు భాధపడింది.

ముప్పై కూడా దాటని ముత్తైదువలో ఎంతో ఓర్పు చూడగల్గుతున్నాడు ఆయన.

తల్లి కోసం ఎదురుచూస్తూ గేటు ముందు కూర్చుంటారు తన యిద్దరి మనవరాళ్ళు-

పెద్దది రమ; చిన్నది ఉమ.

పెద్దదానికి అన్నీ తండ్రి పోలికలే. దాన్ని చూస్తుంటే వెంకట్రామయ్య గారికి హాస్పిటల్‌లో వున్న తన పెద్ద కొడుకు మనసులో మెదులుతాడు.

ఎంత అభిమానం వాడికి తల్లి దండ్రుల మీద. తనలాగ పట్టుదలేం తక్కువ లేదు వాడిలో!"

తను రిటైరయేముందు ఒకసారి ఏలూరు వచ్చాడు అకస్మాత్తుగా. వాడికి వాళ్ళమ్మ రాసిందిట. రిటైరయాక ఢిల్లీలో ఉన్న చిన్న కొడుకు దగ్గరకు వెళ్దామనుకుంటున్నామని.

అంతే-నాల్రోజులు తన దగ్గర బైఠాయించి వాడి దగ్గరకే ముందు వచ్చేలా వాగ్దానం చేయించుకొనిగాని మరీ కదిలాడు కాదు.

తనకి అదేనేమో ఆఖరుసారి-వాడిని ఆనందంగా చూడటం.

తను రిటైరయి హైదరాబాదు చేరటం; ప్రకాశాన్ని క్యాన్సర్ ఆస్పత్రిలో చేర్పటం -దాదావు ఒకేసారి జరిగాయ్.

జబ్బు బాగా ముదిరిపోయిందని, ఆయువు పోయలేకపోయినా మరికొన్ని నెలలు మాత్రమే అతన్ని బ్రతికించుకోవచ్చని డాక్టర్లు వెంకట్రామయ్య గారికి ప్రయివేటుగా చెప్పినప్పుడు ఆయన ఆ గదిలోనే వలవలా ఏడ్చేశారు. అన్నీ తెలి

సున్నా వాళ్ళ చేతులు పట్టుకొని మరీ మరీ ప్రాధేయపడ్డారు. ప్రకాశానికి ఎలాగయినా ప్రాణం పోయమని.

అప్పట్నుంచీ! ఆ భయంకరమైన నిజాన్ని ఆయనలోనే దాచుకున్నారు.

ఆ నిజానికిప్పుడు మూడు నెలల వయసు:

ప్రకాశం:

దూరంగా గంటలు వినిపిస్తున్నాయ్!

లెక్క పెట్టాడు ప్రకాశం.

తొమ్మిది!

జీవితంలో తనవి ఆఖరి ఘడియలు.

తన పాత్రకి తెర పడబోతోంది.

చావంటే తనలో ఇదివరకటి భయం లేదు-బ్రతుకుతాడన్న ఆశలేదు గన్క.

అది ఉన్న రోజుల్లో జీవితంమీద తీపి ఉండేది.

తనూ-తన వాళ్ళు; చుట్టాలు-స్నేహితులు వాళ్ళని చూడాలనే తపన-చూడని రోజు బాధ.

ఇన్నాళ్ళు తనకి తోడంటూ ఉండేది.

ఇప్పుడు-తను ఒంటరి.

అతి ప్రయత్నంతో అందరిమీదా మమతలు చంపుకున్నాడు-తెంచుకున్నాడు.

కానీ ఎంత విదిలించుకుందామన్నా, తెంచుకుందామన్నా తెగని బంధం అయికూర్చుంది-దుర్గ.

తనే సర్వం అయిన తన భార్యకి చీకటి మిగిల్చిపోతున్నాడు. ఆమె జీవితంలో నిప్పులు కురువబోతున్నాయ్! తన చావు ఆమెకి శాపం కాబోతోంది! ఆ ఆలోచనే తన్ని పీడిస్తోంది! వేధిస్తోంది! బాధిస్తోంది!

తలుపు చప్పుడయితే ఆసక్తిగా అటు చూశాడు ప్రకాశం.

ఎదురుగా అతని చూపులకి మసగ్గా కనిపించింది. దుర్గ.

దుర్గ: కొన్ని రోజుల్నుంచీ దుర్గ రూపంలో మార్పొచ్చింది.

ఎంబ్రాయిడరీ చేసిన నైలెక్స్ చీర!

స్లీవ్‌లెస్ బ్లౌజ్!

కంటి నిండా కాటుక!

సింగార్ బొట్టు!

జడలో కుప్పలా మల్లెపూలు!

ఒంటి మీద ఇంటి మేట్ సెంటు!

ఇదివరలా ఆమెల బరువు బాధలు కనిపించటం లేదు.

పిల్లలంటే చిరాకు పడుతోంది.

ఆ పరిస్థితుల్లో ఆమెలో వచ్చిన 'వింత మార్పు' అందరి ఆలోచనల్లో మేకై కూర్చుంది.

ప్రకాశం:

కాలం పదిహేను రోజుల్ని హరించింది.


క్యాన్సర్ ప్రకాశాన్ని హరిస్తోంది.

చాకచక్యంగా-చదరంగంలో పావుల్ని తిన్నట్టు.

తిన్నచోట తినకుండా-

ఉన్నచోట ఉండకుండా-

పాకుతోంది.



కథా రచయిత
తాడిమళ్ళ రామక్రిష్ణ

రజత రంజతం

ఒక్క చోటక్కాదు-ఊరికే కాదు-పొడుస్తూసూదుల్లా కాదు-గునపాల్లా.

ఒంట్లో ఏమీ మిగల్చకుండా-

ఒంటిమీద కనిపించకుండా!

ప్రకాశం ఇప్పుడు ఏమీ తినడం లేదు. క్యాన్సర్ అతన్ని తినేస్తోంది.

దుర్గ:

ఉక్రోషంతో తలుపులు భడాల్న మూసింది దుర్గ.

తలుపులయితే మూసింది గాని అత్తగారి మాటలు ఇంకా ఆమె చెవుల్లో గంటల్లా మ్రోగుతున్నాయ్.

మామగారి చూపులు ఆమెని చీల్చేస్తున్నాయ్.

ఆడపడుచుల ఈసడింపులు ఆమెని దహించేస్తున్నాయ్.

తోడి కోడళ్ళ వెటకారాలు ఆమెని పాతాళంలోకి తొక్కేస్తున్నాయ్.

'ఏమిటి తన తప్పు!'

తను కట్టింది ఫారన్ నైలక్స్ చీర. వేసుకొంది స్లీవ్‌లెస్ బ్లౌజ్.

తను జల్లుకుంది ఫారెను నుంచి తెప్పించిన స్ప్రే!

తన కళ్ళల్లో వెలుగు. ఈ వెలుగు ఎక్కడిది? అసలు తనకు ఇలాంటి స్థితిలో ఇలాంటి వేషం ఇష్టమా? ఇంతటి అలంకరణ మీద మోజా? తన జడలో తురుముకున్న ఈ మల్లెల వాసన వెనక నిజం ఏమిటి?

భర్త చివరి దశలో ఉన్నప్పుడు భార్యగా తను చేసింది ఏమిటో కొందరికి ఆశ్చర్యం కలిగించవచ్చు. కొందరికి కోపం తెప్పించవచ్చు.

కొందరికి సూటిపోటి మాటలు మాట్లాడే అవకాశం కల్పించవచ్చు మొన్నటి వరకూ ఎలా ఉంది తను.

నిన్నటి నుంచీ ఏమిటీ మార్పు.

ఇలా ఎందుకు జరుగుతోంది.

ఆలోచించే వాళ్ళెవరూ?

పైకి కనిపిస్తున్న దాన్ని కడిగేయటం తప్ప వీళ్ళకి చేతనయిందేమిటి?

మొన్నటి వరకూ తను కట్టింది మామూలు నేత చీర! వేసుకొంది మామూలు జాకెట్.

చల్లకొంది ఫారెన్ స్ప్రే కాదు. కన్నీటి ప్రవాహంలోంచి ఒలికిన నీటి బిందువులు.

తన కళ్ళల్లో ఉన్నదా వెలుగు-అందులో కాటికంత చిక్కని చీకటి.

ఆయన ఇక్కడ ఉండేది కొన్ని రోజులట-సంవత్సరాలు కాదు-కనీసం నెలలూ కాదు-రోజులు.

ఆయనే చెప్పారు రహస్యంగా-ఆ రహస్యం ఎవరికి తెలుస్తుంది. చెప్తే వీళ్ళు నమ్ముతారా?

మొన్న ఎవరూ లేనప్పుడు ఒంటరిగా తనతో ఆయన చెప్పింది ఏమిటి.

తను ఎలాగూ వెళ్ళక తప్పదు-అనంతంలోకి. ఆ అంతిమ క్షణాల్లో తను యిలా నిస్తేజంగా, నిర్వీర్యంగా, నిరుత్సాహంగా కనిపించకూడదట. ఇదేం కోరికో! నిండుగా కనిపించాలట!

ఈ వేషం అంతా ఆయన కోరిక మీద వేసుకొన్నదే. భార్యగా ఆయన కోరిక తీరుస్తూంది! అది తప్పా?

తనిలా విషం బిళ్ళ మీద పంచదార పూతలా ఆఖరి కోరిక. ఆ కోరిక తీర్చటం తన విధి. తనలోపల ఎన్నెన్నో బాధల అగాధాలు-వాటన్నిటినీ కప్పుతూ తను ఇలా ఉండటం... ఆ తీపి పూత కరిగిపోయాక తనకు మిగిలేది-విషం.

చీకటి లాంటి విషం.

ఈ వ్యధ ఎవరికి తెలుస్తుంది?

ఎలా తెలుస్తుంది?

(నా బావమరిది ప్రకాశరావు స్మృతికి-కన్నీళ్ళతో అంకితం.

- రచయిత)



ప్రముఖ హస్తసాముద్రికుడు

శ్రీ రాజగోపాల్‌తో ఇంటర్వ్యూ

ఇంటర్వ్యూ: ఛమేలీ

* ప్రశ్న: పామిస్ట్రీ శాస్త్రీయమైందని ఎందుకనుకోవాలి?

కేవలం ప్రయోగశాలల్లో నిర్ధారించగలిగితే శాస్త్రీయమైందనడానికి వీల్లేదు.

ఒక పద్ధతి, క్రమం మీద ఆధారపడి, ఇదివరకటి ఖచ్చితమైన ఫలితాల మీద ఆధారపడి, ఎలాంటి ఊహాగానాలకు, గెస్‌వర్క్‌లకు తావులేని దేదయినా శాస్త్రీయమైందే.

ఉదాహరణకు ఒక పామిస్టు మీరు ధనవంతుడవుతారు అని చెప్పాడనుకోండి. కోట్లాది మంది ధనవంతుల చేతులమీద ఆ గీత ఉన్నది గాబట్టి, ఆ విధంగా రేఖ ఉన్న వాళ్లు ధనవంతులయ్యారు గాబట్టి ఇది పామిస్ట్రీ పుట్టినప్పటి నుండి అంటే కొన్నివేల సంవత్సరాల నుండి జరుగుతున్నది గాబట్టి ఈ ప్రత్యేక మయిన రేఖ చూసినప్పుడు మీరు ధనవంతుడవుతారు అని పామిస్టు చెప్పగలిగినాడని అర్థం చేసుకోవాలి.

ఒకరి జీవితాన్ని చూసి, వారి చేతుల మీద ఉన్న గీతలతో వారి జీవితాన్ని అన్వయించడం వల్ల ఆవిర్భవించిందే హస్తసాముద్రికం. అంతేకాని ఎవరో తపస్సు చేసి రాసిందో లేక మరింకెవ్వడో ఊహాత్మకంగా భ్రమించి వ్రాసిందో కాదు. పామిస్ట్రీలో ఊహకు గాని, అంచనాలకు అసలు తావు లేదు. అవకాశం లేదు.

* ప్రశ్న: ఒకరు ఎక్కువ కృషి చేయవచ్చు. ఒకడు తెలివైన వాడు మరొకడు సాధారణమైన తెలివితేటలు ఉన్న వాడు కావచ్చు అప్పుడెలా?

పామిస్ట్రీ సైన్సు ప్రకారంగా ప్రపంచంలోని మానవాళిని ఏడు రకాలయిన వ్యక్తులుగా వర్గీకరించడం జరిగింది. అందువల్ల ఒక ఫలితాన్నిచ్చే రేఖ ఏడుగురికి ఏడు రకాలయిన లేదా ఏడు శ్రేణుల్లో ఫలితాలనిస్తుందని అర్థం చేసుకోవాలి. చేయిచూసే ముందు అతడే వర్గానికి (అపోలోనియన్, జూపిటాలియన్ మొదలగు) చెందినవాడో అతని ముఖాన్ని బట్టి ఒక నిర్ణయానికి వచ్చి తరువాత చేతి మీద మౌంట్స్‌ని బట్టి ఆ నిర్ణయాన్ని ధృవపరచుకోవాలి.

ఇకపోతే తెలివి తేటలు, పట్టుదలకు సంబంధించి వాటిని నిర్ధారణ చేసిన తరువాతే పామిస్టు ఫలితాన్ని చెబుతాడు.

* ప్రశ్న: గతం చెప్పినంత స్పష్టంగా భవిష్యత్ చెప్పేవీలుందా?

పామిస్ట్రీలో గతమొకటీ, భవిష్యత్తు ఒకటీ అంటూ ఉండదండి. రెండూ కూడా చేయి ఆకారం, మౌంట్స్ గీతలమీద ఆధారపడి పామిస్టు చెబుతాడు. మీ వయస్సును

బట్టి కొన్ని గతమౌతాయి. మరికొన్ని భవిష్యత్తు అవుతాయి. నీ వయస్సు ఎంత ఉందో అడిగి తెలుసుకొని ఫలానా ఫలితాలు జరిగాయని పామిస్టు మీకు చెబుతాడని అర్థం చేసుకోవాలి.

* ప్రశ్న: అంటే హస్తసాముద్రికం ఆధారంగా వయస్సును చెప్పవచ్చా?

నాకు తెలిసినంత వరకు పామిస్ట్రీని బట్టి వయస్సును చెప్పే అవకాశం చాలా తక్కువ. ఉదయాన్నే జీవితరేఖను బొటనవ్రేలితో ఒత్తిడి చేస్తూ పరిశీలించినప్పుడు తెల్లటి మిరుగు (Spark)లాంటిది కొందరి వ్యక్తుల చేతుల్లో స్పష్టంగా కనబడుతుంది. దాన్ని మార్కు చేసి వయస్సును నెలలతో సహా ఖచ్చితంగా చెప్పవచ్చు. అయితే అన్ని సందర్భాల్లో, అందరి వ్యక్తుల చేతుల్లో సాధ్యంకాదు. అందువల్ల పామిస్టుతో సహకరించటం ఈ విషయంలో అత్యవసరం.

* ప్రశ్న : హస్తంమీద రేఖలను మరేదైనా ప్రభావితం చేసి మీరు చెప్పే ఫలితాలను యథాతథంగా, మార్చగలుతుందా? ఉదా! మంత్ర తంత్ర యిత్యాదులు.

మంత్ర తంత్రాలు చేతి మీది రేఖలను ఎంత మాత్రమూ మార్చలేవు. వీటిని మార్చగలిగే శక్తి భగవంతుడికి ఉంది. ఈ విషయంలో పరమశివునికి ఉన్న శక్తి మరే దేవునికి లేదు. శివున్ని ధ్యానం చేసినప్పుడు (సుదీర్ఘ కాలం పాటు) తెగిన శీర్షరేఖ అతుక్కోవడం నేను కళ్లారా చూశాను. ఇది నా జీవిత అనుభవం నుండి చెప్తున్నాను.

* ప్రశ్న: ముష్టివాడికి, దుర్బలుడికి, మూఢుడికి, దుర్మార్గుడికి మొత్తం మీద దారిద్ర్యం ఉన్నా గుణం, ప్రవృత్తి, వృత్తి స్పష్టంగా చెప్పగలరా?

చూడండి. పామిస్ట్రీ వల్ల ఒక వ్యక్తి గుణం ఖచ్చితంగా చెప్పటం చాలా సులభం. దారిద్ర్యం చెప్పటం కూడా అదే విధంగా చాలా సులువు. అయితే వృత్తి అనేది కొంత క్లిష్టతమైంది. తనకు చెందిన వృత్తి కాకుండా మరో వృత్తిని చేపట్టి మానసిక సౌఖ్యాన్ని కోల్పోవడం ఉంటుంది. అదేవిధంగా వృత్తి అంటూ ప్రత్యేకంగా పామిస్ట్రీలో లేదు. చేయి చూడడం ద్వారా మనం తెలుసుకున్న అంశాలమీద ఆధారపడి వృత్తిలో అలుసు బాగా రాణిస్తాడో చెప్పవచ్చు. ఇప్పుడున్న వృత్తులు కొంతకాలం క్రితం అసలు లేనేలేవని గమనించవచ్చు. ఉదాహరణకు కంప్యూటర్ సైంటిస్టు.

* ప్రశ్న: ఎడమచేతిన ఎంతవరకు చూసి చెబుతారు?

కుడిచేతిని చూసే ఫలితాన్ని చెబుతాం. కొన్ని సందర్భాల్లో కుడిచేతిలో కొన్ని రేఖలను పోల్చుకోవడం కష్టం. అప్పుడు ఎడమచేతిలో ఆ రేఖ పరిస్థితి ఏమిటో చూసి తెల్సుకోవచ్చు. ఇందులో నాకు కొన్ని వింతైన భావాలు ఉన్నాయి... ఎడమచేతిలో ఉన్న రేఖ కుడిచేతిలో పూర్తి అదుపు తప్పి ప్రకక్కు మళ్లిపోయి ఉంది. ఎవరో దాన్ని కావాలని త్రిప్పినట్లుగా ఇప్పుడు ఈ రెంటిని పరిగణించి, మిగతా రేఖల ఆధారంగా ముఖంగా గురు-స్థానంపై లంకను బట్టి ఆ వ్యక్తి పరమతాన్ని స్వీకరించడం వల్ల బంధువులు వ్యతిరేకమయ్యారని నేను చెప్పగలిగాను. దానికి సంబంధించి పెళ్లి, మళ్లీ ఎడమచేతి రేఖల పరిస్థితి మీద ఆధారపడి మొత్తం అతని జీవితమంతా సంగ్రహంగా చెప్పగలిగాను.

* ప్రశ్న: నా మరణం స్పష్టంగా ఫలానా వయసులో ఉందని చెప్పారు. కొందరు అయితే ఆ వయస్సును సూచిస్తున్న స్థానాన్ని దాటి ఇంకా రేఖలు పొడవుగా ఉన్నాయేమిటి?

మరణం సూచించాలంటే ఫలానా రేఖ అక్కడ ఆగిపోవాలని నియమం లేదండి. చాలామంది పామిస్టులు ఇక్కడే పొరపాటు చేస్తుంటారు. మరణం అనగానే మళ్లీ జీవిరేఖను చూస్తుంటారు. మరణం ఒక్క జీవితరేఖ మీదే ఉండనక్కరలేదు. మరణ సూచన లేదా మారకం ఎక్కడైనా ఉండవచ్చు. ఉదాహరణకు శీర్షరేఖపై అయితే రేఖలు ఆగిపోవడంపై రెండు ప్రధాన రేఖలు ఉదాహరణకు శీర్షరేఖ జీవితరేఖ ఏక కాలాన్ని సూచిస్తూ, అద్భుతంగా ఆగిపోయాయనుకోండి అది

మరణాన్ని సూచిస్తుంది. ఒకే రేఖ ఉదాహరణకు శీర్షరేఖ వస్తూ వస్తూ మధ్యలోనే ఠక్కీమని ఆగిపోయిందనుకోండి. ఇది కూడా ఆకస్మిక మరణాన్ని సూచిస్తుంది. ఇందుకోసం ఎడమచేతిని చూడాలి. ఎడమచేతిలో ఇలాగే ఆగిపోయి ఉంటే అది అతని బుద్ధిని మాత్రమే సూచిస్తుందచ్చు. ఎడమచేతిలో శీర్షరేఖ పొడుగ్గానే ఉండి కుడిచేతిలో మధ్యలోనే అకస్మాత్తుగా ఆగిపోయినట్లయితే అది ప్రమాదాన్ని సూచిస్తున్నది. వెంటనే కుడిచేతిలో ఇతర స్థానాల్లో కోణాలను సూచిస్తున్న రేఖలేమైయినా ఉన్నాయేమో వెతకడం అత్యవసరం.

ఈ విధమైన అనేక సందర్భాల్లో నేను ఆ వ్యక్తిచేతిలో డయాబెటిస్‌ను, (మధుమేహ వ్యాధి) ఎలా హృద్రోగాన్ని కనుక్కొన్నాను. ఆ వ్యక్తికి అవి ఉన్నట్లే తెలియదు. పరీక్ష చేస్తే అతను అతనికి డయాబెటిస్ వ్యాధి ప్రమాదకర స్థాయిలో ఉన్నట్లు తేలింది!

* ప్రశ్న: హస్తసాముద్రికం ద్వారా మానసిక స్థితి తెలుస్తుందా?

హస్తసాముద్రికం ద్వారా ఒక వ్యక్తి మానసిక స్థితిని స్పష్టంగా చెప్పవచ్చు. ఆ వ్యక్తికి పిచ్చి వస్తుందనే విషయాన్ని ఒక ఇరవై సంవత్సరాలు అంతకంటే ముందే చెప్పవచ్చు.

* ప్రశ్న:రేఖలు మారుతుంటాయంటారు కదా మరి మీరు ఫలితం చెప్పాక

రేఖలు విచిత్రమైన కోణాల్లో మారిపోతేనో?

రేఖలు పూర్తిగా మాయవడమో, మారిపోవడమో అంటూ ఉండదండి. ఒక్క ఆరోగ్యరేఖ తప్ప. అయితే రేఖలు క్రిందికి వంగడమో, పైకి లేవడమో జరుగుతుంది. ముఖ్యంగా శిర్షరేఖ దీన్ని ముందె చెప్పవచ్చు. అతని తీవ్రమైన కోరికలు, లేదా ఉన్మాదం మొదలైనవి మొదటే తెల్సుకోవచ్చు. గాబట్టి రేఖ వైపుకు మొగ్గసతున్నదో ఇంకా కొంత కాలానికి పూర్తిగా ఎటువైపు మొగ్గుతుందో తెల్సుకోవచ్చు.

ప్రశ్న: ఆకస్మిక మరణాన్ని మీరు ముందే చెప్పారనుకోండి. దాన్నుండి తప్పించుకోవచ్చునా? ఒకవేళ తప్పించుకోలేకపోతే అసలు చెప్పడం దేనికి? అందువల్ల హస్తసాముద్రికం అనవసరమేగదా?

మీ ప్రశ్న అంతటికీ ఒక ఉదాహరణ చెబితే బాగుంటుంది. నేనొక పత్రికాఫీసులో ఉపసంపాదకుడిగా పనిచేస్తున్నాను. నా సహోద్యోగి ఒకతను నా వద్ద హస్తసాముద్రికం చెప్పించుకున్నాడు. అతని చేతిలో శిర్షరేఖ జీవితరేఖ ఏకకాలంలో తెగివున్నాయి. అతను బ్రతకడం కష్టమని నాకు తెలిసింది. అతను తలమీద బలమైన గాయం వల్ల మరణించాలి. అతను దీన్నంత సీరియస్‌గా తీసుకోలేదు. ఇదివరకే ఒక ఆక్సిడెంటు జరిగింది. నాతో ప్రయాణిస్తున్న వ్యక్తి మరణించాడు. నేను బ్రతికాను అని ఆయన అన్నారు. మీరెలాగ బ్రతికారో నాకు ఆశ్చర్యంగా ఉంది అని నేనన్నాను. నా బదులు మరొకడు చచ్చాడు గదా? అదీగాక 24 ఏట ఎప్పుడో జరిగిపోయింది లెండి అంటూ ఆయన జోక్ చేశాడు. అయితే చిన్న చిన్న ఆక్సిడెంట్‌లను సూచిస్తున్న స్థానాలు శిర్షరేఖపై గతంలో రెండున్నాయి. నేనదే అన్నాను. కాని ఆయన పెద్దగా పట్టించుకోలేదు. ఆయన వయస్సెంతో నాకో ఖచ్చితంగా చెప్పలేదు. విధి మరోలా ఉంది. ఈ సుఘటన జరిగిన 15 రోజులకే అతను ఆకస్మికంగా 32 ఏట మరో కొన్ని రోజుల్లో పెళ్లి కావాల్సి ఉండగా ఆయన మరణించాడు.

ఇక మీ ప్రశ్నలో రెండవ భాగానికి సమాధానం. శిర్షరేఖ, జీవితరేఖ రెండు ఏకకాలంలో తెగిపోయినంత మాత్రాన ఖచ్చితంగా మరణించాలని లేదు. తెగిన రేఖల మధ్య క్రాస్ మార్కు ఉంటే మరణించే ప్రమాదం ఎక్కువగా ఉండగా తెగిన రేఖలమధ్య నక్షలోం (రెండు ముక్కలకు అంటుకోకుండా) ఉన్నట్లయితే మరణాన్ని ఆపడం అసంభవం. అసాధ్యం కూడా ఎన్ని జాగ్రత్తలు తీసుకొన్నా మరణం తథ్యం. బాత్‌రూంలో కాలుజారి పడి మరణించవచ్చు!

అందువల్ల ఒక పరిస్థితిలో మరణాన్ని ఆపగలగడం, అందులోంచి బయటపడటం మన చేతుల్లో ఉంది.

ప్రశ్న: పామిస్ట్రీ ద్వారా ఏయే రోగాలు ముందుగా తెలుసుకోవచ్చు? ఏమిటి లాభం?

పామిస్ట్రీ ద్వారా రోగాలు తెలుసుకునే పద్ధతిలో అనేక రకమయిన అంశాలను కనుగొన్న మహనీయుడు. విలియం జార్జ్ బెన్‌హామ్. నేను ఈయన గ్రంథాన్ని ప్రామాణికంగా తీసుకొంటాను. బెన్‌హామ్ చేసిన కృషి తరువాత ఎవరూ చేయలేదు.

పామిస్ట్రీ ద్వారా శిర్షరేఖ హృదయ రోగాలను తెల్సుకోవచ్చు. రక్తపోటు, మధుమేహం, గర్భకోర వ్యాధులు చాలా సులభంగా ఖచ్చితంగా తెల్సుకోవచ్చు. దీనికి నేనొక ఉదాహరణ చెబుతాను. ఒక వ్యక్తి

జ్యోతి పాఠకులకు ఓ ఆఫర్

ప్రముఖ హస్తసాముద్రికుడు శ్రీ రాజగోపాల్‌తో కన్సల్టేషన్ అవసరమనుకున్న పాఠకులు తమపేరు, పూర్తి చిరునామాతో జ్యోతి కార్యాలయానికి లేఖ రాస్తే, అప్పాయింట్ వివరాలతో సమాధానం ఇస్తాము. స్టాంపులు అతికించిన స్వంత చిరునామా గల కవరు జతచేసి పంపించండి. అప్పాయింట్‌మెంట్ ఇచ్చిన సమయానికి శ్రీ రాజగోపాల్‌ను హైదరాబాద్‌లో కలవవలసి ఉంటుంది.

చేయి చూసి నేను ఈ విధంగా చెప్పాను. మీకు మీ చిన్నప్రేవుల్లో వ్యాధివల్ల బహుశ, అవి వాడిపోవడం వల్ల మీకు రక్తపోటు వచ్చింది. అధిక రక్తపోటు, హై బి.పి. అని చెబుతూ మొదట ప్రేగులకు చికిత్స చేయించుకోండి. రక్తపోటు తగుతుంది అన్నాను. ఆయనకు అధిక రక్తపోటు ఉంది. దీనికి ఎందరో డాక్టర్లు పరీక్ష చేసి ఎన్నో మందులు ఇచ్చారు. అయినప్పటికీ దీన్ని కంట్రోల్ చేయలేక పొయ్యారు. ఆయన ఒక పెద్ద స్పెషలిస్టు దగ్గరికి వెళ్లాడు. ఈయన అనేక పరీక్షలు చేయించి, వేల రూపాయలు ఖర్చుపెట్టించి చివరకు డియోడైనిటిస్ ఉందని చిన్న ప్రేవులు వాచిపోయాయని దీనికి మందులు వ్రాశాడు. ఆ విధంగా రక్తపోటును కంట్రోల చేశాడు.

ఇంకో ఉదాహరణ: నాకు తెలిసిన ఒక వ్యక్తి ఒక వ్యాధివల్ల అనేకసార్లు మరణం అంచులకు వెళ్లాడు. జీవన్మరణాల మధ్య ఊగిసలాడారు. డాక్టర్లు ఈయనకి ర్యూమెటిసమ్ (కీళ్లనొప్పుల వ్యాధి) ఉందని తేల్చారు. అందుకు చికిత్సను సుమారు ఏడేళ్ల పాటు కొనసాగించారు. ర్యూమటిసమ్ లేదని, చెప్పాను. అతను ఆశ్చర్యపోయాడు.

ఈ మధ్య పడలేక ఒక హోమియోపతి డాక్టరు దగ్గరకు ఈయన వెళ్లగా కేసును కొంతమంది హోమియో డాక్టర్లు క్షుణ్ణంగా పరిశీలించి ఈయనకు ర్యూమెటిసమ్ లేదని తేల్చారు. ఇది సాధారణ ఆర్థ్రైటిసిగా వాళ్లు గుర్తించారు.

ఇలాంటి ఉదాహరణలు అనేక నేను ఇవ్వగలను. హిస్టరెక్టమీ ఆపరేషను చేసి గర్భకోశం తీసివేసిన విషయాన్ని నేను చెయ్యి చూసి గుర్తుపట్టాను.

అయితే చేసి చూసి రోగాలను గుర్తుపట్టగలిగే విషయమై ఇంకా ఎంతో రీసెర్చ్ జరగవల్సి ఉంది. ఉదాహరణకు మీద్యానికి బానిసను సూచించే ఒక రేఖ కేవలం అలర్జీని కూడా సూచిస్తుంది.

ప్రశ్న: ఇప్పుడున్న పామిస్టులు సాధారణంగా ఎక్కడ పొరపాటు చేస్తున్నారంటారు?

పామిస్టుల లేదా హస్తసాముద్రికులం అని చెప్పుకునే వాళ్లలో అనేకమందికి అసలు పామిస్ట్రీ అంటే ఏమిటో తెలియదు! అదే విధంగా గర్డిల్ ఆఫ్ వీనస్, సూర్యరేఖపై అనేకమైన మూఢనమ్మకాలున్నాయి.

* ప్రశ్న: చివరగా ఒక ప్రశ్న. మన ఇండియన్ పామిస్ట్రీకి, వెస్టరన్ అంటే ప్రాశ్చాత్యుల పామిస్ట్రీకి భేదం

ఉందా?


చాలామంది అనుకొంటున్నట్లుగా ఒకదానికొకటి విరుద్ధం కాదు. ఇండియన్ పామిస్ట్రీలో అదనంగా గుర్తులపై ఆధార పడి చెప్పడం, దీన్నే పీరోమాన్సి అంటా రని ఉంది. దీనికొక ఉదాహరణ చెబు తాను. నేనొక సందర్భంలో ఒక ప్రసిద్ధి గాంచిన స్మగ్లర్ చేయి చూడడం తటస్థిం చింది. ఈయనెంతో ప్రమాదకరమైన వ్యక్తి ని పేరు తెచ్చుకున్నాడు కూడా. ఈయన కోటీశ్వరుడు కూడా. ఈ స్మగ్లర్ చేయిపై కోటీశ్వరుడని తెలుపడానికి చంద్రస్థానంపై మరేదేనికీ తగలకుండా ఒక కళాకారుడు గీయగలిగినంత స్పష్టంగా చేపబొమ్మ ఉంది. జీవితరేఖకు సమీపంలో మణికట్టు వైపుకి ఈ చేప బొమ్మ తోకతో సహా ఇండియన్ హస్తసాముద్రికం ప్రకారం కోటీశ్వరుడు కావాలి. అయితే అదే చేయిపై ఖర్మరేఖ నుండి శాఖబయలుదేరి సూర్యస్థానం మీదికి వెళ్లింది. ఇది ప్రఖ్యాత హస్తసాముద్రికం.

అయితే ఖర్మరేఖ శాఖ సూర్యస్థానం మీదికి వెళ్లడం (ఖర్మరేఖ నిటారుగా ఉన్నపుడు) సంపదను తెస్తుందని మన ఇండియన్ పామిస్ట్రీ కూడా ఉంది. ప్రహ్లాద హస్తసాముద్రికం.

ఒకసారి వీరిలా అన్నారు:

ఇదేనమ్మా జీవితం! ప్రజలు ఒకళ్లనొకళ్లు ఏ విధంగా ఎదుర్కొంటున్నారో చూడు. అనుకోకుండానే నీవొకళ్లను దెబ్బ తియ్యవలసొస్తోంది. ఇంతకూ నీవెవరిని కొడుతున్నావు? నీలాగే ఏ హక్కులూ లేని నిర్భాగ్యపు జీవిని. ఈ సందర్భములో అతడు నీకన్న అదృష్టహీనుడు. ఏమంటే వాడు ఉట్టి మూర్ఖుడు. పోలీసులు, గూఢచారులు రాజకీయ పోలీసులు అంతా మనకు శత్రువులే. కాని వాళ్లంతా మనలాటి మనుషులే. మనకు మల్లనే వాళ్ల రక్తం కూడా పీల్చబడుతోంది. మనలను చూచినట్లుగానే వాళ్లను కూడా హీనంగానే చూస్తారు. మనమంతా ఒక్క తరహా వాళ్లమే. కానీ యజమానులు మాత్రం ప్రజలను ఒకళ్ల మీద ఇంకొకళ్లను రెచ్చగొట్టి ఉంచుతారు. భయంతోనూ, అవివేకంతోనూ వాళ్లను అంధులను చేస్తారు. చేతులూ కాళ్లూ కట్టేసి, బాగా నలిపేసి, రక్తం పీల్చేస్తారు. చివరికి ఒకళ్ల నొకళ్లు కొట్టుకొని అంతా నలిగిపోతారు. వాళ్లు ప్రజలను తుపాకులుగానూ, కర్రలుగానూ, రాళ్లుగానూ మార్చేసి 'ఇదే రాజ్యం' అంటారు.

-'అమ్మ' నవలలో మాక్సిమ్ గోర్కీ



చిత్రం: ఎ.ఎ. టోని.

కన్నీళ్ళొచ్చాయి



కృష్ణాదిశేషు కథ

ఇప్పుడు సమయం ఐదుగంటలు. నెమ్మదిగా రూముకు తాళంవేసి హోటలు క్రింది భాగంలో ఉన్న రెస్టారెంట్ వైపు నడిచాడు ముకుందం.

కాఫీ త్రాగి హోటలు మహాలక్ష్మి నుండి బయటకువస్తున్న అతనీ చుట్టూ రిక్షా బాబులు "వస్తారా!" అంటూ ఒక్కసారిగా చుట్టూ చేరారు.

భక్తులకు పవిత్ర దేవాలయాలు కాశీ, కన్యాకుమారి, తిరుపతి ఎలానో శృంగార పురుషులు, రసిక మహారాజులకు మనస్సుపడ్డపుడు పెద్దాపురం, మానేపల్లి, రాజమండ్రిలు లాంటివి జ్ఞాపకం వస్తాయి.

అంతప్రాముఖ్యత ఉన్న రాజమండ్రిలో మెరకవీధి వైపు ప్రయాణమయ్యాడు వాళ్ళందర్నీ తప్పించుకుంటూ..

ఒకవ్యక్తి మాత్రం ధైర్యంచేసి ముకుందం వెంట నడుస్తూ....

"రండి బాబూ! మంచి అమ్మాయి. కాలేజీ అమ్మాయి."

"మంచి కంపెనీ ఇస్తుంది బాబూ! భయంలేదు."

ముకుందం మౌనంగా నడుస్తున్నాడు అతన్ని మౌనాన్ని అంగీకారంగా తీసుకుని చెప్పసాగాడు.

పోలీసుల భయంలేదు, నో డేంజరు, నో ప్రాబ్లమ్ మీకిష్టమయితేనే ఉండండి. నో ఫోర్స్ సార్!!

ముకుందం నెమ్మదిగా నడుస్తూ బృందావన్ లాడ్జిమీదుగా కోటగుమ్మం చేరాడు. అతన్ని మాత్రం వారించనూలేదు, ప్రోత్సహించనూలేదు.

ఈ లోకంలో పంచదార మొదలు కిరోసిన్, బియ్యం లాంటి నిత్యావసర వస్తువులకు కొరత, రేషన్ ఉండవచ్చు. హాస్పిటల్లో మందులు లేకపోవచ్చు, కాని వ్యభిచారానికి మాత్రం రేషన్‌గాని కొరతగాని లేదు. అదేమి విచిత్రమోగాని ఎంతో పవిత్రంగా కాపాడుకోవలసిన శీలాన్ని ఇలా బజారున అమ్మకంపెట్టడం, ఆమాటకొస్తే ప్రతిపట్టణానికీ ఒక పోలీసు స్టేషన్, ఒక దేవాలయం, ఓ పోస్టాఫీసు ఉండటం ఎంత అనివార్యమో, వ్యభిచారం, జూదం, ఓ బార్ ఉండటం అంత అవసరంగాను అందుబాటులోనూ కనిపిస్తున్నాయి.

"నీ పేరు?" నెమ్మదిగా అడిగాడు ఆ బ్రోకరువైపు చూస్తూ.

"వీరయ్యండి."

"జేబు నుండి ఓ పది రూపాయలు తీసి అతనికిస్తూ నాకు అవసరం అయ్యినప్పుడు నిన్ను పిలుస్తాను. "ఇక నువ్వు వెళ్ళు" నెమ్మదిగా అన్నాడు.

గుమ్మంలో నిలబడి ఉన్న ఆమె ఇతన్ని చూస్తూనే నవ్వుతూ లోపలికి ఆహ్వానించింది.

"మీరు మాధురి అనుకుంటా!" కుర్చీలో కూర్చుంటూ అడిగాడు.

అవునన్నట్టు తల ఊపింది.

"నాపేరు ముకుందం" తనను తాను పరిచయం చేసుకున్నాడు.

"మిమ్మల్ని గుర్తుపట్టాను. మీ ఫ్రెండ్ చెప్పిన గుర్తులు ప్రకారం."

"నిజానికి మీ కోసమే ఎదురు చూస్తున్నాను."


ఆమెను ఒకసారి పరీక్షగా చూసాడు. ఆమెలో నటనగాని, కల్మషంగాని ఏమాత్రం లేవు. నిండుగా కొత్త పెళ్ళికూతురిలా సంసారపక్షంగా ఉంది.

గ్లాసులో మంచినీళ్లు ఇస్తూ "స్నానం చేస్తారా!" ఆప్యాయంగా అడిగింది.

వద్దని చెప్పాడు.

తన పడకగదిలోకి తీసుకెళ్తూ అతి

ధిగార్కి స్వాగతం. "ఈరోజు నేను మీ దానను మీ కోరికలు తీర్చడానికి సిద్ధంగా ఉన్నాను!" నవ్వుతూ వినయంగా తలవంచుకొని చెప్పింది.



ఆమెనుండి వెదజల్లే ఉడుకులాం వాసన మత్తెక్కిస్తోంది. రూమంతా ఒకసారి కలియచూసాడు. అందంగా ఆకర్షణీయంగా రకరకాల సీనరీలతో ఆహ్లాదకరంగా అమర్చి ఉన్నాయి. ఓ వైపున ఓ టీపాయి, రెండు కుర్చీలు ఉన్నాయి. ఆమె మాట తీరు అభినయానికి పరవశుడయ్యాడు. అసలు పురుషులు రంభలాంటి భార్య ఇంటిలో ఉన్నా వేశ్యలపట్ల ఆకర్షితులు కావడానికి ఇదొక కారణం కావచ్చు. వీటికితోడు పురుషుడి మనస్సుదోచే ఆకర్షణలు, అందం ఆమెలో ఉన్నాయి.

నిలబడున్న ఆమెను చూస్తూ "కూర్చోండి మాధురిగారూ" అన్నాడు.

తన ఇంట్లో తనకు మర్యాద చెయ్యడం విడ్డూరంగా అనిపించినా మాట్లాడకుండా కూర్చుంది.

సాధారణంగా తన దగ్గరకొచ్చే కష్టమరు ఏవే, పోవే, లం.... లాంటి పదాలు వాడతారు కాని ఇంత మర్యాద ఇచ్చి మాట్లాడే వారు తన సర్వీసులో చూడలేదు. బహుశా ఇతడు చదువుకొన్న సంస్కారం వంతుడై ఉండొచ్చు' మనస్సులో అనుకుంది.

"మాధురిగారూ! మీరు ఎంతకాలం నుండి ఈ వృత్తిలో అంటే వ్యభిచారం చేస్తున్నారు?" ఓ విలేఖరి ఓ సినీతారను ఇంటర్వ్యూ చేస్తున్నట్టు అడిగాడు.

"ఛ!ఛ తన ప్రశ్న తనకే సిగ్గనిపించింది."

ఒకసారి అతనివైపు చూసింద.

అతనికి ఆచూపు ఓ పిచ్చోడ్ని చూసినట్టు అనిపించింది.

అయినా సౌమ్యంగా చెప్పింది "సుమారు ఎనిమిది సంవత్సరాలనుంచి."

"ట్రాన్స్‌ఫర్స్ ఏమైనా" ఛీ!ఛీ మళ్ళీ చచ్చు ప్రశ్న ఏ గవర్నమెంటు ఉద్యోగస్తుడ్నో అడిగినట్టు.

ఈసారి కాస్తకోపం, ఆ తరువాత అతని చిలిపి ప్రశ్నలకు మరికాస్త నవ్వువచ్చింది.


"చాలా ఊర్లు తిరిగాను. అంతేకాదు అప్పుడప్పుడు ఒక్కొక్క కష్టమరు మా మీద మోజు పడినట్టయితే తమతో దూర ప్రాంతాలకు తమతమ కోరికలు నిర్భయంగా తనివితీరా, నిర్మొహమాటంగా తీర్చుకోడానికి తీసుకెళ్తుంటూరు. అంటే మీ భాషలో క్యాంప్స కెళ్ళడం అన్నమాట."


"మరి నెలసరి ఆదాయం."

" ఓ అదా! జీతం మాటా."

"అతనివైపు పరీక్షగాచూసింది. అతని ప్రవర్తన మాట్లాడేతీరు తనకి ఏమాత్రం అర్థంకావడంలేదు. నిజం చెప్పాలంటే వింతగా ఉంది. బహుశా ఇటువంటి పరిసరాలకు ఎన్నడూ వచ్చినట్టులేదు. ఇతనిలాంటి కష్టమరును తన సర్వీసులో ఏనాడు చూడనూలేదు.

సాధారణంగా కష్టమరు రాగానే పిచ్చి





పిచ్చి చేష్టలతో వేధిస్తూ, అసహ్యంగా మాట్లాడుతూ ఆ తర్వాత తాము వచ్చిన పని ముగించుకోవడం జరుగుతూందిగాని ఇలా సావధానంగా స్నేహితులతో కబుర్లు చెబుతున్నట్టుగా ఉండే ఇటువంటి కస్టమరు తటస్థపడటం ఇదే మొదటిసారి.

అయినా తను మాత్రం అతన్ని తృప్తి పరచాలి. అడిగిన ప్రతి ప్రశ్నకు నేర్పుగా, సౌమ్యంగా జవాబుచెప్పాలి. అది తన వృత్తి ధర్మం. తన సర్వీసులో నేర్చుకున్నది అదే.

"చూడండి ముకుందంగారూ ఇంతకీ ఈ వేశ్యవాకిటికి మీరెందుకు వచ్చింది. మీ ప్రవర్తన నాకేం బోధపడటంలేదు ఆశ్చర్యంతో విసుగును కూడా కల్గిస్తున్నాయి. మా దగ్గరకు వచ్చే కస్టమరు ఎటువంటి వారైనా ఏ చచ్చు ప్రశ్నలువేసినా అతనికి ఏ విధంగాను ఇబ్బంది కలుగకుండా తృప్తి పర్చడం మా వృత్తిధర్మం."

"అడిగారు కాబట్టి చెబుతున్నాను."

మాకో యజమానురాలు ఉంటుంది. మమ్మల్ని కంట్రాక్టుమీద నెలకు ఇంతని ఒప్పందం కుదుర్చుకుంటాం. నా మటుకు నెలకు రెండు వేలు ఇచ్చి రెండుపూటలా భోజనం, కాఫీలు ఇస్తారు. దానికి ప్రతిఫలంగా యజమానురాలి ఆజ్ఞప్రకారం విటులను సుఖపెట్టాలి. ఆ కస్టమరు తాగుబోతు కావచ్చు, కురూపి కావచ్చు, మరేదైనా కావచ్చు. ఇది మా అగ్రిమెంటు.

అతను ఏదో చెప్పబోయాడు. మధ్యలోనే అందుకుంటూ పైగా ఏమైనా వస్తాయా అంటారు. అంటే లంచం అవునా! అతని వైపు చిలిపిగా చూస్తూ అంది.

ఆమె వైపు ఆశ్చర్యంగా చూస్తూ అవునన్నట్టు తల ఊపాడు.

"మా దగ్గరకు వచ్చే కస్టమర్సు మా సర్వీసులో తృప్తిచెంది సరదాలు తీరినట్టు భావిస్తే పదో, పరకో ఇస్తారు. అయినా అవి మాత్రం మా దగ్గర నిలబడవు. ఎందుకంటే మా దగ్గరకు వచ్చే వారిలో ఆరోగ్యవంతులతో పాటు రకరకాల రోగాలతో వచ్చిన వారు ఉంటారు. పోతూ పోతూ మాకుకూడా తమ తమ రోగాల్ని బహుమానంగా మా శరీరానికి అంటగట్టి పోతుంటారు. అలానే వాళ్ళు తీసుకెళ్ళుతుంటారు. నిజం చెప్పాలంటే మా శరీరం రోగాలకు నిలయం అన్నమాట. అందుకుగాను మమ్మల్ని మేము కాపాడుకోవడానికి కొంత డబ్బును, రోగాల్ని తగ్గించుకోడానికి ఉపయోగిస్తాం" ఈ మాట చెబుతున్నపుడు ఆమె కంఠం జీరబోవడం స్పష్టంగా కన్పించింది.

"ఇలా ఎంతకాలం జరుగుతూంది" నెమ్మదిగా అడిగాడు.

"బహుశా చచ్చేంత వరకూ".

"ఈ పరిస్థితిలో మీ బంధువులుగాని, పరిచయస్థులుగాని వచ్చారనుకో ఏం చేస్తారు?"

"ముందు ఆశ్చర్యపోతాను. తరువాత సిగ్గుపడతాను. నేను ఎంతటి నీచమైన పని చేస్తున్నానని, ఆతరువాత సర్దుబాటు చేసుకుని వాళ్ళ కోరికను తీరుస్తాను.

"అది సిగ్గు అనిపించడం లేదు".

అదే సిగ్గువారికున్నట్టయితే ఇటువంటి కొంపలకు అస్సలు రానేరారు. అయినా నేను నీతులు చెబుతూ ఇది తప్పుదారి అంటే నమ్ముతారా! ఏదో మీ పిచ్చిగాని.

ఈ మాటలు అతనికి నిజమనిపించాయి.

"అయితే మాధురిగారూ మీ దగ్గరకు వచ్చే కస్టమర్సుతో గడుపుతున్నప్పుడు ఎలా ఫీలవుతారు.

ఈసారి అతనివైపు తీక్షణంగా చూసింది. ఇతను దేనికొరకు వచ్చిన్నట్టు కొంపదీసి రచయిత కాదుకదా! కారణం ఏదైనా తన వృత్తిధర్మం నిర్వర్తించాలని మనస్సులో అనుకుంది.

"ఓ భగవంతుడా నాకు ఇంతటి దుర్భరజీవితం ఎందుకు ఇచ్చావు అని బాధపడుతుంటాను. కాని మా దగ్గరకు వచ్చే విటులకు మా శరీరంతో పనిగాని మా మనస్సుతో కాదుగదా! నిజానికి ఈ వృత్తి ఒక నరకంలాంటిది."

అటువంటప్పుడు ఈ వృత్తి దేనికొరకు చేస్తున్నట్టు డబ్బుకొరకా? లేక సరదాకా?

"పొరపడుతున్నారు ముకుందంగారూ! ఒకసారి ఈ వృత్తిలో దిగబడిన వారు జీవితంలో తిరిగి బయటపడలేరు. ఒకవేళ ఏ విశాలహృదయం కలవారో మా మీద దయతలచి ఈ కొంపనుండి బయిటకుతీసినా మాతోపాటు అతని జీవితం నరకం అవుతుందే తప్ప పూలపాన్పు కాలేదు. ఇటువంటి పరిస్థితుల్లో ఏ వ్యక్తీ ఇందుకు సాహసించరు. ఇకపోతే చచ్చేంతకాలం మా శరీరంలో అందం, ఆకర్షణ, ఆరోగ్యం బాగున్నంతవరకూ ఈ జానెడు పొట్టను ఈ వేశ్య వృత్తిచేసి పోషించక తప్పదు బాబూ! చివరకు మాకు జన్మ ఇచ్చిన ఆ బ్రహ్మ కూడా మా తలరాతను మార్చలేడు. ఇక మా ఖర్మంతే" ఆ మాటలు అంటునప్పుడు కళ్ళనుండి నీళ్లు జలజలారాలాయి. గొంతు బొంగురుపోయింది.

"మరో విషయం బాబూ! మేము మా శరీరాన్ని అమ్ముకుంటున్నందుకు వచ్చే ఆదాయంలో ఒకవంతు రౌడీలకు, మరో వంతు పోలీసుల బెడదనుండి తప్పించుకోవడానికి లంచాలుగాను, మరో వంతు మేము నివసించే ఇంటి యజమానికి. ఇక ఉన్నదాంట్లో కొంత మా ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి, మందులు. ఇందులో ఏది కాదన్నా మా వ్యాపారానికి ముప్పేకదా!"

ఆమె ప్రతిమాట పరిపరి విధాల ఆలోచింపజేసేవిగా ఉన్నాయి. ఆ మాటలో అన్నీ యదార్థాలే గోచరిస్తున్నాయి. ఆమె అన్నట్టు నిజంగా వ్యభిచారం అనేది నికృష్టజీవితం.

"మాధురీ మీరు నాకోమాట ఇవ్వాలి!" అభిమాన పూర్వకంగా అడిగాడు.

ఆమె అతని వైపు ఆశ్చర్యంగాను, వింతగాను చూసింది. తను అతనికి ఇవ్వవలసిన మాటేమిటో అనుకుంటూ.

"ఏంలేదు మాధురీ నన్ను మీ దగ్గరకు అప్పుడప్పుడు రానివ్వాలి."

"అంటే జస్ట్ ఓ రెగ్యులర్ కస్టమర్‌గా అన్నమాట అదోలా చూస్తూ అంది.

"ఛ!ఛ! దానికి కాదు. ఒక స్నేహితుడిలా."

"అంటే నన్ను మీ స్నేహితురాలిగా భావిస్తున్నారా!" ఆ స్నేహం అనే మాటకు తన్మయం చెందుతూ అంది.

అవునన్నట్టు తల ఊపాడు.

చూడండి ముకుందంగారూ మా దగ్గరకొచ్చే కస్టమర్సునుండి చీదరింపులు చీత్కారాలతోపాటు ఏవేవో మాటలు వింటూ ఉంటాంగాని మమ్మల్ని ఒక ఫ్రెండ్‌గా చూడటానికి ఏ విటుడూ ఇప్పటివరకూ చూడలేదు. అయినా మమ్మల్ని మీ ఫ్రెండ్‌గా ఉండటానికి మీకేంప్రయోజనం' అడిగింది.

"నిజం మాధురీ! నేను ఓ చిన్న రచయితను. నిన్ను ఒక స్నేహితురాలిగా భావిస్తున్నాను. నరకంలాంటి ఈ వేశ్యవృత్తితో జీవిస్తున్న మిమ్మల్ని సంఘంలో విద్రోహ శక్తులు, అటు రాజకీయ నాయకులు ఏ విధంగా వాడుకుంటున్నారో వాళ్ళ ఆశయాలకు మీరు ఏ విధంగా బలైపోతున్నారో ఈ సమాజానికి తెలియపర్చాలి. తద్వారా ఏమైనా మేలు జరుగుతుందేమో అనే ఆశ. దానికి నీ సహకారం కావాల. అందుకే నాకు మాటివ్వాలి" అంటూ చెయ్యి

సాపాడు.

అప్రయత్నంగా చేతిలో చెయ్యివేస్తూ బాబూ ఈ సంఘటన నా జీవితంలో ఓ తీపి గుర్తుగా ఉండిపోతుంది బాబూ సంతోషంగా అంది. నా వల్ల సమాజానికి ఏమాత్రం ఉపకారం కల్గినా జన్మధన్యమైనట్టే. ముకుందంలేస్తూ జేబునుండి రెండు వందలు తీసి ఆమెకు ఇవ్వబోయాడు.

ఆమె వాటిని సున్నితంగా నిరాకరిస్తూ "బాబూ! మేము వేశ్యలమేగాని మోసగాళ్ళం మాత్రంగాము . ఊరికే డబ్బు తీసుకోడానికి బిచ్చగాళ్ళం అంతకన్నా కాదు" అంది!

"చూడండి! మాధురీ నేను అలా అనుకోవడం లేదు. మీరు నాతో గడిపిన సమయం ఏ కష్టమరుకో వినియోగించినా మీకు నే నిచ్చే డబ్బు కన్నా ఎక్కువగా వచ్చేది. నాలాంటి వాళ్ళతో ఇలా సమయాన్నంతా వృధా చేసుకుంటూపోతే మీ ఖర్చులకు ఎక్కడనుండి వస్తాయి.

"లేదు బాబూ! లేదు! మిమ్మల్ని ఆ చూపుతో చూడలేక పోతున్నాను. మీరన్నట్టు మాకు ఖర్చులు ఉన్నమాట వాస్తవమే. అందుకే ఒక వంద మాత్రం తీసుకుంటాను. ప్లీజ్ నన్ను బలవంతం చెయ్యకండి!" చేతులు జోడిస్తూ అంది.

నాకో మంచి తియ్యటి అనుభూతి కల్గించినందుకు మీకు నా కృతజ్ఞతలు' ఆ మాట అంటున్నప్పుడు ఆమె కళ్ళంటా కన్నీళ్ళొచ్చాయి.

●




వేదగిరి రాంబాబు

"ఆరోగ్యంగురించిమాట్లాడుకుందాం"

మీ అసలైన ఆరోగ్యం గురించి, మేలైన సమాచారం వచ్చే సంచిక నుంచి ప్రారంభం.

కమ్మని కథల చెరువు



మధురాంతకం రాజారాంతో ఓ సాయంకాలం...

[illegible] మారు అరశతాబ్దం పై చిలుకు వయస్సున్న తెలుగు కథా ప్రాభవానికి ప్రత్యక్ష సాక్షిగా, కథేతానై తానే కథై తెలుగు కథకు రాయల సీమ తుంగభద్రానదీ తోయ కూనికలను, రతనాల సరాలను అల్లిన శ్రీమధురాంతకం రాజారం చిత్తూరు జిల్లా, చంద్రగిరి తాలూకా, మొగిరాల గ్రామంలో 1930లో జన్మించారు. చిననాటి చదువులను సాంప్రదాయ రీతుల్లో నెరపి, హైయ్యర్ సెకండరీ తరువాత చదువుకు స్వస్తి చెప్పిన శ్రీమధురాంతకం ఎలిమెంటరీ స్కూల్ టీచరుగా చిన్న వయస్సులోనే జీవితం ప్రారంభించి రిటైరయ్యే వరకూ అదే ఉద్యోగం నిర్వహించారు. చదువు సాగిస్తున్న తొలిరోజుల్లోనే మద్రాసు నుంచి వచ్చే ఆనందవాణి, ఢంకా, చిత్రగుప్త, వనజీవన, కథాంజలి పత్రికలు ఆయనలోసుషుప్తంగా ఉన్న సాహిత్యాభిలాషను మేలుకొల్పాయి. 1951లో ఆయన తొలికథ ఆంధ్రపత్రికలో అచ్చయింది. అప్పట్నించి ఇప్పటివరకూ సుమారు మూడు వందలకు పైచిలుకు కథలు రాశారు. ఓడ జనం దాకా కథా సంపుటాలు వెలువడ్డాయి. 1968లో ఆయనకు సాహిత్య అకాడమీ అవార్డు లభించింది.

1971లో సాహిత్య అకాడమీ శాశ్వత సభ్యత్వం పొందారు. ప్రస్తుతం తెలుగు అధికార భాషాసంఘం సభ్యులుగా కూడా కొనసాగుతున్నారు. రాయలసీమ మాండలికంలో పాత్ర చిత్రగా, పోషణా చేసి, పల్లెటూళ్లలో ఉపాధ్యాయుల రైతుల జానన సమస్యలను, వారి కుటుంబాలలో లోతైన సుడులను ఇతివృత్తంగా ఆనాటి నుంచి ఈనాటి వరకూ ఎత్తిన కలందించకుండా రాస్తున్న మధురాంతకం కథల్లోని ఆర్ద్రత పాఠకుడ్ని కరిగించి వేస్తుంది.

ప్రః గత నాలుగు దశాబ్దాలుగా తెలుగు కథ ప్రక్రియలో చాలా మార్పులు చోటుచేసుకున్నాయి. వస్తు, శిల్పం, శైలి, ఎత్తుగడ వీటన్నిటిలోనూ పూర్వరచయితల శైలికి, శిల్పానికి భిన్నంగా రచన సాగుతోంది. దీన్ని మీరెలా స్వీకరిస్తారు?

జః గత నాలుగు దశాబ్దాలుగా తెలుకు కథాసాహిత్యం ప్రక్రియలో చాలా మార్పులు చోటు చేసుకొన్నమాట నిజమే. కాని, ఆ మార్పుల వల్ల మేలు కలిగిందా, కీడు కలిగిందా అనేది ముఖ్యం. తెలుగు కథ పుట్టగానే యౌవ్వన దశను అందుకొన్నదన్నది ఓ విజ్ఞుని మాట. కాని, అది గురజాడ అడుగు జాడల్లో నడవలేక తప్పటడుకులు వేస్తూనే వచ్చింది. అందువల్ల 1910 నుంచి 1935 వరకూ ఓ పాతిక సంవత్సరాలు తెలుకు కథా సాహిత్య చరిత్రలో సాధనదశ అనవచ్చు. 1935 నుంచి 60 వరకూ తెలుగు కథ వస్తుపరంగానూ, శిల్పపరంగానూ సర్వతోముఖ వికాసం సాధించి ఉన్నత ప్రమాణాలను నెలకొల్ప గలిగిందన్ని వికాశ దశ అనవచ్చు. తెలుకు కథకు అంతర్జాతీయ గుర్తింపు రావటం ఈ కాలంలోనే (1952 - గాలివాన, పాలగుమ్మ పద్మరాజు వరకు) జరిగింది. అయితే 1950 నాటికి తెలుగు సాహిత్యంలో గాలివాన లాంటి కథ రావడం యాధృచ్ఛికం కాదు. ఆంగ్ల సారస్వతంలో చెప్పుకోదగ్గ పరిచయం ఏర్పరచుకొని జీవితాను భవాలు పండించుకొని, శిల్పాన్ని గురించిన సునిశిత పరిజ్ఞానాన్ని పెంపొందించుకొన్న తెలుకు కథకులు 1950 - 60 ప్రాంతాల్లో రచించిన గొప్ప కథలు చాలా ఉన్నాయి. 1956 నుంచి క్రమంగా కథానిక స్థాయి పడిపోతూ వచ్చింది. అందుకు కారణాలు అనేకం. ముఖ్యంగా గొప్ప కథకులు కొందరు తెరమరుగై పోవటం, మిగతా వాళ్లు రాయకపోవటం మొదటిది. కథకుల్లో చాలా మంది పల్లె సీమల్ని వదిలిపెట్టి నగరాల్లో స్థిరపడిపోవడం రెండవది. జనాభాలో అత్యధికులైన రైతులు, కూలీలు, వృత్తి పనులవాళ్లు మొదలగువారి జీవితాలు కథల్లో అరుదై పోవడం, కథలు నగర జీవితం చుట్టూ తిరగడం వల్ల వైవిధ్యం కొరవడడం వంటివి కొన్ని కారణాలు. ఇక పత్రికల పరంగా ఆలోచిస్తే వార, మాస పత్రికల సంఖ్య గణనియంగా అభివృద్ధి చెందడం వల్ల కొత్త రచయితలకు అవకాశాలు హెచ్చడం మంచిదే అయినప్పటికీ, కథలు రాయాలన్న ఉబలాటం తప్పవారిలో ఎక్కువ మంది వస్తువు కోసం జీవితాన్ని, శిల్పంకోసం సాహిత్యాన్ని అధ్యయనం చేయటంలేదు. అందువల్ల సగటు పాఠకుడి విజ్ఞానస్థాయి కన్నా సగటు రచయిత విజ్ఞాన స్థాయి తగ్గిపోవటం జరుగుతోంది. తోటి మనుషులతో అనుబంధాలు తగ్గిపోవటం వల్ల రచనలు నుడికారాలకు దూరం కావటం, సంభాషణలు కృత్రిమంగా

ఇంటర్వ్యూ కొప్పరపు

ఉండటం జరుగుతున్నది. ఇతర కథలకో, లేక సినిమా కథలకో అనుకరణలు గానో, అనుసరణలు గానో తయారైె కథలు జీవితం నుంచి దూరం కావడం వంటి కారణాలు కథల రాసి పెరిగినంతగా రాసిపెరగడానికి దారితీశాయి. ఉదాహరణకు కొన్ని పత్రికలు ప్రతి సంవత్సరమూ కథల పోటీ ఏర్పాటు చేసినా, బహుమతులుగా పెద్దమొత్తాలే ఇస్తున్నా, పోటీలు గెలుపొందిన కథలు దాదాపుగా పాఠకులకు జ్ఞప్తిలో ఉండకపోవటమే చెప్పుకోవచ్చు.

ప్ర:2. ఈ పరిణామం ఆధునిక యుగానికి అనివార్యమని రాజీపడాలా? లేక ఇదివరకటి కథా ప్రమాణాలను నిలబెట్టడానికి ప్రయత్నించాలా?

జ: రాజీపడటానికి వీలు కాని సమస్య ఇది. ఈ పరిస్థితిలో మార్పురావాలంటే కొన్ని కీలకమైన మార్పులు రావాలి. పెద్దెత్తున సాహిత్య సభలు, సన్మానాలు ఏర్పాటు చేయటం కన్నా, కొత్త రచయితల కోసం వర్క్‌షాప్స్‌ను నిర్వహించడం మంచిది. వారపత్రికలు జిల్లా స్థాయిలో కథల పోటీ ఏర్పాటు చేసి అక్కడ జనజీవితాన్ని ప్రతిబింబిచే కథలను ఆహ్వానిస్తే, ప్రజలకు ప్రాతినిధ్యం వహించే కొత్త కథకులు పుట్టుకురావటానికి, కథలు రాసే దృక్పథంతో మార్పు రావటానికి అవకాశం ఉంటుంది.

ప్ర:3. కొవగటిగంటి కమ్యూనిజం ప్రభావానికి లోను కాక ముందు కథలు నడిపిన తీరు భాష, శైలి, కమ్యూనిజం ప్రభావం పడ్డాక మారిందని కేతు విశ్వనాథరెడ్డి గారు నిరూపించారు. అలా మీరూ ఏదైనా ప్రత్యేక సిద్ధాంతం ప్రభావానికి ఎప్పుడైనా కావటం జరిగిందా?

జ: సాహిత్యకారుడిగా నాకు జీవితం ప్రమాణం సిద్ధాంతం కోసం జీవితాన్ని వక్రంగా చిత్రిస్తే ఆ రచన ఎలా ఉత్తమ రచన అనిపించుకొంటుందో నాకే మాత్రం అర్థం కాలేదు అన్నారు కుటుంబరావు గారు. మార్క్సిజం వల్ల ప్రభావితం కావడానికి ముందు, వెన్కాకూడ ఆయన సమాజ శ్రేయస్సుకే కథలు రాసి ఉంటారని నా నమ్మకం. బలవంతులైన వారు, బలహీనులైన వారిపైన ఆధిక్యత ప్రకటించడం, వారిని హింసించడం, దోపిడీ చేయటం అనేవాటి పట్ల సాహితీ స్రష్టలకు గల నిరసన మార్క్సిజంలోనే పుట్టింది కాదు. ఇది అదివరలోనే ఉంది. నేను ఆదినుండి కథ అనేది మనిషిలోని సంస్కారాన్ని పెంచటం ద్వారా అతనిలోని మంచి తనాన్ని పెంచాలి అన్న అవగాహనలో రాస్తున్నాను. ఇదే నా సిద్ధాంతం.

ప్ర:4. అభ్యుదయ వాదం అందరిసొత్తు. ప్రతిరచయిత తన కథలో ఒక కొత్త ఆదర్శం, పరిష్కారం చూపించాలని ప్రయత్నిస్తాడు. అభ్యుదయమంతా కమ్యూనిజమేనని కొందరి భావన. ఈ నేపథ్యంలో చూస్తే కొడవటిగంటి, చూసో, కరుణ కుమార్ లాంటి వాళ్లంతా కమ్యూనిస్టులన్న అభిప్రాయంతో విరసం, విశాలాంధ్ర వంటి సంస్థలు వాళ్లకు చాలా ప్రచారం చేశాయని అంటాను నేను? మీరు నాతో ఏకీభవిస్తారా?

జ: సాహిత్యం లక్ష్యం సమాజశ్రేయస్సే మానవాభ్యుదయాన్ని కోరి రచనలు చేసే వాళ్లందరూ మానవులందరికా చెందిన వాళ్లై ఉంటారు గాని ప్రత్యేకించి రచయితల సంఘాలకు చెందిన వాళ్లయి ఉండరు. అలా అనుకోవటం ఉట్టి భ్రమ. రాజుల్ మత్తుల్ వారి సేవ నరక ప్రాయంబు అన్న దూర్జటి మహాకవిని ఆనాటి వాళ్లు శైవుడని భావించి ఉండవచ్చు. కాని, ఇప్పుడలా ఎవ్వరూ అనుకోవటం లేదు. గాలి, నీరు, ఆకలి ఎట్లాగైతే ప్రజలందరి ఉమ్మడి సొత్తు. అట్లాగే మహాకవులు, రచయితలు కూడా.

ప్ర: 5: నా కథల్లో కొంత ఉపన్యాస ధోరణి కనిపిస్తే అది బహుశ నేను పల్లెటూరి ప్రశాంత జీవనానికి అలవాటు పడి, కొంచెం నింపాదిగా ఆలోచించడం వల్ల కావచ్చు. శిల్పాన్ని పూర్తి కాయడంలో శిల్పికి తొందరపాటు ఉండకూడదన్నది నా అభిప్రాయం. నగర జీవనంలోని వేగం నా కథల్లో కనిపించకపోవచ్చు. కాని, కొంచెం నిదానమైన చిత్తప్రవృత్తి కలిగిన పాఠకులకు నా కథలు ఇప్పుడూ, ఎప్పుడూ కూడా సంతృప్తిని కలిగించగలవనే నా నమ్మకం.

ప్ర: 6: ఆధునిక యుగ అవసరాలను దృష్టిలో పెట్టుకొని ముఖ్యంగా టీవీ వచ్చాక పత్రికల పాత్ర ఆలోచిస్తే బహుశ ఇక కథకు చివరి రోజులు దాదాపు వచ్చేసాయనిపిస్తుంది. భయం వేస్తుంది కూడా. కథ ఈ ఒడుదుడుకలను తట్టుకుంటుందంటారా?

టీవీ ప్రమాదం కొత్తగా మనదేశానికి, మన ప్రాంతానికి మాత్రమే ఏర్పడింది కాదు. ఇది సర్వప్రపంచానికీ సంబంధించిన విషయం. అయితే భావకుడి ఆంతరంగిక ప్రపంచానికి పుస్తకంగా టీవీ చేరువయ్యే అవకాశం లేదు. టీవీ వల్ల సినిమా వసూళ్లు తగ్గినట్టు వింటున్నాం. కాని పత్రికల సర్క్యులేషన్ తగ్గినట్టు వినడంలేదు.

ప్ర:7: నేటి పత్రికలు తమ ఉనికిని నిలబెట్టుకొంటు కథా విలువలు కాపాడాలంటే మీలాంటి వాళ్లు ధైర్యం చేసి, నడుం బిగించి ముందుకు వచ్చి స్వేచ్ఛగా మాట్లాడవలసి ఉంటుంది. అందుకు మీరు సిద్ధమేనా? మీరు ఏం చెప్పదల్చారు ఈ విషయంలో?

జ: కథ విలువల్ని కాపాడడానికి మంచి కథలు రాయటమొక్కటే కథకులకు చేతనైన ఉపాయం. అదృష్టవశాత్తు మంచి కథల్ని ప్రచురించే పత్రికలు ఇంకా ఉన్నాయి. మంచి కథలు రావడానికి చేయువలసిన పనులను కొన్నింటిని ఇదివరలోనే సూచించాను. మన సాహిత్య విమర్శకులు పాతపుస్తకాల బీరువా చుట్టూ తిరగడం మానేసి సమకాలీన సాహిత్యం గురించి పట్టించుకోవాలి. ప్రతి సంవత్సరమూ ఒక్కొక్క సాహిత్య ప్రక్రియలో వచ్చిన రచనలను సమీక్షిస్తూ వార్షి సాహిత్య సమీక్షలు ప్రకటించాలి. అపమార్గాన్ని నిర్మొహమాటంగా ఖండించాలి. రాష్ట్రస్థాయిలో ఓ సాహిత్య విలువల పరిరక్షక సంఘం ఏర్పడితే బాగుంటుంది. పెద్దలు ఇందుకు నడుం కట్టాలి. ఈ విషయంలో ఉదాసీనత మంచిది కాదు.

వచ్చే సంచికలో
'కళ'ల కబుర్ల
చలసాని ప్రసాదరావు
గెస్ట్ ఎడిటోరియల్
ఇంటర్వ్యూ

అతి త్వరలో

ప్రముఖ కవి, కథారచయిత

వంగపండు ప్రసాదరావు

కథ

గదిలోంచి బయటకు రాబోయి అప్పుడే గది లోకొస్తున్న ఫిజిక్సు లెక్చరరును ఢీ కొట్టేశాడు.

ఇంత రాద్ధాంతానికీ అసలు కారణ మైన మన నాయకులిద్దరూ జంటగా ఈలే సుకుంటూ వాళ్ల క్లాసు వైపెళ్లిపోయారు. ఈ వింతలేవీ పట్టించుకోకుండా.

మన నాయకులిద్దరు ఇలా కలిసి కట్టుగా కాలేజీలోకి అడుగు పెట్టడానికీ, కాలేజీలో జనాభా అంతా ఆశ్చర్యాంబుధిలో మునగడానికీ సంబంధం ఏమిటంటారా? ఇదిగో, ఇదీ కారణం....-

క్రితంరోజు వరకూ వాళ్లిద్దరూ బద్ధశత్రువులు. ఆ విషయం పరంధామన్ గారి దగ్గర్నుంచి కాలేజీ మైదానంలో జామచెట్టు మీదున్న పిల్లకాకి వరకు ఆబాలగోపాలానికంతా. తెలుసు. వీళ్లందరికీ రంగ నాథమూ, శేషగిరీ ప్రాణం ఇచ్చి పుచ్చుకునేంత స్నేహంగా ఉండేవాళ్లని కూడా తెలుసు. కానీ ఈ గోపాలానికి తెలియన దంతా ఏమిటంటే మన నాయకులిద్దరూ అలా అక స్మాత్తుగా కలిసపోవడానికి కారణం. వాళ్లిద్దరి కామన్ [illegible] కవిరాజు, [illegible] చెప్పిందాన్ని బట్టి తెలిసిందేమిటంటే రంగనాథను, శేష గిరీ, ఇద్దరు చిన్నప్పటి నుంచీ ప్రాణస్నే హితులు. కలిసి ఓనమాలు నేర్చుకున్నారు. జంటగా క్లాసులో మాష్టార్గనేడిపించి తర్వాత జాయింటుగా దెబ్బలు తిని ఏడిచేవాళ్లు. రంగనాథను దొంగతనంగా పక్కింటివాళ్ల మామిడి చెట్టెక్కి కాయలు కోస్తూంటే శేష గిరి గేటుదగ్గర కాపలా నిలబడే వాడు. ఒకే మాష్టారి దగ్గర ట్యూషన్ వెళ్లేవారు. శేషగిరి స్కూలు ఫైనలు ఫెయిలయితే, రంగనాథను తను పాసయినా కూడా కాలే జీలో చేరలేదు. శేషగిరి ఆ ఏడు సప్లి మెంటరీలో పాసయింతర్వాత ఆ మరుసటి సంవత్సరం ఇద్దరూ కలిసి కాలేజీలో చేరా రు. ఒకే కాలేజీ, సేమ్ ఆప్షనల్స్ సేమ్ సెక్షనూ అని వేరే చెప్పక్కర్లేద నుకుంటాను. అమ్మా యిల్ని కలిసికట్టుగా తమాషా చేసేవారు. దరి మిలా ప్రిన్సిపాలుదగ్గర జాయింటుగా వార్నిం గులందుకునేవారు. ఇద్దరూ కాస్త డబ్బున్న కుటుంబాల నుంచి వచ్చారు కనుక ఒకే మంచం ఒకే కంచం వాడలేదుగాని మిగతా పనులన్నీ దాదాపుగా కలిసే చేసేవారు. ఇలా గ వాళ్ల స్నేహం మూడు పూవులూ అయిదు కాయలు కాసేసి ఆరో కాయ పిందెలో ఉండగా వాళ్ల క్లాసులో ఓ కొత్త మ్మాయి చేరింది. ఆ అమ్మాయి నాన్నగారేమో సెంట్రలు గవ ర్నమెంట్‌లో ఉద్యోగం.. మరేమో సెంట్రలు గవర్నమెంటు వాళ్లు అలవాటు ప్రకారం పిల్లల చదువులు సంవత్సరం మధ్యలో

ఉండగా బదిలీ చేసిన పదివేలమంది నాన్నార్గలో ఈ కొత్తమ్మాయి నాన్నొకరు. దరిమిలా మన కథారంభం కాలం నాటికి ప్రియంవద బియస్సీ ఫైనలియర్‌లో వచ్చి చేరింది. కే.బి.సి (కనకారావు బ్రాడ్ కాస్టింగ్ కార్పొరేషను) వార్తలబట్టి తెలి సింది ఏమిటంటే ప్రియంవద కాలేజీలో చేరిన మొదటిరోజు సాయంకాలం నుండి కాలేజీ అటెండెన్సు దారుణంగా పెరిగిపో సాగిందట. ఇంటరు మొదటి సంవత్సరం కుర్రకారు నుంచి డిగ్రీకోర్సు ఫైనలియ ర్‌తో మూడు సంవత్సరాల నుంచి నిర్వి రామంగా కుస్తీ పడుతున్న అతిరథ మహా రథుల వరకు ప్రతి ఒక్క విద్యార్థీ ప్రియం వద క్లాసురూం బయట పచార్లు మొదలె ట్టారట. కే.బీ.సీ చెప్పడం ఏంటంటే ప్రియం వద ఆ ఊరికొచ్చిన మొదటి ఒక నెల లోనే ఆ ఊళ్లో పౌడరు డబ్బాలూ, దువ్వె నలూ, రేజరు బ్లేడ్లూ వగైరా ఎన్నడూ కనీ వినీ ఎరగనంత విరివిగా అమ్ముడుపోయా యనీ, అవన్నీ ఆ విధంగా అమ్ముడు పోయినందుకు ఆయా కంపెనీల సేల్సు రిప్రెసెంటేటివులకు తపీ తపీ తపీ మని కమీషనూ, ప్రమోషనూ వచ్చాయనీనూ. ఈ వార్తను ఎంతవరకు నమ్మవచ్చునో మీరే చెప్పాలి.

ఇంత గందరగోళానికీ కారణం మీరు ఊహించినట్టుగానే ప్రియంవద అందంగా ఉండడం, ఎంత అందంగా ఉంటుందో చెప్పడం నాలాంటి మామూలు కథలు రాసేవాళ్లకు చాతగానంత అందంగా ఉంటుంది. మరి చాతగాదని పూర్తిగా మానేస్తే ఎలాగ? అందుకని ఆ అమ్మాయి క్లాసుకు వచ్చిన మొదటిరోజు జరిగిన విష యాలు వర్ణిస్తే మీకు కొంచమైనా అయి డియా వస్తుంది. ఫస్టు పీరియడు. పది న్నర పదకొండయుంటుంది. మేడం కళా వతి గారు జువాలజీ బోధిస్తున్నారు. విద్యా ర్థులంతా చాలా అర్థంటుగా పాఠం పట్టిం చుకోవడం లేదు. కొంతమంది క్రితంరాత్రి మిస్సయిన నిద్ర మేకప్ చేసుకుంటు న్నారు. కనకారావు చివరి బెంచీలో ఒక్కడే కూర్చుని ఉన్నాడు. అతని మిత్రద్వయం అనగా మన నాయకద్వయం ఏదో సినిమా మార్నింగు షో చూడ్డానికి వెళ్లినట్టున్నారు. ఆ రోజు పాఠం టి.సి.ఏ సైకిలు. మనం గాఠ్ఠిగా గాలిపీలుస్తే (నెమ్మదిగా పీల్చినా ఫరవాలేదు) మనలోని ప్రతికణంలో ఉన్న "పవర్ స్టేషన్సు" లేక "మైటో కాండ్రియా"ల్లో జరిగే రసాయనిక క్రియ ప్రతిక్రియలన్నీ వరుసగా పుస్తకంలోంచి బోర్డు మీదికెక్కిస్తోంది కళావతిగారు. ఈ విడ గారి పద్ధతి ఎప్పుడూ ఇంతే. ఆమే రాసేది అంతా పుస్తకంలో ఎలాగా ఉంది కదా అని ఎక్కువగా పట్టించుకోరు జువాలజీ పుస్తకం ఉన్న విద్యార్థులు. పుస్తకంలేని విద్యార్థులు పుస్తకం ఉన్నవాళ్ళ దగ్గర నుంచి పరీక్షల ముందు అప్పు తీసుకుని చదువవచ్చులే. అని క్లాసులో తాపీగా ఊరి కనే కూర్చున్నారు. ఆ మాత్రానికి వాళ్లంతా క్లాసుకు రావడం ఎందుకంటారా? మంచి ప్రశ్న. నాక్కూడా అదే అనుమానమొచ్చి మొదటి బెంచీలో కూచున్న రాముడు మంచి బాలుడు గారిని అడిగాను. దీక్షగా బోర్డువైపు చూస్తున్న రా.మ.బా. గారికి నా ప్రశ్న వినగానే విసుగొచ్చి నట్టుంది. అందు కని కొంచెం ఘాటైన సమాధానం ఇచ్చారు." క్లాసుకు రాకపోతే మా నాన్నగారు సిగరె ట్టుకు డబ్బులివరండి రచయితగారూ. ఇక మీదట ఇలాంటి చొప్పదంటు ప్రశ్నల డక్కండి, మర్యాదగా ఉండదు" అని. ఈయనగారితో లాభం లేదని కనకారావు

నడిగాను అదె ప్రశ్న. ఎంతసేపయినా జవాబు రాకపోతే మళ్లీ అడిగాను అదే ప్రశ్న. తన తపస్సు భంగం చేసినందుకు కోపం వచ్చిందేమో, కస్సుమంటూ నావైపు తిరిగి "మీ కథను కూడా నా కవిత్వంలాగే ప్రతి పత్రికవాడూ తిరుగుటపాలో..." అని విశ్వామిత్రుల వారికి మళ్లె శపించబోయాడు. కాని నా అదృష్టం బావుందేమో, అంతలో తలుపు దగ్గర నుంచి పరంథామన్ గారి కంఠం ఖంగుమంది "మీ క్లాసునుదా ఈ విధంగా ఇంటరప్టు చేస్తా ఉండాను గదా అని ఏదీ అనుకోకండి గళావదిగారూ. ఈ క్లాసులోదా ఈ పొద్దు చేరిన ఒక కొత్త స్టూడెంట్ వాడిని దా పరిచయం చేస్తామని పట్టుకొని వచ్చినాను. దీనిని దాకొంచం కనిపెట్టుకొని ఉండండి. పాపం కొత్తవాడు కదా" అని. వరండాలో తలుపు చాటున నిలబడి ఉన్న ప్రియంవద వైపు తిరిగి "కమిన్, కమిన్ దిస్ విల్ బి యువర్ సెక్షన్. గుడ్‌లక్" అని చెప్పి వెళ్లిపోయాడు.

ఇంతవరకూ తలుపు చాటున నిలుచుని ఉన్న ప్రియంవద మొహమాటం కొద్దీ లోపలికడుగు పెట్టడానికి తడబడుతున్నట్టుందేమో క్లాసులో కూర్చున్న వాళ్లకు బయట నుంచుని ఉన్నది అమ్మాయో, అబ్బాయో కూడా తెలియడం లేదు. సెకండ్లు గడియళ్లా గడుస్తున్నాయి. చివరకు ఏమయితేనేం అని ఆ అమ్మాయి ధైర్యం చేసుకుని షో మోషన్ నాజూగ్గా, కొత్త పెళ్లికూతురు అత్తవారింట్లోకి మొదటిసారి ఎలా అడుగు పెడుతుందో అలా ప్రవేశించింది. అంతే ఆ రోజునుంచీ ఆ క్లాసులో ఉన్న వాళ్లందరి జీవితాలూ ఫర్ ఎవర్ మారిపోయాయి. అమ్మాయిలంతా అసూయతో, అబ్బాయిలంతా ఆశతో మలమలా మాడిపోవడం మొదలెట్టారు. అంత అందంగా ఉండే అమ్మాయిని చూసేప్పటికి కనకారావు మొదటి అయిదు నిమిషాలు ఆనందపడి తర్వాత పది నిమిషాలు మొదటి అయిదు నిమిషాల ఆనందం భరించలేక ఉక్కిరి బిక్కిరి పడి చివరికి ఎలాగో ప్రాణం తెచ్చుకుని ఈ శుభవార్త రంగనాథానికీ శేషగిరికీ చెప్పడానికి పరిగెట్టుకుని బైరాగి సినిమా హాలువైపు అర్జంటుగా వెళ్లిపోయాడు. ఆ రోజునుంచీ మేడం కళావతి గారు కట్టుకునే సీ. త్రూ. ఫారిన్ నైలెక్సు చీరలన్నా, ఆమె తొడుక్కునే వెరీ వెరీ లోనెక్ జాకెట్లన్నా ఆవిడ చెప్పే పాఠాలకంటే కూడా అవే పాప్యులర్ అయ్యాయని తరువాత ఎప్పుడో కనకారావు చెప్పాడు. ప్రియంవద అజంతా శిల్పం లాగుంటుందని కూడా కనకారావే చెప్పాడు. మరి కనకారావు అజంతా ఎప్పుడూ వెళ్లలేదు కదా అని మీరడగ

ఒకసారి వీరిలా అన్నారు

నా కోపం, తాపం, నా దుఃఖం, సంతోషం, నా సరదా, నా క్యూరియాసిటీ వగైరాలు ఇతరులకి తెలియచెయ్యటానికి కూడా నేను కథలు రాసేనుకుంటాను. నా మీద నా కుండే అసహ్యం కొద్దీ నేను [illegible]గా రచన చేశాను. లోకంలో మంచి, చెడ్డ అనేవి వుంటూ వస్తున్నాయి. వాటి మధ్య నిత్యం పోరాటం జరుగుతూనే వుంటుంది. ఈ విషయం అందరికీ తెల్సిన విషయమే. ప్రతి రచయిత కూడా [illegible] ఎన్నో కొన్ని [illegible] చేసి ఈ మంచి చెడ్డల [illegible] వస్తాడని, [illegible] నేను నమ్ముతున్నాను.

[illegible]


వచ్చు. కానీ అడగరు. ఎందుకంటే మీరు మంచివాళ్లుగనక. కథ మధ్యలో చచ్చు ప్రశ్నలగడగం మీకు చేతగాదు గనక (చివర్లో అడిగినా ఫరవాలేదు) కష్టపడి (పడకుండా కూడా) కథల్రాస్తే వాళ్లంటే మీకు సానుభూతి గనక. అసలు ఆ మాట కొస్తే నేను కూడా అజంతా వెళ్లానా పెట్టానా! అసలు అజంతాలో శిల్పాలున్నాయో లేదో కూడా నాకు ఘంటాపథంగా తెలీదు. ఏదో కనకారావు సెలవిచ్చాడు గదా అని నేను రాసేస్తున్నాను గానీ అసలు మీరు కూడా మీ మీ(కాబోయే) భార్యామణులను అవసరం కొద్దీ అప్పుడప్పుడు 'ఊర్వశీ' 'తిలోత్తమా' అని కిందివాటాలో వాళ్లు వినకుండా పిలుస్తూ -పిలచే) ఉంటారుకదా! మీరు మాత్రం ఊర్వశినీ తిలోత్తమనూ చూశారా ఏమన్నానా? వెధవ బడాయిలూ మీరునూ... అంచేత నేను చెప్పేదేమిటంటే, మహాశయులారా ప్రియంవదను అజంతా శిల్పంతో పోల్చడంలో కనకారావు ఏ అపచారమూ చేయలేదు. కావలిస్తే మీరే తిలకించండి ఆ అమ్మాయిని.

కరక్టుగా అయిదున్నరడుగుల పొడుగూ, ముప్పైయేళ్ళ క్రితం కాంచన లాంటి విగ్రహమూ బాపు బొమ్మల్లో లాంటి సన్నని పొడుగైన నాసికా, తీర్చిదిద్దినట్టుగా ఉండే సన్నటి కనుబొమ్మలూ, జీవితమంతా వాటిలోనే ఈదుతూ ఉండిపోవాలనిపించే సరోవరాల్లాంటి పెద్ద పెద్ద కళ్లూ! మామూలు సరోవరాల్లో అయితే ఉట్టి నీళ్లుంటాయి. కానీ ప్రియంవద నయనకొలనుల్లో మాత్రం మకరందమో ఏదో ఉందనిపిస్తుందట కనకారావుకు. అలా జీవితాంతమూ వాటిలో ఈదే ఉద్దేశంతో తండోపతండాలుగా వచ్చే జనాలని ఒద్దు, చాలా లోతు మునిగిపోతారు అని వారించే జపాను విసనకర్రల్లాంటిగంభీరమైన కనురెప్పలూ, దొండపండులాంటి ఎర్రని లేత పెదిమలూ, అమావాస్య చీకటికన్నా నల్లని తాచులాంటి నేలనంటే జడా... అసలా ఆ అమ్మాయి ఒక్కసారి మిమ్మల్ని చూసి ఓ చిరునవ్వు చిందించిదంటే చాలు. మీ జన్మ తరిస్తుంది. దాసోహం అనేస్తారు అలా నవ్వగానే వచ్చి దాసోహం అనే మీలాంటి వాళ్లను ఏం చేసుకోవాలో తెలీక కాబోలు ఆ అమ్మాయి ఎక్కువగా నవ్వదు. అలా నవ్వకపోవడానికి ప్రాబబుల్ కారణాలమీద చాలామంది ప్రియంవదారాధకులు అప్పుడే బోలెడు థీసీసులు రాసేసి డాక్టరేటు పట్టాలు పుచ్చేసుకున్నారట. అసలు కాలేజీలో చేరింతర్వాత ప్రియంవద రెండు మూడసార్లు మాత్రమే నవ్విందనీ, అలా నవ్వినప్పుడు బోల్డు ముత్యాలూ గట్రా రాలాయనీ కనకారావు చెప్తాడు. అలాకిందపడ్డ ముత్యాలూ అవీ అర్జంటుగా ఏరేసుకున్న తర్వాత టాటా, బిర్లా, వాల్మియాలు కోటీశ్వరుల్లాయరని వాళ్లంటే గిట్టని వాళ్లంటారట. ఈ మాట కూడా కనకారావే చెప్పాడు. టాటాలూ బిర్లాలూ ఆ సమయంలో ఈ ఊళ్లో ఏంచేస్తున్నారని మీకు అనుమానం వస్తే కనకారావునే అడగండి. యాభై ఏళ్లు పైబడ్డ ప్రిన్సిపాలు పరంథామన్ గారు కూడా మొదటిసారి ప్రియంవదను చూసినప్పుడు అనుకున్నారు తమ హేవిళంబి గారిని పెళ్లిచేసుకోవడంలో కాస్త తొందరపడ్డానేమో అని.

ప్రియంవదకు నడుము ఉందా లేదా అన్న సబ్జక్టుమీద సాయంకాలాలు కాఫీ హోటళ్లలో, వీధిచివర లైటు స్తంభాల కిందా ప్రతిసాయంకాలం అయిదింటి నుంచి అర్ధరాత్రి వరకూ జరిగే డిబేట్లలో అర్జున్ వాళ్ల వాదం ప్రకారం ఆ అమ్మాయికి అసలు

నడుమనేది లేదు అని. 'ఛ... ఛ... నడుం లేకపోవటం ఏమిటి, ఫిజికల్‌గా యింపాజిబుల్ ఉందికానీ చాలా అంటే చాలా కనపడనంత సన్నం' అని పైన్నుంచి (అప్పుడప్పుడూ) చదివేవాళ్ల వాదం. ఈ సంగతి అటూఇటూ తేల్చుకోలేని వాళ్లు మాత్రం ప్రతి ఉదయమూ సాయంత్రమూ "ప్రియం"ను ఇంటినుంచి కాలేజీకీ, కాలేజీనుంచి ఇంటికి ఎస్కార్టు చేసేవాళ్లు.... అలా వాళ్లు ఆరు నెలల నుంచి ప్రయత్నిస్తున్నా ఎటూ నిశ్చయించుకోలేక పోతున్నారంటే అది వాళ్ల తప్పు కాదనుకుంటాను.

ఇక అమ్మాయిల్ని హృదయపూర్వకంగా ప్రేమించడానికి అవసరమైన అర్హతలన్నీ మన నాయకులిద్దరికీ పుష్కలంగా ఉన్నాయి. ఆ మాటకొస్తే వీళ్ల హృదయాలంత విశాల హృదయాలు మీకెక్కడా- కనిపించవు (మీ అద్దంలో తప్పించి) వీళ్లిద్దరి హృదయాలు ఆధారంగా తీసుకునే గంధర్వులు పుష్పక విమానమూ, మన ఆర్.టి.సి వాళ్లు సిటీ బస్సుల డిజయిను చేశారని ఓ ఆలోచనా బడి కూడా ఉంది. ఇప్పటివరకూ చెరో వెయ్యి మంది అమ్మాయిలని ప్రేమించి ఉంటారు. ముళ్లపూడి గారు చెప్పినట్టు వీళ్లకు సందు సందుకూ, బస్సు బస్సుకూ ఫ్రాండ్‌బైలు ఉండేవాళ్లు. కనపడ్డ అమ్మాయి కాస్త కంటికి పసందుగా ఉంటే చాలు,



సిల్క్...నగల...స్మిత

ప్రపంచాన్ని తన సెక్స్ స్కాండల్స్‌తో ఉర్రూత లూగించిన 'పమెల్లా బోర్డస్' కథని సినిమాగా తియ్యాలని చాలా మంది నిర్మాతలు ఉబలాటపడు తున్నట్టు చెన్నపట్నం భోగట్టా. ఆ పాత్రకు 'సిల్క్‌స్మిత'ను ఎంపికచేస్తూ తమ సినిమా తీస్తున్నట్లు చిత్ర నిర్మాత చెల్లప్పన్ ప్రకటించారు కూడా. అయితే ఇందులో 'సిల్క్‌స్మిత' వంటిమీద బట్టలుండవుట (ఓ సీన్లోనే లెండి సుమా) అయితే నిప్పుంటాయిట అంటే వంటి నిండా నగలుంటాయట. ఆ నగల్ని చూడ్డానికి మనం ఆ సినిమాకి వెళ్లాలిట. బా-గానే ఉంది తెలుగు పమెల్లా!

-సూ.

మనసు పారేసుకునేవారు. అక్కర్లేదని ఆ అమ్మాయిలు తిరుగుటపాలో ఆ మనసు కాస్తా విసిరేసేవాళ్లు. ఈ ఇచ్చిపుచ్చుకోవడాల్లో ఆ మనసు పాపం అప్పుడప్పుడూ చేయి జారి కిందపడి ముక్కలు ముక్కలు అయ్యేది. అయినా నిరుత్సాహపడకుండా విసుగు చెందని విక్రమార్కుడిలాగ ఆ ముక్కల్నే మళ్లీ తలా ఓ ముక్కచొప్పున పంచి పెట్టేవాళ్లు. ఇలాగ సర్వ మానినీ సమానత్వమే (అంటే అందరమ్మాయిల్నీ జాతిమత భేదాల్లేకుండా ప్రేమించడమన్న మాట) జీవిత ధ్యేయంగా పెట్టుకుని రంగేళీరాజాల్లాగా జీవితాలు గడిపేస్తున్న మన నాయకద్వయానికి ప్రియంవదను చూడగానే మన తెలుగు (లేక హిందీ) సినిమా మల్లే మొదటి చూపులోనే మతిపోయింది. అందమైన ఆడదాన్ని చూడగానే విశ్వామిత్రుడే నత్తడం మొదలెట్టాడట... వీళ్లిద్దరూ ఎంత? క్షణం ఆలస్యం లేకుండా ఆ రోజు వరకూ ఎడాపెడా, అరువిచ్చిన హృదయముక్కలన్నీ తపీమని వెనక్కి తెచ్చుకుని 'క్విక్‌ఫిక్సు'తో అతికించి, అతుకులు కనపడకుండా వీళ్ల పణాలతో అలంకరించి ప్రియంవద పాద పద్మాలకు సమర్పించడానికి సిద్ధమయ్యారు.

కథ ఇంతవరకూ బాగానే ఉంది ఇక్కడే కాస్త మలుపు తిరుగుతుంది. పరి

స్థితులు ఈ మజిలీ కొచ్చేటప్పటికి కనకారావు పక్క ఊళ్లో జరుగుతున్న 'కాబోవు కవుల సమాఖ్య' వార్షిక సమావేశానికి పన్నెండోసారి ప్రెసిడెంటుగా ఆహ్వానించబడితే వెళ్లడం వల్ల మన నాయకులిద్దరి మధ్య జరిగిన విషయాలు మనకు సరిగ్గా తెలియదు. వారం రోజుల తర్వాత తను తిరిగి వచ్చేటప్పటికి ప్రాణమిత్రులు కాస్తా ప్రాణశత్రువులుగా మారిపోయారు. వీళ్లిద్దరినీ సమాధాన పరచడానికి కనకారావు పడ్డ కష్టాలు మన సమిష్టికుటుంబాల్లో కోడళ్లు కూడా ఎరుగరు. అవన్నీ ఒకవేళ వివరిస్తూ కూర్చుంటే ఈ పత్రిక సంపాదకులు గారు కత్రిరుచ్చుకుంటారేమో... ఇజ్రాయిలు వాడూ అరబ్బు వాడూ ఫట్టు కొట్టుకుని, తర్వాత అమెరికాలోనో ఆఫ్రికాలోనో రాజీపడి ఇంటికెళ్లి మళ్లీ కొట్టుకున్నట్టు మన హీరోలిద్దరూ కనకారావు చెప్పిన నీతి బోధలన్నీ విని ఊ కొట్టి తను పెట్టించిన టిఫిన్లూ కాఫీలూ స్వాహాచేసి ఇంటికెళ్లి మళ్లీ కలబడేవారు. వీళ్లగోల పడలేక ఇంటి ఓనరు ఓ ఉదయం వీళ్లిద్దర్నీ తరిమేస్తే, ప్రియంవద ఉండే వీథికి ఉత్తరం వీథిలో ఒకరూ, దక్షిణం వీథిలో ఒకరూ చెరో గది అద్దెకు తీసుకుని కోల్డ్ వార్ ప్రకటించేసుకున్నారు. కాలేజీ క్రికెట్ పోటీల్లో రంగనాథను బౌలింగు చేస్తున్నప్పుడు శేషగిరి అంపైరింగు తీసుకుని ఎల్.బి డబ్ల్యూ అనఫీషియల్‌గా రద్దు చేసేవాడు. వాళ్ల టీము బాటింగప్పుడు శేషగిరి వంతు సిక్స్ డౌనవుతే రంగనాథను అయిదు వికెట్లునే డిక్లేరు చేసేవాడు. వీళ్లిద్దరి మూలాన వాళ్ల కాలేజీ టీము ఆ ఏడు ఇంకా ఒక్క పోటీలో కూడా గెలవలేదు.

రోజులూ వారాలూ గడిచిపోతున్నాయి.

కనకారావు ఎంతగట్టిగా ప్రయత్నిస్తున్నా వీళ్లు రాజీకి రావడం లేదు.

అలా అర్థంటుగా గడిచిపోతున్న బోలెడు ఆదివారాల్లో ఆ రోజు ఒకటి. ఇంటి బయట కాంపౌండులో ఈజీ ఛెయిర్‌లో కూర్చుని కాఫీ సిప్ చేస్తూ కూర్చున్నాడు కనకారావు. చేతిలో ఆవేళ్టి పేపరుంది కానీ చదువుతున్న సూచనల్లేవు. గంటసేపైనా కూడా ఇంకా మొదటి పుటవైపే చూస్తున్నాడు. పేజీ తిరగడంలేదు. భృకుటి సీరియస్‌గా ముడుచుకుని ఉంది రామాయణం సినిమాల్లో రావణాసుడులాగ. తీక్షణంగా ఆలోచించేస్తున్నాడే కానీ ఒక్కటి కూడా అయిడియా మంచిది రావడంలేదు. ఒకటో ఆరో ఒకవేళ దారి తప్పి వచ్చినా నచ్చడంలేదు. పదికొట్టేస్తుంది. ఈ తతంగమంతా గమనిస్తున్న వాళ్లమ్మగారికి మాత్రం ఈ పద్ధతులేమీ నచ్చలేదు. చదువు సంగతి సరిగ్గా పట్టించుకోవడం లేదని ఆమె గారి బాధ. ఆరోజు ఇక ఏమాత్రం సహించలేక సణగడం మొదలెట్టింది. ఓ వైపు బియ్యం చేసుకుంటూ.

"ఏవిట్రా ఆ వెధవ చదవడం నువ్వనూ అదేమైనా క్లాసుపుస్తకమనుకున్నావా గంటకో పేజీ చదవడానికి ఆ సన్నాసులిద్దరి గురించి అస్తమానం ఆలోచిస్తూ ఉన్న బుర్రకాస్తా పాడు చేసుకుంటే ఎలా? ముందే మనతెలివి అంతంత మాత్రం. ఏమన్నా అవుతే పిచ్చాసుపత్రి చుట్టూ తిరగలేక నేను ఛావాలి... నా మాట విని మీ మామయ్యనడుగు ఏదైనా మంచి ఉపాయంచెప్తారేమో..."

"అన్నట్టు మర్చిపోయాను ఆ పేపరిలా తగలేయి, మార్నింగు షో ఏదైనా మంచిదుందేమో" అన్నారావిడ.

"ఏంటమ్మా నీగోల, ఆదివారం నాడు కూడా పేపరు చదవకుండా ఏవిటి ... ఇంకో కప్పు కాఫీ ఇవ్వు, నీ మాట వింటా... లేపోతే పేపరు సాంతం చదివేదాకా ఇక్కణ్ణుంచి కదల్నంతే." అని కాసేపాగి "ఒక్క కప్పు కాఫీ అయితే పేపరూ, రెండు కప్పుల కాఫీ ఇస్తే మామయ్యగారింటికి వెళ్లడమూ చేస్తా" నన్నాడు.

అంత ఘోరంగా బ్లాక్‌మెయిల్‌కు ఒడిగట్టిన సుపుత్రుడి మీద కాస్త కోపం వచ్చినా మార్నింగుషో మీది మమకారం వల్ల లొంగిపోక తప్పలేదు. గొణుక్కుంటూ మెల్లిగా వంటింటివేపు దారి తీసిందావిడ.

న్యూస్‌పేపర్ రెండో పేజీ తిరిగింది.

మర్నాడు మధ్యాహ్నం కళావతి గారి క్లాసు మధ్యలో శేషగిరికీ రంగనాథానికీ ఒకేసారి వాళ్ల నాన్నాగ దగ్గర్నించి టెలిగ్రాములొచ్చాయి అర్జంటుగా ఊరికి రమ్మనీ, రాకపోతే తమ తమ ఆస్తిపాస్తులన్నీ ఇథియోపియో దేశానికి ధారాదత్తం చేస్తామనీనూ... చేసేది లేక ఇద్దరు ఆ సాయంత్రం రైలుకే వెళ్లిపోయారు క్వెశ్చన్ మార్కు మొహాలు పెట్టుకుని.

మంగళవారం ఉదయం తొమ్మిది గంటలకంతా కాలేజీ కాంపౌండులో చెట్టు కింద ఓ చిన్న ఆఫీసు పెట్టాడు కనకారావు. ఓ కుర్చీ, బల్లా బోర్డుతో సహా కాలేజీ క్రికెట్ టీం బెనిఫిట్ కోసం లాటరీ అని బోర్డు రాసివుంది. టిక్కెట్టు ధర రూపాయి. ఫస్టుప్రైజు వంద రూ. సెకండు ప్రైజు తొంభై తొమ్మిదీ, థర్డు ప్రైజు జీవితాంతం కాలేజీ క్రికెట్ టీమ్‌కి లాంగు వికెట్‌కీపరూ అని తెలిసేటప్పటికి జనం విరివిగా కొనేసారు టిక్కెట్టు, తలా రెండూ మూడూ చొప్పున. బుధవారం సాయంత్రానికంతా అయిదు వేలరూపాయలు జమ అయ్యాయి ప్రైజులు పోగా, కాలేజీ చరిత్రలోనే బెస్టు లాటరీ?

ఆ సాయంత్రం ఆ డబ్బు తీసికెళ్లి వాళ్ల మామయ్యకిచ్చాడు. అది తీసుకుని ఆయన కనకారావును మళ్లీ కనపడమని చెప్పి ఏదో పనిమీద తను ఢిల్లీ వెళ్లిపోయారు. తర్వాత రెండు రోజులూ ఎలా గడిచిపోయాయో కనకారావుకు గుర్తులేదు. శనివారం ఉదయం ఏడుగంటలపుడు తలుపు దబాదబా చప్పుడవుతోంటే తెరిచాడు ఎవరా అని... అయిదు వందల మీటర్ల హార్డిల్సు రేసు అపుడే పూర్తి చేసిన పీటీ ఉషా కన్నా విపరీతంగా ఆయాసంతో ఉక్కిరి బిక్కిరవుతూ గోడనానుకుని నీరసంగా గడపదగ్గర చతికిల పడున్న శేషగిరి కనపడ్డాడు. అయిదు నిమిషాలు వరకూ నోట్లోంచి మాట రాలేదు. కనకారావిచ్చిన గ్లాసుడు మంచినీళ్లు ఒక్క గుటకలో మింగేసి చివరకు ఎలాగో తేరుకుని "ప్రియంవదా వాళ్లు ఇల్లు ఖాళీచేసినట్టు మాకు చెప్పలేదెందుక"ని నిలదీశాడు. ఆశ్చర్యపోవడం ఈసారి కనకారావు వంతయింది.

"అదెలా.... ఎవరు చెప్పారు? నిజంగానే లేపోతే ఊరికే కోస్తున్నావా? ఏప్రిలు ఫూల్సు డే ఇంకా నెల రోజులుందని తెలుసా! "

"కొయ్యడంలేదురా కవిగారూ, నిజంగానే. నీ వందరూపాయలప్పు తీర్చినంతొట్టు. కావలిస్తే నీ కళ్లతోనే చూద్దుగాని పద" అంటూ బయటకు కదలబోతూంటే రయ్యిమంటూ తుఫానులాగ రంగనాథనొచ్చాడు. లోపలికి వగరుస్తూ కారణమేంటో చెప్పకుండానే అర్థమై పోయింది కనకారావుకు. తను గబగబా డ్రెస్ చేసుకున్న తర్వాత ముగ్గురు మస్కటీయర్సూ కలిసి బయలుదేరారు. ఈ మిస్టరీ అంతు తేల్చడానికి. ప్రియంవదా వాళ్ల పక్కింటి వాళ్లను, ఎదురింటి వాళ్లను చివరికి వాళ్లింటి ముందర ఫుట్‌పాత్ మీద కూర్చునే బిక్షగాడినీ, పోస్టు బంట్రోతునీ అందర్నీ వేధించి రెండు గంటల తర్వాత తెలుసుకున్నదిది. ఆ గురువారం సాయంత్రం కేంద్రప్రభుత్వం వాళ్ల దగ్గర్నుంచి ప్రియంవద నాన్నగారికి టెలిగ్రాం వచ్చిందట... ఆంధ్రప్రదేశ్‌లో అంత త్వరలో తన కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేసినందుకు సంతోషిస్తూ తాము ఆయన గారిని ఢిల్లీకి బదిలీ చేస్తున్నట్టూ, సోమవారం నాటికంతా వచ్చి డ్యూటీలో చేరకపోతే నికోబారుకు ద్వీపాంతరం పంపిచేస్తామనీనూ. శుక్రవారం సాయంత్రం షనో ఢిల్లీ వెళ్లిపోయారట ప్రియంవద వాళ్లు.

"అన్నట్టు మీ ఇద్దరికోసం ప్రియంవద ఇది వదిలి వెళ్లిందండీ" అంటూ పక్కింటాయన ఓ పార్సిలందించాడు రంగనాథం, శేషగిరిలకు.

ఏవిటా అని విప్పి చూస్తే అందులో ఇంకో రెండు చిన్న ప్యాకెట్లున్నాయి. అవి ఆర్నెల్లక్రితం ప్రియంవద పాదపద్మాలకు తమర్పించుకున్న బహుమతులు. ప్రేమ భరిత హృదయాలు. పాపం ఎవరూ తెరిచి చూసిన సూచనలు కూడాలేవు. ఆ ప్యాకెట్ల మీద. నెమ్మదిగా మొహం మొహం చూసుకున్నారు మిత్రులిద్దరూ.

కాస్త అవమానం, కుంచెం ఏబ్బెట్టూ కొంత సిగ్గూ చివరగా పశ్చాత్తాపంతో కూడిన భావాలు ఇద్దరి కళ్లలో ఒకేసారిగా మెదిలాయి. ఇద్దరూ హ్యాండ్‌షేక్ చేసుకుంటోంటే కనకారావు తన శకుని మామగారిని మనసులోనే జోహార్లందించుకుని.

బైరాగీ థియేటర్లో కొత్త మార్నింగు షో ఆడుతుంది. బోల్డుమంది అమ్మాయిలొస్తారు, త్వరగా పదండి ఆ హృదయప్యాకెట్లు పట్టుకుని, ఒకవేళ పనికొస్తాయేమో అన్నాడు.

ఆ తర్వాత వాళ్ల కాలేజీ క్రికెట్ టీము ఒక్క మ్యాచ్ కూడా ఆ ఏడు ఓడిపోలేదని పాఠకులకు వేరేచెప్పనవసరం లేదనుకుంటాను.

(అంకితం: గత పాతికేళ్ళుగా నా అభిమాన రచయిత ముళ్ళపూడి వెంకటరమణ గారికి)

మళ్లీ అరంగేట్రం......

బాలచందర్ నిర్మించిన అరంగేట్రంకు ప్రమీల రుణపడి ఉంటుంది. ఎందుకంటే ఈ సినిమా తరువాత ఆమెకు సుమారు 250 చిత్రాలలో ఆమెకు అవకాశం లభించింది. ఆ తర్వాత ప్రమీల సిన్మారంగంలో వెనుకబడింది.

అయితే ప్రస్తుతం ప్రమీల 'అధ్యర ట్రక్కా ముంబు' అనే సినిమాని పాత్ర తన నిజజీవితానికి అద్దంపట్టేదిలా ఉందని ఆమె అంటోంది. ఈ చిత్రంలోని ప్రతి సంఘటనా, మాటా తన జీవితంలో ఓ ఎప్పుడో ఓ చోట జరిగినట్టుగా అనిపిస్తుందని, ఇందులో మాటలు వింటే తనకు పాతజ్ఞాపకాలు వస్తున్నాయని, కావున ఈ సినిమా తనకు ఉజ్వల భవిష్యత్తును అందిస్తుందని ప్రమీల ఆశాభావాన్ని వ్యక్తంచేస్తోంది.

-సూరి.

చాంపేయమాల



సీరియల్

28

వీరు నోరు తెరిచి పిక్చర్‌లో చేస్తానూ అంటే ఒద్దు పొమ్మంటాడా, అవ్వ, అవ్వ... ఎంత పొగరు.


"శాంతప్పా!" వాహిని ముఖం చిట్లించింది. "నేను నీకు ఈ విషయం చెప్పింది నోరంతా తెరిచి అందరికీ చాటమని కాదు. సుధాంశ 'సాధన' రిలీజ్ అయ్యేలోగా సాధనను మించిన పాత్ర నాది రావాలి. ఆ ఛాన్స్ వుందా. ఆలోచించు."

"ఓ. బ్రహ్మాండంగా వుందమ్మా! మీకు నేను శివాజీ ప్రొడక్షన్సు మన చుట్టూ రోజూ తిరిగి పోతున్నారని చాలాసార్లు చెప్పాను."

"శివాజీ ప్రొడక్షన్స్.. అంటే ఆ కొత్త వాళ్లేనా?"

"కొత్త వాళ్లయితే ఏమ్మా, అసలు కొత్త వాడయితేనే పవర్స్‌లో మనం పైచెయ్యిగా వుంటాం. కథలోనూ, యాక్టర్స్ సెలక్షన్‌లోనూ మనం చెప్పింది వింటాడు."

"నువ్వు చెప్పిందీ నిజమే. కానీ కొత్త వాడు కదా, పిక్చర్ పూర్తి చేస్తాడా లేక మధ్యలో చేతులు ఎత్తేస్తాడా అని..."



కె. ఉషారాణి

"ఆ భయం మీరు హీరోయిన్‌గా వుండగా ఏ ప్రొడ్యూసరుకూ వుండదు హీరోయినమ్మా! మీరు వూ అనాలే కానీ.. ఒక్క స్టేట్‌మెంట్‌తో డిస్ట్రిబ్యూటర్లు క్యూలో నిలబడరూ!"

"వూ."

"ఐతే ఇకనేం, ఇప్పుడే వాళ్లని రమ్మని చెప్తాను."

"ఫోన్ చెయ్యకు. స్వయంగా నువ్వే వెళ్లి మాట్లాడు. స్టోరీ హీరోయిన్ ఓరియంటెడ్ కావాలి, పిక్చర్ వీలైనంత తొందర్లో అయిపోవాలి."

"అన్నింటికీ వాళ్లని ఒప్పించే పూచి నాదీ. మీరు నిశ్చింతగా వుండండి."

శాంతప్ప కారా కిళ్లీ బుగ్గన దట్టించి హడావుడిగా వెళ్లిపోయాడు.

వాహినికి మొన్న రాత్రి నుంచే మొదలయిన ఆవేదన అప్పుడు కాస్త తగ్గుముఖంపట్టింది.

"సాధన.. ఆఫ్ట్రాల్ ఓ కొత్తనటి, అదీ ఇన్నాళ్లుగా తన ప్రక్కన పళ్లెం పట్టుకుని నిలబడ్డ వ్యక్తి.. తనకు పోటీయా! చూస్తాను."

వాహిని ఫోన్ దగ్గరకు లాక్కుంది.

"హలో లావణ్యా పిక్చర్స్! నేను వాహినిని మాట్లాడుతున్నాను."

"నమస్కారమమ్మా! ఏమిటి చెప్పండి."

"నిన్న నా ప్రక్కన ఫ్రండ్ క్యారక్టర్‌కు ఇంకా ఎవ్వరూ ఫిక్స్ కాలేదన్నారుగా.. ఆ పాత్రకి సాధనని బుక్ చెయ్యండి."

"సాధన.. అంటే ఎక్స్‌ట్రా సునీతేనా?"


"ప్రొడ్యూసరు గారూ! ఆమె ఎక్స్‌ట్రా సునీత అన్న మాట మరిచిపోవాలి మీరు. ప్రస్తుతం ఆమె సాధన, డిస్కవరీ ఆఫ్ సుధాంశ."

"అలాగేనమ్మా! మాట్లాడి సెటిల్ చేస్తాను."

"అంత కష్టమేమీ కాదు, ఎందుకంటే సుదాంశ పిక్చర్ తప్ప ఆమెకింకే ఆఫర్లూ లేవు."

"అలాగేనమ్మా!" ప్రొడ్యూసరు అంగీకారం విని గర్వంగా నవ్వుకుంది.

సాధన ఒప్పుకుంటుంది. అవకాశాల కోసం ఎదురు చూసీ చూసీ అలసిన వ్యక్తులు ఏ చిన్న పోటి ఆసరా కనిపించినా ఒదులుకోరు. తను మెయిన్ హీరోయిన్‌గా వున్న చిత్రంలో సాధన ఓ ఐదు నిముషాల పాటు వుండటం.. రానున్న సుధాంశ సాధనగా ఆమెకంత మంచి పేరు రాదు ఈ పాత్ర ముందు ప్రేక్షకు





లకి పరిచయం కావడంతో. అదీ తనకు ప్లస్ పాయింట్. డెఫినెట్‌గా లావణ్యా వారి చిత్రం ముందుగా విడుదలవుతుంది. సాధనకు ప్రేక్షకుల్లో నుంచి ఏ విధమైన రెస్పాన్సూ రాదు.

వాహిని ఎంత గర్వపడిపోతున్నా అంతరాంతరాలలో ఏదో... కొరత.

'నువ్వు పోటీ పడుతున్నదెవరితో వాహినీ! సుధాంశతోనేనా? ఎందుకింత దిగజారి పోయావు?'

నిలదీసి మరీ అడుగుతోంది మనసు.

'నేను సుధాంశతో పోటీ పడ్డంలేదు. నా కెరీర నాశనంకాకుండా జాగ్రత్త పడుతున్నానంతే!'

తనకు తానుగా నచ్చజెప్పుకోలేక నలిగిపోతూంది వాహిని.

'ఆత్మ వంచన వాహినీ! ఆత్మ వంచన.' లోలోపల గొంతుక చించుకు అరుస్తోంది అంతరాత్మ.

వాహిని భరించలేని దానిలా ఫోన్ దగ్గరకు లాక్కుంది.

"హలో. సుధాంశ వున్నాడా?"

"లేరు మేడమ్! స్టూడియోలో వున్నారు."

"వూ."

స్టూడియోకు ఫోన్ చేసింది.

"హలో, సుదాంశ కావాలి."

"వెయిటె మినిట్ మేడమ్! పిలుస్తాను."

"హలో! సుధాంశా హియర్."

"నేను సుధావాహిని" మెత్తగా అంది. "సుధా! ప్లీజ్, మళ్లీ అడుగుతున్నాను. నన్ను సాధన పాత్ర వెయ్యనివ్వు."

"నిన్న రాత్రి చెప్పానుగా వాణీ!" సుధాంశ సౌమ్యంగానే అంటున్నా అతడి స్వరంలో స్థిరత్వం తొణుకుతోంది.

"ఆలోచించు. నన్ను కాదని తొందర పడుతున్నావేమో! కొన్ని ఏళ్లుగా మన మధ్య పెనవేసుకున్న స్నేహానుబంధం.."

"ఈ కారణంగా తెగిపోతుందేమోనని భయమా?" తేలిగ్గా నవ్వాడు. "అంత తేలిగ్గా మనం దూరమైపోములే వాణీ!"

"సుధా! ప్లీజ్."

"సారీ. వాణీ, నాకు చాలా పనుంది. సారీ, ఫర్ డిసప్పాయింటింగ్.."

సుధాంశ ఫోన్ పెట్టేశాడు. వాహిని నిట్టూర్చింది. 'లాభం లేదు, అతడు మాట వినడు.' కోపం, బాధా.. కలబోసుకుని కదలాడుతున్న మనసు మండిపోతూంది.

'ఇంకో ఐదేళ్లదాకా తనకి ఢోకా లేదనుకుంటే.. తనకి పోటీని సుధాంశే రంగంలోకి ప్రవేశపెడతాడా.. హౌ డేర్ హి వాజ్..'

వాహిని విసురుగా నెంబరు డయల్

చెయ్యసాగింది మళ్లీ.

"హలో, ప్లీజ్ కనెక్ట్ టు మిష్టర్ సుధాంశ!" అతడు లైన్లోకి రాగానే అతడ్ని మాట్లాడే అవకాశమివ్వకుండా తనే త్వర గా అంది.

"సుధా! నా రిక్వెస్ట్ కాదనకు. నన్ను కాదని నువ్వు ఎదుర్కోబోయే సమస్యలు ఒక్కసారి ఆలోచించుకో!"

వాహిని కంఠంలో ఎంత ప్రయత్నించినా అభ్యర్ధనే తప్ప బెదిరింపు ధ్వనించడం లేదు.

"నేను ఎప్పుడూ ఒకే మాట చెబుతాను. పదే, పదే మాటలు మార్చను."

"అంటే.."

"ఐయామ్ రియల్లీ సారీ..."

వాహిని టక్కున రిసీవర్ పెట్టేసింది. సరిగ్గా అప్పుడే.. ఏవాజీ ప్రొడక్షన్స్ నిర్మాతల కారుతో కాంపౌండ్‌లోకి వచ్చాడు శాంతప్ప.

29

శోభనం సెట్.

మతి పోయేంతటి రంగుల మయంగా వుంది సెట్టింగ్.

పువ్వులు, పువ్వులు, పువ్వులు- ఎక్కడ చూచినా పువ్వులే! దేవేంద్రుడి నందన వనం మొత్తం ఫ్లోర్‌లో సెట్ రూపాన వెలిసిందా అన్నట్టుగా విరగబూసిన పువ్వులు విరగబడి నవ్వుతున్నాయి:

మల్లెలు, సన్నజాజులు, గులాబులు, కనకాంబరాలు.. అందమైన డిజైన్లలో గదంతా వ్రేలాడుతున్న పువ్వుల సరాలు, మధ్యగా మంచం.. వూహు, దాన్ని మంచం అనకూడదు పువ్వుల పాన్పు అనాలి.

చెరకు విండి వెలుపు చిత్రంలోని నాయికా నాయకులకోసం పరచిన పారిజాత సుమ దళాల పానుపు.

అది ఓ అద్భుత నవలోకం.

అది వెలసింది ఓ చిత్రంలోని సన్నివేశం కోసం.

వాహిని ఫుల్ మోకప్‌తో సెట్స్ మీదకు వచ్చింది.

ఆమె రూపం సమ్మోహనం. అచ్చు శోభనం రాత్రి పెళ్లి కూతుర్లా.. అలా చూడగానే ఇలా కోర్కెలు ఝుమ్మంటూ గుండెలో రాగాలుతీసేలా..

వాసినిని చూసి నోళ్లు వెళ్లబెట్టారు షూటింగ్ చూస్తున్న విజిటర్స్. సెట్స్‌లో పల షూటింగ్ జరిగేటపుడు స్టూడియోలోకి విజిటర్స్‌ని అలవ్ చెయ్యరు. పర్మిషన్ వున్న వాళ్లూ, పత్రికల వాళ్లూ తప్ప సాధారణ వ్యక్తులు షూటింగ్ చూడ్డం వీలు పడదు. నిర్మాత గారి బంధువులు, దర్శకుల బంధువుల బంధువులు, కెమెరామన్ ఇంటికొచ్చిన చుట్టాలు, ప్రొడక్షన్ మేనేజర్ స్నేహితుల ఫ్యామిలీలు.. ఇలాంటి వాళ్లే వస్తూ వుంటారు.

వాహిని అలా ఇలలో విరిసిన ఇంద్రధనుస్సులా మెరిసిపోతూ వుంటే ఆమె అందం చూస్తున్న మగాళ్లకి మతులుపోతున్నాయి. ఇక ఆడ వాళ్లకైతే.. తమ రూపాలమీద తమకే రోత పుడుతోంది.

వాహిని మెల్లిగా నడుస్తూ వచ్చి తన స్వంత కుర్చీలో కూర్చుంది.

"నమస్కారమమ్మా!"

"ఎవరూ, స్వామినాథం గారా!" స్వామినాథం సుధాంశ దగ్గరి టెక్నిషియన్స్‌లో ఒకడు. "ఎంత వరకూ వచ్చిందండీ మీ పిక్చరు?"

"ఏం రావడమో ఏమోనమ్మా!" స్వామినాథం వాహిని పాదాల దగ్గరే నేలమీద చతికిలబడ్డాడు. "నాకైతే ఏమీ అర్థంకావడంలేదు. పిక్చర్‌లో డైలాగ్ రైటర్‌కూ, మేకప్ మాన్‌కూ, కాస్ట్యూమ్స్ డిజైనర్‌కూ.. ఎవ్వరికీ పని లేదు చేతినిండా. కెమెరామన్, డైరక్టరూ వుంటే చాలు పనైపోతూ వుంది. సినిమా తీస్తున్న వాలకం చూస్తోంటే తనకు తాను సత్యజిత్ రాయో, శ్యాం బెనగలో.. అనుకుంటున్నట్టుగా వుంది మా డైరక్టరు. తీరా పూర్తయ్యేదాకా అది మూకీ అవుతుందో, టాకీ అవుతుందో తెలియదు. అక్కడో డైలాగూ, అక్కడో డైలాగూ వుండి వుండీ వినిపిస్తుంది.

పిక్చర్ మొత్తానికి ఒక టేపాట. ఇక హీరోయిన్ అయితే. కళ్లెత్తి చూడ్డమూ, పెదవి విరిచి నవ్వడమూ తప్ప నోరు విప్పి ఎప్పుడోగానీ మాటాలాడదు. మామూలు బుర్రలున్న వాళ్లు ఈ సినిమాను అర్థం చేసుకోగలరంటే నాకు నమ్మకం లేదు."

హ్యాండ్ మిర్రర్‌లో పెదవులకూ, బుగ్గలకూ రంగు అద్దుకుంటున్న వాహిని కిలకిలా నవ్వింది.

"మరీ అంత గొప్పగా తీస్తున్నాడంటే అవార్డులన్నీ మీకేనేమో!"

"ఏం అవార్డులులే తల్లీ! అమ్ముకు తిందామన్నా అమ్ముడుబోవు. అన్నట్టు మీ పిక్చర్ 'వాహిని' చాలా కాస్ట్లీ పిక్చర్ అవుతూందంటున్నారు నిజమేనా?"

"ఏమో, ఆ విషయాలు నేను పట్టించుకోను. పోతే ఒకటి చెప్పగలను. ఇన్నాళ్లుగా మీరు చూసింది వాహినిలోని గ్లామర్ మాత్రమే! ఈ చిత్రంలో నేనూ మంచి నటిగా గుర్తింపబడతాననే నా నమ్మకం." వాహిని మాటల్లో వినయం వున్నా, చెప్పే తీరులో మాత్రం గర్వం తొణికిసలాడుతోంది.

యూత్ సర్వే -

గత సంచికలో ప్రకటించిన 'యూత్ సర్వే'ను ఈ సంచికలో అందించలేకపోతున్నాం. వచ్చేనెల సంచిక మీకు ఆకర్షణీయమైన 'బ్లోఅప్'తో పాటు సర్వే కూడా ఇస్తున్నామని తెలియజేస్తున్నాం-

-బిజినెస్ మానేజర్

పాఠకులకో గమనిక:

'జ్యోతి' సగౌరవంగా ప్రారంభించిన 'అత్యుత్తమ అవార్డు కథ'కు సంబంధించి ఒక పత్రికలో వచ్చిన కథను మళ్లీ ప్రచురించే బదులు, ఒక కొత్త కథను ప్రచురించవచ్చు కదా' అని చాలా మంది సాహితీ మిత్రులు, కోరిన కారణంవల్ల, మేమనుకున్న 'రెస్పాన్స్' మా పాఠక మిత్రుల దగ్గరనుంచి కూడా రాని కారణంవల్ల ఈ శీర్షికను నిలిపివేస్తున్నామని విచారంతో తెలియజేస్తున్నాం.

- ఎడిటర్.

వాహిని. స్వామినాధంతో నవ్వుతూ అంది.

"ఇప్పుడు తీస్తున్న సాంగ్ చూస్తారా! సెట్టింగ్, పాట చాలా బావుంటాయి."

వాహిని కెమెరా ముందుకు వెళ్లే సరికి మరింత రెట్టింపైన ఆమె అందం.

లేలేత సన్నజాజులు అంచులుగా పేర్చి, మల్లెల దుప్పటీ పరిచి, పారిజాతాల తలగడలమర్చి గులాబీ రేకులద్దినట్టుగా వుంది పందిరి మంచం.

వాహిని గది గుమ్మం దగ్గర నిలబడింది. మంచం కటువైపుగా నిలబడ్డ హీరో తరుణ్ గాజుల సవ్వడికి తలతిప్పిచూశాడు. అతడి వంక ఓరగా చూస్తూ.. మెల్లిగా అడుగు లోపలపెట్టింది వాహిని.

ఆమె మనసులోని భావాలన్నీ పాటగా కట్టి సమకూర్చిన రాగమాలిక గాయని నోటమ్మట పలుకుతోంది. గాయని కంఠంలో చమక్కులూ, గిమ్మిక్కులూ, అక్కడక్కడా మధురంగా వినిపించే డ్రమ్స్ బీట్స్..

కళ్లప్పగించి షూటింగ్ చేస్తున్నారు విజిటర్స్. వాహిని అందం చూస్తున్న వాళ్లకు విసుగురాలేదు. ఆ చోటు విడిచి పోవాలని లేదు.

ఇరవై నిముషాలపాటు చూసిన స్వామినాధం బయటపడ్డాడు.

'ఈ ఒక్క పాట చాలు, ఈ పిక్చర్ వంద రోజులు ఆడడానికి. ప్చ్, మా సిన్మాలోనూ శోభనం సీనుంది. ఎందుకు!'

గొణుక్కుంటూ గోడకానించిన సైకిల్ ఎక్కాడు.

30


"అమ్మగారూ!"

"ఎవరూ?" సాధన తొంగి చూసింది. ఆమె ఇంకా తన పాత ఇంట్లోనే వుంది. ఏమో, హీరోయిన్‌గా అవకాశం ఐతే వచ్చింది కానీ అదృష్టం ఎలా వుందో, ఆ స్థానంలో తను నిలబడగలదో లేదో. తన ఖర్మ ఇంకా తనని వెంటాడుతూ 'సాధన' ఫెయిలైతే.. మళ్లీ ఎక్స్‌ట్రా బ్రతుకు తప్పదు. హఠాత్తుగా ఎదురైన అందలాన్ని నమ్ముకుని ఎక్కి కుర్చుంటే. తీరా ఎక్కిన కాసేపటికే ఎత్తునుంచి జారిపడి నేలమీదకు చేరుకుంటే..

సాధన గుమ్మంలో నిలబడ్డ బలరాంను చూసి నవ్వింది.

"నువ్వా, ఏమిటి కొత్త పిలుపు మొదలు పెట్టావ్?"

"ఇప్పుడు నా పిలుపేకాదు నీ జాతకం మొత్తం మారుతోంది. త్వరగా బయల్దేరు."





"ఎక్కడికీ?"

"శివాజీ ప్రొడక్షన్ వాళ్లు తమ పిక్చర్‌లో నీకు సెకండ్ హీరోయిన్‌గా ఛాన్స్ ఇస్తున్నారు. అర్జంట్‌గా నిన్ను రమ్మన్నారు."

"శివాజీ పిక్చర్స్.. సెకండ్ హీరోయిన్. "సాధన కళ్లు పెద్దవి చేసింది. "నిజమా, బలరాం?"

"ఎవరి మీద ఒట్టెయ్య మంటావ్, త్వరగా రా!"

బలరాంవెంట వ్యానులో వెళ్తూంటే సాధనకదంతా కలలా వుంది. నిన్న లావణ్యాలో పది నిమిషాల పాత్ర, ఇవ్వాల శివాజీ ప్రొడక్షన్స్‌లో సెకండ్ హీరోయిన్. అదృష్టం మరీ ఇంతగా విరగ పండిపోతూందేమిటి తన జీవితంలో!

"హీరోయిన్ వాహిని. దాదాపు ఆమెతో ఈక్వల్‌గా వుండే క్యారెక్టర్. ప్రతి ఫ్రేములోనూ నువ్వు వుంటావు. పోతే వాంప్ టైప్ క్యారక్టర్."

"వాంపో, గీంపో.. ఒప్పేసుకో సాధనా! మళ్లీ ఈ అవకాశం రాదు." బలరాం చెవిలో గుసగుసలాడుతూంటే అంగీకరించినట్టుగా తలాడించింది.

డైరక్టర్ విజయేంద్ర, నిర్మాత ఇద్దరూ లోపలకెళ్లి పది నిముషాల్లో తిరిగివచ్చారు.

"ఇదిగో, పదిహేను వేలు అడ్వాన్స్, పిక్చర్ పూర్తయ్యాక మిగిలింది ఇస్తాం. మాకు పిక్చర్ తొందరగా ఫినిష్ చెయ్యాలనుంది. షూటింగ్ రేపట్నించే ప్రారంభం."

చేతుల్లో కదులుతున్న కరెన్సీ కట్టలు. సాధన వాటి బరువు మోయలేనిదానిలా ఫీలవుతోంది.

అగ్రిమెంటు ఫారాలమీద సంతకాలు చేసి ప్రొడక్షను ఆఫీసునుంచి బయట పడుతుంటే..

తను ఎవరో, ఎటు పోతూందో తనకే అర్ధంకాని అయోమయం ఒక్క క్షణం ఆవరించిందామెను.

మొన్న మొన్నటిదాకా రోజుకూలికోసం ఈ స్టూడియో చుట్టూ తిరిగింది. నెలకు ఆరు వందల వరకూ దక్కించేంత పని దొరికితే చాలని దేవుళ్లనూ, ప్రొడక్షను మానేజరునూ, ఎక్స్‌ట్రా సప్లయర్‌నూ బ్రతిమలాడుకుంది. అలాంటిది ఇప్పుడే వేలు.. అడ్వాన్స్ తీసుకునే స్థాయికి ఇంత హఠాత్తుగా ఎదిగిపోయింది!

ఎంత విలువలేని బ్రతుకును ఎంత వింత మలుపు వైపు తిప్పాడు భగవంతుడు'

(మిగతా వచ్చే సంచికలో)



కొండని కదిలిస్తే గీతంతా కదుల్తుంది

అని యథాలాపంగా రాశాను మే 89 భీమఖండం శీర్షికలో కాశీగారు అడిగారు ఏమిటి దీని అర్థం సందర్భం అని. టెలిఫోను తీగని లాగుతూ ధర్మారావు గారు డొంక తిరుగుడెందుకు లెద్దురూ భీమారావు గారికి వర్డ్ ప్లే ఉంటే ఇష్టం. ఏదో సరదాకి వాడి ఉంటారు అన్నారు. కాశీగారు పట్టుబట్టారు. చెబుతాలెండి కాస్తాగండి అన్నా.

భీమ ఖండం

సాంఘిక వైరుధ్యాలమీద వక్ర భాష్యాలు కళ పేరుతో ఆడియన్సు మీద రుద్దడం సందర్భంలో ఈ తెరగమరగా డబుల్ రివర్స్ స్టేట్‌మెంట్ దొర్లింది. కొంతవరకు మాటాట అని ఒప్పుకోక తప్పదు. అయితే ఆడుకోటంలో మట్టుకు అర్థం ఉండదు టండీ. వినండి మరి. కొండల్లో వెండికొండలు, రాచకొండలూ, ధనికొండల్తో బాటు బెల్లంకొండలూ మునికుండలూ ఉంటాయి. రాజుల్లో రారాజు, నెలరాజులతో బాటుగా భట్రాజులూ, కందారాజులూ ఉన్నట్టే. (ఎప్పుడో ఇలాంటి మాటేదో రావిశాస్త్రి గారనే ఉన్నారు) గీతలు - నిలువు అడ్డం గీతలు, భగవద్గీతలూ, కల్లు గీతలూ, తల రాతలూ అని పలు విధంబులు. మనం భాష్యం చేసేటప్పుడు ఏ కొండ కదిలిస్తే ఏ గీతం కదుల్తుందో గమనించాలి. అసలు కొంత సంస్కృతంలో 'అచలం' అన్నారు. అంటే చలనం లేనిది, కదలనిది అనేక దా మరి. తెలుగువాళ్లు అచలాన్ని చలం చేశారు. వేంకటాచలాన్ని వెంకటచలం చేశి కొండొకచో చెలంగా మార్చి ముద్దుగా పిల్చుకున్నారు. అందుకే తెలుగువాళ్లు మొదటి జియాలజిస్టులు అన్నారు. జియాలజీ వాళ్లు కొండలెప్పుడూ ఇలాగే లేవనీ అని పెరుగుతూ వచ్చాయనీ చాలాకాలం నించీ అంటున్నారు కదా. ఇప్పుడు హిమాలయాలున్న చోట ఒకప్పుడు టెథిస్ అనే సముద్రం ఉండేది. అది అసలు మధ్యధరా సముద్రం. రెండు పెద్ద భూఖండాల మధ్యన ఉండేవి. మహాఖండాలు కదిలి ఒకటికొకటి దగ్గరైనప్పుడు మధ్యన్నలిగిన భూమి మడతలు పైకి లేస్తే మహా పర్వతాలయ్యాయి. అలాగే కొన్ని కొండలు కరిగి తరిగిపోయాయి. ఒంగిన వింధ్య అలాగే ఉండిపోలేదూ. అగ్ని పర్వతాలు లోపల ఉడికిపోతూ అప్పుడుడు లావా విరజిమ్ముతాయి. ఈ శతబ్ది మొదటిభాగంలో క్రకటోవా అనే సముద్రాంతర్గత అగ్ని పర్వతం ప్రజ్వరిల్లి అవిచల్లారేటప్పటికి ఒక సరికొత్త ద్వీపం సముద్ర మధ్యంలో ఏర్పడింది. భూగర్భ శాస్త్రరీత్యా కొండలు ప్రకృతిలో కదుల్తూనే ఉన్నాయి. అవి కదిలినప్పుడల్లా నైసర్గిక హద్దులూ, గీతలూ కదుల్తూనే ఉన్నాయి.

వాటంతటవి కదలం సరే 'ఎవరేనా కొండని కదిలించడం గురించి కదా మన భాష్యం అంటారా? సరేనండి అసలు మొదట్లో కదుల్తున్న కొండల్ని రెక్కలు తెగ్గొట్టి కదలకుండా చెయ్యలే ఇంద్రుడు. (మళ్లీ రివర్స్‌గేర్) స్వేచ్ఛగా ఎగిరేవాటిని గీతల్లోపల కదలకుండా చేశాడు. అప్పట్నుంచి కొండలకీ కొండల మీదుండే వాళ్లకీ కొండలాధారంగా బతికేవాళ్లకీ గీతలూ హద్దులూ పెరుగుతూ వచ్చాయి. అప్పుడప్పుడు కొండలు కదలించే ప్రయత్నాలు జరిగాయి. రావణాసురుడు వెండి కొండ ఒక్కచేతిమీద, తెస్తే మహాదేవుడు కాలరాచి తొక్కి అంతటి వాడి చేత దాసోహం అనిపించాడు. వ్యక్తిగతమైన తిరుగుబాటు అణచివెయ్యబడింది. దేవతలకీ రాక్షసులకీ మధ్య గీతలు నిలిచిపోయాయి. దరిమిలా హనుమంతుడు సంజీవి పర్వతం కదిలించి లక్ష్మణుడికి. ప్రాణం పోశాడు. రామపక్షం వాళ్లందరి తలరాతా బాగుంది. సీత లక్ష్మణ గీతని దాటడం కొండని కదిలించడానిక్కారణమైంది. గీతదాట్ల వారికి కొండంత అండలు అవసరం.

అసలు సిసలు తిరుగుబాటు విప్లవం

నందివాడ భీమారావు


ద్వాపరయుగంలో బాలకృష్ణుడి నాయకత్వంలో జరిగింది. ఇది ఎవరు కొండల స్వేచ్ఛని అపహరించాడో ఆ ఇంద్రుడిమీదే. ఇంద్రుడు కోపంలో రాళ్ల వర్షం కురిపించాడు. స్త్రీ బాలవృద్ధ గోగణాల మీద విచక్షణా రహితంగా (స్ట్రైక్ ఎక కార్డ్?) ఫెజలు తిరుగుబాటు చేస్తే పెబువుతారుకుంటారా? అప్పుడు గోవులకొండని కదిలించి అడ్డంబెట్టి తిరుగుమాటు విజయవంతం చేశాడు కృష్ణుడు. ఇంద్రుడే దిగొచ్చాడు. మనకి తెలిసినంతవరకూ ఇది నిలదొక్కుఉన్న మొదటి తిరుగుబాటు.

కృష్ణుడు పెరిగి పెద్దవాడై గీతలుపదేశించాడు. న్యాయం అనే గీతకి ఇరుపక్కలా ఉన్నవాళ్లకి పోరు ఆరంభమైనప్పుడు వ్యక్తుల విశిష్టతకంటే ధర్మ నిబద్ధతకి పెద్ద పీట వేశాడు. ఈ రోజుల్లో రాజుల కొండలు కదిలిపోయినా, ధనికొండలు విస్తరిస్తునే ఉన్నాయి. బెల్లం కొండ చుట్టూ చీమలు చేరినట్లు ధనికొండల చుట్టూ గీతకివతలి వాళ్లు కూడా వాళ్ల వాళ్ల స్వప్రయోజనాల కోసం ప్రదక్షిణాలు చేస్తూనే ఉంటారు. అయితే కొండలాధారంగా తిరుగుబాట్లు స్పార్టకస్ నుంచి సీతా రామరాజు దాకా ఆ తరవాత కూడాసాగుతానే ఉన్నాయి. మనుష్యుల మధ్యగీతలు అటుదిటు చెయ్యడానికి పరిధి విస్తృతమో సంకుచితమో చెయ్యడానికి ప్రయత్నాలు నిర్విరామంగా సాగుతున్నాయి. గీత కదిలే లోపల ఉన్నవాడి భద్రత దెబ్బ తింటుందని భయం. అలాగే ఉంటే అటుపక్క వాళ్లు ఆలోలక్ష్మణా అంటూ ఉండాల్సిందే. ప్లానర్లూ ఎకానమిస్టులూ ఈ గీతని ఎక్సి స్మీదిక మార్చి పోవర్టీలైన్ అని పేరు పెట్టారు. గీత కిందవాళ్లని బలవంతానైనా గీతమీదకి పంపే ప్రయత్నాలు జరుగుతున్నాయి. కొండంత ప్రయత్నాలు చేసి కొండల్ని తవ్వి ఈ గీతల్ని కదిలించాలి. మధ్య మధ్యన ఎలుకలు కొట్టేస్తుంటాయ్.

మావో మహాశయుడు చైనా పాతకథ ఒకటి చెప్పాడు. పర్వతాలను తొలగించిన తెలివిమాలిన వృద్ధుడు అని ఒక వృద్ధుణ్ణి ఉత్తర పర్వతానికి చెందిన పనికిమాలిన వృద్ధుడు అనేవారు. అతని ఇంటి ముఖద్వారానికి అడ్డుగా రెండు పెద్ద పర్వత శిఖరాలుండేవి. కొడుకులతో కలిసి అతను పలుగుపారల్తో ఆ కొండలు తవ్వడం మొదలెట్టాడు. దారినపోయే దానయ్య ఒకడు ఇదేం తెలివి తక్కువ అంత పెద్ద కొండల్ని ఇంత కొద్దిమంది తవ్వడం అసాధ్యం అన్నాడు. దానికి తెలివిమాలిన వృద్ధుడు నేను పోతే నా కొడుకులు, వాళ్లు చనిపోతే నా మనుమలు, వాళ్ల తరవాత వాళ్లబిడ్డలు ఇలా తవ్వుతూ ఉంటాం. పర్వతాలు ఎంత ఎత్తయినా మేం తవ్వినంత మేరకు వాటి ఎత్తు తగ్గుతూ ఉంటుంది. అంచేత ఎప్పటికో అప్పటికి వీటిని తొలగించడం అసాధ్యం కాదు అన్నాడు. తరువాత నిర్ణయం మార్చుకోకుండా రోజూ తవ్వడం కొనసాగించాడు. దేవుడికి కరుణ కలిగి ఇద్దరు దూతల్ని పంపాడు. వీళ్లు ఆ కొండల్ని కదిలించి ఎత్తుకుపోయారు. వృద్ధుడి ఇంటి ముఖద్వారానికి అడ్డు తొలగి దారి గీతలు కదిలాయి. మావో సామ్రాజ్యవాదం భూస్వామ్యవాదం రెండు కొండలనీ వాటిని తొలగించే దూతలు చైనా ప్రజలనీ ముగిస్తాడు కథ.

కొండలు కదిల్తేనే గీతలు కోరదగిన రీతిలో కదిలేది.

జాలి



రావులపల్లి సునీత కథ

ఇల్లంతా గందరగోళంగా వుంది. ఉదయం ఏడు గంటలు కావస్తున్నా ఎక్కడ పని అక్కడే వున్నట్టుంది సునందకి. ఆ యింట్లో పనిమనిషి మానేసి అప్పటికి పది రోజులు. నెల తిరిగేసరికి చేతుల నిండా రూపాయిలు పోస్తున్నా నెలా-రెణ్ణెళ్లు చేసి జీతం పెంచమని పని మానేసే పని వాళ్ళ మీద మహా ఒళ్ళుమంట ఆమెకి.

ఆరుగంటలకే లేచి, పిల్లల్ని, ఆడపడుచునీ లేపి వంటింట్లో జొరబడింది. అన్నగారింట్లో వుండి, కాలేజీలో చదువుకొంటున్న ఆడపడుచు స్వర్ణ అంట్లగిన్నెలు కడిగి వదినగారికి అందించి, పిల్లల్ని స్కూలుకి తయారుచేయడంలో సహాయపడుతోంది.

“సునందా! నీళ్ళు కొట్టుకొస్తాను” నిద్ర కళ్ళతో అన్నాడు భర్త సూర్యం- అడవికెళ్ళి కట్టెలు కొట్టుకొస్తానన్నట్టు.

రెండు బకెట్లు రెండు చేతుల్లో పట్టుకొని, కొట్టుడు పంపు వైపు భారంగా కదుల్తున్న భర్తని చూసి,

“దిక్కుమాలిన హైదరాబాదు- దిక్కుమాలిన ఎండకాలం, దిక్కుమాలిన కార్పొరేషన్ బాబూ” అనుకుంది. నోరెండిపోతోంది, నాలుగు చుక్కల నీళ్ళు నా నోట్లో పొయ్యండని అర్థిస్తున్నట్టు దీనంగా తన వైపే చూస్తున్నట్టుంది నీళ్ళ పైపు. రోజు విడిచి రోజు ఒక్కో ఏరియాకి ఒక్కో టైములో గానీ వదలరు ఆ పైపుల్లో నీళ్ళు! ఆ నీళ్ళు పట్టుకొనే భాగ్యం తమకెక్కడిదీ? ప్రాణాలు తోడుకుపోయేట్టు ఆ కొట్టుడు పంపులో కొట్టుకు చావాల్సిందే! తక్కువ నీళ్ళు పడతాయా తన సంసారానికి? ‘ఈ నీళ్ళు కొట్టుకోలేక మాకే మేం బరువై ఛస్తుంటే ఈవిడగారు కూడా ఇక్కడే చేరింది మా ప్రాణానికి’ అనుకొంది ఆడపడుచు గురించి.

తనూ భర్తా ఆఫీస్‌లకీ, పిల్లలు స్కూళ్ళకీ, స్వర్ణ కాలేజీకీ... ఇలా అంతా బయటికెళ్ళాక- ఇహ ఇంట్లో ఎవరూ లేరని నమ్మకం కుదిరాక, మిట్టమధ్యాహ్నం పన్నెండింటికి ఈ ప్రాంతానికి నీళ్లొదిలి ఛస్తారీ వాటర్ వర్క్స్ వాళ్ళు! మాయదారి సంత- కనిపిస్తే కసితీరా తన్నాలనిపిస్తుంటుంది సునందకి.

ఒక్క ఆదివారం- వారమంతటిలో తమదైన ఒక్క ఆదివారం- మరెక్కడికీ వెళ్ళకుండా ఇంట్లో తిష్ఠ వేసుక్కూర్చుంటే తప్ప,వారు ప్రసాదించే మహా ప్రసాదం లాంటి నీళ్ళని పట్టుకొని ఎరుగుదుమా??

“శాడిస్ట్స్!” కసి పైకే తిట్టింది.

ఏదో ఇంటి వాళ్ళు దయ తలచి ఆ బోర్‌వెల్ తవ్వించారు. తవ్వించిన వాళ్ళు ఆ చేత్తోనే మోటార్ పెట్టిస్తే ఏం కొంప మునిగిపోయిందో...?

గాల్లో లేచిన అమ్మాయి పొడవాటి జడలాంటి బోర్‌వెల్ తోకని పట్టుకొని కసరత్తు చేస్తున్నట్టు కిందికీ పైకీ కదుల్తూ బిందెల్ని నింపుతున్నాడు సూర్యం. మాట వరసకు చెప్పాను గానీ- అది అమ్మాయి జడ పట్టుకొన్నంత మధురంగా లేదు. గుండెలు అరికాళ్ళల్లోకి జారి పోతున్నట్టుగా వుంది. మార్చి నెల దాటుతున్న సూర్యుడు సురసురలాడ్తూ పైకి లేస్తున్నాడు.

ఆయాస పడిపోతున్న అన్నగార్ని చూసి, పిల్లల్ని వదిలి బోర్‌వెల్ దగ్గరికి పరిగెట్టింది స్వర్ణ.

“నేను కాసేపు కొడతాను. నువ్వాగు అన్నయ్యా!” అంది.

“వద్దులే! నువ్వు కొట్టలేవు. ఆ నీళ్ళు ఇంట్లో పోసిరా!” అన్నాడు ఈ నీళ్ళన్నీ పనిమనిషి ఒక్కతే కొట్టడాన్ని గుర్తు తెచ్చుకొంటూ. ఈ నీళ్ళు కొట్టలేక ఈ ఇంట్లో పని మానేసిన పని వాళ్ళని లెక్క బెట్టుకోసాగాడు. పంపు కొడుతూనే!

“పనిమనిషిదొరకనట్టేనా అన్నయ్యా!” బిందెల్లో నీళ్ళు ఇంట్లో పోసొచ్చి అడిగింది స్వర్ణ.

“ఎక్కడ దొరుకుతారు? వెతకలేక నా ప్రాణం పోతోంది. ఇది అమలాపురం అనుకున్నావా?” విసుగ్గా అన్నాడు.

“మరేం చేద్దాం? ఈ నీళ్ళు కొట్టడం రోజూ మనవల్ల అయ్యే పని కాదుగా.” ఆయాసం వల్ల పంపు కొట్టడం ఆపిన అన్నని చూస్తూ అంది. అసలే కాస్త లావుపాటి మనిషి ఎండాకాలం త్వరగా అలసిపోతున్నాడు. పైగా ఆఫీసులో పగలంతా పనుంటుంది. మొహమ్మీద నీళ్ళు జల్లుకొన్నట్టుగా కారుతున్న చెమటని తుడుచుకుంటూ అన్నాడు.

“వెతగ్గా వెతగ్గా దొరికిన వాళ్ళు మిగతా పనంతటికీ ఒప్పుకొని, ఈ నీళ్ళు కొట్టడం మాత్రం మావల్ల కాదని జారుకొంటున్నారు.”

“మిగతా పని, కాస్త పెందలాడ లేస్తే మనం మాత్రం చేసుకోలేమా? ఈ నీళ్ళ కోసమే కదా మనకి మనిషి కావల్సింది!” నిస్పృహ గొంతులో పలికించింది.

వాళ్ళల్లో ఓ ముసలాడు ముందుకొచ్చాడు చేస్తానని. అయితే, కాస్త ఎక్కువే అడిగాడు. ఇంట్లో పనంతా కూడా చేస్తానన్నాడు.”

“ఎక్కువయితే అయిందన్నయ్యా, పెట్టుకొందాం! ఈ బాధ మనం పడలేం!” ఆశగా అడిగింది.

“చూద్దాం! ఈ పూట ఇంటికి రమ్మన్నాను, మాట్లాడటానికి. మీ వదిన ఒప్పుకోవాలిగా, ఎక్కువ ఇవ్వడానికి!” నవ్వుతూనే అన్నాడు.

స్వర్ణ కూడా నవ్వుతుంది. డబ్బు ఖర్చు దగ్గర వదిన ఎంత గట్టిదో తెలుసు. ఇద్దరి జీతాలూ తన చేతిలోనే వుంచుకొంటుంది. అన్ని ఖర్చులూ పోను నెలకి ఎంత మిగల్చాలనుకొంటుందో,అంతకు ఒక్క రూపాయి తగ్గినా ఆమెకు మనశ్శాంతి వుండదు.

డబ్బు తక్కువ అవడం వల్ల తన తండ్రి తన పెళ్ళి చెయ్యడానికెంత ఇబ్బంది పడ్డాడో సునందకి తెలుసు! డబ్బు పెట్టలేక పై చదువు ఆగిపోయి-తమ్ముడి జీవితం గుమస్తాగిరీకి ఎంత అసంతృప్తితో రాజీపడి పోయిందో సునందకి బాగా తెలుసు! ఈ డబ్బు లేనందువల్ల తన పిల్లల భవిష్యత్తు మాత్రం అలా కాకూడదనుకొంటుంటుంది సునంద.

అందుకోసం పొదుపు అన్నది జీవిత ధ్యేయమన్నట్టు డబ్బు ఖర్చు చేస్తుంది. కొన్ని కొన్ని పనులకి కొన్ని ఫిక్స్‌డ్ రేట్స్ నిర్ణయించుకొంది. స్వర్ణ ఈ సంవత్సరం చదువు కోసం వచ్చి వుంటే, ఆమె కోసం ఎక్కువ పాలుగానీ, కూరలుగానీ పెంచలేదు. అంతకుముందు తెప్పించుకున్నట్టే తెప్పించి, అందులోనే సర్ది పెడుతుంది. చుట్టాలొచ్చినా తను తగ్గించుకొంటుంది తప్ప- పాలకి నిర్ణయించిన కోటా పెరగనివ్వదు.అనుకున్న

అందమైన ముఖం...

* ముఖం మీద చర్మం జిడ్డుకారేట్టయితే రెండు లేక మూడు బాదం పప్పులు నూరి, దానిలో ఒక టీస్పూన్ తేనె కలిపి తయారు చేసిన మిశ్రమం ఉపయోగించి ముఖానికి ఉదయం, సాయంత్రం రాస్తూ ఉంటే చర్మం నిగ నిగ లాడుతుంటుంది.

* సామాన్యంగా చాలా మందికి ఎండలో తిరగవలసి వస్తుంటుంది. అలా ఎండ వల్ల కమిలిపోయిన ముఖాన్ని [illegible] రుద్దితే బాధ తొలగడంతో బాటు చర్మం కూడా మెత్తబడుతుంది.

- ఎ.ఎల్. సువర్చల

దానికన్నా ఒక్క రూపాయి ఎక్కువయినా ఆమెకెంత భయం కలుగుతుందో స్వర్ణకీ, సూర్యానికీ బాగా తెలుసు!

పిల్లలు పెందలాడే స్కూళ్ళకెళ్ళి పోయారు.

ఆఫీస్‌కెళ్ళే టైమవుతోంది. అందరూ ఇంట్లోంచి బయటపడే హడావుడిలో వున్నారు.

సూర్యం స్కూటర్ ట్రబులిస్తోందని షెడ్డులో ఇచ్చాడు మొన్న. తన స్కూటర్ మీద ఎక్కించుకెలతానని, ఆ వీధిలోనే వుంటున్న సూర్యం కొలీగ్ శివరాం వచ్చి కూర్చొని వున్నాడు ముందు గదిలో.

కాలేజీకెళ్ళేందుకు తయారై బయటి కొచ్చిన స్వర్ణకి, కాంపౌండ్‌లో తచ్చాడుతూ ఓ ముసలతను కనిపించాడు.

స్వర్ణని చూసి ఓ అడుగు ముందుకేసి,

"అమ్మా! సూర్యం అయ్య ఇల్లు ఇక్కడేనా?" అనడిగాడు. అతనికి అరవయ్యేళ్ళుంటై, బక్కగా వున్నాడు.

"ఆ! ఇదే. ఏం కావాలి?" అంది.

"ఇంట్ల పని జేసేటందుకు మనిషి గావాల్నన్నడు. మాట్లాడేటందుకు వచ్చిన." అన్నాడు గడప దగ్గరకొస్తూ.

"ఇక్కడే వుండు. పిలుస్తాను." అంటూ లోపలికెళ్ళింది.

మరో మూడు నిముషాల్లో స్వర్ణతో పాటు సూర్యం, సునంద ముదుగదిలో కొచ్చారు. గడపలో నిలబడ్డ మనిషిని చూసి

"ఇతనే నే చెప్పినతను." సునందతో అని, అక్కడ్నే కుర్చీలో కూర్చుని వున్న శివరాంతో

"ఇంట్లో పని చేస్తానని వచ్చాడు. అతన్తో మాట్లాడి ఒక్క అయిదు నిముషాల్లో బయల్దేరుదాం!" అన్నాడు, ఆలస్యం అయ్యేట్టున్నందుకు సంజాయిషీఇస్తున్నట్టు.

"ఫర్వాలేదులే. ఆ పని కానీ!" ప్రశాంతంగా వుంది శివరాం గొంతు.

"నీ పేరేమిటన్నావ్?" ముసలతన్ని డిగాడు సూర్యం.

"నర్సయ్యయ్యా."

"ఇంట్లో పనంతా చెయ్యగలవా? అంట్లవీ శుభ్రంగా తోముతావా?" అడిగింది సునంద, మగమనిషి కదా చేస్తాడో లేదో అని.

"చేస్తానమ్మా, బోళ్ళు తొముత, ఇల్లూకుత, నీళ్ళు గొడత, అన్ని మంచిగ జేస్త తియ్యరాదు." చాలా నమ్మకంగా పలికాడతను తెలంగాణా యాసతో.

"బాగా చెయ్యాలి! మూడు రోజులకో నాగా పెడితే కుదర్దు." గట్టిగానే అని శివరాం వైపు తిరిగి

"వీళ్ళతో ముందే అన్నీ మాట్లాడాలి. లేకపోతే తర్వాత మనల్ని ఏడిపించుకుతింటారు." అంది సగం ఇంగ్లీషులో, సగం తెలుగులో.

"గట్లెందుకు జేస్తనమ్మ. చేసినకెళ్ళి మంచిగనే జెయ్యాలె. గనుమంటి ఆద్మిని గాదు నేను." అన్నాడు.

"స్థిరంగా చేస్తావా? నెల రోజులుచేసి ఇంక నేను చెయ్యను అని ఏదో వంక బెట్టి వెళ్ళిపోతావా? అది కూడా ముందే చెప్పు. అలాంటిదేమన్నా వుంటే ఇప్పుడే ఇంకో మనిషిని చూసుకుంటాం." పరీక్షిస్తోంది. ఇదివరకు మనుషులలా వెళ్ళిపోవడం గుర్తుంచుకొని జాగ్రత్త పడుతోంది.

"గదేం లేదమ్మా! కష్టమొ, సుకమొ ఒక్క దిక్కున్నె జేసుకుందామనే వచ్చిన."

"ఊ! సరే. దొంగతనాలవీ మాకసలు సరిపడవు. ఎక్కడి వస్తువులక్కడే వుండాలి!" ఖచ్చితంగా వుంది సునంద గొంతు.

'ఎవరికి మాత్రం సరిపడుతుంది దొంగతనం' మనసులో అనుకుని నవ్వుకున్నాడు సూర్యం.

"గా పనులు చెయ్యబడితె గిట్లెందు కుందునవ్వ? నా గాచారం మంచిగ లేక గని, నా కొడుకులిడ్సిపెట్టి పోవట్టె, గీ పొట్టగిన్ని తిప్పలాయె!" ఎక్కడో తగిలినట్టుందతనికి. తలొంచుకొని పొట్టని చేత్తో నిమురుతూ కష్టంగా అనడం చూసి బాధ కలిగింది స్వర్ణకి.

"ఈవిడకసలు మతి లేదు" తిట్టుకొంది వదినని.

ఇంక ఊరుకోలేక అడిగాడు సూర్యం-

"ఇంతకీ జీతమెంత కావాలో చెప్పు."

"నిన్ననే జెప్తిని గదయ్య. డెబ్బై రూపాలియ్యి. గింత సద్ది మిగల్తె ఎయ్యి లేకుంటె లే!"

ఆ మాట వినగానే నిలువుగుడ్లేసింది సునంద.

ఆ మొత్తం అంతకు ముందు పనిమనిషికిచ్చిందానికన్నా ఇరవై ఎక్కువ. తను పనిమనిషికి ఇవ్వాలని ఫిక్స్ చేసిన రేటుకన్నా ముప్పై ఎక్కువ. అతనెంత తగ్గినా పది తగ్గుతాడు. అయినా అది అందని బేరమే అని అర్థమయిపోయింది.

[illegible]

[illegible]

\- ఎ.ఎల్. సువర్చల

"డెబ్బై రూపాయిలా? సరిపోతుందా?" వ్యంగ్యంగా అంది.

"రూపాల పేరే గాని, ఏమొస్తయి మండిల. నువ్వే జర సమజ్ చెయ్యి బాంచన్".

"వద్దులే! అయినా, ఆ పంపు నీళ్ళు మేమే కొట్టలేం, నువ్వేం కొడతావ్ వద్దులే!" అప్పటి దాకా కనపడని అతని ముసలితనం అప్పుడు కనిపించింది సునందకి.

"అట్లనకుండ్రి బాంచన్! ఆరామ్‌గా కొట్టుకుంట నీళ్ళు. ఇంట్ల పనంత జేస్త. చెయ్యకుంటే గప్పుడడుగుండ్రి." అన్నాడు తన శక్తిని తక్కువ అంచనా వేయవద్దన్నట్టు. దొరికిన పని జారి పోతోందనే భయం నీడ ఆ మొహంలో కదలాడింది.

"వద్దయ్యా, మాకక్కరలేదు. ఈ వయసులో నీతో నీళ్ళు కొట్టించుకోడానికి మాకయినా బుద్ధుండాలి. కాదంటారా శివరం గారూ?" అతని వైపు ఓరగా చూస్తూ అంది.

ఏమంటాడు శివరావు. నవ్వి ఊరుకున్నాడు. ఆ సమయంలో అతనక్కడే వుండటం ఇబ్బందిగా వుంది సునందకి.

సునంద ధోరణి చూసి భయమేసింది సూర్యానికీ, స్వర్ణకీ. ఈ మనిషి కూడా పోతే మళ్ళీ మనిషి దొరకడం అసాధ్యం కావచ్చు. ఈ ఎండలకి నీళ్ళన్నీ కొట్టుకోడం దుర్భరమయిందే!

"నా కట్టం జూసి ఇయ్యుండ్రమ్మ. అసలె ఎండకాలమాయె. నోరెండకపోతాంటది. కడుపుకింత తినాలె ! ఓ పదిరూపాలు తగ్గించుకోండ్రి." అన్నాడు నర్సయ్య

సర్రున వెనక్కి తిరిగి అంది సునంద.

"వద్దని చెప్పానా? నువ్వు కొట్టగలవా ఆ పంపు! ఏదో ఒక చావు మేమే ఛస్తాంలే. నీతో చేయించడానికి మాకు మాత్రం మనసొప్పవద్దూ!" ఎంతో జాలి పడుతున్నట్టు అంది.

"నీ కాల్మొక్త బాంచన్! ముసలోణ్ణి! ఈ ముసలి ముండకొడ్కును ఇడ్సిపెట్టి, కొడుకులు పొట్ట చేతల బట్టుకొని దేశం మీద బోయిన్రు. వాళ్ళకు నేను బరువైతే, ఏం జేద్దును. పొద్దంత పని జేసెతందుక్- సత్త లేదు. గీ పైసలన్న లేకుంటే ఎట్ల బత్కుత? సోచాయించుడి!" దీనంగా అడిగి అక్కడే కూర్చుండిపోయాడు.

"పోనీ, అతను కొట్టగలిగినన్నే కొట్ట నిద్దాం. మిగతా నీళ్ళు మనం కొట్టుకోవచ్చు మనకీ తేలికగానే వుంటుంది." అన్నాడు సూర్యం.

"చాల్లే ఊరుకోండి. అలా ముందే అలవాటు చేశామంటే, వాళ్ళే కష్టపడుతున్నట్టు నాటకమాడి నీళ్ళన్నీ మనతోనే కొట్టిస్తారు. అయినా ఇతను మనకి వద్దు!" కోప్పడింది ఇంద్రీషులో.

"ఇటీజ్ ట్రూ...ఇటీజ్ ట్రూ!" నవ్వుతూ? సునందని సమర్థించాడు శివరామ్.

"బడితెల్లా ఇంట్లో ముగ్గురం వుండి, ఈ వయసు వాడితో నీళ్ళు కొట్టించు కోడం ఏం బావుంటుంది చెప్పండి శివరామ్ గారు! చుట్టుప్రక్కల నవ్విపోరూ! మనకయినా కాస్త కనికరం వుండాలి గదండీ!" సమర్థించిన శివరామ్‌ని చూస్తూ అంది.

"ఒంటిమీద పీసు కండలేదు మనిషికి. ఏం కొడతాడు??" శివరాం మళ్ళీ పలికాడు.

సునంద కనికరానికి బలం దొరికింది.

"మంచిగనే జేస్తనయ్య! పొద్దంత కూలి పని జేస్తలేనా?" బ్రతిమలాడుతున్నట్టన్నాడు నర్సయ్య.

"ఇహ నువ్వు వెళ్ళుతాతా! విసిగించకు. నీతోమాకెందుకు గానీ ఆఫీసుకి టైమ్ అయిపోయింది. వస్తా శివరామ్ గారూ!" బాగ్ తీసుకొని బయల్దేరుతూ, నాన్రోజులోపిక పడితే అనుకున్న రేటుకి మనుషులు దొరక్కపోరు అని మనసులో అనుకుంది!

"పొద్దు, మాపులు సల్లగున్నప్పుడు నీళ్లొట్టుకొని, ఎండ పొద్దంత గుడిసె నీడల కూసుందమనుకుంటి! ఎండ కాలిమేంది. సలికాలమేంది... సచ్చేదన్క ఆస్మాన్ కిందనే నా బత్కు!" ఎంత ఆశతోవచ్చాడో, ముసలి నర్సయ్య- సునంద 'కనికరానికి' బలై, కుంగిపోయి, గొణుక్కుంటూ, ఎండలోకి అడుగులేయడం చూసి ఎక్కడో కలుక్కుమంది స్వర్గకి!

'జాలి'కి నిర్వచనం తెలిసి, దేనికోసమోతెలియని తమ "పాకులాటల" బ్రతుకుల మీద క్షణం పాటు 'రోత' కలిగింది!!

శ్రీ నందివాడ భీమారావు
గెస్ట్ ఎడిటోరియల్,
ఇంటర్వ్యూ
అతి త్వరలో

ఏలూరులో కాస్త పొట్టిగా, ఇంకాస్త పొట్టిగా వున్నాయన్ని మీరు చూసే వుంటారు. చిన్న ఆడపిల్ల పాదాలతో, బాగా ఎర్రగా వున్నాయన్ని మీరు చూసేవుంటారు. ఎగ దువ్విన జుట్టుతో, ఎగశ్వాస పీలుస్తున్నాయన్ని మీరు చూసేవుంటారు. నోటినిండా మనసూరించే కబుర్లతో మసులుతున్నాయన్ని మీరు చూసేవుంటారు. ఆస్త్మా ముండతో అవస్థ పడుతునాయన్ని మీరు తప్పక చూసేవుంటారు. ఒక పక్క ఫోనుతోను, మరో పక్క పత్రికలతోను. సంసారం చేస్తూన్నాయన్ని మీరు చూడకండా వుండి వుండరు. మంచి తెల్ల కాయితాల మీద, మంచి రంగుల కలాలతో రాసే ఆయన్ని బహుశా మీరు చూసే వుంటారు. ఆర్టిస్టుగ్గా సంతకం పెట్టడం అలవాటున్నాయన్ని అడపాతడపా మీరు చూసే వుంటారు. ఇంటి దగ్గర లుంగీని గుండెలదాకా కట్టుకుని తిరిగే ఆయన మీ కళ్ళకి వింతగా ఎప్పుడన్నా కనిపిస్తే కనిపించి వుండచ్చు. అన్ని పత్రికలూ కొంటూ, చదువుతూ, దాస్తూ వున్న ఈయన మీకు ఎక్కడో ఒక చోట కనిపించే వుండచ్చు. సైకిల్ వాళ్ళూ , నడిచేవాళ్ళూ, ముందు వెళ్ళిపోతుంటే, వాళ్ళ వేనక తాపీగా తన స్కూటర్ మీద వెళ్ళే ఈయన్ని మీరు తప్పకుండా చూసేవుంటారు. మీరు చూసీ, చూడని ఈయన పేరు కొమ్మన రాధకృష్ణా రావు. ఈయన పట్నూరులో

'మనలో మనిషి

నిరాడంబర కవి, రచయిత

కొమ్మన రాధాకృష్ణ.

నాగుల చవితి రోజున 1-11-1943న పుడితే 5-11-1943 అని రికార్డులో వుంది. సత్యవతమ్మ, నాగభూషణం గార్లు ఈయనకి తల్లిదండ్రులయితే, ఒక అన్నయ్య, ఒక అక్కయ్యకి ఈయన తమ్ముడు. అందుకే ఇంట్లో అందరూ బంగారం చిట్టిబాబు, శేఖర్‌బాబు, బర్సల్ అని తలా ఒక ముద్దు పేరుతో పిలుస్తారు. ఈయనకి పట్నూరులో ముస్లిం మాస్టారు దగ్గర తెలుగు అక్షరాభ్యాసం చేశారు. తర్వాత ప్రతాప విశ్వపతిశాస్త్రి గారి వీధి బడిలో చదువుకున్నారు. ఏడో క్లాసుకి వచ్చేసరికి తిన్నగా ఏలూరు థియోసాఫికల్ హైస్కూలులో చేరి స్కూల్ఫైనల్ వరకూ అక్కడే చదివారు. పదిహేను ఏళ్ళకే కల్పన అనే పేరుతో కలం స్నేహం మొదలు పెట్టారు. అమ్మాయి పేరువల్ల ఇబ్బందులు రావటంతో ఆపేశారు. సి.ఆర్.రెడ్డి కాలేజీలో పి.యు.సి. 1959 లో చదివారు. 1962 కే దక్షిణ భారత హిందీ ప్రచార సభ వారి రాష్ట్ర భాషా ప్రవీణ పూర్తి చేశారు. 1962 లో కాకినాడ ఫ్రెండ్స్ ఫోరం వాళ్ళు గురజాడ మీద వ్యాస పోటీపెడితే, మొదటి బహుమతి వచ్చి అరకాసు గోల్డు మెడల్ సంపాయించారు. ఏలూరులోనే బిఎస్సీ 1963 లో పూర్తి చేశారు. ఇటు డిగ్రీ పూర్తి అవగానే అటు పెళ్ళి పని కూడా 1963 జూన్ 8 న పూర్తి చేశారు. లాంగ్వేజస్‌లో మంచి మార్కులు రావడం వల్ల ఆ రోజుల్లో తెలుగు ట్యూటర్‌గా అదే కాలేజీలో 1963 జులై 8న వుద్యోగంలో చేరిపోయారు. బెంచినుంచి కుర్చీలోకి మారినట్టు 19 ఏళ్ళ వయస్సులో చదువునుంచి వుద్యోగంలోకి మారిపోయారు. అలా వుద్యోగం చేస్తూ కొంతకాలానికి వుద్యోగం వూడిపోతుందనే భయంతో 1968 లో

టైపు హయ్యర్, షార్టుహాండు పాసయ్యారు. 1966 లోనే సదరన్ లాంగ్వేజస్ బుక్ ట్రస్టు తరపున చల్లా రాధకృష్ణ శర్మ, కొడవటిగంటి కుటుంబరావు గార్లు నిర్వహించిన ట్రాన్స్‌లేటర్స్ ట్రైనింగ్ కోర్సులో చేరి మద్రాసులో మూడు నెలలు మకాం వేశారు. ప్రైవేటుగా తెలుగు ఎమ్.ఏ.చదివి 1972 లో డిగ్రీ తీసుకున్నారు. 1972 లోనే మొదటిప్రపంచ పుస్తక ప్రదర్శన ఢిల్లీలో జరిగితే పనిగట్టుకుని వెళ్ళారు. అక్కడ ప్రముఖ కవుల కవిత్వాన్ని విన్నారు. ప్రసిద్ధ రచయితల్ని కలిశారు. 1975 లో జువెనైల్ లిటరేచర్ సెమినార్‌కి బెంగుళూరు వెళ్ళారు. అక్కడ ముళ్ళపూడి వెంకటరమణగారి బాలసాహిత్యం, బాలసాహిత్యం కానే కాదని MUCH TALKED ABOUT FUTURE CITIZENS అని ఓ వ్యాసం చదివేశారు. 1976 లో లెక్చరర్ కిరీటం పొంది ఉద్యోగ భయం పోయి స్థిర పడ్డారు.

ఒక పక్క పుస్తక ప్రదర్శనలు, రచయితల పరిచయాలు, సెమినార్లు ఉత్సాహం కలిగిస్తే ఇంకోపక్క వెలగా వెంకటప్పయ్య, లంకాసూర్యనారయణ గార్లు తనని ప్రభావితంచేసి, మాట్లాడించి, రాయించారు. మరోపక్క 1963-68 మధ్య కాలంలో ప్రతి సంవత్సరం సాహితీపరులు, అభిరుచిపరులు సంక్రాంతి సమావేశాల పేరిట ఏదో ఒక వూళ్ళో నిశ్శబ్దంగా హడావుడి చేస్తూ వుండేవారు. ఈ సమావేశాల్లో రాధాకృష్ణగారు 'చినుకులు' పేరుతో కవిత్వం చదివేవారు. 1975 లో జనరల్ విషయాల మీద రాసిన 'నూరు వ్యాసాలు' ప్రచురించారు. ఆ పుస్తకం ఇప్పటికి నాలుగైదు ఎడిషన్లు పడితే ఆనందించారు. తర్వాత కాళోజీ కవిత్వం 'నాగొడవ' 1975 లో అచ్చు మొదలు పెట్టి ఎమర్జన్సీ కారణంగా ఆపేశారు. మళ్ళీ 1977 లో పూర్తి చేసి సంక్రాంతి మిత్రుల తరపున ఊరికినే పంపకం చేశారు. ఆ తర్వాత వేగుంట కనక రామబ్రహ్మంగారి గౌరవార్థం కళ్లన్నీ వత్తులు చేసుకుని 'కానుక' అనే అభినందన సంచిక ఆప్యాయంగా, అపురూపంగా అందించారు. 'ఆంధ్రసాహిత్యంలో రాయబారాలు' శీర్షిక కింద ఒక్కొక్క స్కాలర్‌ని పిలిపించి ఏలూరులో సభలు పెట్టడంలో ప్రధాన పాత్రనిర్వహించారు.

ఈ వ్యవహారాల తర్వాత ప్రముఖ కథారచయిత భమిడిపాటి జగన్నాథ రావుగారు పరిచయం అయ్యారు. ఇష్టమైన పద్మరాజు కథలు, త్రిపుర కథలు జగన్నాథరావు గారు చదివితే, రాత్రి పదిగంటలనుంచి మూడు గంటల వరకు రాధాకృష్ణ గారు వినేవారు. అవబృధ స్నానం చేసినట్టు అనుభూతి పొందేవారు. ఒక్కొక్క కథారెండు మూడుసార్లు చదివి వినిపించుకునేవారు. జగన్నాధరావుగారి ద్వారా కథల పరిచయమే కాకుండా, భరాగో, ఏలూరు సీతారాముడులాంటి కథకులు కూడా రాధాకృష్ణగార్కి పరిచయమయ్యారు.

రాధాకృష్ణగారు తనని తను విముక్తి చేసుకోవడానికి కవితలు రాస్తారు. ఒక్కో దెబ్బ తగిలినపుడు కూడా కవితలు రాస్తారు. ఇలారాసిన, అచ్చుకి ఇవ్వని ఆ కవితలకు 'పొడిపలుకులు' అని పేరు పెట్టుకున్నారు. వ్యాపార ప్రకటనల మధ్య తన కవితల్ని కళ్ళార చూడటం ఇష్టంలేక పత్రికలకి పంపించటం మానుకున్నారు. రెండుమూడు కవితలు తప్ప, అచ్చుకాకుండా పదిలంగా వున్న వాటినన్నిటిని పుస్తక రూపంలో తెచ్చే పట్టుదల లేకుండా వున్నారు. అచ్చుయిన 'వేళ్లు' అన్న కవితని చూసిన త్రిపుర దాన్ని ఇంగ్లీషులోకి అనువదించే ప్రయత్నంలో వున్నారు.

ఇలాఒక పక్క కవితలు రాసి ఆత్మీయులకు మాత్రమే వినిపించి ఆనందిస్తూ వుంటారు. మరో పక్క కలలు కంటూ కోరికలు చెబుతూ వుంటారు. 'నిండు నూరేళ్లు' శీర్షిక కింద సి.ఆర్.రెడ్డి, సి.వై. చింతామణి, బళ్లారి రాఘవ, ఆచంట లక్ష్మీపతి లాంటి నూరేళ్లు దాటిన వాళ్ల మీద ఫ్రీడమ్ ఎట్ మిడ్ నైట్ శైలిలో ఇరవై పేజీల వంతున రాస్తానని ప్రకటిస్తున్నారు. 'కనీస విజ్ఞానం' శీర్షిక కింద, రోజు వింటున్న విషయాల మీద సమగ్రమైన సమాచార వ్యాసాలతో ఓ పుస్తకం రాస్తానని ఊరిస్తున్నారు. ఈ తరం మన తెలుగు ప్రముఖులు, రచయితలు, కవుల మీద బిబిసీ ఇంటర్వ్యూశైలిలో కూర్చి అందిస్తానని ఆశపెడుతున్నారు.

అభిమానం సామర్థ్యాన్ని వెక్కిరించకూడదు. అని చెప్పే రాధ కృష్ణ గార్కి క్రాంతి మా ఇంటి పేరు, సంక్రాంతి మా మిత్రుల పేరు అని చెప్పు కోవడం సరదా I AM AN ISLAND BY MYSELF అని చెప్పే రాధాకృష్ణ గార్కి ఇంటి దగ్గర ఉయ్యాల ఊగుతూ టీ తాగడం సరదా, ముందుకు ప్రాజక్టు అవటం

ఇష్టపడని రాధాకృష్ణ గార్కి, తను అచ్చేసిన పుస్తకాలు అమ్మటం అంటే మహాచిరాకు. చలం మహారచమిత, శ్రీశ్రీ మహాకవి అనేమాటలు చాలా ఏళ్లకి గాని అర్థం కాలేదు. అని చెప్పే రాధాకృష్ణ గార్కి, చిన్న కూతురు శ్యాముతో తిట్లు తినడం మహా సరదా. రావి శాస్త్రి నీ, శ్రీశ్రీనీ చదివితే రామయణాన్నీ, ధూర్జటినీ చదువు కోవాలనిపించింది అని చెప్పే రాధాకృష్ణ గార్కి వాళ్ల అమ్మతో కబుర్లు చెప్పటం సరదా. ఫెమినా పత్రిక చాలా ఇష్టం, రీడర్స్ డైజెస్ట్ మరీ ఇష్టం అని చెప్పుకునే రాధాకృష్ణ గార్కి ఇండియా టుడే పత్రిక టెక్స్టు బుక్కులా అవుతున్నందుకు అయిష్టం. ప్రొఫైల్స్, ఆత్మకథలు, జీవిత కథలు ఇష్టంతో చదివే రాధాకృష్ణ గార్కి, మనిషి మనిషికి టానిక్‌లా, మల్టీ విటమిన్ క్యాప్సూల్లా, రామబ్రహ్మం గారిలా, చిల్లర శేషగిరిరావు అనే మిత్రుడిలా తను కావాలను కోవటం ఇష్టం. తాగుడు కోసం క్లబ్బులు, రూములూ వెతుక్కోవడం అసహ్యం అని చెప్పే రాధాకృష్ణగార్కి, వాళ్ల అన్నయ్యతోనే ఆ సరదా చెయ్యటం ఇష్టం. తెలుసుకోవాలనే తపన వున్న రాధాకృష్ణగార్కి విప్లవం అనేమాట తెలుగు భాషలోకి ఎపుడు ఎలా ప్రవేశించిందీ అని కనపడిన వాళ్లని అడగటం ఇష్టం. జీవితంలో ద్రోహిగా కాకుండా బతకగలగాలనే కాంక్షవున్న రాధాకృష్ణ గార్కి, మంచీ చెడూ అనే శక్తి

హీనమైన, అసందర్భమైన మాటల్లో కాకుండా, యధాతధంగా స్వీకరించి కొత్త సంస్కృతిని పెంపొందించటం ఇష్టం. ఒంటరితనం శత్రువు కాకూడదు అని నిరపేక్షంగా సేవ చేసే రాధాకృష్ణగార్కి, పూర్ణ ఆరోగ్యంతో ఎవరూ బాధపడకూడదు, చిన్నో చితకో కాస్త సుస్తీ చేస్తూ వుండాలి అని అనుకోవడం సరదా. భార్యని ప్రేమించలేకపోతున్నాను అని అనుకుంటూ బాధ పడిపోయే రాధాకృష్ణ గార్కి, మొదటి స్నేహితురాలు భార్య అని ఆనందించటం ఇష్టం. భార్యతో స్నేహం చెయ్యటం నేర్చుకుంటున్న రాధాకృష్ణగార్కి, భార్య సుఖపడ లేక పోతోందా, సుఖపెట్టలేకపోతున్నానా అనే చిక్క ప్రశ్నలో ప్రతిక్షణం వేగటం సరదా. నిద్ర పోయేముందు మళ్లీ స్నానం చేసే రాధాకృష్ణ గార్కి వుదయానే వేడి ఇడ్లీ, దాంట్లో కొబ్బరి చట్నీ అంటే ఇష్టం. రాత్రే గెడ్డం చేసుకోవటం అలవాటున్న రాధాకృష్ణ గార్కి, రేడియోలు కట్టేసిన తర్వాత సంగీతాన్ని ఆనందించటం సరదా. టూ ఇన్ వన్‌గా లుంగీని కట్టుకునే రాధాకృష్ణ గార్కి కింద కూర్చుని పేపరు పరచుకుని చదవటం ఇష్టం. మంచి షాంపుతో తలంటుకునే రాధాకృష్ణ గార్కి తలారబెట్టుకుంటూ షాంపూ వాసనని ముక్కుతోను, జిన్ వాసనని నోటితోను ఆస్వాదించటం సరదా. వేడి భోజన ప్రియుడైన రాధాకృష్ణగార్కి బాచీ పెట్టేసుకుని

కింద కూర్చుని భోంచెయ్యడం ఇష్టం. పక్క మీద కూర్చుని టీ తాగే రాధాకృష్ణ గార్కి న్యూస్ పేపర్ ఫ్రెష్‌గా వుండకపోతే చదవడానికి అయిష్టం. పొసెసివ్ ప్రకృతి వున్న రాధాకృష్ణగార్కి విమర్శని తట్టుకోలేని బలహీనత కారణంగా చాలా వాటికి దూరంగా వుండటం ఇష్టం. అవతలెళ్లండిని అటు మొన్ననే చూసే రాధాకృష్ణగార్కి, విశ్వాస బలంతో నిర్భయంగా బతకాలనుకోవడం, బతగ్గలుగుతన్నందుకు ఆనందపడటం సరదా. ఇన్ని సరదాలు, ఇష్టాలు, అయిష్టాలు వున్న రాధాకృష్ణ గారు ఉపాధ్యాయుడుగా ఓపెన్ యూనివర్సిటీ తెలుగు పుస్తకాల్ని మెచ్చుకుంటారు. ఓపెన్ యూనివర్సిటీవి, క్లోజ్డ్ యూనివర్సిటీలవి తెలుగు పుస్తకాలు ఒకే రకంగా వుండాలనుకుంటారు. అవకాశం దొరికితే వడ్డే చండీదాస్ గారి 'అనుక్షణికం' నవల మీద పిహెచ్ డీ పరిశోధన చేద్దామనుకుంటున్నారు.

ఇంకా వెనక బెంచిలోనే వున్న రాదాకృష్ణ గారు ముంద బెంచీల్లోకి వచ్చేంత వరకూ కవిగా, రచయితగా ఆయన స్థానం ఖాళీగానే వుంటుంది. ఆ ఖాళీస్థానాన్ని పూరించే భాధ్యత రాధాకృష్ణగారిదే.

– డా అత్తలూరి నరసింహారావు.

అత్యుత్తమ అబద్ధాలపోటీ

ఉత్తమ అబద్ధాలు:

1. స్త్రీ ఒంటిపై బట్టకట్టి ఉంటేనే సెక్స్ అప్పీల్ ఉంటుందని నమ్మేవాణ్ని నేను.

- కోడిరామకృష్ణ
(జూలై 7, ఆంధ్రప్రభ డైలీ ఇంటర్వ్యూలో)
యర్రా బాబ్జీజ్యోతి, అనకాపల్లి.

2. 'గత జన్మలో నేను చాలా గొప్ప మేధావినై ఉంటాను.'

-హిందీ నటి రేఖ.
(జూన్ 30, స్వాతి)
ఎమ్.ఎస్.ఎల్.జోగేశ్వరి, వడ్డాది.

3. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఎన్టీఆర్‌పై పోటీచేసి రెండు లక్షల ఓట్ల మెజార్టీతో గెలుస్తాను.

- నటుడు కృష్ణ
(6-7-89, ఆంధ్రజ్యోతి)
ఎమ్.ఎస్.నాయుడు, మచిలీపట్నం.

4. కాంగ్రెస్‌లో తస్మదీయులు లేరు. అంతా అస్మదీయులే.

-చెన్నారెడ్డి.
(16-7-89, ఉదయం)
-చలపాక ప్రకాష్, విజయవాడ.

5. 'నేనే ప్రధానినైతే రాజీనామా చేసుండే వాడిని.'

- నీలం సంజీవరెడ్డి.
(ఈనాడు, 20-7-89)
-భీశెట్టి శ్రీనివాసరావు, అనకాపల్లి.

(అత్యుత్తమ అబద్ధాల పోటీ విజేతలకు ఈనెల నుంచి 'జ్యోతి' మాసపత్రిక ఆరు నెలలపాటు ఉచితంగా పంపడం జరుగుతుంది.)



భవిష్యత్తులో ఒక రోజు...

విశ్వాంతరాళాన్ని ఛేదించుకుంటూ వెలుగు చుక్కలా ప్రయాణిస్తోంది ఒక అంతరిక్ష నౌక.

కంట్రోల్స్ దగ్గర ఉన్న వ్యక్తి పేరు గౌతమ్.

అతడి పక్కనే నిలబడి స్క్రీన్ మీద కనిపిస్తున్న దృశ్యాలను పరీక్షగా చూస్తోంది ఒక యువతి.

ఆమె అతడి భార్య అశ్విని.

స్క్రీన్ మీద, వాళ్ళు సమీపిస్తున్న ఉపగ్రహం స్వరూపం యిప్పుడు స్పష్టంగా పెద్దగా కనిపిస్తున్నది.

"అశ్వినీ! గెట్ రెడీ!"....

ఇద్దరూ జాగ్రత్తగా కంట్రోల్స్‌ను నియంత్రించసాగారు...

అంతరిక్షనౌక వేగం తగ్గిపోయి, గ్రహానికి దగ్గర కక్ష్యలో పరిభ్రమిస్తోంది. ఇప్పుడు నౌక నుండి చిన్న లాండింగ్ క్రాఫ్ట్ విడివడి, ఉపగ్రహం మీదకు దిగటం స్క్రీన్ మీద కనిపిస్తున్నది.

కొద్దిసేపటి తర్వాత లాండర్‌తో పాటు దిగిన ఒక 'రోబోటిక్ రోవర్' గ్రహం ఉపరితలం మీద తన అన్వేషణ మొదలు పెట్టింది. ఉపరితలం నుండి శిలలు, ధూళి శాంపిల్స్ సేకరించడానికి, దానికి మెకానికల్ హాండ్స్, స్టీరియోస్కోపిక్ విడియో కెమేరా విజన్, పవర్ సప్లయికి ఒక రేడియో ఐసోటోప్ థెర్మో ఎలక్ట్రిక్ జనరేటర్ ఉన్నాయి.

లాండింగ్ క్రాఫ్ట్‌లోని పరికరాలు ఆ ప్లానెట్ గురుత్వాకర్షణ శక్తి, సాయిల్ స్ట్రక్చర్, మాస్ గురించిన వివరాలు మదర్ షిప్‌కు పంపసాగాయి. గౌతమ్, కంప్యూటర్‌కు ఫీడ్ చేయబడుతున్న ఆ వివరాలను పరీక్షగా చూస్తూ తృప్తిగా తల పంకించాడు.

అశ్విని ఒక బటన్ నొక్కింది.

సెకను కన్న తక్కువ వ్యవధిలో శక్తివంతమైన లేసర్ బీమ్, ప్లానెట్ ఉపరితలాన్ని తాకి చిన్న వాయు మేఘం పైకి లేచింది. మరొకవైపు నుండి ఛార్జ్‌డ్ పార్టికల్స్ బీమ్ ఒకటి ఉపరితలం మీద యాన్స్‌ను చెదరగొట్టింది.

మదర్ షిప్‌లోని మాస్ స్పెక్ట్రోమీటర్ మొదలైన ఆధునిక పరికరాలు వాయు మేఘాన్ని, అయాన్స్‌ను పరీక్షించి గ్రహ నిర్మాణంలోని మూల పదార్థాల అన్వేషణకు ప్రయత్నించసాగాయి.

గౌతమ్ ప్రశంసగా అశ్విని వంక చూసాడు.

వారికి నిర్దేశించబడ్డ పనిలో దాదాపు సగం ముగిసినట్టే.

మరొక రోజు పాటు వాళ్ళు డేటా సేకరిస్తూ అక్కడే గడపాల్సి ఉంది.

"అశ్వినీ!"....

రెండడుగులు వేసి ఆప్యాయంగా భర్త భుజం మీద చెయ్యి వేసింది.

ఆ స్పర్శలోని ఆర్ద్రత అతడికెంతో హాయినిస్తోంది.

ఇద్దరూ దగ్గరో ఉన్న సోఫాలో కూర్చున్నారు.

గౌతమ్ అశ్విని ఒళ్ళో తల వాల్చాడు.

ఆమె భుజం మీదుగా కిందికి జారిన గాఢ తిమిరం లాంటి జుట్టు అతడి ముఖానికి పట్టుతెరలలాగా సోకుతున్నది.

భర్త నుదిటి మీద చేతి వేళ్ళతో మృదువుగా రాస్తూ ఆలోచనల్లో పడింది అశ్విని. 'తలుచుకుంటే ఈ జీవితం ఆమెకెంతో ఆశ్చర్యంగా అనిపిస్తున్నది. ఎందుకంటే, ఎక్కడో ఆంధ్రదేశంలో పుట్టిన వాళ్ళు మార్షియన్ సొసైటీలో సభ్యులై గెలాక్సీలో సంచారం చేస్తుంటారని వాళ్ళు కలలో కూడా ఊహించి ఉండకపోవచ్చు.'

కాని ఒకరకంగా యిందులో పెద్దగా ఆశ్చర్యపడాల్సిన పనేమీ లేదు. 21వ

శతాబ్దం తొలి దశలోనే! స్పేస్ టెక్నాలజీ ఎంతో అభివృద్ధి చెందింది. గ్రహాంతర యానం అభివృద్ధి చెందింది. అదే టైములో పారలల్‌గా భూమి మీద మతి తప్పిన అణ్వాయుధాలు, లోపభూయిష్టమైన న్యూక్లియర్ రియాక్టర్స్, విష వాయువులు వాతావరణాన్ని మరింత కలుషితం చేసాయి. అట్టి పరిస్థితుల్లో హెల్తీజనరేషన్స్ కోసం, భూమి తిరిగి కోలుకోవటం కోసం, ప్రజలు యితర గ్రహాలకు వలస అనివార్యంగా చాలా దేశాలు భావించాయి. యిందుకు తగిన మేధావుల బృందాలను ఎంపిక చెయ్యటానికి ఒక అంతర్జాతీయ కమిటి ఏర్పడింది. అయితే యిందులో కూడా తల దూర్చటానికి, ఇండియా నుంచి, ఓట్లు కొనే రాజకీయవేత్తలు, కులగజ్జిగాళ్ళు, రికమండేషన్‌గాళ్ళు కొంత మంది ప్రయత్నాలు చేసారు. కాని వాళ్ళకు తగ్గిన అర్హతలు లేకపోవటం, దానికితోడు ఈ ప్రయత్నాలలో సుఖాల కన్నా కష్టాలే ఎక్కువగా ఉంటాయని అర్థమై వాళ్ళు వెనక్కితగ్గి శిథిలమై పోగా మిగిలిన దేశాన్ని దోచుకు తినే కార్యక్రమంలో నిమగ్నమైపొయ్యారు.

మొదట్లో కొన్ని ఒడిదుడుకులు ఎదురైనా, తరువాత పనులు చక చక జరిగిపొయ్యాయి.

మొదటిదశలో చంద్రుడికి దగ్గరగా లూనార్ కాలనీలు ఏర్పడ్డాయి. వీటి నిర్మాణంలో చాలావరకు చంద్రుడి మీద నుండి మైనింగ్ చేసి తియ్యబడ్డ అల్యూమినియం, టైటానియం, సిలికాన్ సిలిండ్రికల్ షేపులో ఉండి పెద్ద పెద్ద మిర్రర్స్ ద్వారా 24 గంటలు సూర్యరశ్మి లభించే ఏర్పాటు చెయ్యబడ్డాయి. ఎలక్ట్రిసిటీ కోసం సోలార్ పవర్ స్టేషన్, స్పేస్ షటిల్స్, దిగటానికి డాకింగ్ ఫెసిలిటీస్ ఏర్పడ్డాయి. భూమి నుండి తెచ్చిన లిక్విడ్ హైడ్రోజన్‌ను లూనార్ సర్ఫేస్ నుండి లభించిన ఆక్సిజన్‌తో కలిపి నీరు తయారు చేసుకున్నారు.

రెండవ దశనాటికి భారత దేశం నుండి పంపించబడ్డ బృందంలో గౌతమ్, అశ్వని ఉన్నారు. వీళ్ళను 'మార్స్'కు దగ్గరగా నిర్మాణదశలో ఉన్న కాలనీలలో పని చెయ్యటానికి పంపించారు. వీళ్ళందరి కృషి ఫలితంగా 20వ శతాబ్దపు మానవుడి కలలు ఫలించి ఎన్నో కొత్త కాలనీలు ఏర్పడ్డాయి. వీటిల్లో పని చేస్తున్న వివిధ దేశాల యువతీ యువకులు వివాహాలు చేసుకొని నూతన అంతరిక్ష నాగరికతకు నాంది పలికారు.

జరిగినదంతా ఆలోచిస్తుంటే అశ్వనికి ఎంతో విచిత్రమనిపిస్తోంది. 'తాము మార్షియన్ కాలనీకి వచ్చి అప్పుడే 15 సంవత్సరాలు దాటుతోంది?'

'అశ్వనీ! ఏమిటి ఆలోచిస్తున్నావ్?.... పిల్లలు గుర్తుకొచ్చారా?'...

"గౌతమ్!...

ఈ జీవితాన్ని ఎన్నుకున్న తరువాత పిల్లల ముద్దు ముచ్చట్లను గురించి ఆలోచించే అవకాశమే ఉండటం లేదు. అయినా, మార్షియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ భావి పౌరుల బాధ్యతను స్వీకరించిన తరువాత నాకెటువంటి చింతా లేదు"...

ఒక్క క్షణం ఆగి,

"తమ్ముడి నుండి మెసేజ్ వచ్చింది. భూమి మీద ఆపర్ట్యూనిటీస్ సరిగా లేవుట. మన దగ్గరకు రావటానికి వీలుంటుందేమోనని అడిగాడు."

గౌతమ్ నిట్టూర్చాడు.

"అశ్వనీ!... 20వ శతాబ్దంలో మన పూర్వీకులు అమెరికా వెళ్ళటానికి తహతహలాడే వారుట. యిప్పుడు 'మార్స్'కు డిమాండ్ పెరిగింది.

అయినా మనచేతిలో ఏముంది?...

ఇంటర్నేషనల్ కమిటి సెలక్షన్‌లో అతడి క్వాలిఫికేషన్స్, మెడికల్ ఫిట్‌నెస్ సరిపోవాలి. దానికితోడు మార్షియన్ సొసైటీ యిప్పుడు కొత్త వాళ్ళను ఎక్కువగా అనుమతించటం లేదు. ఒకవేళ సెలక్షన్‌లో అతడు నెగ్గితే లూనార్ కాలనీస్‌లో ఏదైనా అవకాశం లభించవచ్చు. తరవాత చిన్నగా యిక్కడికి ప్రయత్నం చేసుకోవాలి."

దూరంగా ఒక ఉల్క గ్రహం ఉపరితలం మీద వెలుగులు చిమ్ముతూ పతనమైంది.

స్పేస్ షిప్‌కున్న ట్రాన్స్‌పరెంట్ డోమ్ ద్వారా ఆ దృశ్యాన్ని చూసిన గౌతమ్, లేచి రోబోట్ ఉనికి గురించి స్క్రీన్ మీద పరిశీలనగా చూశాడు.

అది తనపనిలో నిమగ్నమై కనిపించింది.

యిటువంటి ఎక్స్‌ప్లోరేషన్స్‌లో అప్పుడప్పుడు ఉల్కాపాతాల వల్ల పరికరాలు ధ్వంసమైపోవటం వారికి పరిపాటే.

"గౌతమ్! ఎంత ప్రయాణించినా తరగని ఈ శూన్యాంధకారంలో యింకా ఎన్నెన్ని కొత్త సంగతులు దాక్కున్నాయో?...

భగవంతుడి సృష్టిఅపూర్వం కదూ!"...

గౌతమ్ ముఖంఅప్రసన్నంగా పెట్టాడు.

"అశ్వనీ! ఇండియాను, భూమిని శాశ్వతంగా వదిలి పెట్టేసిన తరువాత కూడ నీకింకా పాత భావాలు వదల్లేదు. ఇవన్నీ సెల్ఫ్ కాన్ఫిడెన్స్ లేని వాళ్ళు అనాల్సిన మాటలు. ఆ రోబోట్‌లాగే మానవుడు కూడ ఒక విధమైన యంత్రం. దానిలాగే మానవ యంత్రం కూడ ఎప్పుడోప్పుడు చెడిపోయి ఆగిపోతుంది. దాన్నే నువ్వు మరణమనుకో లేక ఇంకేదన్నా పేరు పెట్టుకో. అంతే కాని దేవుడు, సృష్టి... ఈ మాటలన్నీ ఉత్త ట్రాష్!".... ఆవేశంగా అన్నాడు.

"గౌతమ్!...

భగవద్గీత పేరు నువ్వు వినే ఉంటావ్...

20వ శతాబ్దంలో ఘంటసాల అనే అమర గాయకుడు తనగాన మాధుర్యంతో భగవద్గీత శ్లోకాలకు జీవం పోసాడు. మార్షియన్ సొసైటీకి వస్తూ నేను వెంట తెచ్చుకున్న వాటిల్లో భగవద్గీత కాసెట్ కూడ ఉంది. భగవద్గీత నువ్వొకసారి చదివితే బాగుంటుంది.

"అశ్వనీ!... మతం మత్తులాంటిది. మతం ముసుగులో భూమి మీద రక్తపు టేరులు పారిన సందర్భాలెన్నో ఉన్నాయి. అందువల్లనే స్పేస్ కాలనీలో మతానికి సంబంధించిన గుర్తులేవీ ఉండకూడదని చట్టం చేశారు."

చిన్నగా నిట్టూర్చింది అశ్వని.

గౌతమ్ భావాలు మొదటి నుండి అంతే. కరుడు గట్టిన సైంటిస్టులా భౌతిక వాదానికే ప్రాముఖ్యత యిస్తాడు.'

"గౌతమ్!... ఈ విశ్వాంతరాళంలో గ్రహాలు, ఉపగ్రహాలు, నక్షత్రమండలాలు యివన్నీ ఏదో ఒక సూత్రానికి, పరిమితికి లోబడి పని చేస్తున్నాయి కదా. వీటన్నిటినీ నడిపించే శక్తే దేవుడు కాకూడదా?"...

కొండపనేని
శంకరరావు
అసుర
పర్వం
కథ
వచ్చే సంచికలో..

గౌతమ్ ఆమెతో మాటలు పెంచటం యిష్టం లేనట్టు ఆమెకు దూరంగా వెళ్ళి రొబోటిక్ రోవర్‌కు నావిగేషనల్ యిన్‌స్ట్రక్షన్స్ పంపసాగాడు.

ఒక రోజు గడిచింది.

వాళ్ళ మిషన్ పూర్తయి, సేకరించిన డేటాతో స్పేస్ షిప్ తిరుగు ప్రయాణం మొదలు పెట్టింది.

యిక కొన్నాళ్ళు వాళ్ళ ధరికి వెకేషన్.

అశ్వని మనస్సు పిల్లల మీదకు మళ్ళింది.

'ఈ వెకేషన్‌లో వాళ్ళను భూమికి తీసుకెళ్ళాలి. ఈ మధ్యనే తన తండ్రి పంపిన కాస్మోగ్రామ్‌లో పిల్లలందర్నీ చూడాలనిగాశాడు. వీలైతే లూనార్ కాలనీలో ఉన్న సిస్టర్ దగ్గరికి కూడ వెళ్ళి రావాలి. యిప్పుడు భూమి చాలవరకు బాగు పడిందని అందరూ అనుకుంటున్నారు.'

గౌతమ్ అశ్వనిని సమీపించాడు.

అలసినప్పటికి. ప్రశాంతంగా కనిపిస్తున్న అతడి కళ్ళలోని భావం ఆమెకర్థమైంది. అతడి పెదవులు ఆర్తిగా ఆమె పెదవులతో కలిసాయి.

కొద్ది నిముషాల తరువాత...

హఠాత్తుగా స్పేస్ షిప్ ఒకసారి కంపించింది.

సుఖానుభూతిలో ఉన్న ఆ జంట మొదట్లో దాన్ని పట్టించుకోలేదు.

అయితే సెకనుకన్న తక్కువ వ్యవధిలోనే, షిప్‌లోని డేంజర్ అలారమ్స్ మోగటం మొదలుపెట్టాయి.

గౌతమ్ ఒక్క పరుగుతో వెళ్ళి ఒక పానెల్ మీద బటన్స్ నొక్కాడు.

ఎదురుగా ఉన్న స్క్రీన్ మీద 'బ్లాక్ హోల్' అనే అక్షరాలు మెరిశాయి.

తరువాత, ప్రళయ ప్రభంజనంలా అందుబాటులోకి వచ్చిన వాటినన్నిటిని తనలోకి లాక్కుంటున్న 'బ్లాక్ హోల్' విశ్వరూపం గోచరించింది.

గౌతమ్ శక్తివంతమైన థ్రష్టర్స్‌ను యాక్టివేట్ చేసి షిప్‌ను దూరంగా తీసుకెళ్ళ ప్రయత్నించాడు.

కాని అప్పటికే ఆలస్యమైపోయింది.

స్పేస్‌షిప్ కొంత దూరం వెళ్ళినట్టు వెళ్ళి, తిరిగి రెట్టించిన వేగంతో బ్లాక్ హోల్ వైపుకు సాగిపోతున్నది.

అతడి కళ్ళలో మొదటిసారి భీతి కనబడుతోంది.

'బ్లాక్ హోల్‌లోకి పోయింతర్వాత ఏమవుతుందో!...

డెత్ షోగా వస్తుందో లేక పెయిన్‌ఫుల్‌గా ఉంటుందో!'..

ఒక్కసారిగా అతడి కళ్ళ ముందు పిల్లలు, భూమి మీద అప్తుల రూపాలు గిర్రున తిరిగాయి.

'మార్షియన్ సొసైటీలో తమ మరణానికి కొద్దిసేపు మౌనం పాటిస్తారేమో... తమ పిల్లలు ఆర్ఫన్స్‌గా బతకాల్సిందేనా?'...

అశ్వని చెయ్యి ధైర్యమిస్తున్నట్టుగా అతడి భుజమ్మీద పడింది.

పసిపిల్లవాడిలా ఆమె వంకే చూడసాగాడు.

కాని ఆమె కళ్ళు అతడి వంక చూడటం లేదు.

శూన్యంలోకి చూస్తున్నట్టున్న ఆమె మనో నేత్రం ముందు నిరాకారుడైన భగవంతుడు దర్శనమిస్తున్నాడు.

గౌతమ్‌కు ఆమె పరిస్థితి అర్థం కావటం లేదు.

యింతలో దిక్కులు పిక్కటిల్లేలా భయంకర శబ్దం...

ట్రాన్స్‌పరెంటు డోమ్‌లోంచి దూరంగా దూసుకు వస్తున్న పెద్ద అగ్నిగోళం....

దాని వేగాన్ని అంచనా కట్టడం అతడి వల్ల కాలేదు...

అది ఆస్టిరాయిడ్

'బ్లాక్ హోల్‌ను చేరటానికి ముందే, అది షిప్‌ను సమీపిస్తే తాము భస్మీపటలం అవుతారు.

ఏ విధంగానైనా మరణం తప్పదు.'

అశ్వని కూడ ఆస్టరాయిడ్‌ను చూసింది.

ఒకటి... రెండు... మూడు... సెకను తిరిగి పోతున్నాయి.

కోటి సూర్యుల తేజోరాసి దిక్కులను ప్రకాశవంతం చేస్తూ దగ్గరైంది.

స్పేస్‌షిప్ అస్తవ్యస్తంగా పల్టీలు కొట్టి, యిద్దరూ షిప్ లోపల చెరొక మూలకు విసిరేయబడ్డారు.

కొద్ది నిముషాల తరువాత తెప్పరిల్లిన గౌతమ్, అశ్వనులకు బ్లాక్ హోల్ వైపుకు దూసుకువెళుతున్న ఆస్టిరాయిడ్ కనిపించింది... స్పేస్ షిప్ బ్లాక్‌హోల్ పరిధికి దూరంగా ప్రయాణం చేస్తున్నది....

"అశ్వనీ!... ఆస్టిరాయిడ్ మనల్ని కాపాడింది. దాని ఫోర్సు వల్ల మనం దూరంగా విసిరేయబడ్డాం... లక్కీగా హీట్‌షీల్డ్సు షిప్‌ను భస్మం కాకుండా కాపాడాయి"....

సంతోషంతో అతడికి మాటలు తడబడుతున్నాయి.

"గౌతమ్!... అది ఆస్టిరాయిడ్ కాదు.... భగవంతుడు."

ఆమె కళ్ళు భక్తితో అర్థనిమీళిత నేత్రాలయ్యాయి.


కథారచయిత(త్రి)లకో గమనిక:

'జ్యోతి' మాసపత్రికలో ప్రచురణకోసం కథా రచయిత(త్రి)లు పంపిన కొన్ని వేల కథల్లోంచి ఎంపికచేసిన 'కథల జాబితా'ను వచ్చేనెల 'జ్యోతి'లో ప్రచురిస్తున్నామని తెలియజేస్తున్నాం.

-ఎడిటర్

తిలకం

రచన చేయుటమన్నది కూడా ఒక కళే అనటంలో ఎటువంటి సందేహమూ లేదు. ఎందరో తమ రచనల ద్వారా పేరు ప్రఖ్యాతులతో పాటు, ఎంతో ధనాన్ని కూడా ఆర్జించారు. అమెరికా, ఇంగ్లాండు, రష్యా లాంటి ఆధునిక దేశాలలో రచనకు, రచయితులకు మంచి విలువ, ప్రోత్సాహం, ఆదరణ లభిస్తాయి. ఆదేశాలల్లోని పత్రికలు, పబ్లిషర్లు రచనకు ఇచ్చే పారితోషికం అత్యధికంగా ఉంటుంది. మనదేశంలో కూడా ఈనాడు విరివిగా దిన, వార, పక్ష, మాస పత్రికలు ప్రచురింపబడుతున్నాయి. రచయితలు, రచయిత్రులు కూడా ముందంజవేస్తూ చారిత్రక విషయాలు, ప్రాచీన సాహిత్యం, వైజ్ఞానిక, సామాజిక సమస్యలు, దేశీయ పురోభివృద్ధి, ఆధునిక ప్రగతి, వివిధ రాష్ట్రాలకు సంబంధించిన ఆచారాలు, పండుగలు, పద్ధతులు అలవాట్లు, విదేశీ సంస్కృతి లాంటి ఎన్నెన్నో విషయాలమీద కృషిచేసి, తమరచనలను సాగిస్తున్నారు. కొంతమంది రచనే తమ వృత్తిగా ఎన్నుకుని, తమజీవితకాలమంతా రచనకే వినియోగిస్తున్నారు. మరి కొంత మంది రచనను తమ హాబీగా ఎంచుకున్నారు. కొంతమంది ఉద్యోగం చేస్తూనే తీరిక సమయం మిగిలినప్పుడు రచనను సాగిస్తున్నారు.



కొంతమందికి తమ చుట్టు ప్రక్కలవారు సమస్యలతో, కన్నీళ్ళతో, దైన్యంగా తల్లడిల్లిపోతున్నప్పుడు మనస్సులో సంఘర్షణ, కదలిక ప్రారంభమవుతుంది. ఎదుటివారి స్థితి వారిలో మానసికలజడినీ, అశాంతినీ, స్పందననూ రేకెత్తించి, వారు సమస్యలకూ, వారి పరిస్థితికీ సానుభూతిగా పరిష్కారమార్గాలను ఆలోచించటం జరుగుతుంది. ఆ ఆలోచనలు మనస్సును పురుగులా తొలిచేస్తూ వారిచేత కలాన్ని పట్టిస్తాయి. ఇంకొంత మంది తమ అనుభవాలను తోటివారికి పంచటానికోసం రచనలు సాగిస్తారు. కొంతమంది ప్రముఖవ్యక్తులు తమ ఆత్మ కథను రచించటం కూడా జరిగింది. కొందరు పేరు తెచ్చుకోవాలన్న తహతహతో మరి కొందరు కేవలం ధనార్జనే తమధ్యేయంగాపెట్టుకుని రచనను వ్యాపకంగా చేపడుతున్నారు.

పఠితకల మనస్సులను ఆకట్టుకోవాలన్న ఉద్దేశ్యంతో రాయబడే నవలలు సొమ్ము చేసుకోవచ్చు కాని ఆ రచనల వల్ల ప్రయాజనం శూన్యం. హింస, మితిమీరిన శృంగారం, స్త్రీల అంగాంగ వర్ణనలు, సెక్స్‌లాంటి విషయాలను అధికంగా వర్ణించి రాసే రచనలు వయస్సు మీరినవారి మీద తమ ప్రభావాన్ని చూపెట్టలేకపోయినప్పటికీ యువతరం మీద వాటి ప్రభావం పడక తప్పదు. యువతను తప్పుదారి పట్టిస్తాయి. అటువంటి రచనలు చెడు ఆకర్షించినంత త్వరగా మంచి విషయాలు మనస్సును ఆకట్టు కోలేదన్నది యథార్ధ విషయం. అందువల్ల యువతను చెడుదారులు పట్టించే రచనలను పత్రికలు, పబ్లిషర్సు ప్రోత్సాహించకూడదు, ప్రచురించకూడదు. శృంగారం సున్నితంగా ఉంటేనే అందాలు చిందుతుంది. పాఠకుల మనస్సులను ఆలోచింపచేసేలా, సమాజం పురోగమించేలా, మూఢనమ్మకాలను పారద్రోలేలా మనిషిలో దాగున్నశక్తిని వెలికిలాగేలా, పాఠకుల మనస్సులో కదలిక ప్రారంభమై మానవత్వం, సౌభ్రాతృత్వం వెల్లువిరిసేలా రచింపబడిన రచనలు కలకాలం నిలిచి ఉంటాయి. ఒక లక్ష్యం, ఒక గమ్యంఒక ప్రయోజనం కోసం చేసే రచనలు జీవించే ఉంటాయి, వాటిని రచించినవారు మృతిచెందినాకూడా. అడవిబాపిరాజు, విశ్వనాథ సత్యనారాయణ, మునిమాణిక్యం లాంటి ఎందరో సుప్రసిద్ధ రచయితలు మరణించినా వారి రచనలు పాఠకుల మనస్సులో నిలిచిపోయాయి ఈ నాటికీ.

రచయిత ఎర్నెస్ట్ హెమింగ్వే తన మనస్సుకు నచ్చని విషయాలను ప్రస్తావిస్తూ విమర్శనాత్మకంగా రచనలు చేశారు. సమాజంలో ఎదురయ్యే సమస్యలు దృష్టిలో ఉంచుకునిరచనలు చేసిప్రఖ్యాతిచెందారు. డాస్టొవ్ స్కీ అప్పులు తీర్చటానికోసం రచనలు చేసేవారు. డబ్బుకోసమే కలాన్ని పట్టిన డాస్టొవ్ స్కీ ఎన్నో నవలలు రాసి అప్పులు తీర్చటమే కాకుండా బోలెడంత ధనాన్ని ఆర్జించారు. ఆయన రాసిన "దిగాంబ్లర్" నవల ప్రపంచ ప్రఖ్యాతి చెందింది. ఛార్లెస్ డికెన్స్, లియోటాల్‌స్టాయ్, షేక్స్‌పియర్, ప్రేమ్‌చంద్, విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్, శరత్‌బాబు లాంటి ఎందరో, ఇంకెందరో మహా రచయితలను వారి రచనలు చేసేవారిలో ఒక్కోరకమయిన అలవాట్లుంటాయి. రచన చేసే సమయంలో టేప్‌రికార్డర్ లో తమకు ఇష్టమయిన పాటలు వింటూ రచన చేస్తారు కొందరు. ఓ పెగ్గుపుచ్చుకుంటే కానీ రాయలేని రచయితలు కొందరు. నోట్లోసిగరెట్టు ఏకధాటిగా కాలుతూ ఉంటే కానీ కలం ముందుకు సాగని రచయితలు ఇంకొందరు. కాఫీ, టీ లాంటి పానీయాలను రచన సాగిస్తున్నంత సేపూ మధ్య మధ్య త్రాగుతూండటం కొందరికి అలవాట్లు. రాసే సమయంలో ఏదో ఒక

మహిళలకు, యువతులకో గమనిక:

ఈ 'తిలకం' శీర్షిక మీద:
ఇందులో మీకు నచ్చిన, నచ్చని విషయం మీద మూడు పేజీలకు మించకుండా వ్యాసం రాసి పంపండి.

మా చిరునామా:
'తిలకం' శీర్షికకు:
ఎడిటర్, జ్యోతి మాసపత్రిక,
చిక్కడపల్లి, హైదరాబాద్20.

కె. నిర్మల.

టి నోట్లో వేసుకుని నములుతూ రాయడం మరి కొందరి అలవాటు. ఇట్లాగే, ఒక్కో రచయితకూ, రచయిత్రికీ రచనా వ్యాసంగ సమయంలో ఒక్కొక్క విచిత్రమయిన అలవాటు ఉంటుంది. ప్రముఖ రచయితలకు కూడా ఇలాంటి అలవాట్లెన్నో ఉన్నట్లుగా కూడా వెల్లడయింది.


రచన చేసే సమయం ఒక్కొక్కరికి ఒక్కొక్కరీతిగా ఉంటుంది. కొంతమంది ఒక నిర్ణీత స్థలంలో, ఒకే ప్రదేశంలోనే రాసే అలవాటుంటుంది. కలం పట్టాలంటే వారా ప్రదేశంలోనే ఉంటారు. ఆ ప్రదేశంలో, ఆ సమయంలో తప్ప వారికి కలం ముందుకు సాగదని వారు చెప్తుంటారు కూడా. కొంతమంది రచనా సమయాన్ని నిశ్శబ్ద వాతావరణమయిన అర్ధరాత్రి సమయాన్ని ఎన్నుకుంటారు. మరి కొందరు, తెల్లవారుఝామున పక్షుల కిలకిలారావాలు వింటూ రచన చేస్తారు. కొంతమంది సాయంసమయాన్ని తమ రచనలకు వినియోగించుకుంటారు. కొందరికి ఒంటరితనం ఉన్నా, ఇంట్లో రచన సాగదు. వారికి ప్రకృతి వాతావరణం ముఖ్యం. పార్కుల్లో, పచ్చగా ఉన్న చెట్ల మధ్య ప్రశాంత మయిన వాతావరణంలో ఓ మూలచాటుగా కూర్చుని ఎంతో ఏకాగ్రతతో పరిసరాలనే మరిచి తమ రచనలో నిమగ్నమవుతారు. గ్రంథపఠనానికి కానీ, రచనావ్యాసంగానికి కానీ నిశ్శబ్దం, ఒంటరితనం చక్కగా సహకరిస్తుంది. రచనను చేపట్టిన వారు ఏదో ఒకటి రాయకుండా ఉండలేనంత బలహీనతకు లోనవుతారు, కొంతకాలం గడిచేసేసరికి. ఎంతో సాధన, కృషి, ఏకాగ్రత, నిశితపరిశీలనాశక్తి, భాష, శైలి, తాను రాసే విషయంపట్ల చక్కటి అవగాహన ప్రతి రచయితకూ రచయిత్రికీ తప్పనిసరిగా ఉండాలి. తాను చేసే రచవ పాఠకులకు ఎంత వరకూ ఉపయోగిస్తుంది అన్న ఆలోచన కలం పట్టిన వారికి తప్పకుండా ఉండాలి. సమాజానికీ, పఠితలకూ ప్రయోజనకరంగా రాయబడే రచన కలకాలం నిలిచిఉంటుంది.

ఒకసారి వీరిలా అన్నారు

మానవులు జంతు దశ నుంచి అభివృద్ధి చెంది నిప్పుని కనిపెట్టి, కొన్ని రకాల పనులు చెయ్యడం తెలుసుకుని అనేక వేల సంవత్సరాలు మానవులందరూ ఒకే విధంగా జీవించారు. ఆది మానవులు జీవించిన 'ఆదిమ సమాజం'లో వర్గాలు లేవు. ఉత్పత్తి సాధనాలు కొందరికే ప్రత్యేక సొత్తుగా అవడానికి వీలైన పరిస్థితులు ప్రారంభమైన తర్వాత మాత్రమే వర్గాలు ప్రారంభమయాయి. ఆదిమ సమాజం అంతరించి పోయిన తర్వాత శతృవర్గాలు ప్రారంభమైన తర్వాత ఏర్పడిన మొదటి సమాజం బానిస సమాజమే. ఎద్దుల్నీ, ఆవుల్నీ, గుర్రాల్నీ మానవుడు తన ఆధీనంలో వుంచుకున్నట్టే, తన తోటి మానవుణ్ణి కూడా తన ఆధీనంలో వుంచుకున్నాడు. బానిసని జంతువుగానే గానీ మానవుడిగా బానిస సమాజం గుర్తించలేదు.

-రంగ నాయకమ్మ.

యామిని పదవ్యూహం-28



అడ్డం

1) పనికొచ్చే తెలివి (5)
3) టెక్కు (2)
5) వాల్మీకికి నేర్పిన మంత్రం (2)
7) భారమైనది (5)
9) గొప్పతనము (3)
11) కొనసాగని ప్రేమ (2)
12) భర్తను వెతుక్కోవాలి (4)
14) మారువేషం (4)
16) మర్దరా? (2)
18) ప్రశంసార్థకం (3)
19) వీళ్లదే గెలుపు (5)
20) కొలత (2)
21) కునికిపాటు (2)
22) గారడీతో కట్టబడిన వాడు (5)

నిలువు

1) అబద్ధమా (5)
2) డెమ్రాకసీలో పరిస్థితి (8)
4) కశ్యపుడి భార్య (3)
6) రామాయణ భారతాలు చెప్పిన కావ్యం (8)
8) పైకి ఎక్కుపెట్టబడింది (2)
10) జీర్ణజ్వరము (3)
13) శృంగార గీతావిశేషం (3)
15) భరతుడి తర్వాత ఒక చంద్రవంశపు రాజు (5)
17) నాయకుల శక్తి, బాధ్యత (2)
18) పడతా నీ పని (3)

యామినీ పదవ్యూహం - 27: విజేత: ఎ.ఎల్.కె.సరోజ, బీహార్.
(వీరికి ఆరు నెలలపాటు 'జ్యోతి' మాస పత్రిక బహుమతిగా పంపడం జరుగుతుంది).

పావు రాట

మళ్లీ పాత గెటప్‌లో జ్యోతి చాలా బావుంది. అందరూ చదువుకోడానికి మంచి కథలతో వస్తున్న 'జ్యోతి'ని చూస్తుంటే పదేళ్ల క్రితం నాటి 'జ్యోతి' జ్ఞాపకానికి వస్తుంది. చా.సో ఇంటర్వ్యూలో 'శ్రీశ్రీ, నారాయణబాబు' మధ్య వ్యత్యాసం స్పష్టంగా తెలిసింది.

– కె.జనార్దనాచారి, కాకినాడ.

హరి 'చిత్రల'హరి'లో పాత సినిమాలు ముచ్చట్లు చాలా బాగున్నాయి. రేటు పెంచారు కాబట్టి పేజీలు ఇంకా పెంచితే బాగుంటుంది. నేడు వస్తున్న అన్ని వార, మాస పత్రికలలోలేని 'సాహితీ వ్యక్తిత్వం' జ్యోతిలో ఉంది. అందుకు ఎడిటర్‌గారికి, యాజమాన్యానికి జ్యోతి కొన్నేళ్లుగా చదువుతున్న సాహితీ ప్రియులుగా మా అభినందనలు.

– ఎమ్.అన్నపూర్ణ, బెంగుళూరు.

జ్యోతిలో మూడు సీరియల్స్ ముచ్చటగా ఉన్నాయి. ముఖ్యంగా బొమ్మల విషయంలో ఇంకా శ్రద్ధవహించాలి. కాగా దంతూరి పండరినాథ్ సీరియల్ ఆసక్తికరంగా ఉంది.

– కె.విజయ, మద్రాసు.

మారిన 'జ్యోతి'ని చూస్తుంటే ఆశ్చర్యమేసింది. కొత్త గెటప్‌లో ముచ్చటగా ఉంది. కథలన్నీ బాగున్నాయి. ప్రత్యేక నవలానుబంధం ప్రచురిస్తే 'జ్యోతి'ని 'జ్యోతి'లా చూసుకోగలుగుతాం.

–ఎమ్.అరవిందం, బళ్లారి.

'మంచిని పెంచుతున్న పత్రికలు కొన్ని ఉంఢడం శ్రేయస్కరంగా ఉంది. వాటి ప్రభావంవల్ల మిగతా సన్మార్గానికి వస్తాయని ఆశించొచ్చు. చా.సో గారి ఇంటర్వ్యూలోని మాట జ్యోతికే చెల్లు. ప్రస్తుతం వస్తున్న పత్రికల దారి నుంచి తప్పుకుని 'జ్యోతి' విలక్షణ దారిలో ప్రయాణిస్తోంది. ఆల్ ది బెస్ట్.

–డి.హిమజ, వరంగల్.

జూలై 1 సందర్భంగా తిలక్ లేఖ ప్రచురించినందుకు కృతజ్ఞతలు. ఆ లేఖ చదివి కన్నీరు కార్చాను. ఆ 'జ్యోతి'ని బైడింగ్ చేయించుకుని ఇంట్లో దాచుకున్నాం.

'ఏ.రమ, ఏ.శైల, అమలాపురం.


మహిళలకు ప్రత్యేకంగా నిర్వహిస్తున్న 'తిలకం' శీర్షిక; మనోబాధల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న 'పర్సనల్ ఎఫైర్స్' వెరైటీగా ఆసక్తిగా ఉంటున్నాయి. సినిమాల వార్తలు ఫ్లీరు వెయ్యరా?


–కె.కిరణ్, కె.అనూరాధ, సికింద్రాబాద్.

PRINTER & PUBLISHER: BHOGADI VENKATA RAYUDU,
EDITOR: *DATLA NARAYANA MURTY RAJU*
P.B.No.1824, CHIKKADPALLY, HYDERABAD. PHONE:64104




దీని కళ్ళు అచ్చం నావే...
దీని ముక్కు అచ్చం నాదే... దీని చిరునవ్వు అచ్చం నాదే...
కాని నా చర్మం అచ్చం దీనిది!
ఇది సంతూర్ మహిమ. ఈ సబ్బులోని పసుపు, చందనం గుణాల మేలు కలయిక నా చర్మాన్ని ఏళ్ళతరబడి లేతగా, పువ్వులా కోమలంగా ఉంచుతుంది — మా అమ్మాయి లేత చర్మం లాగానే. మరి మేమిద్దరం అచ్చం ఒక్కలాగ కన్పిస్తామని అందరూ అనడంలో ఆశ్చర్యమేముంది.
సంతూర్
పసుపు చందనం గల సబ్బు
SANTOOR
జీవితమంతా వికసించే చేనిక



అందిస్తున్న
ఆగస్టు నెల అనుబంధం
వర్తమాన కవుల
కవితా సంకలనం
కత్తులూ...
విత్తులూ...



కత్తులూ - విత్తులూ

వర్తమాన కవుల కవితాసంపుటి

● ఎడిటర్:
దాట్ల నారాయణ మూర్తి రాజు



కవి మిత్రులకు నమస్కారం

కవులు వ్యక్తిగతంగా కవితాసంపుటాలను తెచ్చుకోవడానికి భయపడే పరిస్థితులున్న ప్రస్తుత వాతావరణంలో ఒక 'పత్రిక'కు అనుబంధంగా ఒక 'కవితాసంపుటి'ని తేవడం కష్టసాధ్యమే అయినా 'జ్యోతి' ఆ ప్రయత్నాన్ని సుసాధ్యం చేసింది. అందుకు ముందుగా తమ తోడ్పాటునందించిన కవిమిత్రులకు కృతజ్ఞతలు. మా ఆహ్వానాన్ని మన్నించి చాలామంది కవులు తమ కవితలు పంపారు. స్థలాభావంవల్ల కొంతమంది కవుల కవితల్ని ప్రచురించ లేకపోతున్నాం. ఆ కవితల్ని 'రెగ్యులర్' సంచికల్లో ప్రచురిస్తామని మనవిచేస్తున్నాం.

కాగా, అడగానే తమ కవితను పంపి, సహకరించిన డాక్టర్ సి. నారాయణరెడ్డి గారికి ప్రత్యేక కృతజ్ఞతలు.

ఈ సంపుటిపై తమ అభిప్రాయాలను పంపమని కోరుతూ-

సంపాదకుడు

ముఖచిత్రం:
కలర్ ఫొటో:
ఆర్కాట్ బాపూజీ, రాజమండ్రి.



ఒడ్డు

క్యాలండర్ తోకపట్టుకుని ఈదితే
కాలం ఒడ్డు చేరుకోలేవు.
క్షణాల మూపులమీద స్వారీచెయ్యి
ఎర్రమరకల తేదీలకు అంటుకుపోకుండా
ఎగిరిపో నీలి అలల రెక్కలమీద.
ఎన్నిసార్లు మునిగావో
ఎన్నినీళ్లు మింగావో
ఎవడిక్కావాలి ఈతగాని సంజాయిషీ?
గొర్రెలా తలవంచుకునిపోతే
అతిరిక్త పరిస్థితులు
అల్లా ముక్కుల్లోకి దూరుతాయి.
కాళ్లు కత్తుల్లా తిప్పకపోతే
విషమ సమస్యలు
మొసళ్లలా నంజుకుతింటాయి.
ఒడ్డుచేరిన వాడికే లోకం
వొంగి సలాం కొడుతుంది.
వాలుకు కొట్టుకుపోతే
కాలం జలసమాధి కడుతుంది.

-డా. సి.నారాయణరెడ్డి.

గోడమీద పిల్లి

నా దేశం
నోరూవాయీలేని గంగిగోవు
పురిటినొప్పులు పడుతున్న చూడావు
అదిగో ....
శిరసోదయమైన లేగదూడ మెడ
అరెరే .....
తల్లి బొడ్డుతాడే పిల్లమెడకి ఉరితాడైంది.

పెనుగులాడుతున్న దూడది హింసని గోలచేస్తూ
బిగుస్తున్న ఉరితాడుది ప్రతిహింసనే
ప్రభుతని సమర్థిస్తూ
ఆపరేషన్ చెయ్యాల్సిన ఆలోచన
పాత 'గీత'ల 'గోడ' మీద నిలబడింది
పిల్లిలా కళ్లు మూసుకు 'పాలు'పంచుకుంటోంది
రేపు
వర్గ వైరుధ్యాల పోరాటం పోటెత్తక తప్పదు
ఈ గోడమీద పిల్లి యేవైపుకి
దూకాలో తేల్చుకోకతప్పదు
ఆ విలయం నుంచొచ్చిన విప్లవమే
మంత్రసానై ఈ 'ఉరి'ని తెంచి పురుడోస్తుంది

నోరూవాయీలేని జీవాల్ని (తల్లీ పిల్లల్ని)
నిటారుగా నిలబెడుతుంది.
అంతవరకూ అలీనంగా ఉన్న ఆలోచన
గోడమీద పిల్లిలా మీనమేషాల్ని లెక్కెడుతూ
ఉరితాడుకే బాగా పురిపెడుతుంది.
(నాలోని మధ్య తరగతి ఆలోచనలమీద నాకే అసహ్యంవేసి
నన్ను నేను ఓదార్చుకుంటూ)

కాలం చెల్లింది

విప్లవ సాహిత్యం
వింటినుంచి విడుస్తున్న బాణాలు
తీస్తున్నాయి
కాలం చెల్లిన పాత 'పురాణం' ప్రాణాలు
నిజంగా కాలం చెల్లింది పాత పురాణానికే
చరిత్రకి వికృత రూపం పురాణం
ఎప్పుడో నీ కాలం చెల్లింది.

● కాకరాల.

(15.1.1988 రాత్రి వి.ర.సం బహిరంగ సభ తరువాత నిర్వహించిన 'కవితా పఠనం' ఇచ్చిన ఉత్సాహంతో రాసింది)



బిందుఘోష!

ఊరి పక్క వాగునడుగు
సముద్రాన్ని గురించి చెప్తుంది.
నదులను తాగి నిలువెత్తు కెరటాల్తో
మిడిసిపడుతుంది.
ప్రవాహాన్ని నటించే
చిత్రగత నిశ్చలన చైతన్యమౌతుంది సముద్రం.
మేఘాలను ప్రచారం చేసుకునే
రాజకీయవాదిలా అరుస్తుంది.

చంద్రరేఖకు గుచ్చుకుని గాయపడ్డ జ్ఞాపకాలు
సముద్రంలో ప్రతిఫలించవు.
సముద్రం గర్జిస్తుంది, బెదిరిస్తుంది.
ఓడల సాహసాన్ని కుట్రలతో ఛేదిస్తుంది.
శతాబ్దాల వాస్తవాలను తిని
అజీర్తి కీర్తితో మూల్గుతుంది.

చుక్కల చక్కెర బిళ్లను మింగి
ఉప్పవుతుంది సముద్రం.
ఒడ్డును మచ్చిక చేసుకుంటుంది.
గాలికి అనుగుణంగా
ఆర్కెస్ట్రాలను సవరిస్తుంది.

సముద్రానికి వ్యక్తిత్వం ఉందా?
సముద్రమిప్పుడు
సూర్యుణ్ని కూడా భరించలేని
అనారోగ్య సజీవ కళేభరమవుతుంది.
బిందెలో నీళ్లనడుగు
సముద్ధాన్ని గురించి చెప్తాయి.
సముద్రంతో నాయుద్ధం ఈనాటిదికాదు
కోపంగా చూస్తే
సముద్రం బిందువుగా కుంచించుకుపోతుంది.
చెమట చుక్కరాలితే
సముద్రం విరిగిపోతుంది.
తీరంనుండి సైగల్ మూల్గితే
సముద్రం సిగ్గుతో తలొంచుకుంటుంది.
కొబ్బరాకుల నిచ్చెన్లపై నిలవలేక
చూపులు జారిపడుతుంటాయి!
యాంటీనా దువ్వెన్లతో
గాలికల్లోల కురులను దువ్వుకుంటుంది.
టీవీలో సముద్రం
నంగనాచిలా దొంగనవ్వులు పెదజల్లుతుంది.

● -డా. ఎన్.గోపి.

కొడుకు

పాతిక సంవత్సరాల క్రితం-
వాడు-
నా కడుపులో తన్ని బయటపడ్డాడు!
ఇప్పుడు -
వాడు-
నా కడుపుమీద తన్ని బయటకునెట్టాడు!

● పచ్చిగోళ్ల సుధ.

ఆదిమరాగం

తమ సహజవాంఛా స్వరూపాల్ని
భుజాలపై మోసే తండ్రులు
సహజాతాల సాంగత్యాన్ని
రొమ్ములకదుముకొనే తల్లులు,
తప్పటడుగుల్లోనే
జీవితం చేతికొస్తున్నది వాళ్ల కాళ్లపక్క!



తృష్ణమాత్రమే అంతస్సూత్రంగా
అంతిమ గమ్యంగా ఆటలాడుతుంటే
తృళ్లిపడే ఆవేశాల ఆవేశాల్లో
అన్ని హద్దుల్ని అతిక్రమించే
ఆత్మవంచన ఈ సభ్యతలోనే!

బాధల అనుపల్లవి చివర
ఎక్కడైనా వాంఛించే ఆత్మసంతృప్తి.
బాధ్యతలను మోసే చేతుల
మొరటుదనంలో ఒక తహతహ.
సుఖజీవనమే సాక్షిభూతంగా
మెత్తని అరచేతుల నడుమ
ఆరిన అగ్ని స్పర్శలను పూయించే
ఒక కాలాతీత అభివ్యక్తి
నిరంతరంగా ఈ శరీర పరిధిలోంచి
మీటుతోంది ఆదిమరాగ ప్రతిధ్వనుల్ని!

● -నిఖిలేశ్వర్.

ఎదిగీ ఎదగని వయసు

జంక్షన్లా గొంతు
రెండు రైళ్లు పలుకుతుంది
పడీపడని వాన చినుకుల్లా
గడ్డం-
పగటి లాంతరు కాంతిలా
చేతికి తోచని మీసం
అద్దంలో మొహం ఆరున్నరలా భయపెడుతుంది.
నాకీ సందిగ్గాలు తగలబెట్టాలనిపిస్తుంది.
'ఒరేయ్ చంటీ కొత్త నిక్కరు నీకేరా బావుందా?'
దిబ్బలో పారెయ్ నా కొద్దు-
'వీక్లీ తెచ్చి పెడుతావా చంటీ!'
టైమ్ లేదాంటీ రేపు ట్రైచేస్తా.



'రారోయ్ రాముడా ఓ బుద్ధిమంతుడా
తప్పమ్మా నువ్వలాంటివి వినకూడదు చూడగూడదు
ఈ ఉత్తరం పట్టుకెళ్లి మేరీరాణికిచ్చెయ్
ఏదీ పరిగెత్తు ..... ఒన్ ..... టూ ..... త్రీ'
సీనియర్ ఇంటర్ రాజారావు
కంకరమాట వినిపిస్తోంది
కరకర గొంతు వినిపిస్తోంది.
రక్తం మరుగుతుంది సలసలా..... .

ఈ సెగకి ఒక పెద్ద రైలు పెట్టె నడుస్తుందేమో
ఏమనుకుంటున్నాడు వీడు (!)
నీ ......
నీ ......
నీ ......
చెవులు మూసి పరిగెత్తించడం ఎలాగో నాకూ వచ్చు

వదికళ్లు ఇటు తూలడానికి
గురూ గురంటూ వాలడానకి
చేయగలిగిందేమిటో చేస్తాను.
లాబ్‌లో పిల్లికూడా
లావణ్య జడ కత్తిరంతా
అబ్బెబ్బే హూష్ కాకి!
రేపట్నించే ఈ చంటీ చంటాడు కాదు
దొంగచాటు సిగరెట్టూ
స్వర్గాలో ఉల్లి పెసరట్టూ
సెన్సారించని సినిమా టిక్కెట్టూ
అద్దె పుస్తకం మధ్యపేజీలో జారిన చీరకట్టూ
వెరసి చంటీ ది గ్రేట్.
అలవాటుగానే ...
అంతా అసంకల్పితంగానే కనిపించాలి.
ఏమంటాడప్పుడు రాజారావ్?
'హర్నీ ఎంత వాడయ్యావురా-' అనా
రేయ్ బ్రదర్ -
జరుగు బే -
వస్తున్నాడొస్తున్నాడు సూపర్ హీరోగారొస్తున్నారు
తప్పుకో తప్పుకోరోరేయ్.
హాండిల్ వదిలేసి సెంటర్లో సైకిల్ తొక్కుతా.
ఎదురువస్తే నువ్వో నేనో అటే తేల్చుకుందాం
ఇప్పుడిక్కడ 'నేను' బహువచనం
తొడుక్కున్న పాంటు బహువచనం
దువ్వేనకున్న వలువరసలు బహువచనం
మొహమ్మీద మొలుచుకొచ్చిన
మొటిమలు బహువచనం
వాక్యానికి అర్థం బహువచనం
వ్యాపకాలు బహువచనం

ఏకవచనంచేసి చెవిపుచ్చుకు లాక్కెళ్లిన వేపైనా ఉంటే
గింటే మర్చిపోనీయ్ ఈ కాస్సేపూ
స్కూల్‌డే నాడు అమ్మాయి వేషానికి
నున్నటి నా మొహంకోసం
బిరుసెక్కని గొంతుకోసం
వెతుక్కుంటూ వస్తున్న తెలుగు టీచర్?
కళ్లు తిరిగి పోయేట్టు
ఏదో ఒకటి చేసెయ్యాలి.
మెచ్చుకుంటున్నట్టు కనిపిస్తూనే గిచ్చిపోతున్న

అనేకానేక సంఘటనల పరంపరలో
పధ్నాలుగేళ్లొచ్చిన నేను
ఇంకా పసివాడ్నా!?
కాదు మగవాడ్ని
పసివాడు మగవాడెందుక్కాడు?
పుట్టకముందే రెండంగుళాల ప్రకటన కదా.
మగవాడు మగవాడనిపించుకుందుకు వెతికే
ప్రతిచర్యల దశలో
సవాలక్ష సందేహాలొస్తున్నాయ్.
జంక్షన్లో గొంతు
రెండు రైళ్లు పలుకుతుంది
పడీ పడని వానచినుకుల్లా
గడ్డం
పగటిలాంతరు కాంతిలా
చేతికి తోచని మీసం
అద్దంలో మొహం అరున్నరలా భయపెడుతుంది
నాకీ సందిగ్ధాలు తగలబెట్టాలనిపిస్తుంది.

● కొండేపూడి నిర్మల



ఔనూ ఒంటరి దుఃఖమే

గాయంకాని రోజులేదు
అంతిమ గాయాక్షరం రాసి గాయం చేయనూలేను
గాయమే హృదయమైనప్పుడు
పెదాలమీంచి జారే ప్రతిస్వరం
గాయస్వరమై కూచుంటుంది
వ్యర్థంగా ప్రాణం కదలాడటం అలవాటైపోయింది
జీవ సాఫల్యంతో నన్ను మోసే చెప్పులు
వేసుకున్న చొక్క తొడుక్కున్న ప్యాంటు
తినేతిండి తాగేనీరు పీల్చేగాలి
సహకరించే ఈ సమస్తం
సజీవంగానే బతుకుతున్నాయి
సాఫల్యంలేని ఈ కాయానికి
అన్నీ ఉపకరిస్తూనే ఉన్నాయి
నేను మ్మాత్రం నిరుపయోగంగా
పెరుగుతున్న నేలబరువుని
నేనో ఉద్యమ నెలబాలున్నాయినా కాకపోతి
దానిధ్యాన ధారగానైనాపారకపోతి
ఏమీ కాని నేను ఎంత కాలమిక్కడ పడుండేది
ఈ నిర్వీర్య నిస్సత్తువతో

నా ఈ అవయవాల్ని నాకు నేను
కష్టాలపాలు చేసుకోవడం సహించలేను
అనవాళ్ళు గుర్తుపట్టలేనంతగానైనా
నాకో యాక్సిడెంటయి తునాతునకలై పోతే బాగుండు
నాకు నేను ఏమీకాని విధంగా ఎగిరిపోతే బాగుండు
మేల్కొలేని నిద్రలోకి ఒదిగిపోయి
నా శరీరానికి ప్రణమిల్లితే బాగుండు
ఆత్మతృప్తితో నా మనువు మట్టితో
మమేకమైపోతే బాగుండు
ఆత్మాహుతి ప్రేరేపించే ఈ వ్యవస్థ
ఆత్మాహుతిని అంగీకరించకపోవడం నేరం
ఏంచేయనూ! నన్నేమీ కానీకుండ
ఇలానే మ్యూజియంలోని బొమ్మలా
ఈ వ్యవస్థ వేళ్ళాడుతున్న రేపటి
భవిష్యత్ పటానికి మళ్ళే
రోజూ నాకు నేను అగుపడి నన్ను
నేను చూసుకోవడం
రోజూ నాకు నేను అగుపడి నన్ను
నేను తిట్టుకోవడం ఇక సహించలేను
బాబ్బాబు నన్ను గాయపెట్టేకన్నా
గాయంచేసిన ఈ పిడికెడు ప్రాణాన్ని
ఈ వ్యవస్థ ఉరికొయ్యకు వేళ్ళాడ దీయవా!
నీకూ నీ వ్యవస్థకూ రుణపడే ఉంటాను
నీవు రాసే బానిస గాయాక్షరాల
చరిత్రలో గాయమై నిలిచిపోతాను
గాయాల వాగ్గేయకారులకు
గానంగానైనా మిగిలిపోతాను.

●-నాళేశ్వరం శంకరం.

అన్నం కోసమే కదా

ఇక యిప్పుడు
సర్వనన్నర్ధం కావడమొక్కటే చేయగలిగింది.
ఇప్పుడు నిందించీ బాధపడీ
దుఃఖించీ కన్నీళ్లు పెట్టుకునీ లాభం లేదు
చేజేతులారా చేసుకుందీ మనమే!
మనంతాగే ఏ నీటి చుక్కలోనూ
మన మొహాలు ప్రతిబింబితం కావటంలేదు
మనం తినే ఏ అన్నపు మెతుకుమీదా
మన పేరు రాసిలేనేలేదు.
చెరువులూ కాల్వలూ తవ్వింది మనమే
లోతైన నూతులు తవ్వీ
స్వేదాన్ని జలగా పుట్టించింది మనమే
డామ్‌లు కట్టిందీ మనమే
నెత్తిన బిందెలతోనూ
భుజాన కావిళ్లతోనూ మైళ్లకు
మైళ్లు నడుస్తుందీ మనమే!
అరకలుదున్నీ - ఆకుమళ్లు జల్లీ
ఊడ్పులు వూడ్చీ, కలుపులుతీసీ

కోతలు కోసిందీ మనమే
ధాన్యాన్ని రాశులు పోసిందీ మనమే!
గుప్పెడు గింజలు మనల్ని గుర్తు పట్టలేనప్పుడు
ఎండకళ్లకు అరచేతులు అడ్డంపెట్టుకుని
ఆకుపచ్చ కార్డులు పట్టుకుని
క్యూలో నిలబడుతున్నదీ మనమే.
విద్యాలయాల్లో చేరి
అవిద్యను విద్యగా అభ్యసించిందీ మనమే
అజ్ఞానాన్ని జ్ఞానమని భ్రమపడిందీ మనమే
అడవులవైపు ఆశగా చూస్తున్నదీ మనమే.
పని అంటే తెలియని వయసులో
నాలుగు గాళ్ల పనుల వెనక
హోటళ్ల వంటింటి మురికి కూపాలవైపు
గనులవైపు, కార్ఖానాలవైపు
పసితనాన్ని మసిపాతనుచేసి విసిరేసిందీ మనమే.
అవయవాలు సంపూర్ణంగా వికసించకమునుపే
కోరిక అంటే తెలియక మునుపే
శరీరం యింకా సిద్ధపడకమునుపే
కళ్లు మూసుకుని, పళ్లు బిగబట్టుకునీ
శరీరంలోని అణువణువునూ బాధించుకుని
చీకటి గదుల్లో చిత్రహింసలనుభవించమని
లేలేత యవ్వనాల్ని నలిపేసిన
పువ్వుల్ని చేసి తరిమేసిందీ మనమే!
మన సర్వస్వాన్ని అమ్ముకున్నాం
మనం బాల్యాన్ని అమ్ముకున్నాం
మన యవ్వనాన్ని అమ్ముకున్నాం
మనం భూమిని అమ్ముకున్నాం
మనం రక్తాన్ని మూత్రపిండాల్ని అమ్ముకున్నాం
మనం అజేయమైన శ్రమను అమ్ముకున్నాం

మనం అచంచలమైన నమ్మకాన్ని అమ్ముకున్నాం
మనం అకుంఠితమైన ఐక్యతను అమ్ముకున్నాం
మనం కట్నం డబ్బులు పేరుతో
పుంసత్వాన్ని అమ్ముకున్నాం
సంసారం పేరుతో స్త్రీత్వాన్ని అమ్ముకున్నాం!
అన్నీ అమ్మేసుకుని మనం
బతుకును వ్యాపారం చేసేశాం!
అన్నీ అమ్మేసుకుని మనం మనిషినే కోల్పోయాం.
అన్నం తినడంకోసమే కదా
మనం అన్నీ అమ్ముకున్నది
ప్రాణాలను నిలుపుకోవడం కోసమే కదా
మనం అన్నీ అమ్ముకున్నది
మనం బతకడంకోసమే కదా
బతుకును అమ్ముకున్నది
గుక్కెడు గెంజికోసమే కదా
మనం వొంచిన నడుమును
గొడుగా చేసి పంటలను కాపాడింది
కడుపుకింత కూడు కోసమే కదా
రాక్షస రాత్రులకు క్రూరంగా
శరీరాన్ని అప్పగిస్తున్నది
పిడికెడు మెతుకులకోసమే కదా
మనం పశువుల వెంట మైదానాల్లో పశువులైపోయింది
కార్ఖానాల చక్రాల్లో చక్రాలైపోయింది
గనుల్లో రాక్షస బొగ్గైపోయింది
హోటల్లో ఎంగిలి అకులైపోయింది
ఆటో గేరేజిల్లో ఆయిల్ తుడిచిన గుడ్డైపోయింది
మీ ఈ పూట పస్తుండేది కూడా
రేపు తిందామనే ఆశతోనే కదా!
పేదరికం వంశపారంపర్యంకాదని

చాటుదాం మనం-
భూమ్మీద ప్రతిమనిషీ కడుపునిండా
అన్నం తినడంకోసం పోరాడుదాం మనం
గెంజిలో చెయిపెట్టి ఎంతదేవినా
నాలుగు అన్నం మెతుకులు దొరకని మనం-
నోటికీ చేతికీ తెలియకుండా
తినే వాళ్ల అన్నాన్ని ప్రశ్నిద్దాం!
కేవలం మనం అన్నం తినడంకోసమే అయితే
కేవలం మనం బతకడం కోసమే అయితే
ఈ నీచాతినీచమైన హీనాతిహీనమైన బ్రతుకొద్దు
ఈ భూప్రపంచకంమీద అన్ని జీవరాశులకంటే
మనిషి తెలివైన వాడని మరోసారి నిరూపిద్దాం!
మనం పస్తులుండి అయినా
మన తర్వాతి తరానికి
అన్నం కోసం చింతలేకుండా చేద్దాం!
మనం ప్రాణాలు త్యాగంచేసి అయినా
మన తర్వాతి తరాన్ని బ్రతికుంచుకుందాం
'కోత'ల సమయం ఆసన్నమైంది
మనం కొడవళ్లకు కక్కుళ్లుపెడదాం!
ఇక యిప్పుడు
సర్వసన్నద్ధం కావడమొక్కటే చేయగలిగింది.

● -శిఖామణి.

ఎటూకాని దారిలో

సాయంత్రానికి వాడిపోతుంది
రోజా పూసే రొటీన · పువ్వు.
ఒక రాత్రి ఒక పగలూ
ఒక చీకటీ ఒక వెలుగూ
ఇవి మాత్రమే కంటిపొరల మీద కదుల్తుంటాయి
చెక్కిళ్లమీద ముడతలు ముడతలుగా
ఆడుకుంటుంది గతం
అసహనం రాదారిమీద అతుక్కుపోతాయి కాళ్లు.

అట్లా దూరాలను కొలుస్తూ
రోడ్డుమీద ఒక్కణ్ణీ
ఒక ప్రశ్న గుర్తులా · నడిచివెళ్లిపోతాను
నల్లటి క్యాన్వాస్ వొంటిమీద
ఎవరి గాయాలనో ప్రదర్శిస్తుంది ఆకాశం
నడిచినంత మేరా
పచ్చటి గవాక్షాలు తెరిచిరుస్తుంది భూమి
ఎవరికి తెలుస్తుంది భూమ్యాకాశాల భాష
ఋతువులు ఋతువులుగా విస్తరిస్తున్న కాలం ఘోష
అక్షరం కదలికల్లో లాభనష్టాల లెక్కలు
కన్పించే ప్రపంచం ఒక ఖాతా పుస్తకం
పిల్లల పెదాలమీద కాగితప్పూలు పూస్తాయి
భార్య ప్లాస్టిక్ శరీరంమీద

వేళ్లు వెచ్చదనం కోల్పోతాయి
స్పర్శకి కూడా ఖరీదు కట్టం కదా,
అదీ రొటీన్ పుష్పమే.

పాత పెళ్లాం పాత జీతం పాత జీవితం
పాత మొహాలు పాడుమొహాలు పాడుదేహాలు
బతుకుగోడనిండా బూజారోతా
చూపుల తెరలనిండా దుమ్మూ ధూళి
వెన్నెల అందమంతా కన్నీళ్లపాలు

ఏ పలకరింతలూ వినిపించవు
ఏ నీడల ప్రశ్నార్థకాలూ కనిపించవు
ఒక పాడుబడిన గుహలోకి
అయిష్టంగా నడిచిపోతున్నట్టు
ఒక పగలూ ఒక రాత్రే ఒకటే అలసట
చీకట్లో నీడల్ని వెంటాడుతూ
ఎవరిచేతులు వాళ్ల భుజాలకే కావిలించుకుని
ఒకే అడుగు ముందుకు-
ఎటూకాని దారిలో ఏ సమాధానమైనా
ఎవరికీ తృప్తినివ్వదు, శాంతినివ్వదు. ● - అఫ్సర్.

క్షేత్రదహనం.....

పొలాలన్నీ
ప్లాట్లవుతున్నాయి నేడు ...
గుప్పెడు మెతుకులిచ్చేందుకు
ఎక్కడా - ఎక్కడా
జానెడు
జాగామిగలదు రేపు! ● - వి.పి.చందన్‌రావు.



తెగినతల పాట పాడుతుంది

పాట గొంతులోంచిరాదు
జీవితంలోంచి వస్తుంది-
జీవితాన్ని పెడరెక్కలు విరిచికడితే
ఎగసిపడే గుండెల సముద్ర
తరంగాలుగా ఘోషిస్తుంది
జీవితాన్ని కటకటాల వెనక్కి తోసేస్తే
జైలు గోడలమీద 'లైవ్ వైర్ల'లే ప్రవహిస్తుంది
జీవితాన్ని భూమిలో పాతిపెడితే
మొక్కగా చీల్చుకువచ్చి గాలిదోవల్ని కదిలిస్తుంది-
ఆకలి తుది ఊరువుమీద
కాలం ప్రశ్నార్థకంగా నిలబడ్డప్పుడు
జీవితం మరణం దగ్గిరే పాటనేర్చుకుంది
మనిషి మనిషి తినేసే సంస్కృతి
చరిత్ర చివర సంధ్యాగ్ని
గుండాన్ని రగులుస్తున్నప్పుడు
జీవితం మరణం దగ్గిరే పాట నేర్చుకుంది
తిరగబడ్డ గుండెలోని దీపాన్ని
దురధికారం ఊదేసి ఆర్పేస్తున్నప్పుడు
జీవితం మరణం దగ్గిరే పాట నేర్చుకుంది
దిక్కు మొక్కులేని అగ్ని కణాల పిడికిళ్ల పోట్లకి
మూసుకున్న చరిత్ర
కనురెప్పలు కదులుతున్న క్షణాల్లో
పాట సాధనచేసింది

జీవితంచేసే రాగాలాపన
తనని మించి జనసమూహాల్ని స్పందింపజెయ్యడం
మరణం సహించలేదు
జీవితం నడిచేదారి నిండా
రక్కెసముళ్లు పరుస్తుంది
స్రవించే రక్తాన్ని విజయతిలకంగా దిద్దుకుని
సాగిపోతుంది జీవితం'
జీవితం ప్రవేశించే ద్వారాల్ని
ఒకదాని వెంట ఒకటి మూసేస్తుంది
రగిలిపోయే రక్తగీతమై
ప్రవహించి పోతుంది జీవితం -
జీవితం బావిలేని నీళ్లు 'పాట'
జీవిత ఆకాశంలోని నీలిమ'పాట'
జీవితం సూర్యుడిలో దగ్ధమౌతున్న యింధనం 'పాట'
జీవిత అస్తిత్వంలోని సమగ్ర చైతన్యం 'పాట'
జీవిత జీవితానికి
మూడు కాలాల జీవధార 'పాట'-
జీవితం చాచిన రాగహస్తం
మరణ సమాధిని దాటి
భావికాలాన్ని స్పర్శించి చిగురింపచేస్తుంది -
పాట గొంతులోంచి రాదు
పాట నరాల కదలికలోంచి రాదు
పాట ఊపిరి అలలమీంచిరాదు
పాట జీవితంలోంచి వస్తుంది
జీవితం లోతులు అరిచినప్పుడు వస్తుంది
మరణం గొంతు నులిమే
జీవితంవేసే కేకలోంచి వస్తుంది -

● అద్దేపల్లి రామమోహనరావు.

అయిదూ అయిదు పద్యాలు

మృత్యువాంఛ

శరీరంలోకి
ప్రవేశించిన క్షణమే
రహస్యాన్ని కోల్పోయాం

మనతో బయల్దేరిన నక్షత్రకాంతి
ఇంకా భూగోళాన్ని చేరలేదు
జీవితం అప్పుడే మసకబారింది
చుట్టూ తెరలువాలుతున్నాయి

మరణించడం అంటే
మళ్లీ రహస్యంలోకి
ప్రవేశించడమే.

పదాలూ కవులే

పాత పదం లోపలికి
కొత్తపదం వొస్తుంది

పొగచూరిన పదం మరణించి
ప్రజ్వలించే పదానికి
ప్రాణం పోస్తుంది

మళ్లీ కొత్తపదం
పాత పదం అయినప్పుడే
భాషకు ఒక రోజు గడిచినట్టు

మనుషులు కవులైనట్టే
పదాలు పద్యాలవుతాయి.

మెలకువ

కనెప్పల అంచుల్లో


నిద్రలు వేలాడుతున్నాయి
కళ్ల వెనుక
ఎక్కడో లోయల్లో
ప్రతిబింబాలుకదుల్తున్నాయి
లక్ష నక్షత్రాలు కలిసి
పగటిమీద కుట్రచేశాయి
నా తిరుగుబాటు
రేపు ఉదయం కాని
ప్రారంభం కాదు

భిన్న ధృవాలు

రోజూ నిన్ను కలుస్తున్నా
నీ ఆచూకీ తెలీదు
రోజూ నిన్ను చూస్తున్నా
నీ ఆనవాలు పట్టలేను
దగ్గరవుతున్న కొద్దీ
దూరమయ్యే సాన్నిహిత్యం మనది
పుట్టుకతోనే
అగాధాలు తవ్వుకున్న
శూన్యప్రేమ మనది.

విషాదం

నగం జీవితం
మానసికంగా గడుస్తుంది
నగం కలలు
జ్ఞాపకమే ఉండవు
పియానో నుంచి
జారిపోయిన ఆలాపన
నగంపాటే పాడుతుంది
మృత్యువు మాత్రం
పూర్తిగా ఆక్రమిస్తుంది.



అడయార్ మఱ్ఱి

శవాలు పాచికలయ్యే దేశంలో
చెట్లను కూడా సుఖంగా చావనీరు.....
అడయార్ మఱ్ఱి కూలింది
కాలాన్ని శ్వాసిస్తూ, శతాబ్దాల్ని ఛేదిస్తూ
చరిత్రకు చూపుడువేలై బతికిన చెట్టు
హఠాత్తుగా 'మరణించింది' ...... మరణించనీయండి
విత్తనం రాల్చిన క్షణంలోనే
చెట్టు పుట తిరగబడుతుంది
నేలగర్భంలోకి ఊడలు నరాలు దింపిన క్షణమే
చెట్టు మరణిస్తుంది ..... మరణించనీయండి
అడయార్ మఱ్ఱిని సుఖంగా, సాంతంగా
కన్ను మూయనీయండి
చెట్టు శవం చుట్టూ శాస్త్రాల్ని తిప్పకండి
మోడుకు లేపనాలద్ది బతుకును అభినయించకండి.....
పరాన్న జీవులే శవాలకోసం ఏడుస్తాయి
దొంగలే శవాలవెనక దాక్కుంటారు....
చెరువు గట్లమీద శవాల్ని నాటేవాళ్లు
'శతాబ్దాలనాటి శవాలను

నీటి పీఠాలమీద తెప్పగట్టేవాళ్లు
శవానికి శవాలతో చితులు పేర్చేవాళ్లు
శవం కూలిన చోట భూతనదుల గారడీ చేసేవాళ్లు
శవయాత్రావ్యసన నర్తకులు
మృత సంస్కృతికి రెక్కలు కుడుతోన్న మూర్ఖులు......
శవంకోసం ఏడ్చేవాడికి బతికే హక్కులేదు....
కణకణ విస్ఫోటనంలో చిందే
జీవాగ్నిని స్పృశించనివాడు
నాడీనదుల్లో ఎదురీది
గుండెకులాయాల్లో అతలకుతలం కానివాడు
తన యెదమీద తానే సేదదీరని వాడు
తన భుజం తానే తట్టుకుంటూ
తనకు తానే తల్లై అనుక్షణం
పునర్జన్మించనివాడు -
జీవశ్శవం......
జీవశ్శవాల, శవయాత్రోత్సవాల,
మృతాక్షరీ ముషాయిరీల రాచకీయాల్ని నమ్మకండి....
శవాలకు చికిత్సలు, శిలా
రూపాంతరాలూ జరిగేచోట
కాలం మృత శిశువుల్ని కంటుంది
శవాంధకారం ఆదర్శమయ్యేచోట
సూర్యకిరణం వృథాగా అస్తమిస్తుంది
శవాల్ని ఖననం కానీయండి
శవారాధకుల్ని, శవానుయాయుల్ని
నిర్భయంగా దగ్ధం చేయండి
మఱ్ఱి నీడన మాగిన మట్టిని
పచ్చపచ్చగా విచ్చుకోనీండి!

● గుంటూరువేసుపాదం.

అనుకంపన



హృదయాలు కంపిస్తే వ్యధేమీలేదు
ఆడి ఆడీ ఆగిపోయిన
గోడగడియారపు డోలనాలవుతాయి
దేహం కంపిస్తే దిగుల్లేదు
ఊగి ఊగీ, మొగ్గిన వేపుకే వాలిన
త్రాసులోని ముల్లవుతుంది.
భూమి కంపించడమేమిటీ
మహాసముద్రాలు మౌనంగా పవళించిన
రాక్షస రాళ్ళేవో కదలాడ్డమేమిటీ!
నగరాలకు నగరాల్ని, దేశాలకు దేశాల్ని
వేనవేల దేహాల్ని, కోటికోట్ల హృదయాల్ని
చాతకాని శోకాల్ని చేసి ఒక్కుమ్మడిగా
కేవలం ఈ కదలికల కర్కశ
కోరలు నమిలేయడమేమిటీ.
అది అర్మేనియా కావచ్చు
మరో మార్మాలియా కావచ్చు
అక్కడ జీవితాలున్నప్పుడు, అక్కడ
జీవరాసి ఉన్నప్పుడు
అక్కడ రాజ్యాలున్నప్పుడు, అక్కడ
యుద్ధాలున్నప్పుడు
అక్కడ అక్కచెల్లెళ్లున్నప్పుడు,
అనుబంధాలున్నప్పుడు
విస్తారంగా పరుచుకున్న వనరులున్నప్పుడు
అక్కడ భూకంపం రావడమేమిటీ!
వాడెవడో భుజం మార్చుకున్నాడనీ
వేయిపడగల విరనాగులేవో

విశ్రాంతిశ్వాసలు పీల్చుకున్నాయనీ
నన్ను నేను ఏ కర్మ సిద్ధాంతాంధ
కారాగారంలోకో పడనెట్టుకోలేను
విజ్ఞాన శాస్త్రమా నిన్ను ప్రశ్నిస్తున్నాను
అణుయుద్ధాలకీ ఆయుధాల ఉత్పత్తికీ
రాజ్యాల దురాక్రమణలకీ, రసాయనాల
విశ్లేషణలకీ తప్ప
నీ ఉనికి మరెందుకు
దోహదమవుతోందో చెప్పమంటున్నాను
నీ తప్పేమీలేదు, నీవు చెప్పే ఉండొచ్చు,
హెచ్చరించి ఉండొచ్చు, కనీసం
శంకల శకునాలు పలికి ఉండొచ్చు,
చావుకైనా సిద్ధపడతామేగానీ
మేం నగరాల్నెలా ఖాళీచేస్తాం
జీవన యాంత్రిక నెలా అంతం చేస్తాం
ధనాల్ని, భవనాల్ని, ఆస్తుల్ని, ఆఫీసుల్ని
మేమెలా వదిలెల్లిపోతాం!
తప్పు మాది
మేం దిగబడి ఉన్న స్వార్థపు ఊబిది
ఎల్లల పేరిటా దేశాల పేరిటా
నిర్మితమైన సరిహద్దులది.

● -పమ్మెట నాగమల్లీశ్వరరావు.

మీరు మీరై

ముడుచుకుని
మళ్లీ మళ్లీ ముడుచుకుని
కుంచించుకుపోయి
అనామకులై
మీలో మీరు దహించుకుపోతున్నారు.

అత్తపత్తి కన్నా
అధ్వాన్నం మీరు
తాకకుండానే
భయపడి పోతున్నారు
కపాలం బద్దలై
కళ్లు చీలికలై
గుండెలో గునపాలు దించుకుని
పాదాలను
అంధకార అగ్నిశిఖల్లో
దగ్ధం చేసుకుంటున్నారు.

మిమ్మల్ని మీరే అమ్ముకుంటూ
కొనేది మీరేనని సంతోషిస్తున్నాను
మీ కోసమే మీరు
బతకడం లేదు
ఎవడికోసం
బతుకుతున్నారో తెలీదు
పురుగులయినా పుట్టలయినా
బాగుండేవారు
మనుషులయినందుకే
నిత్యం ఆత్మలను హత్యచేసుకుంటున్నారు.

అసలు మీరు
మనుషులయితే
మీ మనసేది?
కుక్కలు చింపిన
మీ మనసు ముక్కల్లో
ఏది మీది?
ఎక్కడ దాక్కున్నారు?

మేమంటే మేమని
పొగుడుకుంటున్నారు
కంట్లో వేలు పాతేసుకుని
నోట్లో వేలు కొరుక్కుంటున్నారు
మీ పాదాలకింద
మిమ్మల్నే నలుపుకుంటున్నారు
పూర్తిగా తొక్కేసుకుని చావండి
కాని అనుక్షణం చంపుకోకండి

మీ బాల్యమూ
మీ అందాల అజ్ఞానపు
తొలియవ్వనమూ,
మీ తల్లి ప్రేమా
మీ తప్పటడుగులూ
చితికిపోయి
చీమూ కన్నీళ్లై కారుతున్నాయి
మీ హృదయ సంస్పందనలో
మానవత్వపు ఆక్రోశం
మరుగునపడిపోతున్నది

మీరిక చావడం మేలు
అడవితల్లి
నరకబద్ధ బాహువులమధ్య

దగ్ధమయి
పునీతం కాడవమే హాయి.

మీరిక
మీ కోసమే పుట్టడం మేలు
మీ ఉద్ధరణ కోసమైనా
ఉద్భవించండి
ప్రతివాడూ వాడి కోసమయినా
పుట్టేందుకోసం
మీరు మీరై ప్రేరేపించండి
మీరు మీకోసమే ప్రేమించండి.

- కృష్ణుడు.


మళ్ళీపుట్టరు

- [illegible] భాస్కరాచార్య

ప్రజలం మాకేం?
.....చిరంజీవులం..... చిదానందులం!
అని మురవకండి.
మీరూ చస్తారు
ఓటేసిన తరువాత!
మరి నాయకులూ?
చావరు చావకే చిత్రవధ ..... అనుభవిస్తారు
ఎలా?
మీరు కట్టిన పాడెలో చిక్కి
ఎప్పుడు?
పదవి పెదవి దాటిన తరువాత
ప్రజలు -
మళ్లీ మళ్లీ పుడతారు
నదుల్లా పొంగుతారు
నాయకులు-
ఒక్కసారి చస్తే
మళ్లీ పుట్టరుగాక పుట్టరు.



జనం ...... మనం



నలుదిశలా కమ్ముకున్న ఉత్తర్వుల సముద్రం -
పదునెక్కిన నిఘాల మధ్య
విచక్షణా రహితమైన అహంకారం మధ్య
రెప్పలులేని పోలీసు జాగిలాల మధ్య
క్యాంప్ ఫైర్‌లా బూడిదవుతూ
నిస్సహాయంగా జనం -
దుక్కిదున్ని
ధాన్యం పండించి
అందరికీ ముప్పూటలా అన్నం
ముద్దలు అందించే జనం -
బీడైపోయిన భవిష్యత్తును
పచ్చలహారంగా చెక్కాలని
అమాయకంగా జెండాలు మోసి
ఓట్లిచ్చి
చివరికి చిత్తుకాగితాలై పోయిన అశేషజనం-
ప్రజాస్వామ్య దేశంలో
ఆరుబయట గాలిపీల్చుకోడానికి
ఆత్మీయంగా పలకరించుకోడానికి
సూర్యోదయాలకు ఆతిథ్యం ఇవ్వడానికి
మొహం వాచిపోయిన బానిసజనం -

నిన్న నాగళ్లై
గడ్డపలుగులై
కొడవళ్లైన జనం-
నేడు నిర్వీర్యంగా
బందెలదొడ్లో బలిపశువులుగా మారిన పిచ్చిజనం!
బతుకును మర్చి
బలాన్ని మర్చి
"కుక్కలవలె
నక్కలవలె
సందులలో పందులవలె..."
మహాకవి శ్రీశ్రీ జ్వాలాన్ని మర్చి
విముక్తి పోరాటాలై ముందుకు
దూసుకెళ్లిన వీరత్వాన్ని మర్చి
అదే పనిగా ద్రోహాల నేతనేస్తున్న వెర్రిజనం-
ఎంగిలి కూటి తెల్లదనంకోసం
ఎండమావుల చల్లదనంకోసం
మళ్లీ మళ్లీ మోసపోతూ
కత్తుల బావుల సందిట్లోకి తారుముద్దల్లా జారిపోతూ
ముఖాలు చెక్కేనుకుంటున్న అవిటి జనం
జనం ....!
మనం ....!!

● - యం.కె.సుగమ్‌బాబు.



వర్షం కురిసినప్పుడు

ఆకాశం కరిగి కరిగి గాలి నూలు పోగులమీంచి
చినుకులు వెల్తురు మొలకల్లా రాలుతుంటాయి.
నేలంతా తడితడిగా పులకరించి వరదలు
వరదలుగా పరవశించిపోతుంది
ఎదురుగ్గా మేడగోడలు దుఃఖం జారిన
చెక్కిళ్లయి తడుస్తాయి.
చెట్లన్నీ ఆకులదోసిళ్లతో పచ్చదనాన్ని
తలమీద తలంబ్రాలు పోసుకుంటుంటాయి.
రోడ్డుమీద ఆటోవాడు నీళ్లరెక్కలు చాచి
పరుగెడ్తుంటాడు.
చెప్పుతెగిన అమ్మాయి పాదాలు
ప్రవాహంలో చేపలై కదుల్తుంటాయి.
గొడుగులేని పెద్దమనిషి వర్షాన్ని తిడుతూ
సిగరెట్ నిప్పుతో మేఘాలకు చురకలంటిస్తుంటాడు.
రిక్షాల్లో కూర్చున్న బడిపిల్లలు చెట్లకొమ్మల్లో
రెక్కలు దులుపుకుంటున్న పక్షుల్లావుంటారు.
తలకు చేతిరుమాలు కట్టుకున్న సైకిల్ కుర్రాడు
నీళ్లమీద సర్కస్ ఫీట్లుచేస్తూ కొట్టుకుపోతుంటాడు
కరెంటు తీగల దారాలమీద నీటి ముత్యాలు
మెరుస్తున్న హారాలై వూగుతుంటాయి.

దుకాణాలముందు గుమిగూడిన
జనాల్లో ఓ ముసలాడు
చలిని బఠానీలుచేసి అమ్ముతుంటాడు.
వాల్‌పోస్టర్‌మీద సినీమా సుందరి
చౌరస్తాల్లో ట్రాఫిక్ నిలిపేసి
రోడ్డంతా నీళ్లసుడుల్లో విరగబడి నవ్వుతుంటుంది.
కిటికీలోనుండి బయటకువెళ్లిన
నాచూపులు పడవులై తిర్గుతుంటాయి.
వర్షం బరువునూ చీకటి బతుకు
బరువునూ మోస్తున్న ఓ గుడ్డాడు
చేతికర్రతో నా కళ్లమీద పొడుస్తూ
రోడ్డుదాటుతుంటాడు.
నేను ముక్కలైన పడవనై చినుకుల అలలమీద కొట్టుకు
పోతాను.

● -ఆశారాజు.



లోకచింతన

నాలో అక్షరాలు అర్థరాత్రైనా మేల్కొనే
ఉంటాయి ఈ లోకస్పృహతో
తెల్లవారి కన్నుతెర్రగా ఉండేది అక్షరాలు
మనస్సు నిండా అలజడిగా సంచరించిన గుర్తే!
అక్షరాలు ప్రపంచ బాధలకు స్పందించి ఆర్తితో
సూర్యుడు ఆకాశంలో రచింపబడకముందే
కాగితం పైకి వచ్చేస్తాయి
ధర్మ రక్షణకు నాల్గు దిక్కుల్లోకి గురి చూస్తుంటాయి
అక్షరాలకు సదా లోకచింతన
మనిషిని గూర్చి చింతన
మనిషి మనిషిని గుర్తించే కన్ను నివ్వాలనే చింతన
ఎన్నెన్నో అక్షరాలు గుంపులుగా
ఎదాలవటం ఎన్నెన్నో ఉదయాలను రచించడానికే-
గొంతులో సాహసంగా గీతాలు
వాతావరణమై ధ్వనించడానికే?

● - కంఠాళై రాఘవాచార్య.



ఉదయం కోసం

ఎందుకు అరుస్తున్నారీరాత్రి తలెత్తి
చుక్కల్ని చూస్తూ
చితకబొడుస్తున్న ఎర్రని ఎగొనిని స్మరిస్తూ
ప్రశ్నార్థకాల సైన్యాల్ని మోహరించి
ప్రతిబింబాలను చిందరవందర చేస్తూ
ప్రమాదాల వైపు మోరసాచి
ప్రమిదలై మిణుకు మిణుకుమని వెలగాలని
కకావికలై పోతున్న మకతికల మధ్య
కర్తవ్యం కురుస్తున్న వేళ
కుండెడు బాధనూ బండెడు జీవన భారాన్ని మోస్తూ
శూన్య హస్తాలను హెచ్చరిస్తూ
చంపబడుతున్న సత్యాన్ని ఉదహరిస్తూ
విస్తుపోతున్న చూపులను ఉడికిస్తూ
ఉరలుతున్న రక్తాన్ని ఉరికిస్తూ
ఉదయంకోసం చీకటిని వణికిస్తూ
చురకత్తుల్లాంటి చూపుల్ని దారిపొడుగునా పరుస్తూ
రవ్వున ముఖానికి కొడుతున్న చల్లగాలిని వేడెక్కిస్తూ.
ఎక్కడికి వెళ్తున్నారు వీధుల
వెంట అరుస్తూ జాగృతం చేస్తూ

-ఎ.సూర్యప్రకాశ్.

అశక్తత



ఎంత మూగతనం
ఎంత మాటలేని తనం
బాధను వ్యక్తీకరించటానికి స్వరాలు లేనితనం
లోన ఎంతబాధ ఉంటే బయటకురాదు
లోన బాధ ఎంత లోతులో ఉందో
ఏ చేదకూ అందటంలేదు
బయటకు రావటానికి ఏ అక్షరమూ
వాహికగా సరిపోవటంలేదు
అక్కడే ఉండి గుండెను చుట్టుకొని
తల్లిని విడిచిరాని పసిపాపలా-
ఎంత అవిటితనం
నా మాటల కాళ్లమీద నేను నడవలేను
బాధలోపలికి పోవడమేగాని
ఊబిలోకి దిగబడిపోవటమేగాని
కటకటాల వెనుక ఇంకా
మూలగదిలో ఖైదుకావటమేగాని
బయటకు రాదుకదా బాధ
గుండెనించి రక్తంలోకి కణాల్లోకి బాధ
శరీరమంతా బాధామయం
బాధకు ప్రతీకగా నేను.
లోన బాధ విత్తై మానై నేనే
బాధావృక్షాన్నై భూమిలో కూరుకుపోయినవాణ్ని
ఎవడో నరుకుతూ ఉంటే మీద కూలనివాణ్ణి
బాధపడటమేగాని
బాధపెట్టని వాణ్ణి
బాధ కొవ్వత్తితో నన్ను నేను దహించుకోవటమేగాని

కత్తి తీయనివాణ్ణి
ఇంట్లో రెండు మల్లె మొగ్గలు కత్తుల్తో దాడిచేస్తే
కన్నెత్తి చూడనివాణ్ణి
బయటకు ఒకడు మాటని తుపుక్కున ఉమిస్తే
తుడుచుకుపోవడమేగాని చేయెత్తని వాణ్ణి
లాఠీలో తుపాకులో లాకప్పులో వేస్తే
చేయని నేరం ఒప్పుకున్నవాణ్ణి
బాధనే వస్త్రంగా కప్పున్న వాణ్ణి
ఎంతకాలమిలా ఎంతకాలమిలా.....
నా బాధ నలువేపులా కత్తుల్తో బయటపడే
శుభగడియకోసం నిరీక్షిస్తున్నా

● సుంకిరెడ్డి నారాయణరెడ్డి.

(సిద్ధారెడ్డిలాగా కాదు కాదు శివారెడ్డిలా!! రాయొద్దనుకొని శివారెడ్డిలాగే రాసినందుకు సిద్ధారెడ్డికి క్షమాపణలు)

పాపాయిబడికెడితే...

● - ఘంటసాల నిర్మల.

వెక్కిళ్లతో వీడ్కోలు పలికే ఆ ముఖం
నగిషీలెరుగని అమ్మ బాల్య
దుఃఖానికి అముఖం రచిస్తుంది
చేత మిగిలిన చాకొలెట్ తగరంలా
ఆమె తడికళ్లు రెపరెపలాడతాయి
సందిగ్ధంగా అరమూసిన తలుపుల వెనుక
తల్లిగుండె తచ్చాడుతుంది
గదిలో చెల్లా చెదరు దృశ్యాలు దిగ్గాలుగా చూస్తాయి
బెంగపడిన బెలూన్‌ని ఓదార్చబోయి
కీ యివ్వని రైలు కూతవేటు
దూరాన కూలబడుతుంది
రైమ్స్ కేసెట్టు గరగరమని రోదిస్తుంది.
కళ్లార్పే బొమ్మ అసలే రెప్పవెయ్యదు
సర్దుకోని బొమ్మలబుట్టా
పక్కింటి నుంచి తెచ్చిన చింపాంజీ అట్టా
అవాక్కుగా నిలబడిపోతాయి
యూనిఫాం నెట్టేసిన ఊదాపూలగౌను
ఉక్రోషంగా మంచంకింద దాక్కుంటుంది
సాయంత్రమయ్యే సరికి-
ఒకే ఒక్క సందుచివరి చంద్రవంక కోసం
మనసు ఏకశిలరథమై ఎదురుచూస్తుంది
పసిదాని మాటా నవ్వు పూలతోట
ఇల్లంతా ప్రాణపరిమళాలు పీల్చుకుంటుంది
చిలవల పలవల కబుర్ల గుంపులు వాలి
చిన్నారిని చిలకల పందిరి చేస్తాయి
అల్లీ బిల్లీ ఆటల్లో పాపాయి అదమరిస్తే
అమ్మ చేతి గోరుముద్దకై ఆశగా
రెప్ప వెనుక నీలినిదుర తూలివస్తుంది
లేత వెన్నెల చమ్కీ షామియానా
కథలో రాజకుమారుడ్ని
తమాషా కలగా తర్జుమా చేస్తుంది

కళ్ళు

ఏల్చూరి విజయరాఘవరావు.

ఆకలి కళ్ళతో చూస్తున్నా ...
అందంగా ఆకాశంలో అతికిన
అర్కుడూ, చంద్రుడూ, తారలూ
అణాకాణీకి చెల్లని
అస్తిత్వం లేని
అస్థిపంజరాల్లా కనిపిస్తున్నాయ్!
పచ్చలారని పసికందులా
పరికిస్తున్నా...
పంకజ నాభుడీధరతిని
పక్కన నాలోనమే సృజించినట్టు
ప్రచరించే ప్రత్యణువూ
పంచామృతాలొలికించే
పైడితల్లి స్తనాల్లా కనిపిస్తున్నాయ్!
ప్రేయసికోసం తపిస్తున్నా...
ఇక నా దృక్కులు విరహపు బుక్కులు!
మలయమారుతం ప్రళయదారుణం!
వసంతమొస్తే వొళ్లంతా మండుతుంది!
కోయిలకూస్తే గుండెలదురుత్తై!
స్వర్గం, నరకం, స్వర్ణం, గరళం
జననం, మరణం, జరామరత్వం
స్నేహం, ద్రోహం, శీతం, ఉష్ణం
కవనం, కపటం, ఖడ్గం, కమలం
ఇంతీ, బంతీ, ఇరుగూ, పొరుగూ
ఉరికే వూసరవెల్లి రంగుల్లా మారుతూ
ఎలాంటి చూపుకలాంటి దృశ్యాన్ని సృష్టిస్తూనే
క్షణంలో అంధకారాన్ని బంధిస్తూ
కలలాంటి ప్రపంచాన్ని
కమ్మగా జుర్రున మింగేసే
కాలానికి
గాలాలీ కళ్ళు!

వర్త‘మౌనం’



ఒంటరి వాళ్లం కాదు
సూర్యగోళం భుజాలకు వేళ్లాడుతోంది
‘నల్లవజ్రాల’ గలగలలు
గోదావరి మిలమిలలు
సముద్ర సంగీతంలో శబ్దిస్తున్నాయి
మూగదీపాలు మన వెంట నడుస్తున్నాయి
పాతపడ్డ పాట మనకు తోడుంది
దెబ్బతిన్న కోకిల స్వరం స్వాగతం పలుకుతోంది
భయపడేందుకు ఒంటరి వాళ్లం కాదు-
పచ్చటి మన కలలు కూల్చేసినప్పుడు
వికసించిన పూలని పేల్చేసినప్పుడు
తుఫాన్ తాకిడికి కూలిన
వృక్షం చేసిన గొయ్యి సాక్షాత్కరిస్తుంది
భవిష్యత్ భారీ వృక్షాల కొమ్మలు నరికేసినప్పుడు
నీరులేని నది మన కళ్లముందు కదలాడుతుంది
అప్పుడు వర్తమానం -
దిక్కుతోచని ముసలి రైతులా ముడుచుకొంటుంది
తూటాల్లేని తుపాకిలా మౌనంగా ఉంటుంది
పోలీసు అధికారి కర్కశ కంఠంలా,
గుండెలో తూట్లు పెడుతున్న ఆక్రోశ గీతంలా
వర్తమానం భయపెడుతుంది -
భయం మన మార్గాన్ని మళ్లించగలదా?!
భయాన్ని ఛిద్రంచేసే లేజర్ కిరణాలున్నప్పుడు
భయాన్ని భగ్నంచేసే అక్షర ఆయుధాలున్నప్పుడు
రైఫిల్ రాగాలు వెన్నుతడుతున్నప్పుడు,
ఊపిరి పీల్చే ఉద్యమాల్లో
భయం కార్బన్ డయాక్సైడౌతుంది -



రాయవల్సిన పద్యమొకటి రాయనప్పుడు...!

రాయలసిన పద్యమొకటి
పీడిస్తున్న కొద్దీ
విస్ఫోటనానికి సిద్ధమైన
అసహనాన్నవుతాను నేను!
లోపల జ్వాలొకటి పరుగై తొలుస్తున్న కొద్దీ
గది గదంతా
ఘనీభవించిన మంచుముద్దవుతుంది!
కాసింత సేపు ఈ శరీరాన్ని
విశ్రాంతిలోకి విసిరేద్దామా అంటే
పరుపు పల్లేరు కాయవుతుంది!
కటకటల వెనుక ఆగిపోయే ఊపిరి
కలవరపెడుతూ పోతోంది!
తుపాకి కొనన వేలాడుతు కూడ పాడిన
'నిన్నటి సూర్యుడి' ఆఖరిపాట జ్ఞాపకమై
నన్ను కలవరపరుస్తోంది!
ఎంత సర్దుకుందామన్నా
ఏదో ఓ అనీజి లోలోన కెలుకుతూనే ఉంటుంది
ఏదో ఓటి రాసేసి
ఆ ఆందోళనల్ని దులిపేద్దామా అంటే
పద్యం విరిగిన టీచుక్కై
కాగితం గొంతులోకి దిగదు!
పద్యమంటే 'షాంపెన్'తో తడిసిన మాటలా?
పద్యమంటే నన్ను నేను ఆవిష్కరించడం కదా!
నేను కరుగుతున్న కొద్దీ
పద్యం మొలుస్తుంది!
నేను ఆత్మీయ నిశ్శబ్దంలోకి జారిపోయి

మొలిచిన ఆ పద్యాన్ని మెల్ల
మెల్లగా పైకి విసిరేస్తుంటాను!
అప్పుడే సరిగ్గా అప్పుడే ఎవరో ఒకరు రాయివిసిరి
నన్ను నా నిశ్శబ్దాన్ని భంగపరుస్తారు!
అప్పుడు చూద్దురుగదా!
గాయపడిన పక్షిలా విలవిలలాడిపోతుంటాను నేను
ఇక పద్యమా?
గొంతులోకి దిగని అన్నం ముద్దై
అటుపోక ఇటురాక
రోజు రోజంతా
వెంటాడే తీవ్ర అసంతృప్తి జ్వాలవుతుంది!

● - కోట్ల వెంకటేశ్వరరెడ్డి.

కోరిక



నీ నుండి నే కోరేది-
అభయమిచ్చే చేతులు తప్ప-
ఆకలిగొన్న కౌగిలికాదు!
లాలించే పదాలు తప్ప-
ముద్దులిచ్చే పెదాలు కాదు!
ప్రేమించే మనసు తప్ప-
కామించే వయసు కాదు!
ఓ కన్నీటి బొట్టు రాల్చే కళ్లు తప్ప-
కట్టిపడేసే తాళికాదు!

● -పచ్చిగోళ్ల సుధ.

గుండెలేని స్టెతస్కోప్



సూర్య సూచీ స్పర్శతో ఆకాశం
రికార్డు ఆలాపన మొదలవుతుంది
విచ్చుకున్న గర్భశోకపు
పొరల్లాంటి ఆస్పత్రి గదుల్లో విషాద
పల్లవి మొదలవుతుంది
కాయకల్ప చికిత్సకోసం కలలు క్యూలో నిల్చుంటాయి.
అక్కడ జీవితం హంసతూలికా
తల్పమంత మృదువుగా వుండదు.
తరళ జలతరంగాలపై ప్రతిఫలించే
వెన్నెలంత లలితంగా వుండదు.
పూలభరిణెల మూతలు విచ్చుకుంటే
పొంగిన పరాగాల పరిమళ ప్రవాహంలా వుండదు
రెప్పవేయని అహర్నిశలు ఆదిభౌతిక
ద్వారంముందు పహరాకాస్తాయి
అదృశ్య స్వరసమ్మేళనంలో అపశృతి మొదలవుతుంది
పాలిపోయిన ముఖంలో పేలవ చంద్రోదయమవుతుంది
ఆకాశం రికార్డు అగ్నిగీతం పాడుతుంది
మనసుల్లో గుచ్చుకున్న ముల్లు
మాటల గొంతుల్లోంచి దూసుకొస్తుంది
జీవరసాయన ప్రయోగశాలల్లో
కనిపించని అణురాగ విస్ఫోటనం జరుగుతుంది
తెల్లకోట్ల ఎండమావులకేసి కాంక్షల
కాందిశీక ప్రయాణాల కొనసాగుతాయి
బతికిన వాళ్ళకీ పోయిన వాళ్ళకీ
నడుమ వంతెన్లు కూలుతాయి, తెరలు వాలుతాయి.
వాచిన కళ్ళ కరెంటు దీపాల్నీ
గిలగిలలాడే రెక్కల ఫాన్లపురుగుల్నీ

ఎవరుపట్టించుకుంటారు?
ఆకాశం రికార్డు వేటినీ రికార్డు చెయ్యది
మరణాల మధ్య నడిచే నర్సుల మందహాసంలో
రెక్కల ఒయాసిస్సు రెపరెపలాడుతుంది
జీవితం గాయపడి ప్రతివార్డులోనూ కనిపిస్తుంది
తైలంలేని ప్రమిదలోకి జారుతూ
తలలు బద్దలు కొట్టుకునే
రక్తదీపకళికలు, గ్లూకోస్ కన్నీటి
బిందువులు నిర్జీవ కణాల్ని కదిలించలేవు
విరిగిన పాటలు, విహ్వాలించే పాటలు,
ప్రారంభమైన పాటలు, పగిలిన పాటలు
ఆకాశం రికార్డు యాంత్రిక విధి నిర్వహిస్తుంది
దీపాల కర్పూర కాంతి గదుల
మూలల్లో దాక్కున్న ప్రాణాల్ని వెదుకుతుంది
ఆనకట్టల్ని ఢీకొన్న అలల కల్లోలం
సహాయంగా నీలి అగాధాల్లోకి ఉపసంహరించుకుంటుది.
హరితారణ్య తలపుల్లో పుట్టి, నదీతీరాల శిఖరాల్లో తడిచి
పర్వతాల, లోయలగుండా పాకిన పవన పల్లవం
ఆస్పత్రిని చేరేంతలో వాడిపోతుంది
దారి తెలిని అణువులు, దారి తప్పిన అణువులు
రాత్రంతా మిణుగురులై ఆస్పత్రిపై సంచరిస్తాయి
దిక్కులేని శవాల్ని చూసి స్మశానం
కూడా ముఖం చాటేసుకుంటుంది
ఆస్పత్రిని వశపరుచుకున్న, ముందు
పరచుకున్న అహంకారాలు
కళేబరాలతో చదరంగమాడుతాయి
ఆకాశం రికార్డు ఆగకుండా పాడుతూనే వుంటుంది


● -సౌభాగ్య.



అసలు ప్రాణి పుట్టిందే నీటి కడుపున
ఆదికవి వాణి పలికిందే నీటి ఒడ్డున
నదుల ఒడ్డున
నాగరికత మొలకెత్తిన రోజు
దానవుడు మానవుడుగా అవతరించాడు
కోట్ల సంవత్సరాల చీకటి ఎడారుల్ని జయించి
సృష్టి చరిత్రకు నాయకుడయ్యాడు
పంచ భూతాత్మకం నీరు
ప్రపంచ స్థితిస్థాపకం నీరు
పారదర్శకం నీరు
సర్వవ్యాపకం నీరు
బాల్యంలో ఊట
పరువంలో ఏరు
లేమిలో చెలిమి
కలిమిలో కడలి
ప్రకృతి ప్రసాదించిన వరం నీరు
మనం తీర్చుకోలేని రుణం నీరు
వీధి నల్లా దగ్గర సిగపట్లు
పంట కాల్వలకోసం అగచాట్లు
నదీ జలాలకోసం రాష్ట్రాల కీచులాట
సముద్ర జలాలకోసం దేశాల పోట్లాట
కోటి విద్యలు కూటికోసం కాదు నీటి కోసం
అతివృష్టిలో బతుకులో సుడిగుండాలు
అనావృష్టిలో కరువుల యమగండాలు
అనుగ్రహించి సస్యాన్ని పంచి ఇచ్చినా
ఆగ్రహించి వూళ్ళను ముంచివేసినా
నీరు కుట్రలు చేయలేదు
ఎప్పుడూ తన భావాన్ని
తనలో ఏ శవాన్ని దాచుకోలేదు
అహర్నిశలు ప్రవహించేది నీరు

దశదిశల్నీ ఆవహించేది నీరు
ఎటుచూసినా నీరు
ఎల్లలెరుగని నీరు
చల్లని తల్లిలా
కల్లలెరుగని నీరు
పల్లవించినప్పుడే
పల్లమెరిగిన నీరు
దప్పిగొన్నవాడి
ఉల్లమెరిగిన నీరు
గాలిలో తేమగా
నేలలో పదునుగా
ధ్రువాలలో మంచుగా
భూమిచుట్టూ అంచుగా
నీరే నీరు
నీరులేనిదెక్కడ
తల్లి గర్భంలో నీరు
భూతల్లి గర్భంలో నీరు
నీలో నీరు నీ చుట్టూ నీరు
ప్రజలకోసం
ప్రాజెక్టులుగా అవతరించేది నీరు
మీటనొక్కగానే
పొలాల్లోకి పరుగుతీసేది నీరు
కుళాయి తిప్పగానే
కూజాలోకి ఉరికి వచ్చేది నీరు
ఎడారిలో దప్పిగొన్నవాడు
కళ్ళల్లోకి ఉబికి వచ్చేది నీరు
పంచభూతాత్మకం నీరు
ప్రపంచ స్థితిస్థాపకం నీరు
పారదర్శకం నీరు
సర్వవ్యాపకం నీరు

● డా. అమ్మంగి వేణుగోపాల్..




తప్పదు

అక్కడే నీకూ నాకు పేచీరా బాబూ
తాడో పేడో తేలాల్సిన దగ్గర
నంగిరి నాకలవాటయిపోయింది.
అలీన దేశంలో బతుకుతున్నవాడ్ని
జీవితం శరీరం నిండా స్వార్థం ఉచ్చుమరకలే
అసౌకర్యం అనుకొన్నప్పుడల్లా వొత్తిగిల్లడమే పని
చాటుమాటుగా అన్నీ సజావుగా సాగిపోతుంటాయి
చిన్నాడి స్కూలు సీటునుండి
పెద్దదాని పెళ్లి వ్యవహారం వరకూ
చాపకింద నీరు చందం.
చివికిపోతున్న చాప గురించి నీ ఆరాటం నా కందదు
ప్రపంచ బాంకుఅప్పులమధ్య
సరికొత్త చాపకొనడం తేలిక నాకు
మురుగునీటిని పట్టించుకుంటే
నాపుట్టే మునుగుతుంది.
నా చూరుకంటిన నిప్పు సంగతీ తెలుసు
ఎలకల్ని పెంచుతూ
ఎలకబొక్కల్ని చూసి ఏడవటం అవివేకమనీ తెలుసు
క్షుద్ర, భయానక, రాజకీయ రాక్షస రతిలో
పెట్టిన ఈ గుడ్లు ఎంత పొదిగినా
ఎదిగిన పిల్లలు కావనీ తెలుసు.
పైసా నిషా, అధికారం నిషా, నెత్తిన అదో తమాషా.
నా సంఘనీతే రంగుమారిపోయిందిరా నాయనా
ఇంటి 'కేడీ' నుండి, ఆలిండియా
'రౌడీ' వరకూ నాకాదర్శమే

గొప్పతనానికి గౌరవం ఇవ్వటం
ఎప్పుడో మర్చిపోయాను.
అల్లూరి, భగత్సింగులు పూలదండలికి పరిమితం
సర్ సి.వి.రామన్ సంతలో చింతపండు
మోక్షగుండం విశ్వేశ్వరయ్య కొన్కిస్కా
కలర్ టీవీలొద్దూ, గంగా కావేరీలను కలుపుదాం
అందరం పచ్చగుండి అమెరికానే
కొనచ్చుని మొత్తుకొన్న
డా. కె.ఎల్.రావు సింగినాదం జీలకర్ర.
బట్టలుతికే చేతులూ
మట్టి పనికే వేళ్లూ
బలపడకుండా బోల్డంత తతంగం
ఎప్పుడు ఏ బిస్కత్తు వేస్తే
ఏ కుక్క తోకాడిస్తుందో తెలుసు నాకు.
గాంధీ పుట్టిన గుజరాత్‌లోనే నూట
పాదిక కల్తీ సారా చావులు
దరిద్ర దేవతకు జడిసి కుటుంబాలకు
కుటుంబాలే తిన్న విషాహారం.
రంగురంగు ల రాజకీయ మోహనాంగికోసం
సుందోపసుందుల కత్తులు నూరుకోవటం
ఉమ్మితడి తుడిసినంత సుతారం
అయిపోయిందిరా బాబూ, రక్తంమరక.
పడని వస్తువు కడుపులో యిమడదు సహజంగా
పైత్యం ప్రకోపించి వాంతి అవకతప్పదు
అయితే నువ్వు అకురాలితేనే, తుళుక్‌మంటే
నేను పిడుగుపాటుకైనా అదిరిపడక తప్పదు.

● -రామి నాయుడు.

గంధపు చెట్టు



పాతడానికి ఎవడికైనా సరే దమ్ములుండాలిగాని
భూమిని తవ్వి పల్లెల్ని పాతండి
బంగారం పండుతుంది.
దుక్కిదున్ని విత్తులు నాటిన భూమి పల్లె
రాలినవాన చినుకులు పల్లెమీదపడి
మురిపాల జల్లయి ముత్యాలవుతాయి
కష్టంతో ధాన్యాన్ని పుట్టిస్తుంటే పల్లె
ధనంతో ధనాన్ని పుట్టిస్తుంది నగరం
నాగలి కర్రూ రేగడి బురదా తెలియనివాళ్ళు
పంట చెట్లకు కాస్తుందనుకుంటారు.
అరణ్యాల్లో పళ్ళుపండినట్టు
అవేపండుతాయనుకుంటారు.
నగరవాసులకు పల్లెవాసులంటే ఎద్దేవా
శ్రమకు ఫలితం దక్కని పల్లె స్వేచ్ఛని కోల్పోతుంది.
అనంతాకాశంలో హాయిగా ఎగిరే స్వేచ్ఛ
తన చుట్టూ తను తిరిగేంత
వృత్తపరిధిలో గిరికీలు కొడుతుంది
పచ్చగా స్వేచ్ఛగా వికసించే పల్లె
నగరం బంజరిదొడ్లో బందీ అయిపోతోంది
ఎక్కడచూసినా పల్లెలు పంజరాల్లోనే..
చెప్పుతెగిన కాలు రోడ్డుమీద తచ్చాడుతున్నట్టు
ఒళ్ళుకాలిన పల్లె నగరంమీద పచార్లుచేస్తుంది
శ్రామికులు పెట్టిన పుట్ట నగరం
వ్యూహాలు పన్నుతున్న పాములకు ఆలవాలమైంది
కాలుష్య నది నగరం
పురుగుపట్టిన ధాన్యాన్ని గాదెలో నింపుతుంది.
సింగారించుకున్న వేశ్య నగరం
అమాయకపు పల్లెల్ని కౌగిటచేర్చి

-కందుకూరి శ్రీరాములు.

ఎయిడ్స్ అంటిస్తుంది
పల్లెల పట్టాల కూడలి నగరం
కూడలిలో జంటజంటగా కలుస్తున్న
పల్లెల పట్టాలకు అంతమెక్కడ?
పట్టాలమీద పరుగిడుతున్న రైళ్ళకు గమ్యమెక్కడ?
రైలు ప్రవాహంలో కొట్టుకుపోతున్న
సమీరానికి తీరమెక్కడ?
తీరంలేని
తీరికలేని ప్రవాహాన్ని చూస్తున్నపుడు
చెమటోడ్చి పిల్లకాల్వల్లో స్నానమాడుతూ
గట్టుమీద పచ్చని పైటలారేసుకున్న పొలాలూ...
గుడిసెల్లో కాయకష్టం చేసిన
గుండెకాయలూ గుర్తొస్తాయి.
పొదల్లో బెదిరి చూపుల నెమలి పిల్ల పల్లె
ఎక్కడైనా గావుపట్టిన కేకవిని
దేహమంతా పురివిప్పుతుంది.
అడవిలో విరగబూసిన గంధపు చెట్టు పల్లె
కొమ్మకొమ్మల్లో సహజత్వపు
కోయలలు గొంతెత్తుతాయి. కానీ, పల్లె
రాను రాను మోడై, పాడై
నగరం ఉచ్చులో గిలగిల కొట్టుకుంటుంది.
వ్యామోహానికి మోహంవాచిపోతోంది.
కృత్రిమత్వానికి లోబడి పల్లె
చల్లనిగాలి గానుగ చెట్టు నీడను కాదంటుంది.
నగరంమీద మోజుపడి
పడుచుదనాన్ని పోగొట్టుకుంటుంది. పల్లే! పల్లే!
ఎందుకొచ్చావు ఈ నగరానికి....
జలజల పారుతున్న సెలయేటి కొండకోనల్లో
యథేచ్ఛగా ఎగురుతున్న పక్షివి కదా నువ్వు దేని కోసమని
ఈ గుడ్డుమీద ఎందుకని వాల్తావు? పో! పోయి
నీ వెచ్చదనాన్ని నీ పచ్చదనాన్ని నిలుపుకో! పో!

క్షణంఏకాంతం దొరికితే చాలు ....


నిన్ను మరచిపోవాలనీ
నీ జ్ఞాపకాలనుండి దూరంకావాలనీ
ప్రతిక్షణం అనుకుంటూ ఉంటానా,
ఎంత అసాధ్యమైన పననుకున్నావ్ నాకది?
కన్న తల్లిలాంటి ఉన్న ఊరునొదిలి
జ్ఞపకాలనన్నింటినీ అక్కడే పాతేసి,
బస్సులో దూరంగా ఇంకొక ఊరుపోతుంటానా....
రోడ్డుకు కాళ్లొచ్చి నడచి పోతుంటుంది!
బస్సు కిటికీలోంచి
దారికిరుప్రక్కలా పచ్చని పంటపొలాలు
పిల్లగాలికి నాట్యమాడుతూ కనిపిస్తాయి,
అపుడు మళ్లీ నువు గుర్తొస్తావు!
నన్ను గతంలోకి ఈడ్చుకెళతావు!
నువ్వూ నేనూ కలసి పంటపొలాల గట్ల వెంట
తిరిగిన రోజులు గుర్తొస్తాయి!
నీ లేత పాదాల సిరిమువ్వల సవ్వడి
నాట్యమాడే పైరుకి తాళం వేసిన చప్పుడు
మళ్లీ గుండెలో మెదుల్తుంది!
ఇంకొంత దూరంలో -
టెలిఫోన్ తీగెలు కనిపిస్తాయా...
వందల మైళ్లదూరంలో నున్న నీ మాట
ఆ తీగెలమీంచి నడిచొచ్చి
నా చెవిలో వేణు వూదిన రోజు గుర్తొస్తుంది!
నీ మాటా. నా మాటా ఈ తీగెలమీంచి నడుస్తూ-

ఏ స్తంభం దగ్గర కౌగలించుకున్నాయి చెప్మా?- అని
ఆలోచిస్తాను!

ఈ పల్లెలలో వచ్చిపడ్డాక
ఏకాంతం ఎక్కువై -
సాయంకాలం పోతూ పోతూ సూర్యుడు
మిగిల్చిపోయిన సంజ ఎరుపును చూస్తానా,
ఓ రోజు ఉషోదయాన
ఈ సూర్య కిరణాల వెలుగులోనే
నే చూసిన నీ పెదవుల మెరుపు
నీ నుదిటి సిందూరపు ఎరుపు
గుర్తొస్తాయి!
క్షణం ఏకాంతం దొరికితే చాలు,
నా ఆలోచనల నందనవనంలో
వనకన్యలా సాక్షాత్కరిస్తావు నువు!
అసలు నా ఆలోచనలకు కేంద్రబిందువు
నువ్వూ, ప్రకృతీ మాత్రమే కాకూడదని
ఎన్నోసార్లు నాలో నేను పోరాడతాను!
అప్పుడు ఆత్మలోకంలో
నిఖార్సయిన దివాలా!!

(కొన్నేళ్ల తరువాత ఈ మధ్యనే రైల్లో హఠాత్తుగా కలసి 'నేను జ్ఞాపకం వస్తుంటానా?' అంటూ ఒక ప్రశ్నతో నా గుండెలో పరిమళపు తుఫాన్లు ఎవరైతే రేపారో - ఆమెకి.)

● -జ్యోత్స్న



అమ్మా!

తల్లీ నిన్ను పిడికిట్లోకి తీసుకుంటానా
చిట్టికన్నా ఏం కావ్వాలా అంటూ పిలుస్తావ్
పాలకోసం ఎగబడ్డ బిడ్డలా
నీ గుండెమీద పనిముట్లతో పలకరిస్తానా
సజీవ స్వరమౌతావు.
బొడ్డుకోసిన్నుంచి
నా బతుకు నీదిగామోసి,
కన్ను మూసిన్నాడూ
నువ్వొక్కతివే అక్కున చేర్చుకుంటూ,
నన్నూరడించే నేలతల్లీ
నీకు వేవేల దండాలు.
నెర్రెలై నిస్తేజమైన నీపై
నీళ్లు చిలికిస్తే చాలు
పచ్చనై లాలిస్తావ్.
ఈ ఆకుపచ్చదనానికి
పత్రహరితానివి నువ్వు
తెలిమబ్బు పత్తిచేలకి
తెల్లగా నవ్వడం నేర్పింది,
పూతవై ఫలదీకరించిదీ నువ్వు
ఇన్ని రంగులు కూర్చి
నన్ను నీ చేతి పిల్లంగోవిమీద
పల్లె పాటగా మలుస్తూ
నీకంటూ ఏం మిగుల్చుకుంటావ్
నాకోసం బతకడం తప్ప.
నీకు నా పేగు బాధ తెలును.
పెనుగులాట తెలును.
నువ్వు నా తల్లివని చెప్పుకోడాన్కి
గర్వపడుతున్న వాణ్ణి.
నీ అమ్మతనంలో కమ్మదనాన్ని
దాచుకోవాలనుకుంటున్న వాణ్ణి.
నువ్వు నా ఆర్తివి, ఆరాటానివి,
నాటిన మరుక్షణం
లక్షల అంకురాల్ని మోసుకొచ్చే
అక్షరానివి.
రేకురేకులై విచ్చి
రేపుని ఆవిష్కరిస్తున్న
నా జీవన సంకేతానివి
ఆర్ణవ సంగీతానివి.

● - వఝల శివకుమార్.

వారసత్వం



ఖడ్గాన్ని మోసుకొస్తున్నాను
మీ కోసం ఖడ్గాన్ని మోసుకొస్తున్నాను
ఆకాశంనుంచీ, అధఃపాతాళం నుంచీ
చరిత్రనుంచీ, చెత్తా చెదారాలఘుంచీ
అంధకారం మిగిలిన వారసత్వం నుంచీ
మండుతున్న కడుపుల నుంచీ
కాలుతున్న గుడిసెల గూళ్లనుంచీ
దున్నటమే తప్ప దుక్కిపై హక్కులేని
రైతన్న నాగేటి చాళ్లనుంచీ
వెన్నెలై కదులుతున్న అడవుల నుంచీ
ఖడ్గాన్ని మోసుకొస్తున్నాను
మీకోసం ఖడ్గాన్ని మోసుకొస్తున్నాను.
కడ్గమంటే వీరుడి ఆయుధ మొక్కటేనా?
ఖడ్గమంటే యుద్ధ మొక్కటే గుర్తుకు రావాలా?
ఖడ్గమంటే
చరిత్రకీ చరిత్రకీ మధ్య వారసత్వపు జెండా
యుగానికీ యుగానికీ మధ్య సాక్షీభూత పునాదిరాయి
ఖడ్గమంటే
వీరుడి రెండు చేతుల మధ్య సూర్యోదయం
వీరుడి ముఖంమీది గాయం కూడా ఖడ్గమే
నీగ్రో పాదస్పర్శతో విస్తరిస్తున్న మహావృక్షం ఖడ్గమే
ఖడ్గమంటే బెంజిమెన్ మొలైసే కడసారి చూపు
చీకటిని బద్దలుకొడుతున్న మండేలా మౌనం ఖడ్గమే
ఖడ్గమంటే రెండు శ్రీశ్రీలు
ఖడ్గాన్ని మోస్తున్న కల్లోల తెలంగాణ ఖడ్గమే
అడవిపొదిలో పెరుగుతున్న నెలబాలుడు ఖడ్గమే.
ఖడ్గాన్ని మోసుకొస్తున్నాను

మీకోనం ఖడ్గాన్ని మోసుకొస్తున్నాను
ఖడ్గం పట్టే దగ్గరే నువ్వు నాకు దూరమయ్యింది
ఎప్పుడైనా ఖడ్గం పట్టే దగ్గరే మనం ఏకమయ్యేది
ఖడ్గాన్ని స్వీకరించడమంటే
కత్తుల వంతెనపై కర్తవ్యాన్ని కొనసాగించడమే
ఖడ్గాన్ని స్వీకరించడమంటే
గతం నుంచి నేటికీ
నేటినుంచి భవిష్యత్తుకు బాటవ్వడమే
ఖడ్గం మన వారసత్వం
ఖడ్గంమీదే మనం ఆశలు అల్లుకొన్నది
ఏ నాటికైనా ఖడ్గమే కదా
మానవ మహాకావ్యాన్ని రచించేది.

● - అలాజ్‌పూర్ కిషన్.

బొగ్గు 'గీత'

ఇంట్లో
బొగ్గుతో గీతలు గీస్తే
అప్పులౌతాయన్నది అమ్మమ్మ...
నా దేశంలో
బొగ్గుల గనులే ఉన్నాయి
అందుకేనేమో
దేశం
అప్పుల్లో వుంది!

- వి.పి.చందన్‌రావు.

ముఖాలపై పాదముద్రలతో .....

ఆ ముఖాల నిండా పాదముద్రలే-
ముఖాల్ని అనహ్వించుకుంటూ
ముఖాలమీంచి నడుచుకుంటూ
వెళ్ళిపోయిన వారి ముఖాల మీద కూడా
గుర్తు తెలియని పాదముద్రలే

సాంద్రత పెరిగిన
జన సంద్రంలో
అప్పుడప్పుడొక ముఖం
పైకి తేలుతుంది
నీటిపై చందమామలా

ముఖాల్ని దాచేసుకుంటూ
ముఖాలపైని పాదముద్రల్ని దాచేసుకుంటూ
మునుముందుకు తోసుకుంటూ
వెళ్ళిపోతున్నారు

రోడ్లన్నీ మేల్కొని చూస్తూనే ఉన్నాయి
ముఖ ప్రవాహాన్ని
నగరం నలుచెరగులా
మహోరగం విప్పిన పడగలా
ముఖాలు పర్చుకున్నాయి

సుముఖులు, దుర్ముఖులు, అంతర్ముఖులు
అందరూ నగరంలో సాగిపోతున్నారు
ఏ ముఖంపైన చూసినా

గుర్తు తెలియని పాదముగ్రలే

ప్రజాస్వామ్యమనే గాడిద
తన నాలుగు కాళ్లతోనూ
ప్రజలమీంచి నడిచి వెళ్లిపోతోంది
అవే ఆనవాళ్లు అందరి ముఖాలపై
చెంపలపై చెక్కినట్లున్న డెక్కల గుర్తులు

ప్రభుత్వ యంత్రాంగం తన
ప్రబలమైన బూటుకాళ్లతో
ప్రజల ముఖాలమీంచి నడుస్తూ
పహరా కాస్తున్నట్లున్నది -
గుర్రపు నాడా గుర్తులు
గుండెలమీదికి కూడా పాకాయి
ఉక్కు పాదాలకింద నలిగి, చిట్లి
రక్తం వోడుతున్నా,
ముఖాన్ని పైకెత్తి నడిచేవారు
కొందరే కనపడుతున్నారు
ఆనవాలు పట్టలేని ముఖాలు
అంద వికారమైపోయిన ముఖాలు
దోసిలితో ముఖం కప్పుకుని
దోవంటా పోయేవారు అసంఖ్యాకంగా ఉన్నారు
ఏ ముఖం చూసినా
ఏదో ఒక గుర్తు తెలియని పాదముద్రే
మనిషిదో మెకలదో.
గుర్తు తెలియని ముఖాలతో
గుర్తు తెలియని ముద్రలతో
వంటరిగా ..... గుంపులుగా .....
గుర్తు తెలియని గమ్యంవైపు పోతున్నారు
నెత్తురోడుతున్న ముఖాలతో ...
ముఖాలపై పాదముద్రలతో .....

● - విశ్వనాథ సూర్యనారాయణ.

స్పర్శకోసం

నిజంగా ఒక ప్రేమగీతం
నేనింకా రాయాల్సే వుంది
అసంపూర్ణ వాక్యాన్ని నేను -
ఒక స్త్రీ సువాసనతో నన్ను పూరించుకోవాల్సే వుంది
మునురు కమ్మినప్పుడే కాదు,
దుఃఖం ముసిరినప్పుడు కూడా
వెన్నెల కురిసినప్పుడే కాదు
దేహం నుండి ఆనందం పొర్లినప్పుడు కూడా
మనస్సు మరో శరీర సంబంధం కాంక్షిస్తుంది

ఆకాశంలో ఏకాకి చుక్క విషాదం
నిరంతర స్వగత జీవితం నిజంగా వైఫల్యం
నేనింకా ఒకానొక ఇంద్రధనుస్సును
నాలోకి ఆహ్వానించాల్సే వుంది
ఒకే ఒక్క స్పర్శతో
అణువులు అణువులన్నీ పూలై విచ్చుకోవాలి
నాడులు నాడులన్నీ బిగించిన తీగలై
నేనంతా స్కలన సంగీతాన్నై పోవాలి
రెండు కన్నుల మృదుస్పర్శతో
రెండు వక్షోజాల హృదయాలింగనలో
ద్వయం నుంచి అద్వయంలోకి
కరిగిన కోరికనై ప్రవహించాల్సే వుంది
నిజంగా నేనొకర్ని ప్రేమించాల్సే వుంది.

● - పాపినేని శివశంకర్.

ఈరోడ్డే ఇప్పుడు కరపత్రం



ఈ రోడ్డుని కరపత్రం చేయండి
కరపత్రాల కిరువైపులా నినాదాల్ని నాటండి
జైలునుంచి వినిపిస్తున్న కవిత్వానికి
రోడ్డుమీదే బాణీకట్టండి
అడవినుంచి దూసుకొస్తున్న పాటకు
రోడ్డుమీదే గజ్జకట్టండి
కోట్లాది నాల్కలమీద నృత్యం చేయించండి
నిశ్శబ్దంలో నిద్రిస్తున్న నగరాల్ని
ఇక పాటలతో నిద్రలేపండి
అందుకు ఈ రోడ్డు ను కరపత్రం చేయండి
కరపత్రానికిరువైపులా నినాదాల్ని నాటండి
దారులన్నీ మూసి పిడికిట
బంధించాలని చూస్తున్నప్పుడు
శత్రువు జాడపసిగట్టి కొత్త కొత్తదారుల్ని వెతకాలి
రహస్యాల్ని చేరవేసే సూక్ష్మతరంగాల్ని
దారిలోనే దగ్ధంచేయాలి
ఎక్కడికక్కడ ఈ రోడ్డు మీదే
బహిరంగ సభలు జరపాలి
ఎప్పటికప్పుడు ఈ రోడ్డుమీదే నిరసన
జండాల్నెగరేయాలి
అందుకు ఈ రోడ్డును కరపత్రం చేయండి
గుమిగూడిన చౌరాస్తాలో ప్రజల త్యాగాలకు స్థూపాలు
కట్టండి
అణువులంతటా విస్తరించి మహాకాయులై పైకిలేవండి
రోడ్డు కడ్డంగా నిలబడి అందరూ

చదివేలా కరపత్రాల్ని ఎగజిమ్మండి
కమ్ముకొస్తున్న నిర్బంధాన్ని రోడ్డుమీదే బద్దలు కొట్టండి
అందుకు ఈ రోడ్డును కరవాలం చెయ్యండి
జీవితం విధ్వంసమై, బ్రతకటం
కేవలం యాదృచ్ఛికమైనప్పుడు
ఆలస్యమెందుకు, నాకు ఆయుధాలనివ్వండి
మీరు సమరగీతాన్ని ఆలపించండి. - శ్రీనివాసమూర్తి.

నగరంలో చిరుతలు

మీరు గమనించారా!
హైదరాబాద్‌నే ఈ
జనారణ్యంలో చిరుతలున్నాయ్ ...
రోజూ చౌరస్తాలో
కాచుకునుంటాయ్
భుజాన బ్యాగ్గో,
చేతిలో పుస్తకమో,
చంకలో ఫైలో
వాటి అలంకారం.
సిటీ బస్సు కనపడగానే
ఉరుకుతాయ్...
ఉద్యమిస్తాయ్...
పడుతూ లేస్తూ,
పరుగులెడుతూ,
ఆ పుష్పక విమానాన్ని
అధిరోహిస్తాయ్!!

● - ఓంప్రకాష్ నారాయణ్.

